
'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 59

బుధవారం 21-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వైభవ్ వీరవిహారం

తమ ఆఖరి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించిన రాజస్తాన్ రాయల్స్ -14లో



ఉగ్రవాదంపై ఉక్కుపాదాలై...

నేడు యాంటీ-టెర్రరిజం డే సందర్భంగా మహిళా సైనికులపై కథనం -13లో



మళ్లీ కోవిడ్ కలవరం

ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ కలవర పెడుతోంది. మంగళవారం నాటికి దేశంలో 257 కేసులు నమోదయ్యాయి.

- వివరాలు 6లో▶



ఐఎస్ఐ ఏజెంట్ జ్యోతి!

భారత నిఘా ఏజెంట్లను గుర్తించేందుకు యూట్యూబర్ జ్యోతిని ఐఎస్ఐ వాడుకున్నట్లు దర్యాప్తు అధికారులు చెబుతున్నారు.

- వివరాలు 6లో▶



గట్టి ప్రాతిపదిక లేనిదే..

వక్ఫ్ సవరణ చట్టం అమలుపై మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు తగిన ప్రాతిపదిక తప్పనిసరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

- వివరాలు 6లో▶



4-5 రోజుల్లో రుతుపవనాలు!

నైరుతి రుతుపవనాలు మరో 4-5 రోజుల్లో కేరళకు చేరుకొనే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం ప్రకటించింది.

- వివరాలు 6లో▶

కేసీఆర్‌కు నోటీసులు

5న విచారణకు హాజరుకావాలన్న పీసీ ఘోష్ కమిషన్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకల ఆరోపణలపై విచారణ జరుపుతున్న కమిషన్

- మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు కూడా నోటీసులు
- 6న హరీశ్, 9న ఈటల రావాలని పిలుపు
- వ్యక్తిగతంగా హాజరు కావాలని సూచన.. వారు కోరితే వర్చువల్‌గా విచారించేందుకూ అవకాశం
- సహజ న్యాయసూత్రాల మేరకు వారి వాదనలు వినాలని నిర్ణయించిన కమిషన్
- తుది నివేదికలో చేర్చే యోచన







సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న విచారణలో మంగళవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. కాగా ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులు, ఇతరులను కమిషన్ విచారించింది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుకు నోటీసులు జారీ చేసింది. జూన్ 5వ తేదీన విచారణకు హాజరుకావాలని తెలిపింది. బీఆర్ఎస్ హయాంలో మంత్రులుగా పనిచేసిన హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు సైతం నోటీసులు ఇచ్చింది. ముగ్గురికీ వేర్వేరుగా మూడు పేజీలున్న నోటీసులను మెసెంజర్ ద్వారా అలాగే రిజిస్టర్ పోస్టులోనూ పంపింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని సూచించింది. జూన్ 6న హాజరుకావాలని హరీశ్‌రావుకు, 9వ తేదీన రమ్మని ఈటల రాజేందర్‌కు తెలిపింది.

ఇప్పటికే పలువురి విచారణ పూర్తి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని అనుమానిస్తున్న ప్రభుత్వం, సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించేందుకు గత ఏడాది మార్చిలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. బరాజ్‌ల నాణ్యతపై కూడా విచారించాలని సూచించింది. దీనిపై దాదాపుగా విచారణ పూర్తి చేసిన కమిషన్, రెండుమూడు రోజుల్లో నివేదిక ఇచ్చేందుకు సిద్ధమవుతోందని భావిస్తున్న తరుణంలో.. కమిషన్ గడువును మరో రెండు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు

మిగతా 12వ పేజీలో ▶

కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ

పీసీ ఘోష్ కమిషన్ నోటీసుల నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఎర్రవల్లి ఫాంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. నోటీసులు, తదుపరి పరిణామాలు, ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం దాదాపు 20 నిమిషాల పాటు కొనసాగగా.. కేసీఆర్, హరీశ్‌రావు విచారణకు హాజరవుతారా? లేదా సమయం కోరతారా అన్న అంశంలో స్పష్టత రాలేదు.

సన్నాలకు బోనస్ ఎప్పుడు?

ఇప్పటివరకు 18.47 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు

- అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 7 ఎల్ఎంటీల సేకరణ
- బోనస్ కింద చెల్లించాల్సిన మొత్తం రూ. 923.40 కోట్లు
- రూపాయి విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం
- 2,87,262 మంది రైతుల ఎదురుచూపులు



సాక్షి, హైదరాబాద్: ఈ యాసంగి సీజన్‌లో సన్న ధాన్యం సాగు చేసిన రైతులు సర్కారు నుంచి రావలసిన బోనస్ కోసం ఎదురుచూస్తున్నారు. మార్చి నెలాఖరు నుంచే యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాగా, ఇప్పటివరకు 55.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అయితే గతంలో ఏ యాసంగి సీజన్‌లోనూ లేనివిధంగా 18.47 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీల) సన్న ధాన్యాన్ని

మిగతా 3వ పేజీలో ▶



ఈ రైతు పేరు సుంకరి నరేష్. నిజామాబాద్ జిల్లా దొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామం. 5 ఎకరాలకు పైగా పొలంలో సన్న వడ్లు సాగు చేశాడు. 140 క్వింటాళ్ల వరకు (350 బస్తాలు) దిగుబడి వచ్చింది. ధాన్యాన్ని కుద్వాన్పూర్ సొసైటీకి విక్రయించి నెల రోజులు దాటింది. పంట డబ్బులైతే వచ్చాయి. కానీ బోనస్ డబ్బులు మాత్రం ఇంతవరకు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. ప్రభుత్వం బోనస్ ఇస్తే తనకు రూ.70 వేల వరకు వస్తాయని, తదుపరి పంట పెట్టుబడికి పనికొస్తాయని చెబుతున్నాడు.

'దొడ్డు'గా సాగు..

ఈ యాసంగిలో మొత్తం వరి సాగులో 65% దొడ్డు రకాలే 3లో



ఎవరి పనితీరు ఏమిటో నివేదికల్లో ఉంది

వాటి ఆధారంగా పార్టీ ముందుకెళ్తుంది: సీఎం రేవంత్

- వ్యవహారశైలి మార్చుకోవాల్సిన వారు వెంటనే మారితే మంచిది... మీ అవసరాలు, బాధలు కూడా వినేందుకు సిద్ధంగా ఉన్నా
- నాగర్‌కర్నూల్, మెదక్, మల్కాజ్‌గిరి పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో భేటీ

2లో

గ్రీన్, ఆరెంజ్, రెడ్ జోన్లుగా భూగర్భ జలాలు



- ఏ గ్రామాలు ఏ జోన్‌లో ఉన్నాయో పంచాయతీ గోడల మీద రాయాలి
- మండలస్థాయి నుంచి వాల్టా అథారిటీలను నియమించాలి
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

3లో

బోధన తీరు మార్చుకోండి



- మూస విధానానికి స్వస్తి చెప్పండి
- ప్రపంచవ్యాప్త బోధన పద్ధతులపై అధ్యయనం చేయండి
- సర్కారీ స్కూళ్లలో అవన్నీ అమలు చేయాలి... వెబినార్‌లో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

12లో

ఇంజనీరింగ్‌లో రెండు కొత్త కోర్సులు

డిజైన్ చేసిన ఐఐటీ మద్రాస్

- కంప్యుటేషనల్ అండ్ మెకానిక్స్
- ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ బయోమెడికల్
- జోసా కౌన్సెలింగ్‌కు అందుబాటులో కోర్సులు



సాక్షి, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్‌లో మరో రెండు కొత్త కోర్సులు రాబోతున్నాయి. ఐఐటీ మద్రాస్ వీటిని అందుబాటులోకి తెస్తోంది. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే జోసా (జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) కౌన్సెలింగ్‌లో ఇవి ఉంటాయని మద్రాస్ ఐఐటీ తెలిపింది. మద్రాస్ ఐఐటీలోని అప్లైడ్ మెకానిక్స్, బయోమెడికల్ విభాగాలు ఈ కోర్సును డిజైన్ చేశాయి. ఒక్కో విభాగంలో 40 సీట్లు ఉంటాయని ఐఐటీ అధికారులు తెలిపారు. ప్రస్తుత ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని కోర్సులను రూపొందించామని ప్రొఫెసర్ వి కామకోటి తెలిపారు.

ఇవీ కోర్సులు

- నాలుగేళ్ల కాలపరిమితితో ఉండే ఈ రెండు కోర్సుల ప్రత్యేకతలను ఐఐటీ మద్రాస్ వెల్లడించింది. కంప్యుటేషనల్ ఇంజనీరింగ్ అండ్ మెకానిక్స్ (సీఈఎం) కోర్సు ఏఐ టెక్నాలజీ ఆధారితంగా ఉంటుంది. సాధారణ ఇంజనీరింగ్ విద్యకు భిన్నంగా ఉండే ఈ కోర్సు వల్ల విద్యార్థి సరికొత్త మెకానికల్ టూల్స్‌పై పట్టు సాధిస్తాడు. సాలిడ్ అండ్ ఫ్లూయిడ్ మెకానిక్స్ మెటీరియల్ సైన్స్, డైనమిక్స్‌లో అత్యాధునిక సాంకేతికతను అనుసంధానం చేశారు.
- బయోమెడికల్ ఇంజనీరింగ్‌ను మరింత బలోపేతం చేసేందుకు ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్ (ఐబీఎంఈ) ఉపయోగపడుతుంది. ఐవోటీ, ఏఐ, వెబ్ ఎనేబుల్డ్ మెడికల్ టెక్నాలజీని ఈ కోర్సు ద్వారా అందిస్తారు. మారుతున్న వైద్య రంగంలో మంచి ఉపాధికి ఇది తోడ్పడుతుందని చెబుతున్నారు.

న్యూస్‌రీల్

బీటెక్‌లో ప్రమోషన్‌కు 20 క్రెడిట్స్!



రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఏకీకృత ప్రమోషన్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. సాంకేతిక విద్య అధికారులతో కూడిన కమిటీ ఈ మేరకు తాజాగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

- వివరాలు 16లో▶

ఇద్దరూ దివ్యాంగులైనా.. 'వివాహ కానుక'



వికలాంగుల వివాహ కానుక పథకం నిబంధనల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. పెళ్లి చేసుకున్న జంటలో ఇకపై ఇద్దరూ దివ్యాంగులైనా పథకం వర్తిస్తుందని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రకటించింది.

- వివరాలు 2లో▶

ఏఐఎస్‌లూ జాగ్రత్త!



అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారుల వ్యవహార శైలిపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. వారు హుందాతనంతో వ్యవహరించకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని హెచ్చరించింది.

- వివరాలు 2లో▶

సామాజిక అంశాలపై స్ఫూర్తినిచ్చేలా..



'టీ-హబ్' వేదికగా మిస్ వరల్డ్ పోటీదారుల మధ్య 'హెడ్ టు హెడ్ చాలెంజ్' నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సుమారు 60 మంది భామలు వివిధ సామాజిక అంశాలపై తమ మనోగతాన్ని పంచుకున్నారు.

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



అక్కడ యుద్ధాలు ఆగిపోవడం ఏమోగానీ ఇక్కడ పాలన ఆగిపోయింది. కాస్త ఇటువైపు కూడా పట్టించుకోండి సార్!

సూర్యుడిపైకి సాగర మేఘాలు

'మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్'తో సూర్యరశ్మి వెనక్కు! • సముద్ర మేఘాల్లోకి జల శతఘ్నుల ప్రయోగం

ఇది కూడా యుద్ధం వంటిదే! అయితే దేశాల మధ్య యుద్ధం కాదు. శాస్త్ర పరిశోధకులు సూర్యుడిని మస కబార్చి భూమిని చల్లబరిచేందుకు చేయబోతున్న మహా ప్రయోగ సంగ్రామం! ఈ జాజ్వల్యమాన జల వ్యూహంలో సముద్రతలం నుంచి నౌకలు, గగన తలం నుంచి విమానాలు ఉప్పు నీటి శతఘ్నులను సంధించి, తమ చెయ్యెత్తులో ఉన్న సాగర మేఘాలను చిక్కబరిచి వాటిని దట్టంగా మార్చేస్తాయి. ఆ బాహుబలి మేఘాలు, సూర్యుడి నుంచి వచ్చే తీక్షణమైన కిరణాలను అడ్డుకుని, వాటిని తిరిగి వెనక్కు అంతరిక్షంలోకి పంపిస్తాయి! వేడిమి నుంచి భూమిని కాపాడతాయి. మహోష్ణ గోళంతో మనిషి తలపడనున్న ఈ ఆపరేషనే 'ఎంసీబీ'. మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్!

సాక్షి, స్పెషల్ డెస్క్

మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ అనేది ఒక జియో ఇంజినీరింగ్ టెక్నిక్. భూతాపాన్ని అరికట్టే ప్రయత్నంలో, భూ వాతావరణాన్ని ప్రభావితం చేసే పర్యావరణ ప్రక్రియలను పెద్ద ఎత్తున మార్చడమే జియో ఇంజనీరింగ్. ప్రపంచవ్యాప్తంగా, మహా సముద్రాలపై సూర్యరశ్మిని వెనక్కు పంపించేలా వాతావరణంలోకి కృత్రిమ రసాయన వాయు కణాలను చొప్పించటం, భూతాప నియంత్రణకు సముద్రపు నీటిలో కరిగి ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ ను పీల్చి పారేయటం వంటి అత్యంత క్లిష్టమైన ప్రాజెక్టుల వంటి అన్నీ జియో ఇంజినీరింగ్ వ్యూహంలో భాగమే.

చిక్కబడిన మేఘాలతో సూర్య 'శౌర్యం' తిరుగుముఖం

భూతాపాన్ని తగ్గించేందుకు జియో ఇంజనీరింగ్ వ్యూహం

ఐదేళ్లలో ప్రయోగాలు

సక్సెస్ అయితే భూగ్రహం ఇక చల్లని గృహమే!



సముద్రంపై తక్కువ ఎత్తులో ఉన్న మేఘాలను దృఢపరిచి, సూర్యకిరణాలను తిరోన్ముఖం పట్టించే సామర్థ్యాన్ని ఆ మేఘాలకు కలిగించటానికి ఆకాశంలోకి ఉప్పు నీటిని చిమ్మటమే... మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్.

వాతావరణంలోకి ఉప్పు నీటిని 'ఎగచిమ్మటం' ద్వారా సముద్ర మేఘాలను కృత్రిమంగా అత్యంత ప్రకాశవంతం చేయటమే మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్. దీనివల్ల ఏర్పడే ఉప్పు నీటి వాయు బిందువులు సముద్ర మేఘాల సాంద్రతను పెంచుతాయి. ఆ మేఘాలను ఢీకొని సూర్యరశ్మి వెనక్కు (పైకి) మళ్లుతుంది. దాంతో భూమి సంగ్రహించే ఉష్ణోగ్రత తగ్గి, భూతాప నివారణ జరుగుతుంది. సముద్రపు మేఘాలు సహజంగా మహాసముద్రాలపై ఏర్పడతాయి. అందుకు సముద్రపు ఉప్పు కీలకమైన పదార్థంగా పనిచేస్తుంది. సము

ఎంసీబీ ప్రయోగాన్ని ఎలా చేస్తారు?

ద్రపు ఉప్పు కణాలు గాలి ద్వారా కదిలినప్పుడు అవి మేఘ బిందువులకు కేంద్రకాలుగా మారి, నీటి ఆవిరి వాటిపై ఘనీభవిస్తుంది. ఈ మేఘ బిందువుల సంఖ్య, పరిమాణం ఒక మేఘం ఎంత సూర్యరశ్మిని తిప్పి కొడుతుందో నిర్ణయిస్తాయి. ఇదంతా సహజ ప్రక్రియ. మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ విధానంలో సముద్ర మేఘాలకు మరిన్ని సముద్రపు ఉప్పు కణాలను జోడించడం ద్వారా ఈ సహజ ప్రక్రియను అనుకరించడం, మెరుగుపరచడం జరుగుతుంది. మెరైన్ స్నో మెషీన్లను, ప్రత్యేకమైన నాళాల వంటి పరికరాలను ఉపయోగించి సముద్రపు ఉప్పు నీటిని గాలిలోకి చల్లడం ద్వారా ఈ ప్రయోగం చేస్తారు.


ఎంసీబీ ప్రయోజనాలు

మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ భూమి గ్రహించే సూర్య రశ్మి పరిమాణాన్ని తగ్గించి భూతాపాన్ని నివారిస్తుంది.	భూగోళాన్ని చల్లబరిచి వేడిగాలులు లేకుండా, కరువు కాటకాలు రాకుండా చేయగలదు.	సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను తగ్గించి, పగడపు దిబ్బలు క్షీణించకుండా కాపాడుతుంది.

ఎంసీబీ దుష్ప్రభావాలు

వాతావరణ సమతౌల్యం, భూమికి నీటిని అందించే 'అవపాత చక్రం' (వర్షపు జల్లులు, మంచు, వడగళ్లు కురిసే కుదురైన వ్యవస్థ) దెబ్బతినే ప్రమాదం ఉంది.	సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రించే 'ఎల్ నినో' గతి తప్పవచ్చు.
	గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించే ప్రయత్నాలు నిష్ఫలం కావచ్చు.

భూమిని చల్లబరిచే జియో ఇంజనీరింగ్ టెక్నిక్



35 ఏళ్ల ప్రయత్నాలు

5 ఏళ్లలో ప్రయోగాలు!

1990లలో తొలిసారి బ్రిటిష్ భౌతిక శాస్త్రవేత్త జాన్ లాథమ్‌కు ఈ 'మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్' ఆలోచన వచ్చింది. ప్రయోగాలకు అనుకూలమైన సముద్ర ప్రాంతాలపై మేఘాలను ప్రకాశవంతం చేయడం వల్ల భూతాపాన్ని పెరగకుండా చేయవచ్చని ఆయన తలపోశారు. ఎలాగంటే... ప్రత్యేక స్ప్రేయర్‌లతో వాతావరణంలోకి చిన్నపాటి సముద్రపు నీటి బిందువులను ఎగజిమ్ముతారు. ఇవి ఆవిరైపోయి ఉప్పు కణాలను మిగులుస్తాయి. ఆ కణాలు దట్టమైన, ప్రకాశవంతమైన మేఘాలను సృష్టిస్తాయి. అవి సూర్యరశ్మిని అడ్డుకుని భూమి మీద వాటి తీవ్రతను తగ్గిస్తాయి. ఇదీ జాన్ లాథమ్ ఆలోచన. ఇన్నేళ్లకు ఈ ఆలోచన ప్రయోగ దశకు చేరుకుంది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రయోగం ఆచరణలోకి రావచ్చని ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూరుస్తున్న 'ఆరియా' అనే బ్రిటన్ సంస్థ అంచనా వేస్తోంది.

రహస్య పరిశోధనా సంస్థ 'ఆరియా'

భూతాప వేగాన్ని నెమ్మదిపరిచే లక్ష్యంతో అనేకమైన జియో ఇంజనీరింగ్ ప్రాజెక్టు పనులు చేపట్టటానికి 'అరియా' అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఇన్వెన్షన్ ఏజెన్సీ' ఏర్పాటైంది. ఇందుకోసం ఈ ప్రభుత్వ రహస్య పరిశోధనా సంస్థ ఇంతవరకు ప్రజా పన్నుల నుంచి 800 మిలియన్ పౌండ్లను సమకూర్చుకుంది. ఇందులో ఒక్క మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ ప్రాజెక్టుకే 57 మిలియన్ పౌండ్లను బ్రిటన్ ప్రభుత్వం కేటాయించింది. అనధికారికంగా 2021 ఫిబ్రవరిలో, అధికారికంగా 2023 జనవరిలో ఈ సంస్థ ప్రారంభం అయింది. ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే శాస్త్రీయ, సాంకేతిక పురోగతులను ఆవిష్కరించమే తన ధ్యేయం అని ఈ సంస్థ చెబుతోంది. ''ఎంతో ఊహాజనితమైన, అతి కష్టతరమైన, వేరే చోట జరగటం అసంభవం అయిన పరిశోధనలను కొనసాగించడానికి మేము శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు అధికారం ఇస్తాం'' అని అరియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇలాన్ గుర్ అంటున్నారు.

క్లుప్తంగా...

సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

కమల్ చంద్ర భంజ్‌దేవ్



భద్రకాళి దేవస్థానంలో కమల్ చంద్ర భంజ్ దేవ్‌కు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకుడు

హనుమకొండ: మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని.. కాకతీయుల 22వ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్ అన్నారు. ఓరుగల్లు పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని, వేయిస్తంభాలగుడి, ఖిలావరంగల్ కోటలోని శంభులింగేశ్వరుడిని దర్శించుకున్నారు. రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమకొండలోని ఓ హోటల్‌లో ప్రజలతో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మాట్లాడారు. ఓరుగల్లులో నిర్మించనున్న విమానాశ్రయానికి రుద్రమదేవి పేరు పెట్టాలని గతంలోనే ప్రధాని మోదీని కోరినట్టు తెలిపారు.

జడ్జి జ్యోతిర్మయికి మంత్రి దామోదర అభినందనలు



వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జ్యోతిర్మయి ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ కాన్పులో మగ శిశువుకు జన్మనిచ్చిన సందర్భంగా.. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎక్స్ ద్వారా ఆమెకు అభినందనలు తెలిపారు. జడ్జి జ్యోతిర్మయి 2023 ఆగస్టు 16న వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో మొదటి కాన్పులో ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పొంది ప్రజల నమ్మకాన్ని పెంచినందుకు మంత్రి అభినందించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను ఎంతో బలోపేతం చేశామని, అన్ని రకాల వైద్య సేవలను, నిష్ణాతులైన వైద్యులను నిరంతరం అందుబాటులో ఉంచుతున్నామని మంత్రి వివరించారు.

ఉద్యాన శాఖను బలోపేతం చేయండి

ఉద్యాన అధికారుల సంఘం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉద్యాన శాఖను పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలని ఉద్యాన అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుడిమళ్ల సందీప్ కుమార్, కార్యదర్శి రావుల విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రాలు అందజేశారు.1982లో ఉద్యాన శాఖ ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకు ఒక్క కొత్త పోస్టు కూడా శాంక్షన్ కాలేదని, ఇప్పటికీ అదే స్థాయి అధికారులే పనిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఒక్కో ఉద్యాన అధికారి 5 నుంచి 10 మండలాల బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో కేవలం 100 మంది మాత్రమే ఉన్నారన్నారు. వ్యవసాయ శాఖ మాదిరిగా ఉద్యాన విస్తరణ అధికారుల (హెచ్‌ఈవో) పోస్టులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ డి.రాజిరెడ్డిని కలిసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరినట్లు సంఘం తెలిపింది.

ఎవరి పనితీరు ఏంటో నివేదికల్లో ఉంది

వాటి ఆధారంగా పార్టీ ముందుకెళ్తుంది: సీఎం రేవంత్‌రెడ్డి

- వ్యవహారశైలి మార్చుకోవాల్సిన వారు వెంటనే మారితే మంచిది
- మీ అవసరాలు, బాధలు కూడా వినేందుకు సిద్ధంగా ఉన్నా
- నాగర్‌కర్నూల్, మెదక్, మల్కాజ్‌గిరి పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో భేటీ



సాక్షి, హైదరాబాద్: అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా మీ ఆలోచనలేంటో చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాసంబంధ అవసరాలు, బాధలు వినేందుకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలతో ముఖాముఖిలో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన నాగర్‌కర్నూల్, మెదక్, మల్కాజ్‌గిరి పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. అయితే, గతంలో మాదిరి కాకుండా ఈసారి ఒక్కో ఎమ్మెల్యేతో విడివిడిగా భేటీ అయినట్టు తెలిసింది. ప్రతీ ఎమ్మెల్యేతో 10-15 నిమిషాలపాటు మాట్లాడిన రేవంత్.. ఎమ్మెల్యేల అభిప్రాయాలను వినడంతోపాటు వారికి దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... ముఖాముఖి భేటీలో భాగంగా వారి పనితీరు గురించి రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఎవరి పనితీరు ఏంటో తన దగ్గర ఉన్న నివేదికలు చెబుతున్నాయని, ఎవరెవరు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారో, ఎవరు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తున్నారో తనకు తెలుసునని, పనితీరు మార్చుకోవాల్సిన వారు వెంటనే మారితే మంచిదని, లేదంటే తాను కూడా ఏమీ చేయలేనని హెచ్చరించినట్టు తెలిసింది. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు వస్తాయని, ఆ నివేదికల ఆధారంగానే పార్టీ ముందుకెళ్తుందని కూడా చెప్పినట్లు సమాచారం. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తీర్చే బాధ్యత తనపై ఉందని, ఈ మేరకు ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని ఎమ్మెల్యేలకు చెప్పారు. నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకురావాలని, కాంగ్రెస్ నుంచి గెలిచిన ప్రతి ఎమ్మెల్యే తనకు సమానమేనని, అందరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. నల్లమల డిక్లరేషన్ సహా అన్నింటినీ అమలు చేస్తానని చెప్పారు. ఒక్కసారి గెలవడం గొప్ప కాదని, రెండోసారి, మూడోసారి గెలిచేలా ప్రజలను ఆకట్టుకోవడంలోనే ఎమ్మెల్యేల పనితీరు తెలుస్తుందని, రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయాల్సి వచ్చినప్పుడు అసలు రాజకీయం ఏంటో అర్థమవుతుందని రేవంత్ వ్యాఖ్యానించారు. సీఎంతో భేటీ అయిన వారిలో వనపర్తి, అచ్చంపేట, కల్వకుర్తి, గద్వాల ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఉన్నారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్ అమెరికా పర్యటనలో ఉండటంతో భేటీలో పాల్గొనలేదు.

ఇద్దరూ దివ్యాంగులైనా.. 'వివాహ కానుక'

వికలాంగుల వివాహ కానుక పథకం నిబంధనల్లో మార్పులు

- ఇప్పటివరకు ఒక్కరు దివ్యాంగులైతేనే పథకం వర్తింపు
- ఇకపై ఇద్దరు వికలాంగులు వివాహం చేసుకున్నా రూ.లక్ష సాయం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దివ్యాంగులకు ప్రభుత్వం కానుక ప్రకటించింది. వికలాంగులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నట్లుగా.. 'వికలాంగుల వివాహ కానుక'పథకం నిబంధనల్లో మార్పులు చేసింది. ఇప్పటివరకు వివాహం చేసుకున్న జంటలో ఒకరు మాత్రమే దివ్యాంగులు ఉంటేనే ఈ పథకం వర్తిస్తుండగా, ఇకపై ఇద్దరూ దివ్యాంగులైనా పథకం వర్తిస్తుంది. ఈ మేరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీచేశారు.

ఎక్కువ మందికి ప్రయోజనం

సాధారణ వ్యక్తులు దివ్యాంగులను వివాహం చేసుకునేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. దీని కింద అర్హులకు ప్రభుత్వం రూ.1 లక్ష అందజేస్తుంది. కానీ, చాలా సందర్భాల్లో వివాహం చేసుకునే అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ దివ్యాంగులు ఉంటున్నారు. వీరికి ఈ పథకం వర్తించటంలేదు. దీంతో నిబంధనలు మార్చి ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకున్నా ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు పెద్ద ఎత్తున వినతులు అందాయి. దీంతో గతేడాది ఏప్రిల్ 18న ఈ శాఖ అధికారులు పథకం నిబంధనల్లో మార్పులు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా నిబంధనలను సవరించింది. ఇకపై దివ్యాంగులను సాధారణ వ్యక్తులు వివాహం చేసుకున్నా, ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆ జంటలోని మహిళ బ్యాంకు ఖాతాలో రూ.లక్ష ఆర్థిక సాయాన్ని జమ చేస్తుంది. ఈ నిబంధనలు తక్షణమే అమలు చేయాలని అనితా రామచంద్రన్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

పదేళ్ల పోరాట ఫలితం: ముత్తినేని వీరయ్య

వికలాంగుల వివాహ కానుక పథకం నిబంధనలు సడలించాలని పదేళ్లు పోరాటం చేశామని, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామమని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగులందరికీ న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకున్నందుకు సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

అండర్‌గ్రౌండ్ విద్యుత్‌పై భట్టి అధ్యయనం

- బెంగళూరులో కర్ణాటక అధికారులతో భేటీ
- ఫ్యూచర్‌సిటీకి వినియోగించే అవకాశాలపై చర్చ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం బెంగళూరులో బిజీబిజీగా గడిపారు. బెంగళూరులో అండర్ గ్రౌండ్ విధానంలో విద్యుత్ సరఫరా కోసం ఉన్న వ్యవస్థపై రాష్ట్ర విద్యుత్ ఉన్నతాధికారులతో కలిసి అధ్యయనం చేశారు. కర్ణాటక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేటీపీసీఎల్), బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ (బీఈఎస్‌సీఎల్) అధికారులతో కలిసి అండర్ గ్రౌండ్ ప్రాజెక్టులపై చర్చించిన భట్టి.. అనంతరం ఈ ప్రాజెక్టు పనితీరును స్వయంగా పర్యవేక్షించారు. కర్ణాటక అధికారులతో చర్చల సందర్భంగా అండర్‌గ్రౌండ్ ప్రాజెక్టులకు అవసరమైన కార్యాచరణ, బ్యాంకు రుణాలు, సాంకేతిక సమస్యలు, లాభనష్టాలు, ప్రమాదాలకు గల అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీ లాంటి ప్రాంతాలకు అండర్ గ్రౌండ్ విద్యుత్ సంస్థ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా జనసాంద్రత ఎక్కువగా ఉన్న పట్టణాల్లో కూడా ఈ వ్యవస్థ మంచి ఫలితాలిస్తుందని అభిప్రాయపడ్డారు. భట్టి వెంట విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు కృష్ణభాస్కర్, ముషర్రఫ్ ఫారూఖీ తదితరులున్నారు.

సామాజిక అంశాలపై స్ఫూర్తినిచ్చేలా..

మిస్ వరల్డ్ పోటీదారుల నడుమ 'హెడ్ టు హెడ్'

- వివిధ అంశాలపై పోటాపోటీగా ప్రసంగాలు
- సామాజిక మార్పు అవసరాన్ని నొక్కిచెప్పిన సుందరీమణులు



అందాల పోటీల్లో తోటి పోటీదారులతో మిస్ ఇండియా నందిని గుప్తా

సాక్షి, హైదరాబాద్: 'ప్రపంచ సుందరి 2025'పోటీల్లో భాగంగా మంగళవారం 'టీ హబ్'వేదికగా పోటీదారుల నడుమ 'హెడ్ టు హెడ్ చాలెంజ్'నిర్వహించారు. అమెరికా, కరీబియన్, ఆఫ్రికా దేశాలకు చెందిన సుమారు 60 మంది పోటీదారులు ఇందులో పాల్గొన్నారు. వీరంతా 'బ్యూటీ విత్ ఏ పర్పస్'నినాదంతో వివిధ సామాజిక అంశాలపై తమ మనోగతాన్ని పంచుకున్నారు. మెరుగైన ప్రపంచం కోసం జరగాల్సిన కృషిపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. బాలల విద్య, పర్యావరణం, పక్షవాతం, ప్రకృతి, యువతులకు మద్దతు, చిన్న సముదాయాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, యుక్త వయసులో ఆందోళన, మానసిక ఆరోగ్యం, ధ్రువీకరణ శక్తి, భాషా సంరక్షణ, బాలలపై హింస, సౌరశక్తి, ప్లాస్టిక్ కాలుష్యం, లింగ ఆధారిత హింస, బాలలపై లైంగిక వేధింపులు, ప్రత్యేక సముదాయాలకు విద్య, ఆర్థిక సంక్షోభాలు, ఆటిజం, మత్తు పదార్థాలు వంటి స్థానిక, అంతర్జాతీయ అంశాలు, సమస్యలపై పోటీదారులు ప్రసంగించారు. తాము ఎంచుకున్న అంశాలపై మాట్లాడుతూ సామాజిక మార్పు అవసరాన్ని నొక్కి చెప్పారు. అందులో తాము భాగస్వాములం అవుతామని ప్రకటించారు.

స్ఫూర్తిని రేకెత్తించేలా..

విద్య, ఆరోగ్య సంరక్షణ, వాతావరణం, సామాజిక అభివృద్ధి వంటి అంశాల్లో పోటీదారుల ఆలోచనలను, వారిలో మానవతా విలువలు తదితరాలను 'హెడ్ టు హెడ్ చాలెంజ్'లో మదింపు చేస్తారు. ఇది పోటీదారుల మధ్య ఒక పోటీ అనేకంటే వారిలోని ధైర్యం, కరుణ తదితరాలను ప్రదర్శించే ఒక కార్యక్రమం లేదా వేడుక లాంటిది. కాగా ఈ చాలెంజ్‌లో పోటీదారులు ప్రస్తావించిన అంశాలు ఎంతో స్ఫూర్తివంతంగా ఉన్నాయి. 'తెలంగాణకు స్ఫూర్తి కేంద్రంగా పేర్కొనే టీ హబ్‌లో ఈ కార్యక్రమం జరగడం హర్షణీయం..'అని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చైర్మన్, సీఈఓ జూలియా మోర్లే అన్నారు. బుధవారం రెండోరోజు టీ హబ్‌లో జరిగే హెడ్ టు హెడ్ చాలెంజ్‌లో యూరప్, ఆసియా, ఓషియానియా దేశాలకు చెందిన పోటీదారులు పాల్గొంటారు.

తప్పుకొన్న ఇంగ్లండ్ పోటీదారు మిల్లా మాగీ

మిస్ వరల్డ్ పోటీల నుంచి ఇంగ్లండ్ ప్రతినిధి మిల్లా మాగీ అర్ధంతరంగా తప్పుకున్నారు. ఆరంభంలో ఉత్సాహంగా పాల్గొన్న ఆమె.. వివిధ ప్రాంతాల సందర్శనకు వెళ్లిన సమయంలో తీవ్ర ఎండవేడిమి వల్ల వడదెబ్బకు గురైనట్టు తెలిసింది. రెండు రోజులుగా చికిత్స చేయించుకున్న ఆమె పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించిందని చెబుతున్నారు. ఆమె స్వదేశానికి పయనమవుతున్నట్టు సమాచారం.

కిమ్స్ ఉషాలక్ష్మి బ్రెస్ట్ సెంటర్ సందర్శన

బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించిన వైద్య సేవలను అందజేస్తున్న కిమ్స్ – ఉషాలక్ష్మి సెంటర్‌ను మిస్ వరల్డ్ పోటీదారులు కొందరు మంగళవారం సందర్శించారు. సంస్థ చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు స్వాగతం పలికారు. మిస్ వరల్డ్ పోటీదారులు కిమ్స్‌ను సందర్శించడం సంతోషకరమని, బ్రెస్ట్ కేన్సర్ వైద్యసేవల్లో ఉషాలక్ష్మి ఫౌండేషన్ ద్వారా డాక్టర్ రఘురామ్ వందశాతం విజయాలను నమోదు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చైర్మన్ జూలియా మోర్లే, నందిని గుప్తా (మిస్ ఇండియా 2025)తోపాటు ఇతర పోటీదారులు, రొమ్ము క్యాన్సర్ ప్రచారకర్త డాక్టర్ నియోమి మైల్స్ (మిస్ గాడెలోప్ 2025- ఫ్రాన్స్), డాక్టర్ ఇదిల్ బిల్గెన్ (యూఎస్ఏ) తదితరులు పాల్గొని డాక్టర్ రఘురామ్ సేవలను కొనియాడారు.

ఆపరేషన్ సిందూర్ చిన్న యుద్ధమా?

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై మండిపడిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ చిన్న యుద్ధమే నన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఖర్గే ఆపరేషన్ సిందూర్ విషయంలో దుర్మార్గంగా మాట్లాడుతున్నారని, మన సైనికుల సత్తాను తక్కువ చేసి చూపించాలనుకుంటున్నారనిధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా? పాకిస్తాన్ ఆర్మీకి చెందిన 11 మిలటరీ బేస్‌లను ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా? 20% పాకిస్తాన్ మిలటరీ మౌలిక వసతులను ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా? చైనా అభివృద్ధి చేసిన అత్యాధునిక మిలటరీ రాడార్, మిసైల్ డిఫెన్స్ వ్యవస్థను మన సైంటిస్టులు తయారు చేసిన మిసైల్స్ ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా? ఈ దెబ్బకు పాకిస్తాన్ ఉక్కిరిబిక్కిరై.. దయచేసి ఉద్రిక్తతలు ఆపుదామని కాళ్ల బేరానికి రావడం చిన్న యుద్ధమా? అని ఖర్గేను కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఆర్మీ బలోపేతాన్ని విస్మరించారని, అధికారాన్ని కోల్పోయినా, ఆర్మీ సాధిస్తున్న విజయాలను స్వాగతించలేకపోతున్నారంటూ కాంగ్రెస్ నేతలను కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు.

ఏఐఎస్‌లూ జాగ్రత్త!

దిగజారి ప్రవర్తించొద్దు..

- ఇకపై అలాంటి వారిపై చర్యలు తప్పవు
- అఖిల భారత సర్వీస్ అధికారులకు సీఎస్ నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారుల వ్యవహారశైలిపై ప్రభుత్వం సీరియస్ అయింది. వారు హుందాతనంతో వ్యవహరించకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణరావు మంగళవారం ఏఐఎస్ అధికారులు, ఉద్యోగులకు వేర్వేరు మెమోలు జారీ చేశారు. ఏఐఎస్‌లతోపాటు, రాష్ట్ర అధికారులు కూడా ప్రభుత్వ ప్రతిష్ట పెంచేలా వ్యవహరించాలే తప్ప.. దిగజార్చేలా ఉండకూడదని స్పష్టం చేశారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గం మాచారంలో జరిగిన ఇందిర సౌర గిరి జల వికాసం కార్యక్రమం సందర్భంగా సీనియర్ ఐఏఎస్ అధికారి శరత్ సీఎం రేవంత్‌రెడ్డి కాళ్లకు నమస్కారం చేయడాన్ని తప్పుపడుతూ ఈ మెమో జారీ చేసినట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. 'సభలు, సమావేశాల్లో ప్రవర్తించే తీరు ప్రజల్లోకి చెడు సంకేతాలు తీసుకెళ్లేవిగా ఉండకూడదు. ఇకపై అలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది'అని సీఎస్ హెచ్చరించారు. 'ఇటీవల బహిరంగ సభలు, సమావేశాల్లో ఏఐఎస్‌ల ప్రవర్తన, హావభావాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. ఇవి వారి వృత్తిపై చెడు ప్రభావం చూపించే అవకాశం ఉంది. ప్రజల్లో వారిపై ఉన్న విశ్వాసాన్ని ప్రభావితం చేస్తాయి.. ప్రతికూల ఫలితాన్నిస్తాయి. ఏఐఎస్ (కండక్ట్) రూల్స్-1968లోని రూల్ 3(1) ప్రకారం ప్రతి ఏఐఎస్ ఎల్లప్పుడూ సంపూర్ణ సమగ్రతతోపాటు, విధి పట్ల అంకితభావంతో ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించిన ఏఐఎస్ ఎవరైనా క్రమశిక్షణా చర్యకు బాధ్యత వహించాల్సి ఉంటుంది'అని సీఎస్ రామకృష్ణారావు మెమోలో స్పష్టం చేశారు. కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల అడవి విధ్వంసానికి సంబంధించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) చిత్రాన్ని ఐఏఎస్ స్మితా సబర్వాల్ రీట్వీట్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద పోలీసులు ఆమెకు నోటీసులు కూడా జారీ చేయగా, దీనిపై స్మితా సబర్వాల్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సీఎస్ జారీ చేసిన నోటీసు ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉద్యోగులు రూల్స్ పాటించాలి..

'తెలంగాణ సివిల్ సర్వీసెస్ (కండక్ట్) రూల్స్-1964లోని రూల్ 3.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విధికి అంకితమై ఉండాలని, క్రమశిక్షణ, నిష్పక్షపాతం, ఔచిత్య భావాన్ని కొనసాగించాలని నిర్దేశిస్తుంది. ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా అవాంఛనీయమైన, అవమానకరమైన రీతిలో ప్రవర్తించకూడదు. ప్రభుత్వ ఉద్యోగుల చర్యలను ఇకపై తీవ్రంగా పరిగణిస్తాం. వారిపై చర్యలు తీసుకుంటాం'అని సీఎస్ ఉద్యోగులకు మరో నోటీసు జారీ చేశారు.

'హలో.. యే.. రఘునందన్ మాచన హై?!

డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్‌కు రాష్ట్రపతిభవన్ నుంచి ఫోన్

సాక్షి, హైదరాబాద్: పొగాకు నియంత్రణపై తాను చేస్తున్న కృషికి రాష్ట్రపతి కార్యాలయం నుంచి ప్రత్యేకంగా ఫోన్ చేసి రాష్ట్రపతి తరఫున అభినందనలు తెలిపారని డిప్యూటీ తహసీల్దార్, అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ చెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన 22 ఏళ్ల పొగాకు నియంత్రణ పోరాటం గురించి ఇటీవలే రాష్ట్రపతి భవన్‌కు ఒక లేఖ ద్వారా వివరించినట్టు తెలిపారు. మే 31 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా.. విద్యాసంస్థలు, కళాశాలల వద్ద సిగరెట్, బీడీ గుట్కా వంటి పొగాకు ఉత్పత్తుల విక్రయాన్ని నిషేధించాలని ఆ లేఖలో కోరినట్టు వెల్లడించారు. టీనేజర్లు, యువత ఎలా మత్తుకు బానిస అవుతున్నదో వివరిస్తూ 42 పేజీల లేఖను రాష్ట్రపతి భవన్‌కు రిజిస్టర్డ్ పోస్టు చేసినట్టు వెల్లడించారు. మంగళవారం రాష్ట్రపతిభవన్ అధికారులు ఫోన్ చేసి అభినందించడంతో తన జన్మ ధన్యమైందని హర్షం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా...



మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చెన్నైలోని రష్యా కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్జాయేవ్

కార్మికులు లేకుండానే పీఎఫ్ నిధులు కొట్టేశారు

- దక్షిణ మధ్య రైల్వేలో నిధులు స్వాహా.. కాంట్రాక్టర్ సహా మరికొందరి హస్తం
- సీబీఐ కేసు నమోదు

సాక్షి, హైదరాబాద్: కొందరు కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై, పనిచేయించకుండానే కార్మికుల సంఖ్యను అదనంగా చూపి పీఎఫ్ రూపంలో దక్షిణ మధ్య రైల్వే నుంచి నిధులు కొల్లగొట్టిన వ్యవహారంపై సీబీఐ కేసు నమోదు చేసింది. రైల్వే సేఫ్టీ ట్రాక్స్ నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దక్షిణ మధ్య రైల్వేకి చెందిన ఉన్నతాధికారుల ఫిర్యాదుతో.. సీబీఐ అధికారులు ఈ అంశంపై దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాలివి. మధిర సబ్ డివిజన్ పరిధిలో కాజీపేట, కొండపల్లి, మోటుమారి జన పహాడ్ సెక్షన్ సేఫ్టీ ట్రాక్ నిర్వహణ కోసం రాజేంద్రనగర్ హైదర్షాకోట్‌కు చెందిన రైల్వే కాంట్రాక్టర్ జె.రత్నకుమార్‌తో 2023 జూన్ 12న సౌత్ సెంట్రల్ రైల్వే ఒప్పందం చేసుకుంది. పట్టాల నిర్వహణ సిబ్బందిగా పంజుగుల శకప్ప, చిరంజీ బాలరాజులను రికార్డుల్లో కాంట్రాక్ట్ కంపెనీ చూపించింది. నెలకు రూ.12 వేలు జీతంగా ఇస్తున్నట్టు పేర్కొంది. వాస్తవానికి ఆ పేరుతో లేబర్ ఎవరూ లేకపోవడంతో.. అధికారులకు అనుమానం వచ్చి ఆరా తీశారు. 48 మంది గ్యాంగ్ మెంబర్స్ పనిచేయాల్సి ఉండగా.. మొత్తం 86 మంది పని చేసినట్లు రికార్డులు సృష్టించారు. ఇలా వారి పేరిట గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జీతాలు డిపాజిట్ చేసినట్టు.. మణికొండ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన నకిలీ రౌండ్ స్టాంప్‌తో జీతాల స్టేట్‌మెంట్లు తయారు చేశారు. వీరందరి పేరిట గతేడాది ఆగస్టు వరకు విడతల వారీగా పీఎఫ్ రూ.2.31 లక్షలు జమ చేసినట్లు చూపారు. రైల్వేశాఖ నుంచి అంతే సొమ్మును (రూ.2.31 లక్షలు) ఈపీఎఫ్ కోసం సేకరించారు. ఈ మొత్తం వ్యవహారంలో కాంట్రాక్టర్‌తో పాటు మరికొందరు ప్రైవేటు వ్యక్తులపై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు.

వరి జన్యు మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కేంద్రానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: వరి జన్యు మార్పిడికి కేంద్రం అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి ఆయన మంగళవారం లేఖ రాశారు. వరి జన్యు మార్పిడి విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయంతో రైతుకు విత్తనాలపై ఉన్న హక్కుకు భంగం కలుగుతుందని, దేశంలోని ఆహార వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు వంకాయ జన్యు మార్పిడికి తీసుకున్న నిర్ణయాన్ని కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. వరి ధాన్యాన్ని ఎక్కువ ఉత్పత్తి చేసే తెలంగాణలో రాష్ట్ర రైతాంగం తరఫున కేంద్రం నిర్ణయాన్ని రైతు కమిషన్ వ్యతిరేకిస్తుందని కోదండరెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.

దేశానికి ప్రమాదం ఉగ్రవాదులా? మావోయిస్టులా..?

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని

సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదులు, మావోయిస్టులలో ఎవరు దేశానికి ప్రమాదమో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన భారతదేశానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిప్యాక్టో ప్రధానిగా వ్యవహరిస్తుండగా, నరేంద్ర మోదీ డమ్మీ ప్రధానిగా మారిపోయారని ఎద్దేవా చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి మాట్లాడారు. ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఉగ్రవాదులతో చర్చలకు సిద్ధపడ్డ మోదీ, ఈ దేశ పౌరులైన మావోయిస్టుల పట్ల మాత్రం ద్వేషం, కసి పెంచుకొని చర్చలపై స్పందించలేదన్నారు. ఉగ్రవాదులను ఏరివేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయని, కాని ప్రధాని మోదీ మాత్రం ఉగ్రవాదులను అడ్డం పెట్టుకుని సొంత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దొడ్డుగా సాగు..



ఈ యాసంగిలోనూ దొడ్డు రకాల పైనే ఆసక్తి చూపించిన రైతులు.. సన్నాలకు బోనస్ ఉన్నా పెద్దగా పట్టించుకోని రైతులు

- అధిక పెట్టుబడి వ్యయం, ఎక్కువ పంట కాలం దృష్ట్యా వెనుకంజ
- మొత్తం వరి సాగు విస్తీర్ణంలో 65 శాతం దొడ్డు రకాలే
- ఇప్పటివరకు 55.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- ఇందులో 37.50 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డురకాలే..
- సన్న ధాన్యం కేవలం 18.47 లక్షల మెట్రిక్ టన్నులే

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఈ యాసంగిలోనూ రైతులు వరి సాగు విషయంలో దొడ్డు రకాల వైపే ఎక్కువగా మొగ్గు చూపారు. సన్న రకాలకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ప్రకటించినప్పటికీ..ఎప్పటిలా దొడ్డు రకాల కంటే తక్కువే సాగయ్యాయి. ఈ యాసంగిలో తెలంగాణ వ్యాప్తంగా 63,54,286 ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేయగా పంట విస్తీర్ణం ఏకంగా 79,99,834 (126 శాతం) ఎకరాలకు పెరిగింది. వరి 47,27,000 ఎకరాల్లో సాగవుతుందని అనుకుంటే.. ఏకంగా 59.86 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఇందులో 65 శాతానికి పైగా దొడ్డురకాలే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే గతంతో పోల్చుకుంటే సన్నాల సాగు పెరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

యాసంగి సాగు, కొనుగోళ్ల లెక్కలివీ..

71,03,283 మెట్రిక్ టన్నులు — యాసంగి 2024-25 ధాన్యం కొనుగోలు లక్ష్యం..	8,412 — ప్రతిపాదించిన కొనుగోలు కేంద్రాలు
55.97 లక్షల మె.టన్నులు — ఇప్పటి వరకు కొనుగోలు చేసినవి (20.05.2025)	8,353 — ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు
37.50 లక్షల మె.టన్నులు — ఇందులో దొడ్డు రకం ధాన్యం	రూ.12,974.10 కోట్లు — కొనుగోలు చేసిన ధాన్యం విలువ
18.47 లక్షల మె.టన్నులు — సన్న రకం ధాన్యం	రూ.9,632.66 కోట్లు — ఎంపీఎంఎస్ ద్వారా చేసిన చెల్లింపులు

కొనుగోలు కేంద్రాలకూ ఎక్కువగా దొడ్డురకాలే..

→ వరి సాగు విస్తీర్ణం పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం యాసంగిలో 71,03,283 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలును లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ 8,412 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించినా.. చివరకు 8,353 కేంద్రాలను తెరిచింది. వీటి ద్వారా ఈ నెల 20వ తేదీ నాటికి 55.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. ఇందులో 37.50 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకాలు కాగా, సన్న రకం కేవలం 18.47 లక్షల మెట్రిక్ టన్నులే కావడం గమనార్హం.

సన్నాలకు ఎన్ని సమస్యలో..

→ సన్న రకం వల్ల సాగుకు పెట్టుబడి ఎక్కువ అవుతుంది. నీటి వసతి ఎక్కువగా ఉండాలి. చీడపీడల బెడద అధికం. పంట కాలం సైతం నెల రోజులు ఎక్కువగా ఉంటుంది. అకాల వర్షాలతో నష్టపోయే అవకాశం ఉంటుంది. పైగా యాసంగిలో వాతావరణం దృష్ట్యా దిగుబడి తక్కువగా వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న సన్న రకాల విత్తనాలను చూస్తే.. తెలంగాణ సోనా ఎకరాకు 20 నుంచి 23 క్వింటాళ్లు, బీపీటీ 20 క్వింటాళ్ల వరకు, జై శ్రీరాం 18 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అదే దొడ్డు రకం వరి అయితే 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకునే దొడ్డు సాగువైపు మొగ్గు చూపామని వివరిస్తున్నారు.

ఎక్కువ దిగుబడి కోసమే దొడ్డు రకం..



సన్న రకం అయితే పంట కాలం ఎక్కువ ఉంటుందనే ఉద్దేశంతోనే దొడ్డు రకం వేసిన. పైగా దొడ్డు రకంతో ఎక్కువ దిగుబడి వస్తుంది. అందుకే తక్కువ కాల వ్యవధిలో ఎక్కువ దిగుబడి వచ్చే దొడ్డు రకం (1010) సాగు చేశా. సన్నాలకు బోనస్ ఉన్నా.. దిగుబడి తగ్గితే లాభం ఉండదని అనుకున్నం.

- కొండమీది భిక్షపతి, కమలాపూర్, హనుమకొండ జిల్లా

సాగు నిబంధనలు ఏమీ లేవు..

వరి విషయంలో రైతులు ఫలానా రకాలే సాగు చేయాలనే నిబంధనలు ఏమీ లేవు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో తీరుగా రైతులు తమకు నచ్చిన వెరైటీలను వేసుకున్నారు. వ్యవసాయశాఖ తరఫున పంటల సాగుకు ఎప్పటికప్పుడు తగు సూచనలు చేశాం. తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో దొడ్డురకాలే నయమన్న ధోరణితో చాలామంది అటువైపు మొగ్గు చూపినట్లు ఉంది.

- కేతిరి దామోదర్‌రెడ్డి, ఏడీఏ, వరంగల్ జిల్లా

సన్నాలకు బోనస్ ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు కేంద్రాలలో రైతులు విక్రయించారు. పౌరసరఫరాల సంస్థ చరిత్రలోనే ఇది రికార్డు కాగా, ఈనెలాఖరు వరకు కొనుగోళ్లు సాగే అవకాశం ఉండటంతో 25 లక్షల నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల సంస్థ అంచనా వేస్తోంది. అయితే రైతులకు బోనస్ చెల్లింపులో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఇప్పటివరకు కొనుగోలు చేసిన 55.97 ఎల్ఎంటీ ధాన్యం విలువ రూ.12,974.10 కోట్లు కాగా, పౌరసరఫరాల సంస్థ రైతుల ఖాతాల్లో రూ.9,632.66 కోట్లు జమ చేసింది. అయితే ఆర్థిక శాఖ ద్వారా నేరుగా ప్రభుత్వమే విడుదల చేసే బోనస్ విషయంలో మాత్రం ఇప్పటివరకు ఉలుకూ పలుకూ లేకపోవడం గమనార్హం.

బోనస్ ప్రకటనతో సన్న ధాన్యం సాగు

తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా యాసంగిలో సన్న ధాన్యాన్ని రైతులు ఎక్కువగా పండించరు. అయితే ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుండటంతో రైతులు ఈసారి పెద్దయెత్తున సన్నాలు సాగు చేశారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, అందులో ఏకంగా 7.15 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలే కావడం గమనార్హం. అలాగే నల్ల గొండ, నారాయణ పేట, జగిత్యాల, నిర్మల్, సిద్దిపేట, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో కూడా పెద్ద ఎత్తున సన్న ధాన్యాన్ని పండించారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఈ సీజన్‌లో రూపాయి ఇవ్వలే!

యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 18.47 ఎల్ఎంటీల సన్న ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. క్వింటాల్‌కు రూ.500 బోనస్ చొప్పున 2,87,262 మంది రైతులకు రూ.923.40 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఆర్థిక శాఖ ఇప్పటి వరకు బోనస్ కింద రైతులకు రూపాయి కూడా విడుదల చేయలేదు. కొనుగోళ్లు మొదలై 45 రోజులు దాటినప్పటికీ, బోనస్ చెల్లించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కౌలు రైతులు సకాలంలో బోనస్ రాక, ఎప్పుడు వస్తుందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోవడం వల్లనే రైతులకు బోనస్ చెల్లించడంలో ఆలస్యం అవుతోందని ఓ అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం. మరో 15 రోజుల్లో వానాకాలం సీజన్ మొదలు కాబోతుండగా, ఇప్పటివరకు బోనస్ మొత్తం బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారిని ప్రశ్నించగా, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వ్యాఖ్యానించారు.

గత వానాకాలంలో రూ.1,200 కోట్లు చెల్లింపు

గత వానాకాలం సీజన్ నుంచే ప్రభుత్వం బోనస్‌ను అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత వానాకాలం సీజన్‌లో 24 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్న రకం ధాన్యం పండించిన సుమారు 4.50 లక్షల మంది రైతులకు రూ.1,200 కోట్లకు పైగా ప్రభుత్వం నేరుగా చెల్లించింది. ఆ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లతో పాటుగానే విడతల వారీగా బోనస్‌ను జమచేస్తూ వచ్చింది. యాసంగి ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యే నాటికి పూర్తిస్థాయిలో బోనస్‌ను చెల్లించింది.

180 క్వింటాళ్ల సన్న ధాన్యం అమ్మా



నేను 8 ఎకరాల్లో సన్న రకం వరి సాగు చేశా. 180 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్మా. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు బోనస్ ఇవ్వలేదు. అలాగే రెండుసార్లు కాంటా పెడితే మొదటిసారి అమ్మిన ధాన్యానికి మాత్రమే డబ్బులు వచ్చాయి. రెండోసారి కాంటా పెట్టిన ధాన్యానికి ఇంకా రాలేదు.

- గడ్డం పాలెం లింగారెడ్డి, రెంజర్ల, ముప్కాల్ మండలం, నిజామాబాద్ జిల్లా

బోనస్ ఊసే లేదు..



వడ్లు కాంటా పెట్టి 45 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ చెల్లించలేదు. బోనస్ ఇస్తానని ప్రభుత్వం ప్రకటించడం వల్లే వ్యాపారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో అమ్మడం జరిగింది. ఇంటిల్లిపాదీ 15 రోజులు కష్టపడి వడ్లను ఆరబెట్టి కేంద్రాల్లో విక్రయిస్తే ఇప్పటివరకు బోనస్ ఊసే లేదు.

- గుజ్జ రామకృష్ణ, తగిలేపల్లి, వర్ని మండలం, నిజామాబాద్ జిల్లా

మరిన్ని గోదాములు, కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలి

వ్యవసాయశాఖ, అనుబంధ సంస్థల అధికారుల సమావేశంలో మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: నాబార్డు నేతృత్వంలోని గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులను ఉపయోగించి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో గోదాములు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయశాఖ, మార్కెటింగ్, ఆయిల్ ఫెడ్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఇప్పటికే ఉన్న గోదాములు, కోల్డ్ స్టోరేజీల సామర్థ్యాన్ని పెంచే విధంగా రాష్ట్రంలో కొత్త నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులు మాత్రమే ఉత్పత్తులను అమ్ముకునేలా రైతుబజార్లను మరింత పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం అన్నిమార్కెట్లు, రైతు బజార్లలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.

పత్తి విత్తన ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయా?

వానాకాలం సీజన్ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో పత్తి విత్తన ప్యాకెట్లు ఎంత మేర సిద్ధం చేశారని మంత్రి తుమ్మల వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే 40 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లను జిల్లాల వారీగా సిద్ధం చేశామని, రానున్న 15 రోజుల్లో 2 కోట్ల విత్తన ప్యాకెట్లు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్టు వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ గోపి తెలిపారు. మే నెలాఖరు వరకు 2 లక్షల మట్టి నమూనాల సేకరణ పూర్తి చేసి, రెండు నెలల లోపు వాటి ఫలితాలు రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని తుమ్మల అధికారులను ఆదేశించారు. పీఏసీఎస్(ప్యాక్స్) సీఈఓల బదిలీలపై ప్రభుత్వం ఇప్పటికే వెసులుబాటు కల్పించిందని, తదనుగుణంగా స్టేట్ లెవల్ కమిటీ ద్వారా బదిలీలపై వెంటనే చర్యలు చేపట్టాలని తుమ్మల ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్‌రావు, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషా, సహకార అడిషనల్ రిజిస్ట్రార్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూస్తున్నాం..

రైతులకు ఎక్కడా కూడా ఎరువుల కొరత లేకుండా చూస్తున్నామని, కేంద్రం నుంచి రావాల్సిన ఎరువులు సకాలంలో పంపాలని మంత్రి తుమ్మల కోరారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన ఎరువులు పూర్తి మొత్తంలో సరఫరా చేయాలని కేంద్ర మంత్రికి తుమ్మల లేఖ రాశారు.

అగ్ని ప్రమాదంపై ఉన్నతాధికారుల కమిటీ

- జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్, సీపీ తదితరులకు చోటు
- ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలన్న మంత్రి పొన్నం
- గుల్జార్ హౌస్‌లో భవనం పరిశీలించిన ఫోరెన్సిక్ నిపుణుల బృందం
- మొత్తం 14 ఏసీలు ఉన్నట్లు గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదం ఘటనపై సమగ్ర విచారణ కోసం ఆరుగురు ఉన్నతాధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఈ నెల 18న ఓ భవనంలో అగ్ని ప్రమాదం సంభవించి 17 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఘటనపై విచారణకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ఫైర్ విభాగం డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌లతో కూడిన కమిటీని నియమించినట్లు మంత్రి తెలిపారు. ఘటనకు గల కారణాలు, ఘటన అనంతరం వివిధ శాఖలు తీసుకున్న చర్యలపై సీఎంకు కమిటీ సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇవ్వాల్సిన సూచనలతో ప్రతిపాదనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ నివేదిక సమర్పించిన అనంతరం దాని ఆధారంగా సీఎం, డిప్యూటీ సీఎం, ఉన్నతాధికారులు సమీక్ష చేసి చర్యలు చేపడతారని తెలిపారు.



భవనం వద్ద కొనసాగుతున్న బందోబస్తు

ఫోరెన్సిక్ నిపుణుల బృందం పరిశీలన

చార్మినార్: అగ్ని ప్రమాదం సంభవించిన భవనాన్ని మంగళవారం క్లూస్, ఫోరెన్సిక్ నిపుణుల బృందం పరిశీలించింది. అగ్నిప్రమాదం జరిగిన తర్వాత తొలిసారిగా భవనంలో ప్రవేశించిన అధికారుల బృందం.. భారీ స్థాయిలో అగ్నిప్రమాదం సంభవించడానికి గల కారణాలతో పాటు భవనంలోని ప్రస్తుత పరిస్థితులను అంచనా వేసింది. భవనంలో దాదాపు 14 ఏసీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గాలి, వెలుతురు సక్రమంగా లేకుండా ఏసీలు పనిచేస్తుండడంతో అవి అధిక ఒత్తిడికి గురైనట్లు భావిస్తున్నారు. అధిక ఒత్తిడి కారణంగా ఏసీ కంప్రెషర్ ఏదైనా పేలిపోయి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు.

ఫ్లోరింగ్ ధ్వంసం.. గోడలన్నీ బీటలు

బయటకు వెళ్లేందుకు సొరంగం లాంటి ఇరుకు మెట్ల దారి ఉండడం వల్లే బాధితులు ప్రమాదం నుంచి బయట పడలేకపోయారని అధికారులు నిర్ధారించారు. తీవ్రమైన మంటలకు గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండంతస్తులు పూర్తిగా కాలిపోయాయి. గదుల గోడలన్నీ బీటలు వారాయి. షాబాద్ ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసం అయింది. భవనం మొత్తం పనికిరాని విధంగా తయారయ్యింది. రాబోయే రోజుల్లో నివాసానికి పనికి రాదని ఫోరెన్సిక్ నిపుణుల బృందం నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలు 125 ఏళ్లకు పైగా ఇక్కడ నివాసం ఉంటున్నట్లు విచారణలో తేలింది. కాగా భవనం వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. మృతులకు సంబంధించిన వారిని మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు.

గ్రీన్, ఆరెంజ్, రెడ్ జోన్లుగా భూగర్భజలాలు

- ఏ గ్రామాలు ఏ జోన్లో ఉన్నాయో.. పంచాయతీ గోడల మీద రాయాలి..
- మండలస్థాయి నుంచి వాల్టా అథారిటీలు నియమించాలి: సీతక్క

సాక్షి, హైదరాబాద్: భూగర్భ జలాల స్థాయిని గ్రీన్, ఆరెంజ్, రెడ్ జోన్‌గా విభజించి ఆయా గ్రామాలు ఏ జోన్‌లలో ఉన్నాయో గ్రామ పంచాయతీ గోడల మీద రాయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు వాల్టా అథారిటీలను నియమించాలన్నారు. నీరు, భూమి, చెట్ల చట్టం (వాల్టా) రాష్ట్ర ప్రాధికార కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మంగళవారం తొలిసారి నిర్వహించిన ఈ ప్రాధికార కమిటీ సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. భూగర్భజలాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. వాల్టా చట్టంపై వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. నీటిని అధికంగా వినియోగిస్తున్నారని కొన్ని ప్రాంతాలపై ఆంక్షలు పెడితే ఉపయోగం ఉండదని, కొత్తగా బోర్లు వేయవద్దని అధికారులు ఆంక్షలు పెట్టినా ప్రజలు అంగీకరించే పరిస్థితి ఉండదని మంత్రి పేర్కొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు స్థానిక అధికారులతో కమిటీలు వేసి మూడు నెలలకోసారి విధిగా వాల్టా అథారిటీలు సమావేశమయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వాల్టా నిధిని ఏర్పాటు చేసి, తద్వారా పర్యావరణహితం ఈ నిధులను వినియోగిస్తామని మంత్రి చెప్పారు. నీటిని అధికంగా వాడడం వల్ల భూగర్భ జలాలు పడిపోతున్నాయని సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్లు రాజశేఖర్, పాండురంగా రెడ్డి, ఉమాదేవి, జలసాధనా సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడు తీర్మానాలను ఆమోదించారు.



గతం ఎంత కష్టంగా ఉండినాసరే,
నువ్వు ఎప్పుడూ మళ్లీ కొత్తగా మొదలుపెట్టొచ్చు.
- బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 21 మే 2025

‘అఖిలపక్షం వేళ’ అనైక్యత!

దేశం కోసం సమష్టిగా కదలాల్సిన సందర్భాల్లో సైతం కలవలేనంతగా అధికార విపక్షాలు ఎడ మొహం పెడమొహంగా మారాయి. పెహల్‌గామ్‌లో గత నెల 22న ఉగ్రవాదులు సాగించిన మారణ కాండ మొదలు మన ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్, ఈ నెల 10న కాల్పుల విరమణ, పాకిస్తాన్ దురాలోచనలూ వగైరా ప్రపంచానికి తెలియజెప్పేందుకు అధికార, విపక్ష ఎంపీలతో ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాల కూర్పు ప్రక్రియ వివాదాస్పదంగా మారటం దీన్ని చాటుతోంది. మన దేశంనుంచి సమష్టి స్వరం వినబడితే దాని ప్రభావం వేరుగా వుంటుంది. పాకిస్తాన్ సైతం ఇదే తరహాలో అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపటానికి సన్నాహాలు చేసుకుంటున్నది. కనీసం ఇందుకోసమైనా విభేదాలు పక్కనబెట్టి ఒక్కటై నిలబడదామన్న స్పృహ అటూ ఇటూ కరువవుతోంది. ఏ దేశంలోనూ ఇలా వుండదు. అమెరికాలో ప్రపంచ వాణిజ్య కేంద్రం (డబ్ల్యూటీసీ)పై ఉగ్రదాడి మొదలు ఇందుకు ఎన్నయినా ఉదాహరణలివ్వొచ్చు. ‘ఉగ్రవాదంపై యుద్ధం’ పేరుతో అమెరికా అఫ్గాన్‌ను వల్లకాడు చేసింది. చివరకు ఒరిగిందేమీ లేదు. అఫ్గాన్‌నుంచి అవమానకరంగా నిష్క్రమించాల్సి వచ్చింది. అయినా అక్కడి విపక్షం మౌనంగా ఉండిపోయింది. కానీ ఇక్కడలా కాదు. యూపీఏ హయాంలో ముంబైపై ఉగ్రదాడి, దానికి వెనకాముందూ జరిగిన అనేకానేక ఉదంతాల్లో మన దేశంలో అధికార పక్షంపై విపక్షం విరుచుకుపడటం, యక్షప్రశ్నలు వేసి ఇరుకున పడేసే ప్రయత్నం చేయటం రివాజుగా మారింది. యూపీఏ హయాంలో బీజేపీ విపక్షంలోవుండి ఏం చేసేదో, ఇప్పుడు కాంగ్రెస్ సైతం ఆ పనే చేస్తోంది. పుల్వామా ఉగ్రదాడి సమయంలో మరీ దారుణం. జవాన్ల త్యాగాలూ, వారు దెబ్బకు దెబ్బ తీసిన వైనమూ 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో చర్చనీయాంశంగా మారటం ఆశ్చర్యపరిచింది. ఈ ఉదంతాలను బీజేపీ తనకనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేయగా, ప్రభుత్వ వైఫల్యంపై విపక్షం చాటింపు వేసింది.

అయితే మన దేశంలోనూ ఒకప్పుడు అధికార, విపక్షాలు కలిసికట్టుగా పనిచేసిన ఉదంతాలు లేకపోలేదు. ఇందుకోసం ఎన్నడో 1971 నాటి భారత్-పాక్ యుద్ధం వరకూ పోనవసరం లేదు. 1994లో కశ్మీర్‌పై భారత్ వైఖరిని వివరించటానికి నాటి ప్రధాని పీవీ నరసింహారావు రూపొందించిన అఖిలపక్ష బృందానికి నేతృత్వం వహించింది అప్పటి విపక్ష నేత అటల్ బిహారీ వాజపేయి! పాతికేళ్ల క్రితం కార్గిల్ యుద్ధ సమయంలో నాటి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమూ, కాంగ్రెస్‌తోసహా విపక్షాలూ దేశభద్రత కోసం కలిసికట్టుగా పనిచేశాయి. కానీ ఇప్పుడెందుకు పరస్పరం తప్పులు వెదుక్కొనే తాపత్రయాన్ని ప్రదర్శిస్తున్నట్టు? దేశంలో తక్షణం వచ్చే ఎన్నికలేమీ లేవు. అయినా పెహల్‌గామ్‌ను రాజకీయంగా వినియోగించుకోవటానికి అటూ ఇటూ పోటీపడుతున్నారు. త్రివిధ దళాల అధికార ప్రతినిధులు చెప్పేవరకూ ఆగకుండా ఇష్టానుసారం ఉన్నవీ లేనివీ ప్రచారం చేసి, విపక్షాలను పాకిస్తాన్ అనుకూలురుగా, దేశద్రోహులుగా చూపటానికి బీజేపీ శ్రేణులూ, సానుభూతిపరులూ చేయని ప్రయత్నం లేదు. తొలి ప్రధాని నెహ్రూ ఉదారంగా పాకిస్తాన్‌కు నదీజలాలు, భారీయెత్తున సొమ్ము కట్టబెట్టారని బీజేపీ నేతలు ఇంకా ఆరోపణలు గుప్పిస్తూనే వున్నారు. ఒకపక్క అఖిలపక్షాన్ని పంపుతూ మాట్లాడాల్సిన మాటలేనా ఇవి? వీటిని ఎలా ఎదుర్కొనాలో తెలియక ఇష్టానుసారం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చులకనవుతున్నారు. యుద్ధ విమానాలు ఎన్ని కూలాయి... మనవైపు జరిగిన నష్టమెంత అంటూ రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఇవి అడగకూడని ప్రశ్నలేమీ కాదు... కానీ అందుకు తగిన వేదికను ఎంచుకోవాలని కూడా ఆయనకు తోచదు.

ఇంతకూ అఖిలపక్ష బృందాల కూర్పుపై ఇంత వివాదం ఎందుకొచ్చినట్టు? విపక్షాలను విశ్వాసంలోకి తీసుకుని, వారు పంపిన పేర్లనుంచి ఎంపికచేసే కనీస మర్యాద అధికార పక్షం పాటించివుంటే సమస్య తలెత్తేది కాదు. విపక్షానికి ఆలోచించే శక్తిసామర్థ్యాలు లేవన్నట్టు సర్కారు ప్రవర్తించింది. కాంగ్రెస్ పార్టీ నలుగురు సభ్యుల పేర్లు పంపితే వారిలో ఒక్కరినే ఎంపిక చేసింది. పోనీ సర్కారు ఎంచుకున్నది కూడా సమర్థుల్నే కదా అనే సర్దుబాటు ధోరణి కాంగ్రెస్‌కు లేదు. అసలు ఆ పార్టీ నుంచి వెళ్లిన జాబితాలో సల్మాన్ ఖుర్షీద్, శశిథరూర్, మనీష్ తివారీ తదితరుల పేర్లు ఎందుకు లేకుండా పోయినట్టు? సీనియర్ నేత ఖుర్షీద్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం తీరా ఆయన సీనియారిటీని కాదని జేడీ(యూ) నేత సంజయ్ ఝాకు సారథ్య బాధ్యతలు ఎందుకిచ్చినట్టు? సమష్టి స్వరం వినబడాల్సిన ఈ సమయంలో ఇన్ని లుకలుకలుండటం మంచిదేనా? ఇంత రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ చివరకు ఈ వివాదాన్ని పొడిగించదల్చుకోలేదని చేతులెత్తేసింది. కానీ ఎప్పుడూ వీరంగం వేసే అలవాటున్న తృణమూల్ మాత్రం ప్రభుత్వం ఎంపిక చేసిన సభ్యుణ్ణి తప్పుకోమని చెప్పింది. దాంతో ప్రభుత్వం తగ్గి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ సూచించిన నేతకు స్థానం కల్పించింది.

అఖిలపక్షం పంపటంలోని ఉద్దేశమే సమష్టితత్వాన్ని, ఈ దేశ సంకల్పాన్ని, పాకిస్తాన్ కుయుక్తులను చాటడానికైనప్పుడు సభ్యుల ఎంపిక వివాదాస్పదం కాకుండా ప్రభుత్వం చూడాల్సింది. ఈమధ్య ఆపరేషన్ సిందూర్ మొదలుకొని పార్టీ వైఖరికి భిన్నంగా పలు ప్రకటనలిస్తూ సంచలనం సృష్టిస్తున్న శశిథరూర్‌ను కాంగ్రెస్ ఎంపిక చేయకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఆయన్ను ఏరికోరి ఎంపిక చేయటం కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టడానికేనన్న విషయంలో ఎవరికీ సందేహం అక్కర్లేదు. ఏదేమైనా ఇలాంటి సంక్షోభ సమయాల్లో అవసరమైన సంయమనం, హుందాతనం ఇరువైపులా కనబడకపోవటం దురదృష్టకరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.నవమి రా.10.41 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** శతభిషం ప.2.52 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.8.59 నుండి 10.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.31 నుండి 12.22 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.50 నుండి 9.24 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

చైనాతో అమెరికా వైరం ముగిసేదేనా?

విశ్లేషణ



టంకశాల అశోక్

అమెరికా, చైనాల ప్రతినిధుల మధ్య ఈనెల 10, 11 తేదీలలో జెనీవాలో జరిగిన చర్చలు వాణిజ్య సుంకాల విషయంలో ఒక రాజీని కుదిర్చాయి గానీ, మరికొన్ని సమస్యలు ఇంకా మిగిలే ఉన్నాయి. మౌలికంగా గుర్తించవలసింది ఏమంటే, ఇరువురి మధ్య అసలు సమస్య సుంకాలకు మించినది. అది ఆధిపత్య సమస్య. చైనాకు ఆధిపత్యం లభించకుండా ఉండేందుకు పలు విధాలుగా ప్రయత్నిస్తూ వస్తున్న అమెరికా, అందుకు సుంకాల యుద్ధాన్ని కూడా ఒక సాధనంగా ఎంచుకుంది. అయితే, ఈ యుద్ధంలో గెలవలేక పోతున్నట్లు అర్థం కావటంతో జెనీవాలో రాజీకి వచ్చింది. అంతమాత్రాన ఇరువురి మధ్య ఆధిపత్య వైరం ముగిసినట్లు కాదు. అది అనేక రూపాలలో పలు సంవత్సరాలపాటు సాగనున్నది.

తొలుత తగ్గింది అమెరికానే!

జెనీవాలో రెండు రోజుల చర్చల తర్వాత, చైనాపై సుంకాలను అమెరికా 145 శాతం నుంచి 30 శాతానికి తగ్గించగా, చైనా 125 శాతం నుంచి 10 శాతానికి తగ్గించింది. అంతకు ముందు వారాలలో ఒకరిపై ఒకరు పోటాపోటీగా సుంకాలు పెంచుతూ పోయారు. తక్కిన అన్ని దేశాలపై అమెరికా సుంకాలు 50 శాతానికి లోపే కాగా, చైనాపై ఒక దశలో 245కి పెంచారు. తర్వాత అన్ని దేశాలపై 90 రోజులు వాయిదా వేసి చైనాకు మాత్రం మినహాయింపు ఇవ్వలేదు. ఆ విధంగా తమ యుద్ధం ప్రధానంగా చైనాపై అన్నది అందరికీ అర్థమైంది. కానీ, ట్రంప్ అంచనా వేసినట్లు చైనా లొంగి రాలేదు. వాణిజ్య యుద్ధాలు తగవనీ, స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలకు విరుద్ధమనీ స్పష్టం చేసింది. వాణిజ్య యుద్ధం వల్ల కొన్ని నష్టాలు ఉంటాయని తెలిసినా, ప్రత్యామ్నాయాలను అన్వేషించటం మొదలు పెట్టింది.

తనవైపు నుంచి అమెరికాకు చైనా కన్నా ఎక్కువ నష్టాలు కనిపించ సాగాయి. ఆ పరిస్థితులలో చైనాతో రాజీ చర్చల కోసం ట్రంప్ ప్రయత్నాలు సాగించారు. చర్చలను చైనాయే కోరుకుంటున్నదంటూ మొదట మేకపోతు గాంభీర్యం చూపి, చివరకు తామే చర్చల తేదీలు ప్రకటించారు. సుంకాలు ఆ స్థాయిలో అవాస్తవికమని ట్రంప్‌తో పాటు ఆయన అధికారులు ముందునుంచే వ్యాఖ్యానించారు. సుంకాలను తాము బహుశా 80 శాతానికి తగ్గించవచ్చునని కూడా ట్రంప్ సూచించారు. అటువంటిది జెనీవాలో అనూహ్యంగా 30 శాతానికి వచ్చారు. ఈ విరామం 90 రోజుల కోసం! ఆ తర్వాత కూడా 145 శాతానికి వెళ్లే అవకాశం లేదని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు.

ఈ 90 రోజులలో ఏమి జరగవచ్చునన్నది ఒక ప్రశ్న. అదట్లుంచి, జెనీవాలో ఉభయులకూ మరికొన్ని ప్రయోజనాలు కలిగాయి. ఉదాహరణకు, అమెరికాకు అరుదైన ఖనిజాలు, లోహాల ఎగుమతిపై విధించిన నిషేధాన్ని చైనా ఎత్తివేసింది. అవి లేనట్లయితే అమెరికాలో రక్షణ రంగంతో సహా అనేకం తీవ్రంగా దెబ్బతింటాయి. మొత్తం ప్రపంచంలోనే ఈ ఖనిజ నిక్షేపాలు, వాటి శుద్ధి పరిశ్రమలు 70 శాతానికి పైగా చైనా అధీనంలో ఉన్నాయి. ఇప్పుడు ఈ నిక్షేపాల కోసం ఉక్రెయిన్, రష్యా, కెనడా, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, గ్రీన్‌లాండ్, ఆఫ్రికా తదితర ప్రాంతాలలో అమెరికా వేగంగా ప్రయత్నాలు ఆరంభించింది గానీ, అవి ఒకవేళ ఫలించినా వినియోగంలోకి రావాలంటే పదేళ్ళు పట్టవచ్చుననే అంచనాలున్నాయి. కనుక చైనా సరఫరాలు తప్పనిసరి. అదేవిధంగా, చైనా రవాణా నౌకలపై ఆంక్షలు, సుంకాలను అమెరికా రద్దు చేయనున్నది. ఆ విధంగా జెనీవాలో ఇతర లాభాలు కూడా ఇరువురికీ కలిగాయి.



◆ అమెరికా, చైనాల మధ్య అసలు సమస్య సుంకాలకు మించినది. అది ఆధిపత్య సమస్య. అది దీర్ఘకాలికమైనది, వ్యూహాత్మకమైనది. ఇందులో సుంకాల యుద్ధం ఒక చిన్న విషయం. జెనీవా రాజీ వరకు జరిగిన పరిణామాలు ఆ చిన్న ఆరంభ యుద్ధంలో తొలి దశ మాత్రమే!

చైనా సవాలు

సుంకాల యుద్ధం ప్రారంభించటంలో ట్రంప్ ఆశించినవి మరొక రెండు ఉన్నాయి. చైనాకు, ఇతర దేశాలకు తరలిపోయిన అమెరికన్ పరిశ్రమలు తిరిగి రావటం, తమ వద్ద అన్ని సుంకాలనూ రద్దు చేయగలమని ప్రకటించినందున ఇతరులు తమ దేశంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టటం ఒకటైతే, ఆ కారణంగా తమ వద్ద ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగటం రెండవది. అవి సాకారం కావటం తేలిక కాదని అమెరికా సహా పాశ్చాత్య నిపుణులే విశ్లేషిస్తున్నారు. అందుకు ఎదురయ్యే తక్షణ సమస్యలు రెండున్నట్లు చెప్తున్నారు. ఒకటి-అవసరమైన మౌలిక సదుపాయాలు, సప్లయ్ చెయిన్లు లేకపోవటం; వాటి అభివృద్ధికి తగినంత కాలం అవసరం కావటం. రెండవది-ఇతర దేశాల కార్మికులు చేసే అనేక పనులకు అమెరికన్ కార్మికులు సిద్ధపడక పోవటం, వారికి ఆ శిక్షణలూ లేకపోవటం. అందువల్ల, 90 రోజుల అనంతరపు అనుభవాలు, సమీక్షలు ఆశావహంగా ఉండే అవకాశాలు కన్పించవు.

మరొక ముఖ్య విషయం. ట్యారిఫ్‌లకు చిన్న దేశాలు బెదిరిపోగా, కెనడా, యూరప్, చైనా గట్టిగా ప్రతిఘటించాయి. ఇండియా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, తైవాన్ ఇచ్చిపుచ్చుకునే విషయం ఆలోచించాయి. చివరకు జెనీవాలో జరిగినది అందరికీ కొంత ధైర్యాన్నిస్తున్నది. వారు చైనా స్థాయిలో ధిక్కరించటం సాధ్యం కాకపోయినా, ట్రంప్‌తో మరికొంత బేరమాడగలరు. తమకు అమెరికా ఎంత అవసరమో వారికి అమెరికా అవసరం కూడా ఏదో ఒక స్థాయిలో ఉంటుంది.

అమెరికా ఎంత శక్తిమంతమైన దేశమైనా అన్నీ తను కోరుకున్నట్లే జరగబోవు. స్వేచ్ఛా వాణిజ్యానికి, డబ్ల్యూటీఓకు సృష్టికర్తలు వారు. పెట్టుబడులు ఎటునుంచి ఎటైనా స్వేచ్ఛగా వెళ్ళవచ్చునని సిద్ధాంతీకరించిందీ వారే! దాని ఫలితాలను దశాబ్దాల పాటు పొందిన తర్వాత ఇపుడు భయపడటం ఎందుకు? కొన్ని విధానాల ఫలితాలు ఒక దశలో ఒక విధంగా ఉన్నప్పటికీ, కాలం గడిచినకొద్దీ కొత్త పరిణామాలు సంభవిస్తాయి. అపుడు ఆ విధానాలు, ఫలితాలలో వైరుధ్యాలు తలెత్తుతాయి. అటువంటి కొత్త పరిణామం చైనా అయింది.

చరిత్ర మలుపులో...

అమెరికా సమస్య కేవలం వాణిజ్య లోటు కాదు. చైనా గత 15-20 ఏళ్ళుగా నాలుగు విధాలుగా వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఆర్థికం. సైనికం. శాస్త్ర-సాంకేతిక రంగాలు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పలుకుబడి. ఇవి నాలుగూ అమెరికా అగ్రస్థానాన్ని దెబ్బతీయగలవు. ఒకప్పటి సోవియెట్ యూనియన్ ఏ బలహీనతల వల్ల పతనమైందో చైనా కూడా అదే విధంగా పతనం కాగలదని ఒక దశలో ఆశించారు. కానీ, సోవియెట్ పతనం నుంచి పాఠాలు నేర్చుకున్న చైనా తన జాగ్రత్తలు తాను తీసుకుంటూ వస్తున్నది. కనుకనే అమెరికా తర్వాత రెండవ ఆర్థిక శక్తిగా, రెండవ సైనిక శక్తిగా, రెండవ శాస్త్ర-సాంకేతిక శక్తిగా మారింది. బ్రిక్స్, బీఆర్‌ఐ (బెల్ట్ అండ్ రోడ్), డీడాలరైజేషన్, బహుళ ధ్రువ ప్రపంచ బలోపేతం వంటి మార్గాలలో అమెరికా రాజకీయ ఆధిపత్యం కోల్పోయే సూచనలు కనిపిస్తున్నాయి.

అమెరికా, చైనాల వైరం ఈ విధంగా మౌలికమైనది, దీర్ఘకాలికమైనది, వ్యూహాత్మకమైనది. ఇందులో సుంకాల యుద్ధం ఒక చిన్న విషయం. జెనీవా రాజీ వరకు జరిగిన పరిణామాలు ఆ చిన్న ఆరంభ యుద్ధంలో తొలి దశ మాత్రమే! ఇందులో ఏది జరిగినా, వైరం మాత్రం కొనసాగుతుంది. ఈ యుద్ధకాండ సుదీర్ఘమైనది. చరిత్రను ఒక కొత్త మలుపు తిప్పగలది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

ఇండియా, చైనాల మధ్య ఇంత వ్యత్యాసమా?

కామెంట్



కరణ్ థాపర్

నేను బీజింగ్ నుండి తిరిగి వచ్చి పదిహేను సంవత్సరాలు గడిచింది కానీ, నేను ఇంకా దాని గురించి రాయబోతున్నాను. అప్పట్లోనే చైనా రాజధాని నన్ను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పడం దాన్ని తక్కువ చేసినట్లే అవుతుంది. నిజం ఏమిటంటే బీజింగ్‌లో ఆనాడు నేను చూసిన, కనుగొన్న అంశాలు నన్ను ఆశ్చర్యచకితుడిని చేశాయి. ఇప్పుడు అదనంగా, చాలా కాలం క్రితం పరిష్కృతమైందని నేను భావించిన వాస్తవం, పాత చర్చను మళ్ళీ రేకెత్తించింది.

నేను బీజింగ్‌లో మూడు రోజులు మాత్రమే ఉన్నాను. రాజధానిలో ఒక చిన్న భాగాన్ని మాత్రమే చూశానని చెప్పాలి. కానీ గ్రేట్ వాల్, మింగ్ సమాధులను దర్శించాను. నగరంలో, గంటల తరబడి డ్రైవింగ్ చేస్తూ గడిపాను. కానీ నేను చూసిన ప్రతిదీ అభివృద్ధి చెందిన మొదటి ప్రపంచాన్ని సూచించింది. రోడ్లు, భవనాలు, దుకాణాలు, ప్రజల వేషధారణ, వారి ప్రవర్తన... మూడవ ప్రపంచ నగరాన్ని కాదు, యూరోపియన్ లేదా ఉత్తర అమెరికా మహానగర సంస్కృతిని తలపింపజేశాయి. ఏ అర్థంలో చూసినా ఈ అంశాలలో దేనిలోనూ ఢిల్లీ పోటీపడలేదు.

బీజింగ్ నమ్మశక్యం కాని విధంగా శుభ్రంగానూ, ఆశ్చర్యకరంగా స్నేహపూర్వకంగానూ ఉంది. చైనీయులు బహిరంగంగా ఉమ్మివేస్తుంటారని నాకు చెప్పారు. నేను చైనాలో గడిపిన మూడు రోజుల్లో అలా ఉమ్మి వేసినవారిని అరడజను మందిని కూడా చూడలేదు. మింగ్ సమాధులు లేదా ఫర్బిడెన్ సిటీ వద్ద వేలాది మంది ఉన్నారు కానీ వారిలోనూ ఈ అలవాటును చూడలేదు. కాలిబాటలపై చెత్త లేదు, గోడలపై పాన్ మరకలు లేవు, దుకాణాల వెలుపల పారవేసిన సిగరెట్ పీకలు, చిరిగిన పాలిథిన్ సంచులు కూడా లేవు.

◆ బీజింగ్‌లోని రోడ్లు, భవనాలు, దుకాణాలు, వారి ప్రవర్తన మూడవ ప్రపంచ నగరాన్ని కాదు, యూరోపియన్ లేదా ఉత్తర అమెరికా మహానగర సంస్కృతిని తలపింపజేశాయి. ఈ అంశాలలో దేనిలోనూ ఢిల్లీ పోటీపడలేదు.

అంతేకాకుండా చైనీయులు స్నేహపూర్వకంగా ఉన్నారు. నేను హోటల్ నుండి తియానన్మెన్ స్క్వేర్‌కు వెళుతున్నప్పుడు అపరిచితులు తరచుగా నడుచుకుంటూ వచ్చి కబుర్లు చెప్పారు. వారు అడుగులో అడుగు వేసి, అది సహజమైన, స్పష్టమైన పని అన్నట్లుగా సంభాషణను ప్రారంభించారు. వారిలో చాలామంది ఇంగ్లిష్ అభ్యసించే విద్యార్థులే అంటే సందేహం లేదు, కానీ మరే ఇతర నగరంలోనూ ఇంత స్వేచ్ఛాయుతమైన ప్రవర్తనను ఎప్పుడూ చూడలేదు.

ఏది మంచి వ్యవస్థ?

వాస్తవానికి 1962 నాటికి చైనాతో మనకు ఏర్పడిన సంక్లిష్ట పరిస్థితిపై, చైనా-ఇండియా పోటీపై స్పష్టమైన భారతీయ దృక్పథంతో నేను బీజింగ్‌కు వెళ్లాను. కానీ, చైనా పట్ల తీవ్రతకు తగ్గని ఆకర్షణ, ఏకపక్షతతో తిరిగి వచ్చాను. కానీ ఇప్పుడు అది పాత భావజాల ఘర్షణను మళ్లీ రగిలించింది.

నిరంకుశ రాజ్యమైన చైనా - ఆర్థిక వృద్ధిని, అభివృద్ధిని తన ప్రాథమ్యంగా చెప్పుకొంటుంది. స్వేచ్ఛా వ్యక్తీకరణ, సహకారం, రాజకీయ ఎంపికలకు సంబంధించిన ఉదారవాద హక్కులను విస్మరిస్తుంది. క్రమశిక్షణ అనేది అక్కడ స్వేచ్ఛా వ్యక్తీకరణ కంటే ముఖ్యమైనది. భిన్నాభిప్రాయాన్ని తీవ్రంగా శిక్షిస్తారు. దీనికి విరుద్ధంగా, భారతదేశం స్వేచ్ఛా పత్రికా వ్యవస్థ, బహుళ, పోటీ రాజకీయ పార్టీలు, స్వతంత్ర న్యాయవ్యవస్థతో పాటు సిద్ధాంతపరంగా తాము కోరుకున్నది చేయడానికి స్వేచ్ఛ ఉన్న వ్యక్తులతో కూడిన ప్రజాస్వామ్యం. మనం తరచుగా మన ప్రభుత్వాలను మారుస్తాం. తరచుగా మన రాజకీయ నాయకులను పక్కన పెడుతుంటాం. స్పష్టంగా చెప్పాలంటే, భారత్‌తో పోలిస్తే చైనా తక్కువ ఆహ్వానించదగిన దేశంగా కనిపిస్తుంది.

కానీ ఈ విషయాన్ని కాస్త భిన్నంగా చూడండి: చైనా తన ప్రజలకు ఆర్థిక భద్రత, మెరుగైన జీవనశైలి, అధిక తలసరి ఆదాయం ఇచ్చింది. 1947లో (లేదా 1949లో, పీపుల్స్ రిపబ్లిక్ పుట్టినప్పుడు) భారత్, చైనాలు ఒకే ఆర్థిక స్థితిలో ఉన్నాయి. 2010లో, నేను చైనాను సందర్శించినప్పుడు, దాని తలసరి ఆదాయం నాలుగు రెట్లు ఎక్కువ. వారి పిల్లలలో 7 శాతం మందే పోషకాహార లోపంతో ఉన్నారు; కానీ మన పిల్లలలో 46 శాతం మంది పోషకాహార లోపంతో ఉన్నారు. దేశంలో పరిస్థితులు మారాయనడంలో సందేహం లేదు. కానీ భారతీయులు పేదరికం నుంచి పూర్తిగా బయటపడతారనే భావన సందేహంగానే ఉంటుంది!

కాబట్టి రెండు దేశాలకు సంబంధించి ఏది మంచి వ్యవస్థ? అత్యవసర పరిస్థితి సమయంలో గంటల తరబడి దీనిపై తీవ్రమైన చర్చను నిర్వహించిన విషయం నాకు గుర్తుంది. 1977 ఎన్నికలు ఈ విషయాన్ని పరిష్కరించాయని నేను అనుకున్నాను. భారత ప్రజలు స్వేచ్ఛ కోసం ఓటు వేసి, ఇందిరా గాంధీ వేసిన పురోగతి, అభివృద్ధి అనే ఎరను తిరస్కరించారు. కానీ చైనా ఆ ప్రశ్నను తిరిగి మేల్కొలిపింది. ముప్పై సంవత్సరాలుగా చైనా సాధిస్తూ వచ్చిన 10 శాతం వృద్ధి, భారత్ సాధించిన దానికి స్పష్టమైన, ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తోంది. పైగా రానురానూ ఈ అంతరం పెరుగుతూ ఉండవచ్చు.

నేను నా భావనలను స్థిరం చేసుకునే ముందు చైనా గురించి ఇంకా చాలా తెలుసుకోవాలి, చూడాలి. కానీ నా విశ్వాసం దెబ్బతింది. తద్వారా వచ్చిన ప్రశ్నలు నన్ను కలవరపెడుతున్నాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఇన్ బాక్స్

వడ్డీ రేట్లను స్థిరపరచాలి

ప్రస్తుతం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీ రేట్లను తరచూ మారుస్తున్న వైనం గమనార్హం. ఇది వృద్ధులు, మధ్యతరగతి ఉద్యోగులు, పెన్షన్‌పై ఆధారపడే లక్షలాది మంది ప్రజలకు తీవ్రమైన అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు సుదీర్ఘకాలంగా ప్రజలకు సురక్షిత ఆదాయ మార్గంగా ఉండేవి. కానీ కొంత కాలంగా, ఈ డిపాజిట్లపై వడ్డీ శాతాలు నిరంతరం మారుతూ, నాణ్యతగల జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి. వృద్ధులు తమ శ్రమ జీవితానంతరం కొంత ఆర్థిక భద్రత కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆధారపడుతున్నారు. అలాంటి వారికి వడ్డీ రేట్లు తగ్గిపోవడం వల్ల ఆదాయం తగ్గిపోతూ జీవన నిబ్బరత క్షీణిస్తోంది.

ముఖ్యంగా వృద్ధులు, పెన్షనర్ల వంటి వర్గాలకు వడ్డీ రేట్ల మార్పులు తీవ్రమైన ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆర్థిక భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ తరహా సమస్యలను నివారించేందుకు పెన్షనర్లకు ప్రత్యేకమైన రక్షణాత్మక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టాలి.

వడ్డీ రేట్లలో స్థిరత్వం ప్రజలకు ఆర్థిక భద్రతను చేకూర్చడమే కాక ఆర్థిక వ్యవస్థ పట్ల వారికి నమ్మకాన్ని కలిగిస్తుంది. ప్రజల జీవన నాణ్యత మెరుగుపడుతుంది.

– డా॥ కృష్ణ కుమార్ వేపకొమ్మ
రిటైర్డ్ ప్రొఫెసర్– ప్రిన్సిపాల్, హైదరాబాద్

ఆధునిక భారత స్వాప్నికుడు

సందర్భం



బి. మహేశ్ కుమార్ గౌడ్

అతిపిన్న వయసులోనే ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించిన రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్తుకు నాడు నాటిన అభివృద్ధి మొక్కలు నేడు వృక్షాలై ఫలాలు అందిస్తున్నాయి. ఆయన దూరదృష్టితో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ సరళీకృతం చేయడం, పరిశ్రమలకు రాయితీలు, పంచాయతీ రాజ్ వ్యవస్థ పటిష్ఠత వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. 21వ శతాబ్దిలో దేశాన్ని నూతన పథంలో నడిపించేలా దిశానిర్దేశం చేశారు. ఆయన యువతరంలో శక్తిమంతమైన మార్పును ఆకాంక్షించి కంప్యూటర్ యుగానికి నాంది పలకడంతో ఇప్పుడు దేశం ప్రగతి దిశలో పయనిస్తోంది.

నాటి ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ ముష్కరుల చేతిలో హత్యకు గురవడంతో దేశ ప్రజల ఆకాంక్ష, ఒత్తిడి మేరకు ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ 1984 అక్టోబర్ 31న భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1984 డిసెంబర్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాజీవ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ రికార్డు స్థాయిలో 414 స్థానాలు గెలిచింది.

దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలనే ప్రధాన లక్ష్యంతో ‘పబ్లిక్ కాల్ ఆఫీస్’ (పీసీఓ) విధానాన్ని ప్రవేశపెట్టడంతో సాధారణ ప్రజలకు కూడా కమ్యూనికేషన్ కనెక్టివిటీ పెరిగింది. రాజీవ్ ప్రభుత్వం అత్యాధునిక టెలి కమ్యూనికేషన్ టెక్నాలజీని దేశీయంగా అభివృద్ధి చేయడానికి 1984లో ‘సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్’ స్థాపించింది. 1985లో విద్యను సార్వత్రికీకరించడానికి ‘ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ’ని ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఓపెన్ యూనివర్సిటీల ప్రారంభానికి ఇది స్ఫూర్తిగా నిలిచింది. బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనం కలిగేలా జాతీయ విద్యా విధానాన్ని విస్తరించాలనే లక్ష్యంతో 1986లో రాజీవ్ గాంధీ దేశంలో ‘జవహర్ నవోదయ విద్యాలయాల’ను ప్రారంభించారు.

గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1989 మే 15వ తేదీన చేసిన 64వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా పీవీ నరసింహారావు ప్రభుత్వం 1993లో చేసిన 73వ రాజ్యాంగ సవరణతో పంచాయతీలకు రాజ్యాంగ ప్రతిపత్తి లభించింది. మానవ వనరుల అభివృద్ధి కోసం ప్రత్యేక వ్యవస్థ ఉండాలనే తలంపుతో రాజీవ్ గాంధీ 1985లో దీనికోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి పీవీ నరసింహారావుకు అప్పగించారు. దేశ రాజకీయాల్లో ముఖ్యంగా 1967 తర్వాత పార్టీ ఫిరాయింపులు ఎక్కువవడంతో వాటి కట్టడికి రాజీవ్ నడుం కట్టారు. 1985లో 52వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ‘పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టా’న్ని 10వ షెడ్యూల్‌లో చేర్చడంతో పార్టీలు మారే ప్రజాప్రతినిధుల సభ్యత్వాన్ని రద్దు చేసే అవకాశం ఏర్పడింది.



రాజీవ్ గాంధీ చేసిన చరిత్రాత్మక చట్టాల్లో 61వ రాజ్యాంగ సవరణ బిల్లు కీలకమైంది. దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములుగా మార్చాలనే ఉన్నతమైన ఆశయంతో ఈ చట్ట సవరణ ద్వారా ఓటు వేసే కనీస వయసును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు. దీంతో దేశ రాజకీయాల్లో యువత ప్రాధాన్యం పెరగడమే కాకుండా వారు తమ ఆశయాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశాలు ఏర్పడ్డాయి.

రాజీవ్ గాంధీ 1991లో ఎన్నికల ప్రచారంలో హడావిడిగా ఉన్న సమయంలో మే 21 రాత్రి కాళరాత్రిగా మారింది. శ్రీపెరంబుదూర్‌లో ‘లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం’ ఆత్మాహుతి దళం బాంబర్ బెల్టు దాడిలో రాజీవ్ గాంధీ మరణించారు. అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నాకు ఈ దుర్ఘటన షాక్ నుండి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. ఇప్పటికీ ఆ విషాదాన్ని తలుచుకుంటే దుఃఖం ఆగదు. రాజీవ్ గాంధీని ఉగ్రవాదులు హతమార్చిన మే 21వ తేదీని భారత దేశంలో ప్రతి ఏటా ‘ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం’గా పాటిస్తున్నారు.

భారత్‌లో సాంకేతిక విప్లవానికి ఆద్యుడైన రాజీవ్ గాంధీ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇప్పుడు మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసరిస్తున్నామంటే అందుకు నాడు సాంకేతిక రంగానికి రాజీవ్ గాంధీ వేసిన బీజాలే కారణం. మరణానంతరం ఆయనకు దేశంలో ప్రతిష్ఠాత్మకమైన ‘భారతరత్న’ ప్రకటించారు. రాజీవ్ గాంధీ పేరున అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ‘రాజీవ్ ఖేల్ రత్న’ అవార్డు అందిస్తున్నారు. ‘మిస్టర్ క్లీన్’గా రాజకీయాల్లో ప్రవేశించిన రాజీవ్ గాంధీకి ప్రజాదరణ పెరగడంతో పాలుపోని ప్రతిపక్షాలు బోఫోర్స్ కేసు పేరుతో అసత్య ఆరోపణలు చేసినా అవి నిరూపితం కాకుండా ఫాల్స్ కేసులుగానే మిగిలిపోయాయి.

వ్యాసకర్త ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు
(నేడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి)

అష్టావక్ర సందేశం

మహాభారతంలో నీతులను నేర్పించే కథలు కోకొల్లలుగా ఉన్నాయి. అందుకే అది నిత్యనూతనంగా కనపడుతుంది. అందులో ఒక కథను చూద్దాం. ఏకపాదుడు మహా తపశ్శాలి. గొప్ప విద్వాంసుడు. రాత్రింబవళ్ళు శిష్యుల చేత వేదాధ్యయనం, విద్యాభ్యాసం చేయిస్తుండేవాడు.



జ్యోతిర్మయం

అతడి భార్య సుజాత గర్భవతిగా ఉన్నపుడు గర్భంలోని శిశువు తండ్రితో, ‘నువ్వు రాత్రింబగళ్ళు విరామం లేకుండా శిష్యుల చేత వేదాధ్యయనం చేయిస్తున్నావు. నిద్ర లేకపోవడం వల్ల, విసుగు చేత వాళ్ళు అధ్యయనం చేసే వేదంలో దోషాలుంటున్నాయి. అలాంటి విద్య నేర్చుకోవడం వల్ల ప్రయోజనమేమిటి?’ అని అన్నాడు. అప్పుడు ఏకపాదుడు, ‘నువ్వు వేదాధ్యయనంలో దోషాలెన్నడమంటే గుడ్లొచ్చి పిల్లను వెక్కిరించినట్లుంది. అధిక ప్రసంగం చేసి వేదాన్ని వక్రంగా విమర్శించావు కాబట్టి ‘అష్టావక్రుడవై పుట్టు’ అని శపించాడు. అతడు అలాగే పుట్టాడు. ఆ తర్వాత ఏకపాదుడు జనకమహారాజు ఆస్థానంలో వంది అనే వేద పండితునితో వాదించి, ఓడి, బందీ అయ్యాడు. అష్టావక్రుడు పోయి వందితో వాదించి, ఓడించి తన తండ్రిని విడిపించి ఇంటికి తెచ్చాడు. (పుటలు 296-297-అరణ్యపర్వము-శ్రీమదాంధ్ర మహాభారతము, రామకృష్ణ మఠం).

నేడు ఎందరో తల్లితండ్రులు, కోచింగ్ సెంటర్ వాండ్లు వాళ్ళ పిల్లలకు, విద్యార్థులకు మంచి ర్యాంకులు రావాలని విరామం లేకుండా వారిని ఉదయం నుంచి రాత్రి వరకు చదివిస్తున్నారు. వారికి తీవ్ర ఒత్తిడిని కలిగిస్తున్నారు. ఆ పిల్లలు మానసిక రోగాలకు శారీరక రోగాలకు గురువుతున్నారు. ర్యాంకుల మాట దేవుడెరుగు. వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అట్టి విద్య వల్ల ప్రయోజనం లేదంటుంది ఈ కథ. ఇక మహా తపశ్శాలి అయిన ఏకపాదుడు కోపానికి గురై కన్న కొడుక్కే శాపమిచ్చాడు. కోపం దుష్ఫలితాలను ఇస్తుందని హెచ్చరిస్తుంది ఈ కథ. శపించిన తండ్రినే విడిపించుకొని తెచ్చాడు కొడుకు. తల్లితండ్రులపై అలాంటి ప్రేమ సంతానానికి ఉండాలని బోధిస్తుంది ఈ కథ.

– రాచమడుగు శ్రీనివాసులు

ఆరో రోజు..అదే రద్దీ

- మంగళవారం 50 వేల మంది పుష్కర స్నానాలు
- సీఎం ఆదేశాలతో నేటి నుంచి నదీహారతి ప్రత్యక్ష ప్రసారం

భూపాలపల్లి/కాళేశ్వరం: అష్టమి కావడంతో త్రివేణి సంగమ తీరానికి ఉదయం వేళ భక్తుల రద్దీ తక్కువగా ఉన్నా, క్రమక్రమంగా పెరిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరానికి ఆరవ రోజైన మంగళవారం భక్తులు పుష్కర స్నానాలకు వచ్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తజనం సరస్వతిఘాట్‌కు చేరుకున్నారు. పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి, నదీమాతకు విశేష పూజలు చేశారు. నదీ తీరంలోనే సైకత లింగాలను తయారు చేసి శివుడిని ప్రత్యేకంగా పూజించారు. ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన 17 అడుగుల ఏకశిల సరస్వతీమాత, కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. 50 వేల మంది వరకు భక్తులు స్నానాలు ఆచరించినట్టు అధికారులు అంచనా వేశారు. గోదావరి నదిలోకి భక్తులు వెళ్లకుండా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాల మేరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఘాట్, ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని చెప్పడంతో సిబ్బంది బ్లీచింగ్ చల్లారు. వర్షం పడితే రోడ్లు బురదమయం కాకుండా గ్రావెల్ చిప్స్ వేసి నీటిని చల్లుతున్నారు. ఎస్పీ కిరణ్‌ఖరే ట్రాఫిక్‌పై దృష్టి సారించారు. డివైడర్‌లు ఏర్పాటు చేసి పోలీసు ఫోర్స్‌తో వాహనాల నియంత్రణ చేపట్టారు. హైకోర్టు జడ్జి సృజన, ఎస్ఐబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డిలు పుష్కర స్నానాలు చేసి శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. కాగా, ప్రతీరోజు సరస్వతి పుష్కరాల్లో రాత్రి 7.30 గంటలకు నిర్వహిస్తున్న నవరత్నమాలిక హారతిని ప్రత్యక్ష ప్రసారం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నదీ హారతికి భారీ స్పందన రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. బుధవారం నుంచి హారతి ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. కాగా, మంగళవారం రాత్రి నిర్వహించిన నవరత్నమాలిక హారతికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు.


సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న జాజుల తదితరులు

ఆర్టీఐ నియామకాల్లో సామాజిక న్యాయాన్ని విస్మరించారు

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన జాజుల బృందం

సాక్షి, హైదరాబాద్: ఇటీవల సమాచార హక్కు కమిషన్ (ఆర్టీఐ) సభ్యుల నియామకంలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పూర్తిగా విస్మరించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను జాజుల బృందం కలిసి బీసీలకు అవకాశం ఇవ్వాలని కోరారు. కేవలం రెండు మూడు కులాలకు అవకాశం కల్పించారని, మెజారిటీ ప్రజలైన బీసీలలో ఒక్కరికి కూడా అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన లెక్కల ప్రకారం బీసీలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీలో చేసిన చట్టం ప్రకారం నామినేటెడ్, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నియామకం, ఉన్నత విద్యా మండలి పదవులు, ఆర్టీఐ పదవుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. 42 శాతం పదవులు కట్టబెట్టకపోతే ప్రభుత్వంపై బీసీలు విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆర్టీఐ నియామకాలపై పునఃసమీక్షించాలని, బీసీలకు మూడు ఆర్టీఐ పదవులు ఇవ్వాలని జాజుల కోరారు.

క్లుప్తంగా...

సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ కరపత్రం

ఆవిష్కరించిన టీపీసీసీ అధ్యక్షుడు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 17 నెలలవుతున్న సందర్భంగా.. రాష్ట్రంలో అమలవుతున్న 17 ప్రధాన సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. టీపీసీసీ కార్యదర్శి బి.రాకేశ్ రూపొందించిన ఈ కరపత్రాలను మంగళవారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు.

సీఎం చొరవతో కారుణ్య నియామకం

రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన దేవి

సాక్షి, హైదరాబాద్: సీఎం చొరవతో రెవెన్యూశాఖలో వేములపతి దేవి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం పొందారు. హైదరాబాద్‌లోని మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బి.రవికుమార్ విధి నిర్వహణలో ఉండగానే, 2018లో మృతి చెందారు. అయితే మృతుడు ఏపీలోని ప్రకాశం జిల్లా గిద్దలూరువాసి కావడంతో ఆరేళ్లుగా ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాల మధ్య కారుణ్య నియామక అంశం తేలకుండా పోయింది. అయితే సీఎం ప్రజావాణి కార్యక్రమంలో సమస్యను వివరిస్తూ కొన్ని నెలల క్రితం మృతుడి భార్య వేములపతి దేవి పిటిషన్ ఇచ్చారు. ఈ విషయం అధికారుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. హైదరాబాద్ పోలీస్‌శాఖలో ఉద్యోగి కావడంతో తెలంగాణలోనే దేవికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దీంతో నాంపల్లి రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణికి వచ్చిన దేవి తన ఉద్యోగ నియామక ఉత్తర్వులను చిన్నారెడ్డి, దివ్యలకు చూపించి ధన్యవాదాలు తెలిపారు.

గో అక్రమ రవాణా అరికట్టండి

డీజీపీకి అఖిల భారత గో సేవ ఫౌండేషన్ వినతి

సాక్షి, హైదరాబాద్: గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత గో సేవ ఫౌండేషన్ కోరింది. రాజ్యాంగంలో ఉన్న చట్టాలను అమలు చేయాలని మంగళవారం డీజీపీ జితేందర్‌ను.. అఖిల భారత గో సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి, తెలంగాణ గుజరాతి సంఘం అధ్యక్షుడు జిగ్నేష్ దోషి, ఆసరా ఫౌండేషన్ అధ్యక్షులు గౌరీ వందన, అఖిల భారత గో సేవ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ రాఘవేందర్ కలిసి వినతి పత్రం అందజేశారు. వచ్చే నెల 7న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రంలోకి కొన్ని వేల గోవులు, ఎద్దులు అక్రమంగా తరలిస్తున్నారని వివరించారు. సానుకూలంగా స్పందించిన డీజీపీ.. తప్పకుండా వీటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తదుపరి చిత్రం రామ్‌చరణ్‌తోనే..

సినీ దర్శకుడు సుకుమార్

- గ్రామీణ ప్రేక్షకులు థియేటర్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు

మలికిపురం: తన తదుపరి చిత్రం 'గ్లోబల్ స్టార్' రామ్‌చరణ్‌తో ఉంటుందని ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలంలో స్వగ్రామమైన మట్టపర్రుకు కుటుంబ సమేతంగా మంగళవారం ఆయన విచ్చేశారు. గ్రామస్తులు, చిన్ననాటి స్నేహితులు, బంధువులతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... హీరో రామ్‌చరణ్‌తో సినిమా తీసేందుకు కథ సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. షూటింగ్ ఎప్పుడు ప్రారంభించేది త్వరలోనే వెల్లడిస్తామన్నారు. తామిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'రంగస్థలం' చిత్రం అప్పట్లో ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిందని, ఆ తరువాత 'ఆర్ఆర్ఆర్'తో పాన్ ఇండియా స్థాయికి రామ్‌చరణ్ ఎదిగారన్నారు. ఆయనతో తాను చేయబోయే చిత్రం ఆ స్థాయిలోనే ఉంటుందని తెలిపారు. అల్లు అర్జున్‌తో తీసిన 'పుష్ప' జాతీయ స్థాయిలో తనకు గుర్తింపు తెచ్చిందన్నారు. పుష్ప–1కు ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చూసి రెండో భాగాన్ని మరింత ఫోకస్ పెట్టి తీశామన్నారు.

ప్రేక్షకుల అభిరుచి ఏం మారలేదు

సినిమాపై ప్రేక్షకుల అభిరుచి ఏ మాత్రం మారలేదని, అప్పటికీ ఇప్పటికీ ఒకేలా ఉందని సుకుమార్ పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రేక్షకులు థియేటర్లను బాగా ఆదరిస్తున్నారని చెప్పారు. పట్టణ ప్రేక్షకుల్లో కొంత భాగం ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. టాలెంట్ ఉన్నవారు చాలా మంది ఉన్నారని, అలాంటి వారిని ప్రోత్సహించేందుకు సుకుమార్ రైటింగ్స్ వంటి సంస్థల్ని స్థాపించానన్నారు. ఈ సంస్థల ద్వారా చాలామందికి ప్రోత్సాహం, టాలెంట్‌ను ప్రూవ్ చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు. ఆ దిశగానే ఫలితాలు ఉంటున్నాయని చెప్పారు.


స్వగ్రామం మట్టపర్రులోని తన ఇంట్లో చిన్నారితో ముచ్చటిస్తున్న దర్శకుడు సుకుమార్

పుట్టిన ఊరంటే అందరికీ మమకారమే

రెండేళ్లకు పైగా చాలా బిజీ షెడ్యూల్స్‌లో ఇరుక్కుపోయానని, షూటింగ్స్ నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల స్వగ్రామానికి రాలేకపోయానని సుకుమార్ చెప్పారు. లేదంటే ఏటా సంక్రాంతి పండుగను ఇక్కడే చేసుకునే వాళ్లమన్నారు. ఇకపైనా ఏటా ఇదే సంప్రదాయం కొనసాగిస్తానన్నారు. పుట్టిన ఊరంటే అందరికీ మమకారమే అన్నారు. కోనసీమలో గోదారి గట్లూ.. కాలువ చెంత, పొలాల మధ్య స్నేహితులతో తిరిగిన క్షణాలు, కాలేజీ రోజులు చాలా బాగుంటాయన్నారు.

విద్యుదాఘాతంతో ఆరుగురు మృతి

- మోటార్‌ను ఆన్ చేసే క్రమంలో నవ వరుడు..
- మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకున్న మరో యువకుడు
- మృతుల్లో రైతు, రైతు కూలీలు కూడా..

బయ్యారం/మిరుదొడ్డి (దుబ్బాక)/జగదేవ్‌పూర్ (గజ్వేల్)/పిట్లం (జుక్కల్)/ తొగుట (దుబ్బాక): విద్యుత్ తీగలు ప్రాణాలు తీశాయి. వేర్వేరుచోట్ల కరెంట్ షాక్‌కు గురై ఆరుగురు మృతిచెందారు.

పెళ్లయిన 48 గంటలకే..


ఇస్లావత్ నరేశ్

పెళ్లి బాజాలు...డీజే మోతలు మోగిన ఆ ఇంట చావు డప్పు మోగింది. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోడిపుంజుల తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ నరేశ్ (26)కు ఏపీలోని కృష్ణాజిల్లా కంచికచర్లకు చెందిన జాహ్నవితో ఆదివారం వివాహం జరిగింది. సోమవారం తండాకు దంపతులిద్దరూ వచ్చారు. మంగళవారం నరేశ్ ఇంటి వద్ద మోటార్‌ను ఆన్‌చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు.

విద్యుత్ సర్వీస్ వైరుపైపడి..

కొలు రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పీర్లపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. జగదేవ్‌పూర్‌కు చెందిన మహ్మద్ షాదుల్ (25) మామిడితోటను కౌలుకు తీసుకున్నాడు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో మామిడి చెట్టుకు ఇనుప స్టాండ్ వేసుకొని ఎక్కి వలను చుడుతున్నాడు. ఈ క్రమంలో స్టాండ్‌పై నుంచి జారి కిందున్న విద్యుత్ సర్వీస్ వైర్‌పై పడటంతో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రమాదవశాత్తూ కరెంట్ తీగలు తగిలి..

విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. మోతె గ్రామానికి చెందిన మంగోరి కృష్ణ హరి (60) తనకున్న ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లాడు. అయితే సోమవారం రాత్రి వీచిన గాలి వానకు పొలంలో కరెంటు స్తంభం పడిపోయి ఉంది. ఇది గమనించని కృష్ణ హరి వ్యవసాయ పనులు చేస్తుండగా తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

మోటారు తీస్తుండగా విద్యుత్ తీగలు తగిలి..


రాములు


హన్మయ్య

కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కంబాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ శివారులోని పొలంలో బోరు మోటారు పని చేయకపోవడంతో మంగళవారం గ్రామానికి చెందిన రాములు (42), హన్మయ్య (59) బోరు మోటారును తీయడానికి వెళ్లారు. మోటారును పైకి తీస్తున్న క్రమంలో మోటార్‌కు ఉన్న ఇనుప పైప్ పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌తో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

మత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకుని..

సిద్దిపేట జిల్లా తొగుటకు చెందిన రామారపు రాజు (36) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజూ మాదిరిగా మంగళవారం కూలి పనికి వెళ్లి.. సాయంత్రం మద్యం సేవించి ఇంటికొచ్చాడు. మత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకోగా కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రభుత్వ బడుల్లో హాజరుకు కృషి చేయండి

ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కోరారు. ఈ విషయమై ఇప్పటికే పీఆర్‌టీయూటీఎస్ సంఘం క్షేత్ర స్థాయి కార్యకర్తలతో తాను ఫోన్‌లో మాట్లాడినట్టు చెప్పారు. ప్రైవేటు విద్య కన్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో మానసిక వికాసంతో కూడిన విద్యను అందిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ప్రచార కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటానని, అందరినీ సమ్మిళితం చేస్తానని శ్రీపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

గనులు, భూగర్భ వనరుల శాఖ ఓఎస్డీగా సుశీల్ కుమార్

టీజీఎండీసీ అదనపు బాధ్యతలు భవేశ్ మిశ్రాకు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ ప్రత్యేక అధికారిగా (ఓఎస్డీ)గా బీవీఆర్ సుశీల్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుశీల్ కుమార్ ప్రస్తుతం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) వీసీ, ఎండీగా వ్యవహరిస్తున్నారు. గతంలోనే పదవీ విరమణ చేసిన సుశీల్ కుమార్‌ను టీజీఎండీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా రెండేళ్ల కాలానికి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. సుశీల్ కుమార్ స్థానంలో ఐటీ శాఖ ఉప కార్యదర్శి భవేశ్ మిశ్రాకు టీజీఎండీసీ వీసీ, ఎండీగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన మరో ఉత్తర్వులో పేర్కొంది.

25 నుంచి టీఎస్‌యూటీఎఫ్ ప్రచార జాతాలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈ నెల 25 నుంచి 31 వరకూ.. వారం రోజుల పాటు ప్రచార జాతాలు నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, ఎ.వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం మండల కమిటీల బాధ్యులు.. తాము పని చేస్తున్న పాఠశాలలతో పాటు మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా బృందాలుగా ఏర్పడి కళా ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు.

కన్నతల్లి కర్కశం

- ఆరేళ్ల కూతురిని నీటిసంపులో పడేసి హతమార్చిన తల్లి
- భర్తను హత్య చేసిన కేసులో ఇటీవలే బెయిల్‌పై విడుదల


సవిత


ఎల్లమ్మ

లింగాల: పేగు బంధాన్ని మరిచిన ఓ కన్నతల్లి కర్కశంగా వ్యవహరించింది. కుటుంబ కలహాలతో అభం శుభం తెలియని చిన్నారిని బలితీసుకుంది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో చోటుచేసుకుంది. చెన్నంపల్లి గ్రామానికి చెందిన మేకల రాములు, ఎల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాలతో భర్త రాములుతో ఎల్లమ్మ తరచుగా గొడవ పడుతుండేది. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 23వ తేదీన ఇంట్లో నిద్రపోతున్న భర్తను గొడ్డలితో నరికి కిరాతకంగా హత్య చేసింది. ఈ ఘటనలో జైలుకు వెళ్లిన ఎల్లమ్మ రెండు నెలల క్రితం బెయిల్‌పై ఇంటికి వచ్చింది. తండ్రి చనిపోయినప్పటి నుంచి పిల్లలు నాయనమ్మ వద్దే ఉంటున్నారు. కాగా.. అత్తమ్మ మాసమ్మ, మరిది కురుమయ్యతో ఎల్లమ్మకు కుటుంబ కలహాలు పెరిగాయి. తనపై కేసులు పెట్టించి జైలుకు పంపారని వారితో తరచూ గొడవపడేది. అయితే చిన్న కూతురు సవిత (6) తన విషయాలన్నీ అత్త, మరిదికి చేరవేస్తుందనే అక్కసుతో మంగళవారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న చిన్నారిని ఎత్తుకెళ్లి పక్కింటిలో ఉన్న నీటి సంపులో పడేసింది. మరిది గట్టిగా నిలదీయడంతో విషయం చెప్పింది. ఆయన వెంటనే సంపులో నుంచి చిన్నారిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సీఐ రవీందర్, ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ ఎల్లమ్మను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో చిదిమేశాడు

- తండ్రి కింద నలిగి ఊపిరాడక చనిపోయిన 28 రోజుల శిశువు


పసికందు మృతదేహం

ఖానాపూర్: తండ్రి మద్యం మత్తు శిశువు పాలిట యమపాశమైంది. రాత్రి తల్లి పొత్తిళ్లలో ఆడుకుని అమ్మ పక్కనే నిద్రపోయిన ఆ పసికందును మద్యం మత్తులో తండ్రి చిదిమేశాడు. మత్తులో సోయి మరిచి.. పసికందుపైనే పడుకోవడంతో ఊపిరి ఆడక మృతిచెందింది. ఈ విషాద ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ అజయ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన అలకుంట శేఖర్–సుజాత దంపతులకు ఆరేళ్ల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు. 28 రోజుల క్రితం మరో పాప జన్మించింది. ఖానాపూర్‌లోనే ఉంటున్న శేఖర్ డ్రైవర్‌గా, కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు శేఖర్ ఇంటికి వచ్చాడు. భార్య సుజాత, పసికందు మంచంపై పడుకోగా, మత్తులోఉన్న శేఖర్ పాప ఉన్న విషయం మర్చిపోయి.. అదే మంచంపై పడుకున్నాడు. దీంతో పసికందు ఊపిరి ఆడక చనిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



జైళ్లనిండా బుల్లి ఫోన్లే

ఇది రికార్డుల కోసం తయారు చేసిన బుల్లి ఫోన్ కాదు. ఎంచక్కా పని చేస్తుంది. ఫ్రాన్స్ జైళ్లలో ఖైదీలు వీటిని విచ్చలవిడిగా వాడుతున్నారు. జైలు నుంచే దర్జాగా డ్రగ్ డీల్స్ మొదలుకుని కాంట్రాక్ట్ హత్యల దాకా నానా దందాలూ చక్కబెట్టుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కొన్నాళ్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్రెంచి జైళ్లలో నిబంధనల జాడే లేనంతగా అరాచకం రాజ్యమేలుతోందని జనం మండిపడుతున్నారు. దాంతో జైళ్లలో ఫోన్ల వాడకంపై అధికారులు ఉక్కుపాదం మోపారు. 'ప్రిజన్ బ్రేక్' పేరిట మంగళవారం దేశవ్యాప్తంగా ఏకంగా 66 జైళ్లలో ఏకకాలంలో తనిఖీ ఆపరేషన్ నిర్వహించారు. కరడుగట్టిన ఖైదీల వద్ద ఇలాంటి బుల్లి ఫోన్లు వేలాదిగా దొరకడంతో విస్తుపోయారు. కేవలం సిగరెట్ లైటర్ పరిమాణంలో ఉండే ఈ ఫోన్లన్నీ చైనా పీసులేనని విచారణలో తేలడం విశేషం! ఆపార్టిక్ అనే ఫ్రెంచి కంపెనీ వీటిని విక్రయిస్తోంది. జైళ్లలో జరిపే ఎలాంటి ఎలక్ట్రానిక్ తనిఖీలకూ ఇవి చిక్కవని వెబ్‌సైట్‌లో బాహాటంగా ప్రచారం చేసుకుంటోంది! దాంతో సదరు కంపెనీని ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టింది.

ఐఎస్ఐ ఏజెంట్ జ్యోతి మల్హోత్రా!

- ఇండియన్ అండర్‌కవర్ ఏజెంట్లను గుర్తించే యత్నం
- అస్త్రంగా వాడుకున్న పాక్ నిఘా సంస్థ
- దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు



చండీగఢ్/న్యూఢిల్లీ: ఇండియన్ అండర్‌కవర్ ఏజెంట్లను గుర్తించడానికి పాకిస్తాన్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా(33)ను వాడుకుందా? నిజమేనని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఐఎస్ఐ హ్యాండ్లర్ అలీ హసన్‌తో వాట్సాప్‌లో జ్యోతి చేసిన చాటింగ్‌లను వెలికి తీశారు. ఇద్దరి మధ్య కోడ్ భాషలో ఈ చాటింగ్‌లు జరిగాయి. ఒక చాటింగ్‌ను పరిశీలిస్తే.. భారత అండర్‌కవర్ ఏజెంట్ల వివరాలు, వారి ఆపరేషన్ల గురించి అలీ హసన్ ఆమెను ప్రశ్నించాడు. భారత్-పాక్ సరిహద్దు అయిన అటారీ బోర్డర్‌ను సందర్శించినప్పుడు ప్రత్యేక ప్రోటోకాల్ ఉన్న అండర్‌కవర్ ఏజెంట్లను చూశావా? అని ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని జ్యోతి బదులిచ్చింది. ప్రోటోకాల్ అందుకున్నవారే అండర్ కవర్ ఏజెంట్లు కావొచ్చు అని అలీ హసన్ చెప్పగా, అలాంటి వారిని తాను చూడలేదని పేర్కొంది. భారత నిఘా ఏజెంట్ల గుట్టుమట్లు తెలుసుకోవడానికి జ్యోతిని అస్త్రంగా ఉపయోగించినట్లు అంచనా వేస్తున్నారు. ఐఎస్ఐ కోసమే పని చేస్తున్నట్లు ఆమెకు పూర్తి అవగాహన ఉందని పేర్కొంటున్నారు. పాకిస్తాన్‌కు సంబంధించిన భారీ గూఢచార ముఠాలో ఆమె ఒక కీలక సభ్యురాలని నిర్ధారణకు వచ్చారు. జ్యోతి తొలిసారిగా 2023లో బైశాఖీ పండుగ సమయంలో పాకిస్తాన్‌లో పర్యటించింది.

ఈ సరిహద్దులు ఇంకా ఎన్నాళ్లో..

జ్యోతి మల్హోత్రా వ్యక్తిగత డైరీ దర్యాప్తు అధికారుల చేతికి చిక్కింది. ఆమె తన ఆలోచనలు, పర్యటనల గురించి ఇందులో రాసుకుంది. పాకిస్తాన్ ప్రస్తావన సైతం ఉంది. డైరీలో 11 పేజీల్లో రాయగా.. 8 పేజీల్లో సాధారణ అంశాలు, 3 పేజీల్లో పాకిస్తాన్ గురించి హిందీ, ఇంగ్లిష్ భాషలో రాతలు కనిపిస్తున్నాయి. ''పాకిస్తాన్ ప్రజల ఆదరణ, వారి అతిథి మర్యాదలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాకిస్తాన్‌లో భారతదేశ హిందువుల పర్యటనలు ఇంకా పెరగాలని కోరుకుంటున్నా. పాకిస్తాన్‌లోని తమ పూర్వీకుల గ్రామాలను హిందువులు సందర్శించాలి. అక్కడి హిందూ ఆలయాలు, గురుద్వారాలకు సులువుగా వెళ్లొచ్చే పరిస్థితులు రావాలి. 1947లో దేశ విభజన తర్వాత విడిపోయిన కుటుంబాలు మళ్లీ కలిస్తే బాగుంటుంది. పాకిస్తాన్‌లో పది రోజుల పర్యటన పూర్తి చేసుకొని ఈ రోజే ఇండియాకు తిరిగొచ్చా. రెండు దేశాల మధ్య ఈ సరిహద్దులు ఇంకా ఎన్ని రోజులు ఉంటాయో తెలియదు. బాధపడే హృదయాలకు ఉపశమనం కలగాలి. మనమంతా ఒకే దేశం, ఒకే నేలకు చెందిన వాళ్లం'' అని జ్యోతి తన డైరీలో రాసుకుంది. మరోవైపు ఆమె కశ్మీర్ పర్యటనల వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అర్ధరాత్రి పొద్దుపోయే దాకా పనిచేయడం ఆమెకు అలవాటు అని గుర్తించారు. రాత్రి ఒంటి గంట సమయంలో వీడియోలను ఎడిటింగ్ చేసి, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తుండేదని చెప్పారు. చాలా సందర్భాల్లో ఢిల్లీకి వెళ్తున్నానని ఇంట్లో వాళ్లకు చెప్పి మరోచోటుకి వెళ్లినట్లు గుర్తించారు. జ్యోతి వ్యవహారం తెలిసి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో ఆమె ఫోటోలన్నీ తొలగించారు. తన బిడ్డ సంగతి తనకు తెలియదని, దీనిపై తనను ఏమీ ప్రశ్నించవద్దని జ్యోతి తండ్రి స్పష్టం చేశారు.

నిందితురాలిపై ప్రశ్నల వర్షం

యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా వ్యవహారంపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)తోపాటు ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ), మిలటరీ ఇంటెలిజెన్స్ అధికారులు ఆమెను విచారిస్తున్నారు. పూర్తి సమాచారం రాబట్టానికి భిన్న కోణాల్లో ప్రశ్నిస్తున్నారు. జ్యోతి మల్హోత్రా ఆర్థిక లావాదేవీలు, ప్రయాణాల వివరాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. ఆమె పాకిస్తాన్, చైనాతోపాటు ఇతర దేశాల్లో పర్యటించినట్లు తెలుస్తోంది. 'ట్రావెల్ విత్ జో' అనే యూట్యూబ్ చానల్ నిర్వహిస్తూ గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ నెల 16న ఆమెను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని అధికారిక రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేశారు. గూఢచర్యం ఆరోపణల నేపథ్యంలో పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో గత రెండు వారాల్లో మొత్తం 12 మందిని అరెస్టు చేశారు.

ఆదాయానికి, ఖర్చులకు పొంతనేదీ?

ఇదిలా ఉండగా, నిందితురాలు జ్యోతి మల్హోత్రా ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ పర్యటించింది, ఎవరిని కలిసిందీ పూర్తి వివరాలు తెలిస్తే వాటన్నింటినీ క్రోడీకరిస్తామని, దానివల్ల దర్యాప్తు వేగంగా ముందుకు సాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. యూట్యూబ్ చానల్ ద్వారానే తనకు ఆదాయం వస్తోందని నిందితురాలు చెబుతుండగా, అధికారులు విశ్వసించడం లేదు. ఆమెకు వచ్చిన ఆదాయానికి, విదేశీ పర్యటనలకు అయిన ఖర్చులకు పొంతన లేదని అంటున్నారు. అందుకే ఆర్థిక వ్యవహారాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వివరాలు కూపీ లాగుతున్నారు. జ్యోతి ల్యాప్‌టాప్‌పై ఫోరెన్సిక్ విశ్లేషణ జరుగుతోందని అధికారులు చెప్పారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య నాలుగు రోజులపాటు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో జ్యోతి మల్హోత్రా ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో పనిచేసే ఓ అధికారిని తరచుగా కలిసింది. పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ సిబ్బందితో ఆమెకు ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్నట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. సోషల్ మీడియా ద్వారా జనంలో గుర్తింపు పొందినవారిని నియమించుకొని, దేశ రహస్యాలు కొల్లగొట్టడం ఆధునిక యుద్ధరీతిలో ఒక భాగంగా మారిందని తెలిపారు.



సరిహద్దుల్లో మళ్లీ రిట్రీట్

అమృత్‌సర్: పాకిస్తాన్‌తో సరిహద్దులున్న పంజాబ్‌లోని మూడు చోట్ల తిరిగి రిట్రీట్ వేడుక మొదలైంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మే 8వ తేదీ నుంచి రెండు వారాలుగా ఈ కార్యక్రమాన్ని బీఎస్ఎఫ్ నిలిపివేసింది. మంగళవారం నుంచి మొదలైన ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు మాత్రమే పాల్గొన్నారని జలంధర్ కేంద్రంగా పనిచేసే పంజాబ్ ఫ్రంటియర్ తెలిపింది. బుధవారం నుంచి మొదలయ్యే రిట్రీట్‌ను తిలకించేందుకు ప్రజలను అనుమతించనున్నట్లు వివరించింది. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు అట్టారీ, హుస్సైనీవాలా, సద్కిల్లో కార్యక్రమం ఉంటుందని తెలిపింది. కార్యక్రమం సమయంలో సరిహద్దు పోస్టుల్లో గేట్లు మూసే ఉంటాయని, అదేవిధంగా, ఆనవాయితీ ప్రకారం బీఎస్ఎఫ్ బలగాలతో పాక్ రేంజర్ల కరచాలనం ఉండదని బీఎస్ఎఫ్ స్పష్టం చేసింది. ప్రజల హాజరీతో సంబంధం లేకుండా బీఎస్ఎఫ్ దళాలు ప్రతి రోజూ సాయంత్రం ఈ మూడు పోస్టుల్లో జాతీయ జెండాను అవనతం చేస్తూనే ఉన్నాయని అధికారులు చెప్పారు. అట్టారీ-వాఘా సరిహద్దుల్లో నిత్యం జరిగే రిట్రీట్ కార్యక్రమాన్ని ప్రజలు ఎంతో ఆసక్తితో తిలకిస్తుంటారు.





ఐబీ చీఫ్ డేకా పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ: ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) చీఫ్ తపన్ కుమార్ డేకా(66) పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం రెండోసారి పొడిగించింది. దీని ప్రకారం ఆయన 2026 జూన్ వరకు బాధ్యతల్లో కొనసాగుతారు. 1988 బ్యాచ్ ఐపీఎస్, హిమాచల్‌ప్రదేశ్ కేడర్ అధికారి అయిన డేకా 2022 జూన్‌లో ఐబీ చీఫ్‌గా రెండేళ్ల కాలానికి నియమితులయ్యారు. గతేడాది జూన్‌లో ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగించింది. ప్రధాని మోదీ సారథ్యంలోని కేబినెట్ నియామకాల కమిటీ డేకా పదవీ కాలాన్ని 2025 జూన్ 30వ తేదీ నుంచి ఏడాదిపాటు పొడిగించేందుకు ఆమోదం తెలిపిందని సిబ్బంది వ్యవహారాల శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

గట్టి ప్రాతిపదిక లేనిదే మధ్యంతర ఉత్తర్వులివ్వలేం

వక్ఫ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) చట్టం–2025 అమలుకు సంబంధించి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్నా అందుకు తగిన ప్రాతిపదిక తప్పనిసరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పార్లమెంటు చేసే చట్టాలు రాజ్యాంగబద్ధమేనన్నది సాధారణ భావన. వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేసేందుకు ప్రభుత్వానికి అధికారం, రాష్ట్ర, కేంద్ర వక్ఫ్ బోర్డుల కూర్పు, వివాదాస్పద ఆస్తులను కలెక్టర్ విచారణ సమయంలో వక్ఫ్‌గా పరిగణించబోమన్న నిబంధనపై మధ్యంతర ఉపశమనం కావాలంటే ఆ మేరకు గట్టి ప్రాతిపదిక తప్పనిసరని సీజేఐ పేర్కొన్నారు. ఆ మూడు అంశాలపైనే వాదనలు వింటామని గత విచారణ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేయడం తెలిసిందే. దాంతో వాటి అమలు దిశగా ప్రస్తుతానికి ఎలాంటి చర్యలూ తీసుకోబోమని ఆ సందర్భంగా కోర్టుకు కేంద్రం హామీ ఇచ్చింది. చట్టం అమలుకు సంబంధించి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వొద్దని అభ్యర్థించింది. వక్ఫ్ భావనలోనే లౌకికత్వం ఇమిడి ఉందని మంగళవారం సమర్పించిన నోట్‌లో కేంద్రం పేర్కొంది. ''వక్ఫ్ చట్టం జాతీయ అవసరం. మత స్వేచ్ఛకు భంగం కలగని రీతిలో వక్ఫ్‌కు సంబంధించిన పలు లౌకికపరమైన అంశాల మెరుగైన నిర్వహణే దాని ఉద్దేశం'' అని పేర్కొంది. దానితో పిటిషనర్ల తరఫున న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వి విభేదించగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. ''స్పష్టమైన సందర్భం వెల్లడవనప్పుడు ఉపశమనం ఇవ్వలేం. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదు. మేం ఇంతకన్నా చెప్పాల్సిన అవసరం లేదు'' అన్నారు.

వాటికే పరిమితం కావాలి

గతంలో ధర్మాసనం పేర్కొన్న మూడు అంశాలకే విచారణను పరిమితం చేయాలని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థించారు. దాన్ని సిబల్, సింఘ్వి తీవ్రంగా వ్యతిరేకించారు. ''వివాదాస్పద చట్టంలోని కొన్ని అంశాలకే విచారణను పరిమితం చేయజాలం. ఢిల్లీ జామా మసీదు వంటి రక్షిత కట్టడాలు కూడా ప్రస్తుతం వక్ఫ్ ఆస్తులుగా ఉన్నాయి. కొత్త చట్టం ప్రకారం వాటి వక్ఫ్ హోదా రద్దవుతుంది. పైగా వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను చొప్పించేందుకు వీలు కల్పించారు'' అని వాదించారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరుల సంఖ్య రెండుకు పరిమితం కదా అని సీజేఐ ప్రశ్నించగా, అది కూడా ఎక్కువేనని సిబల్ అన్నారు. పార్లమెంటు చట్టాలపై కోర్టులు సాధారణంగా స్టే ఇవ్వరాదన్న కేంద్రం వాదనపై సింఘ్వి అభ్యంతరం వెలిబుచ్చారు. సాగు చట్టాలపై సుప్రీంకోర్టు గతంలో స్టే ఇచ్చిందని గుర్తు చేశారు. సుదీర్ఘ వాదనల అనంతరం విచారణ వాయిదా పడింది.



అశ్లీల కంటెంట్‌పై అమెరికా కొరడా

నియంత్రణకు కొత్త చట్టం • బిల్లుపై ట్రంప్‌తో పాటు మెలానియా సంతకం

వాషింగ్టన్: ఆన్‌లైన్‌లో అశ్లీల కంటెంట్‌పై అమెరికా కొరడా ఝళిపించింది. దాని నియంత్రణకు 'టేకిట్ డౌన్' పేరిట కొత్తం చట్టం తెచ్చింది. దీనిప్రకారం వ్యక్తుల తాలూకు అశ్లీల, అభ్యంతరకర ఫొటోలు, వీడియోలను వారి అనుమతి లేకుండా ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేయడానికి వీల్లేదు. సోషల్ ప్లాట్‌ఫాంలు అలాంటి కంటెంట్‌ను తమ దృష్టికి రెండు రోజుల్లోగా తొలగించాల్సి ఉంటుంది. ఈ నిబంధన డీప్‌ఫేక్ కంటెంట్‌కు కూడా వర్తిస్తుంది. ఈ చట్టం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భార్య మెలానియా ఎన్నాళ్లుగానో కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత బిల్లుపై సోమవారం ఆమె సమక్షంలోనే ట్రంప్ సంతకం చేశారు. అనంతరం ఆయన కోరిక మేరకు మెలానియా కూడా బిల్లుపై సంతకం చేయడం విశేషం. ''దీనికోసం మెలానియా ఎంతగానో పోరాడింది. కనుక ఆమె సంతకానికి అర్హురాలు'' అని అధ్యక్షుడు చెప్పుకొచ్చారు.

మరో నాలుగైదు రోజుల్లో రుతుపవనాలు!

కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు • ఈసారి సాధారణం కంటే అధిక వర్షపాతం

న్యూఢిల్లీ: రైతాంగానికి శుభవార్త. నైరుతి రుతుపవనాలు మరో నాలుగైదు రోజుల్లో కేరళకు చేరుకొనే అవకాశం ఉందని భారత వాతవరణ విభాగం(ఐఎండీ) ప్రకటించింది. పరిస్థితులు అందుకు పూర్తి అనుకూలంగా ఉన్నాయని మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. ఈ నెల 27వ తేదీ నాటికి రుతుపవనాలు కేరళను తాకుతాయని ఐఎండీ గతంలో ప్రకటించింది. కానీ, అంతకంటే రెండు రోజుల ముందే రానున్నాయని మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి తాజాగా అంచనా వేసింది. అదే జరిగితే 2009 తర్వాత నైరుతి రుతుపవనాలు త్వరగా రావడం ఇదే మొదటిసారి అవుతుంది. 2009లో మే 23న కేరళలో అడుగుపెట్టాయి. సాధారణంగా ఈ రుతుపవనాలు ప్రతిఏటా జూన్ 1వ తేదీ కల్లా కేరళలో ప్రవేశిస్తాయి. జూన్ 8 నాటికి దేశమంతటా వ్యాపిస్తాయి. సెప్టెంబర్ 17 నుంచి రుతుపవనాల ప్రభావం తగ్గడం మొదలవుతుంది. అక్టోబర్ 15 కల్లా పూర్తిగా తగ్గిపోతుంది. అయితే, ఈసారి దాదాపు ఐదు రోజుల ముందుగానే నైరుతి రుతుపవనాలు వస్తుండడంవిశేషం. 2018లో మే 29, 2019లో జూన్ 8, 2020లో జూన్ 1, 2021లో జూన్ 3, 2022లో మే 29, 2023లో జూన్ 8, 2024లో మే 30న రుతుపవనాలు కేరళలో అడుగుపెట్టాయి. ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ ఇప్పటికే వెల్లడించింది. ఎల్-నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలు లేవని తెలియజేసింది. భారత్‌లో వ్యవసాయ రంగానికి నైరుతి రుతుపవనాలు అత్యంత కీలకం. దేశవ్యాప్తంగా జలాశయాలు నిండడానికి, విద్యుత్ ఉత్పత్తికి ఇవి దోహదపడుతుంటాయి. దేశంలో 42.3 శాతం జనాభాకు వ్యవసాయ రంగమే ఆధారం. దేశ

జీడీపీలో ఈ రంగం వాటా 18.2%

నైరుతి రుతుపవనాల రాక కంటే ముందు దేశంలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా ఉత్తరాదిన ఈ పరిణామం కనిపిస్తోంది. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి మరో రెండు రోజుల్లో తుపానుగా మారనుందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనవల్ల నైరుతి రుతుపవనాలు కేరళ దిశగా వేగంగా ముందుకు కదులుతాయని అంటున్నారు. ఉత్తర కేరళలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. వయనాడ్, కాసరగోడ్, కన్నూర్, కోజికోడ్ జిల్లాల్లో రెడ్ అలర్ట్, పాలక్కాడ్, మలప్పురం, త్రిసూర్ జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

పాక్ ఆర్మీ చీఫ్‌కు ప్రమోషన్



ఇస్లామాబాద్: భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ అత్యున్నత మిలటరీ హోదా అయిన ఫీల్డ్ మార్షల్‌గా ప్రమోషన్ పొందారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ప్రధాని షరీఫ్ ఆధ్వర్యంలో సమావేశమైన కేబినెట్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్ హోదా కట్టబెట్టేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనపై చర్చించి, ఆమోదం తెలిపిందని పేర్కొంది. ఇటీవల భారత్‌తో తలెత్తిన సైనిక ఉద్రిక్తతల సమయంలో పాక్ బలగాలను విజయం దిశగా నడిపించిన మునీర్ పదోన్నతి పొందారని స్థానిక మీడియా తెలిపింది. ఈ విషయంలో ఆయన అద్వితీయమైన పాత్ర పోషించారని ప్రశంసించింది. యుద్ధంలో తమదే విజయమంటూ పాకిస్తాన్ గొప్పలు చెప్పుకుంటుండగా, భారత్ మాత్రం సాక్ష్యాధారాలతో వివిధ అంతర్జాతీయ వేదికలపై వాస్తవాలను వివరిస్తూ వస్తోంది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తూ తిరుగులేని అధికారాలను చెలాయిస్తున్న మునీర్‌కు ఇటీవల ఆ దేశ సుప్రీంకోర్టు మరిన్ని అధికారాలను కట్టబెట్టడం తెల్సిందే. తాజాగా, ఆయనకు ప్రమోషన్ సైతం లభించడం గమనార్హం.

మళ్లీ కోవిడ్ కలవరం

- దేశంలో 257 యాక్టివ్ కేసులు
- ముంబైలోనే 53 కేసులు నమోదు
- ఆందోళన అవసరం లేదన్న వైద్యులు

ముంబై: ఐదేళ్ల కిందట ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ కలవర పెడుతోంది. మంగళవారంనాటికి దేశంలో 257 కోవిడ్ కేసులు నమోదవ్వగా ముంబైలోనే 53 కేసులు నమోదయ్యాయి. వారం రోజుల్లోనే 164 కేసులు పెరిగాయి. క్రియాశీలక కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే మరణాలేవీ సంభవించలేదు. ముంబైలో కేసులు పెరుగుతుండటంతో నగరంలోని ఆస్పత్రులు కోవిడ్ రోగుల చికిత్సకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రజల్లో ఆందోళన పెరుగుతుండటంతో, భయపడాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ప్రజల్లో రోగ నిరోధక శక్తి బలపడిందని, కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సాయం తీసుకోవాలని తెలిపారు. పరిస్థితి సాధారణంగానే ఉందని, అయినా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. రోగుల సంఖ్య పెరిగినా మునుపటిలా భయపడాల్సిన అవసరం లేదని, ఈ ఇన్‌ఫెక్షన్‌తో అంత ప్రమాదం లేదని రాష్ట్ర ఆరోగ్య మంత్రి ప్రకాశ్ అబిత్కర్ చెప్పారు. కేంద్రం సూచనలు జారీ చేస్తే తప్ప కరోనాకు సంబంధించి ముందు జాగ్రత్తలు అనుసరించాల్సిన అవసరం లేదన్నారు.

ఎవరెస్టును గెలిచింది



ఎవరెస్టుపై సగర్వంగా త్రివర్ణ పతాకం చూపుతున్న ఈమె పేరు గీతా సమోటా. కేంద్ర పారిశ్రామిక భద్రతా సంస్థ (సీఐఎస్ఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్. సోమవారం శిఖరాగ్రానికి చేరి విజయకేతనం ఎగురవేసింది. ఆ సంస్థ 56 ఏళ్ల చరిత్రలో ఎవరెస్టును ఎక్కిన తొలి ఉద్యోగిగా రికార్డు సృష్టించింది. మంగళవారం ఈ ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

బెంగళూరులో జనజీవనానికి అంతరాయం

వర్షాలతో అయిదుకు చేరిన మరణాలు

బెంగళూరు: బెంగళూరులో మంగళవారం కూడా వర్షం కురిసింది. దాదాపు 36 గంటలుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో సాధారణ జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగరంలోని మాన్యత టెక్ పార్క్, సిల్క్ బోర్డ్ జంక్షన్‌లలో వంటి ప్రాంతాల్లో మోకాలి లోతు వరద నిలిచిపోయింది. వాహనాలు మొరాయించడంతో వాహన దారుల అవస్థలు వర్ణనాతీతం. వర్షం సంబంధిత ప్రమాద ఘటనల్లో మరణాల సంఖ్య అయిదుకు చేరింది. సాయి లేఔట్‌లోకి భారీగా వరద చేరడంతో చిన్నపాటి దీవిని తలపిస్తోంది. నివాసాల్లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి నీరు చేరడంతో అందులోని వారు బయటకు రాలేక, లోపల ఉండలేక అవస్థలు పడుతున్నారు. ఆ లేఔట్‌లోని కనీసం 150 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరందరికి అధికార యంత్రాంగం ఆహారం, నీరు సరఫరా చేసింది. వరదతో నిండిన హెన్నూర్ అనాథాశ్రమంలోని వారిని కూడా కాపాడారు. ఇలా ఉండగా, కర్ణాటకలోని కోస్తా ప్రాంతంలోని ఏడు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. బెంగళూరుకు ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతోంది.

సంపన్నుల సేవలో మోదీ సర్కారు

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజం

సాక్షి, బళ్లారి: ధనవంతులను మరింత ధనవంతులుగా మార్చే విధానాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. సంపన్నుల సేవలో తరిస్తోందని ధ్వజమెత్తారు. ఎంపిక చేసిన కొంతమంది బడాబాబుల చేతుల్లోకి దేశ సంపద వెళ్లాలన్నదే బీజేపీ ఉద్దేశమని ఆరోపించారు. కానీ, పేదలకు సంపద పంపిణీ చేసి, వారి కన్నీళ్లు తుడవడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని చెప్పారు. కర్ణాటకలో ప్రజలకు ఇచ్చిన ఐదు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. ఆరో గ్యారెంటీ కింద ప్రజలకు భూ హక్కు పత్రాలను జారీ చేస్తోందని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఉమ్మడి బళ్లారి జిల్లాలోని హొసపేటె భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాహుల్ గాంధీతోపాటు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ పలువురు లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు.

స్వర్ణ దేవాలయంలో ఆయుధాలు మోహరించలేదు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సందర్భంగా అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయ ప్రాంగణంలో ఆయుధాలను, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను మోహరించినట్టు వచ్చిన వార్తలను సైన్యం ఖండించింది. అలాంటిదేమీ లేదని మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. స్వర్ణ దేవాలయంపై దాడికి పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను పూర్తిగా తిప్పికొట్టామని వాయుసేన పేర్కొనడం తెలిసిందే. దాయాది క్షిపణులను గుర్తించేందుకు చరిత్రలో తొలిసారిగా స్వర్ణ దేవాలయంలో లైట్లను ఆర్పేల్సి వచ్చిందని చెప్పినట్టు వార్తలొచ్చాయి. అలాంటిదేమీ జరగలేదంటూ సైన్యం తాజాగా స్పష్టత ఇచ్చింది.

సాక్షి హైదరాబాద్

బుధవారం : 21 : మే : 2025



పాతబస్తీలో పరేషాన్‌లెన్నో..!
పాతబస్తీలో ప్రమాదవశాత్తు ఏదైనా ఘటనలు జరిగితే రెస్క్యూ చేయడం గగనమే.. మచ్చుకు కూడా కానరాని ఎమర్జెన్సీ సర్వీసులతో పెను నష్టం వాటిల్లే ప్రమాదం పొంచిఉంది. -10లో



రీడ్.. ఫ్రెండ్
నగరంలోని బుక్ క్లబ్స్ నిండైన ఫ్రెండ్‌షిప్స్‌కు చిరునామాగా వర్ధిల్లుతున్నాయి. పుస్తక ప్రియత్వం నానాటికీ పెరుగుతూనే ఉంది. బుక్ క్లబ్స్ విజయవంతంగా కొనసాగుతున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.0/26.0
నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

భూ కబ్జాదారుపై క్రిమినల్ ట్రెస్పాస్ కేసు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునంబర్-14లో అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతో పాటు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బ్లూ షీట్లపై గవర్నమెంట్ ల్యాండ్ అనే అక్షరాలను తుడిపేస్తూ తన పేరును రాసుకుంటున్న కరడుగట్టిన భూ కబ్జాదారుపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ ట్రెస్పాస్ కేసు నమోదైంది. రెవెన్యూ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డునంబర్-14లోని భాగ్యనగర్ స్టూడియోను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సయ్యద్ అబ్దుల్ ఖాలిద్ అనే కబ్జాదారు 2020లో కబ్జా చేసేందుకు యత్నించాడు. అతడిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో షేక్‌పేట తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ తర్వాత కూడా సదరు కబ్జాదారు ఈ స్థలంపై కన్నేసి బ్లూ షీట్లపై తన పేరుతో ఉన్న స్టిక్కర్లు అంటిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. రెవెన్యూ సిబ్బంది ఎన్నిసార్లు పోస్టర్లను చింపేసినా కూడా అధికారుల కళ్లుగప్పి అర్ధరాత్రి వస్తూ ఈ స్థలం తనదేనంటూ సయ్యద్ అబ్దుల్ ఖాలిద్ పేరుతో స్టిక్కర్లు వేయసాగాడు. దీంతో కబ్జాదారుపై చర్యలు తీసుకోవాలంటూ షేక్‌పేట తహసీల్దార్ వై.అనితారెడ్డి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ 329 (3), 324 (4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పెంచిన మెట్రో చార్జీలపై 10 శాతం తగ్గింపు

ఈ నెల 24 నుంచి రాయితీ అమలు

సాక్షి, సిటీబ్యూరో: పెంచిన చార్జీలపై మెట్రో 10 శాతం రాయితీ ప్రకటించింది. ఈ నెల 24 నుంచి ఈ తగ్గింపు అమల్లోకి రానుంది. ఇటీవల మెట్రో చార్జీలను గరిష్ఠంగా 30 శాతం వరకు పెంచిన సంగతి తెలిసిందే. దీంతో కనిష్ఠంగా రూ.12 నుంచి గరిష్ఠంగా రూ.75 వరకు చార్జీలు పెరిగాయి. సగటు ప్రయాణికుడిపై రూ.15 అదనపు భారం పడింది. ఆ తర్వాత రెండు రోజుల పాటు పరిశీలించిన ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్ సంస్థ.. ఒక అడుగు వెనక్కి తగ్గి 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) సిఫార్సులకు అనుగుణంగా చార్జీలను పెంచినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులకు మరింత మెరుగైన, నాణ్యమైన రవాణా సదుపాయాలను అందజేసేందుకు, మెట్రో సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని 10 శాతం తగ్గించినట్లు ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి తెలిపారు.

చార్మినార్ పరిసరాల్లో ప్రత్యేక సైనేజీలు

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల మిస్ వరల్డ్ పోటీదారులు చార్మినార్‌ను సందర్శించడంతో కాబోలు దీని పరిసరాల్లో ప్రత్యేక సైనేజీలను ఏర్పాటు చేయాలనుకున్న కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వాటి డిజైన్, నిర్వహణ, పనుల కోసం మరోసారి ఆసక్తి వ్యక్తీకరణలను (ఈఓఐ) ఆహ్వానించింది. గతంలోనూ 'కుడా' ఇలాంటి వాటికోసం ఈఓఐలు ఆహ్వానించినప్పటికీ, ఏజెన్సీల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇటీవల మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటనతో చార్మినార్ బాగా ప్రచారం కావడంతో, ఈసారైనా ఎవరైనా ముందుకొస్తారేమోనని వీటిని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ముందుకొచ్చే ఏజెన్సీలు రూపొందించే డిజైన్లను సంబంధిత కమిటీ ఆమోదించాల్సి ఉంటుంది. సైనేజీలపై ఏర్పాటు చేసే బార్‌కోడ్ ద్వారా సమీపంలో ఉన్న ఆయా ప్రాంతాలు, వాటి ప్రత్యేకతల గురించి తెలుస్తుంది. వీటిని ఏర్పాటు చేసేవారు సైనేజీలపై కొంత ప్రదేశాన్ని వ్యాపార ప్రకటనలకు వినియోగించుకోవచ్చు. తొలుత చార్మినార్ చుట్టూ అర కిలోమీటర్ లోపు దాదాపు 50 ప్రాంతాల్లో ఇలాంటి సైనేజీలు ఏర్పాటుచేసి, వాటికి వచ్చే స్పందనతో నగరంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఏర్పాట్లు చేయాలనుకున్నప్పటికీ, గతంలో స్పందన రాలేదు. ఇప్పుడైనా ఏజెన్సీలు ముందుకొస్తాయో, లేదో వేచి చూడాల్సిందే.





కూడళ్లకు కళాత్మకత!

నగరంలోని పలు ప్రాంతాల్లో బల్దియా యంత్రాంగం ఏర్పాటు చేసిన కళాఖండాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కూడళ్ల సుందరీకరణలో భాగంగా ట్యాంక్‌బండ్- కవాడిగూడ మార్గంలోని హోటల్ మారియట్ కూడలి వద్ద తీర్చిదిద్దిన కృత్రిమ సీతాకోక చిలుకల వృక్షం ఆహ్లాదపరుస్తోంది. అలాగే.. ముషీరాబాద్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రెండు చేతుల మధ్య బంతిని పట్టుకున్న చిత్రం బాటసారులను అలరిస్తోంది. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మోస్ట్ వాంటెడ్ హుస్సేన్ చిక్కాడు

- 250కి పైగా కేసుల్లో నిందితుడు
- గంజాయి కేసులో అరెస్టు చేసిన సిటీ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: మూడేళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ గాంజా పెడ్లర్ సయ్యద్ హుస్సేన్ అలియాస్ లంబా ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఇప్పటికే హుస్సేన్‌పై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రై కమిషనరేట్ల పరిధిలో 250కి పైగా కేసులున్నాయి. స్నాచింగ్‌లు, దొంగతనాలు, దోపిడీలు రకరకాల నేరాలకు పాల్పడ్డాడు. అనేక నేరాలలో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న హుస్సేన్‌పై సైఫాబాద్ ఠాణాలో పీడీ యాక్ట్ పెండింగ్‌లో ఉంది. అబిడ్స్, జూబ్లీహిల్స్, మహంకాళి, నారాయణగూడ ఠాణాల పరిధిలో నమోదైన ఐదు కేసులలో హుస్సేన్ పరారీలో ఉన్నాడు. తాజాగా అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా.. ఫలక్‌నుమాకు చెందిన సయ్యద్ హుస్సేన్ అలియాస్ లంబతో పాటు అమీర్‌ఖాన్, ఫరూఖ్‌ఖాన్, మహ్మద్ గౌస్, మహ్మద్ ఆజంఖాన్‌లను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 21 కిలోల గంజాయి, సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు.

ఆన్‌లైన్ మాయగాళ్లు!



నకిలీ గేమింగ్ యాప్‌లతో చిన్నారులకు వల

- ఆఫర్లు, ఉచిత గేమ్స్ పేరిట ఆకర్షిస్తున్న కేటుగాళ్లు
- యాప్‌లు డౌన్‌లోడ్ చేయించి, వ్యక్తిగత సమాచారం తస్కరణ
- వీటి సహాయంతో బెదిరింపులు, బలవంతపు వసూళ్లు

సాక్షి, సిటీబ్యూరో: మారాం చేస్తున్నారనో.. అన్నం తినడం లేదనో.. ఆన్‌లైన్ క్లాసులనో.. కారణమేదైనా ఈ రోజుల్లో పిల్లల చేతికి సెల్‌ఫోన్‌లు చేరిపోయాయి. ఇదే సైబర్ నేరగాళ్లకు వరంగా మారిపోయింది. తెలిసోతెలియకో అనుమానాస్పద వెబ్‌సైట్లు క్లిక్ చేయడం, నకిలీ యాప్‌లు డౌన్‌లోడ్ చేయడంతో ఫోన్‌లోని కాంటాక్ట్‌లు, ఫొటోలు, వీడియోలు, ఇతరత్రా వ్యక్తిగత సమాచారం సైబర్ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. వీటి సహాయంతో కేటుగాళ్లు బెదిరింపులకు పాల్పడుతున్నారు. బలవంతపు వసూళ్లకు దిగుతున్నారు. ఆడండి గెలుచుకోండి (ప్లే టు ఎర్న్) అంటూ గేమింగ్ యాప్‌లతో సైబర్ నేరస్తులు చిన్నారులకు వల విసురుతున్నారు. నకిలీ గేమింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు సృష్టించి బ్యాంకు ఖాతాలు ఊడ్చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్కువగా గేమింగ్ మోసాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు.

మన డేటా గూగుల్‌లో భద్రం..

మనం సెల్‌ఫోన్‌లో ఏ తరహా వీడియోలు, ఎంత సమయం పాటు చూస్తున్నాం.. ఎలాంటి అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేస్తున్నాం, వంటి ప్రతి క్షుణ్నమైన డేటా గూగుల్‌లో స్టోర్ అవుతుంటుంది. వీటి సహాయంతో తొలుత ఉచితంగా ఉండే గేమ్స్ కొన్నాళ్లకు డబ్బులు చెల్లించాలంటూ సంబంధిత లింక్‌ను యాప్ యాజమాన్యాలు ఫోన్‌కు పంపుతాయి. లింక్ క్లిక్ చేస్తే క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు అడగకుండానే కొన్ని యాప్‌లలో కేవలం ఓటీపీ మాత్రమే వస్తుంది. ఫోన్ తమ చేతిలోనే ఉండటంతో పిల్లలు ఓటీపీని నమోదు చేయడం, ఖాతాలోని నగదు డెబిట్ అయినట్లు అదే ఫోన్‌కు వచ్చిన అలర్ట్ మెసేజ్‌ను డిలీట్ చేయడంతో డబ్బులు పోయినట్లు పెద్దలకు తెలియడం లేదు. కొన్నాళ్లకు పెద్ద మొత్తంలో డబ్బు పోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లు..

మైన్‌క్రాఫ్ట్, ఫోర్ట్‌నైట్, అపెక్స్ లెజెండ్స్ వంటి పాపులర్ గేమ్స్ నకిలీ యాప్‌లను సృష్టించి ప్లేస్టోర్లలో అందుబాటులో ఉంచుతున్నారు. క్రికెట్, స్నూకర్, పోకర్, క్యాసినో వంటి నకిలీ గేమింగ్ వెబ్‌సైట్లను సైతం నేరస్తులు సృష్టించారు. 8-16 ఏళ్ల లోపు ఆన్‌లైన్ గేమ్స్‌తో పాటు షార్ట్ వీడియోలకు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. వీటికి అనుగుణంగా వెబ్ లింక్‌లను ఫోన్‌కు సైబర్ నేరస్తులు పంపిస్తారు. లింక్‌ను క్లిక్ చేయగానే మన ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం అంతా నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయి.



ఇలా జాగ్రత్తపడాలి..

- పిల్లలకు ఫోన్లు ఇస్తే వారు అందులో ఏం చూస్తున్నారు? ఏయే లింక్‌లను క్లిక్ చేస్తున్నారో గమనిస్తూ ఉండాలి.
- క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలను పిల్లలకు చెప్పకూడదు.
- ఫోన్‌లో పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే వంటి యూపీఐ యాప్‌లకు లాక్ చేసుకోవటం ఉత్తమం.
- ఆన్‌లైన్ బ్యాంకింగ్ వినియోగించకుండా ఫింగర్ ప్రింట్ లాక్ ఉంటే మరీ మంచిది.
- సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడకపోవటమే బెటర్.
- అసలు, నకిలీ నిర్ధారించుకున్న తర్వాతే ఫోన్‌లో గేమింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

నయా బిల్డింగ్ బైలాస్



- దేశ విదేశాల్లోని నగరాల్లో అధ్యయనం
- త్వరలో కన్సల్టెన్సీ నియామకం
- ట్రిపుల్ ఆర్ దాకా మహా నగర విస్తరణకు మార్గదర్శనం
- ఆసక్తిగల సంస్థల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ స్వీకరణ

అంతర్జాతీయ ప్రమాణాలే లక్ష్యంగా హెచ్ఎండీఏ కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో:

భవన నిర్మాణ రంగానికి సరికొత్త దిశా నిర్దేశం చేసేందుకు హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) సన్నద్ధమవుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా సమగ్ర బిల్డింగ్ బైలాస్ రూపకల్పనకు కసరత్తు చేపట్టింది. ఈ మేరకు పలు దేశ విదేశాలకు చెందిన మెట్రోపాలిటన్ నగరాల్లోని బిల్డింగ్ బైలాస్‌పై అధ్యయనం చేసి మహా నగర అవసరాలకు అనుగుణంగా బైలాస్‌ను (నియమ, నిబంధనలు) రూపకల్పన చేసేందుకు ఒక కన్సల్టెన్సీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఆసక్తిగల సంస్థల నుంచి త్వరలో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌ను స్వీకరించనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. మహా నగర పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించిన నేపథ్యంలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు హెచ్ఎండీఏ కార్యాచరణ చేపట్టిన సంగతి తెలిసిందే. రీజినల్ రింగ్‌రోడ్డు వరకు మౌలిక, ప్రజారవాణా సదుపాయాల విస్తరణ, పచ్చదనం పెంపు, నీటివనరుల సంరక్షణ తదితర అంశాలపై మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. ఈ క్రమంలోనే భవన నిర్మాణాలకు శాస్త్రీయమైన బైలాస్‌ను సైతం అందుబాటులోకి తెచ్చేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేపట్టింది. దీనివల్ల నిర్మాణ సంస్థలకు అనుమతులను అందజేయడంలో అనవసరమైన జాప్యాన్ని నివారించడమే కాకుండా అడ్డదిడ్డ నిర్మాణాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు. మరోవైపు ఎలాంటి నిబంధనల ఉల్లంఘనకు తావులేకుండా నిర్మాణాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆకాశ హర్మ్యాలకు అంతర్జాతీయ ప్రమాణాలు...

నగరంలో నిర్మాణ రంగం స్థిరంగా కొనసాగుతోంది. గత పదేళ్లుగా బహుళ అంతస్తుల భవనాలు పెరిగాయి. ప్రస్తుతం 57 నుంచి 65 అంతస్తుల హైరైజ్ భవనాలు నిర్మాణమవుతున్నాయి. అదేక్రమంలో విశాలమైన విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ సదుపాయాలు విస్తరిస్తున్నాయి. కానీ కచ్చితమైన నిబంధనలు పాటించడం లేదనే అభిప్రాయం బలంగా ఉంది. ఒక భవనానికి మరో భవనానికి ఒకేలా నిబంధనలు అమలు కావడం లేదు. మరోవైపు డీవియేషన్స్ సైతం ఎక్కువగా నమోదవుతున్నాయి. హెచ్ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి డీవియేషన్‌లను (ఉల్లంఘనలను) గుర్తించినప్పటికీ వాటిని సవరించడంలో విఫలమవుతున్నారు.మరోవైపు ఈ ఉల్లంఘనల వల్ల అనుమతులను ఇవ్వడంలో కూడా జాప్యం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో నిర్మాణ రంగం భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బిల్డింగ్ బైలాస్ రూపకల్పనపై దృష్టి సారించారు.

వివిధ నగరాలపై అధ్యయనం..

- ప్రస్తుతం ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లో బిల్డింగ్ బైలాస్ అమల్లో ఉన్నాయి. నివాస భవనాలకు, వ్యాపార, వాణిజ్య భవనాలకు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు వంటి భవనాలకు ప్రామాణికమైన నిబంధనలను పాటిస్తున్నారు. భవనాల నిర్మాణం, భద్రత, పర్యావరణ పరిరక్షణ,నగర అభివృద్ధి వంటి అంశాలను లక్ష్యాలుగా చేసుకొని ఈ నిబంధనలు రూపొందించారు.ఇందుకోసం ముంబయిలో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ), ఢిల్లీలో ఫ్లోర్ రేషియో ఏరియా (ఎఫ్ఏఆర్) వంటి ప్రామాణికమైన పద్ధతులను అమలు చేస్తున్నారు. నిర్మాణ వైశాల్యం, ప్లాట్ వైశాల్యం ఏ విధంగా ఉండాలనేది ఈ ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది.
- ఒక్కో ప్రాంతంలో ఎఫ్ఎస్ఐ ఒక్కో విధంగా ఉంటుంది. ఉదాహరణకు దక్షిణ ముంబైలో ఎఫ్ఎస్ఐ 1.33 శాతం ఉంటే, సబర్బన్ ప్రాంతాల్లో 2.7 శాతం, ఆసుపత్రులు, విద్యాసంస్థలకు 5.32 శాతం చొప్పున ఉంది. ఢిల్లీలోనూ ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఎఫ్ఏఆర్‌ను నిర్ణయించారు. ఇదే తరహాలో హైదరాబాద్‌లో నిర్దిష్టమైన ప్రమాణాలు రూపొందించాలని హెచ్ఎండీఏ భావిస్తోంది. భవనం చుట్టూ ఖాళీ స్థలం (సెట్‌బ్యాక్), భవనం ఎత్తు, ఓపెన్ స్పేస్ ఏరియా వంటివి కూడా కచ్చితమైన ప్రమాణాలతో రూపొందించాలి. అలాగే.. జపాన్, అమెరికా, యూరప్ దేశాల్లోని బిల్డింగ్ బైలాస్‌పైనా అధ్యయనం చేసి ఇప్పటి వరకు ఉన్న ప్రమాణాల కంటే మరింత మెరుగైన ప్రమాణాలను, నియమ నిబంధనలను రూపొందించేందుకు కసరత్తు జరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

తుది దశలో మాస్టర్‌ప్లాన్..

రాబోయే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ట్రిపుల్ ఆర్ వరకు హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా హెచ్ఎండీఏ సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేపట్టింది. ముసాయిదా ప్రణాళికలను త్వరలో ప్రకటించనున్నారు. మాస్టర్‌ప్లాన్ ప్రణాళికలు తుదిదశలో ఉన్నాయని, వచ్చే సెప్టెంబర్ నాటికి ముసాయిదా అందుబాటులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

సీవర్ నెట్‌వర్క్-3 పనులు వేగిరం

4 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆధునికీకరణ

- 135 కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు
- నిర్మాణ పనులను పరిశీలించిన జలమండలి ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నదికి ఉత్తరం వైపున కోర్ సిటీలో సీవరేజీ వ్యవస్థ ఆధునికీకరణ కోసం చేపట్టిన జోన్- 3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులను వేగిరం కానున్నాయి. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి మంగళవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సీజీఎంలు వినోద్ భార్గవ, రాజేందర్, జీఎంలు శ్రీను నాయక్, కుమార్, ప్రాజెక్టు అధికారులతో కలిసి సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. వర్షాకాలం సమీపించిన తరుణంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు.

జంక్షన్ పనులపై ఆరా..

టోలిచౌకి ఫ్లైఓవర్ ప్రధాన రహదారిలో చేపట్టే జంక్షన్ పనులపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆరా తీశారు. దాదాపు 8 నుంచి 11 మీటర్లు లోతులో జరిగే టన్నెలింగ్ పనులతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రద్దీ లేని సమయాల్లో, సెలవు రోజుల్లో నిర్వహించాలని సూచించారు. టన్నెలింగ్ పనులు చేపట్టేటప్పుడు జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, ట్రాన్స్‌మిషన్, ఓఅండ్ఎం అధికారులను సమన్వయం చేసుకుంటూ నిర్వహించాలని ఆదేశించారు. పనులు చేపట్టే సమయంలో సరైన బారికేడ్లు, రక్షణ పరికరాలను ధరించి భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం సమీపంలోని 7 టూంబ్స్ వెళ్లే రహదారిలో చేపట్టే అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ పనులను నివాస గృహాల పటిష్టతకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పనులు చేపట్టే ప్రతిపాదనలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

పనుల తీరు ఇలా..

- సీవర్ నెట్‌వర్క్-3 పైపులైన్ పొడవు 135 కిలో మీటర్లు కాగా.. ఇప్పటి వరకు 133 కిలో మీటర్ల మేర నిర్మాణం పూర్తయినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- ఇందులో 9.5 కిలో మీటర్ల మేర 200-300 డయా పైపులైన్ పనులు, 6.5 ట్రంక్ మెయిన్లు నిర్మాణం కొనసాగుతోంది. మరోవైపు 10 ప్రాంతాల్లో 9 మీటర్లు టన్నెలింగ్ పనుల కొనసాగుతున్నాయి. జోన్-3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులతో గోషామహల్, నాంపల్లి, కార్వాన్‌లతో పాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాలకు లబ్ధి చేకూరనుంది.

పాదరక్షల గోదాంలో అగ్ని ప్రమాదం

కట్టెల పొయ్యితో చెప్పులకు అంటుకున్న నిప్పు

- వెంటనే మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది
- భవనంలో ఉన్నవారంతా సురక్షితంగా బయటికి..

చార్మినార్/గౌలిపురా: గుల్జార్ హౌజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని మరువకముందే ఛత్రినాక కందికల్ గేట్ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం మరో ఘటన చోటుచేసుకుంది. ఇక్కడి ఓ పాదరక్షల గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించింది. అయితే.. ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందిన ఆరు నిమిషాలకే అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయడం గమనార్హం. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. కందికల్ గేట్ ప్రాంతానికి చెందిన ముఖేష్, కిశోర్ సోదరులు. వీరు పాత చెప్పులు సేకరించి వాటికి రిపేర్ చేసి సెకండ్స్ మార్కెట్లో విక్రయిస్తుంటారు. ఇందులో భాగంగా వీరు కందికల్ గేట్ బోయిగూడలోని జీ+2 భవనంలో గ్రౌండ్ ఫ్లోర్, రెండో అంతస్తులో పాదరక్షలను నిల్వ ఉంచారు. అగ్ని ప్రమాదం సంభవించిన భవనంలో నలుగురు పెద్దవారితో పాటు ఆరు మంది చిన్నారులు ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండో అంతస్తు నుంచి మంటలు చెలరేగడంతో చెప్పులు తగలబడి మంటలు వ్యాపించాయి. హుటాహుటిన వారు తమ పిల్లలను, గ్యాస్ సిలిండర్లు తీసుకొని బయటికి పరుగులు తీశారు.

సమాచారం అందుకున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. చాంద్రాయణగుట్ట, మొఘల్‌పురా నుంచి ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని 25 నిమిషాల్లో మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంట్లో ఉన్న వారిని సురక్షితంగా బయటికి తీసుకురావడంతో అంత ఊపిరి పీల్చుకున్నారు. రెండో అంతస్తులో చెప్పులు నిల్వ ఉంచిన ప్రాంతంలో కట్టెల పొయ్యి పెట్టడంతో నిప్పు అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించిందని సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది





కాలిపోయిన పాదరక్షలు, అగ్ని ప్రమాద భవనం వద్ద గుమిగూడిన స్థానికులు

రైళ్లలో దాడులకు పాల్పడుతున్న హిజ్రాల అరెస్టు

సికింద్రాబాద్: రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికులను బెదిరించి డబ్బులు లాక్కెళుతున్న ముగ్గురు హిజ్రాలను అదుపులోకి తీసుకున్న సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయిశ్వర్‌గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పల్లి సూర్యభాను అలియాస్ జాన్వి, జనగాం జిల్లాకు చెందిన మాదాసు విజయ్ అలియాస్ అనిత, కొత్తగూడెం జిల్లాకు చెందిన చెరుకు జాయికుమార్ అలియాస్ సాత్విక అనే వ్యక్తులు పుట్టుకతోనే నపుంసకులు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన వీరికి మరో మైనతో పరిచయం ఏర్పడింది. కొన్నేళ్ల క్రితం హిజ్రాలుగా మారిన వీరు ప్రధాన కూడళ్లలో భిక్షాటన చేయడంతోపాటు రైళ్లలో ప్రయాణిస్తూ డబ్బులు అడుక్కునేవారు. తొలుత రైలు ప్రయాణికులకు డబ్బులు అడగడం, ఇవ్వని వారిపట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నరు. ఎదిరించిన వారిపై మూకుమ్మడిగా దాడి చేసి అందినకాడికి లాక్కొని ఉడాయించేవారు. ఈనెల 12న సికింద్రాబాద్ నుంచి వరంగల్‌కు రైలులో వెళుతున్న వీరు మౌలాలి రైల్వేస్టేషన్ దాటగానే భిక్షాటన ప్రారంభించారు.



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ డీఎస్పీ జావెద్, తదితరులు

అదే రైలులోని ఓ యువకుడిని డబ్బులు అడగడంతో అతను నిరాకరించాడు. దీంతో మాటమాట పెరిగి వారు సదరు యువకుడిపై మూకుమ్మడిగా దాడి చేసి అతడి జేబులోని రూ.10 వేల నగదు లాక్కొన్నారు. జనగాం రైల్వేస్టేషన్ ప్రాంతంలో రైలు వేగం తగ్గగానే బోగీలోంచి దూకి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మర్నాడు ఉదయం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మహేశ్వరం: ఒక్క సీసీ కెమెరాల వంద మంది పోలీసులతో సమానమని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టులో బీటీఆర్ విల్లాస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 320 ఐపీ సీసీ కెమెరాలను మంగళవారం ఆయన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విల్లాస్, అపార్ట్‌మెంట్లు, కాలనీలు, గ్రామాల్లో నేరాలను అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతోగానో దోహదపడతాయన్నారు. కేసుల పరిష్కారం సులభతరం అవుతుందని, నేర శోధన, నేర నివారణకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. అడిషనల్ డీసీపీ బీవీ సత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, గురువారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాదేళ్ల రాఘవేందర్, డా.కె.అనిల్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

రుణం ఇప్పిస్తానని మోసం

ముగ్గురు నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: స్థిరాస్తులకు బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. స్పెషల్ జోన్ క్రైం టీం (ఎస్‌జెడ్ సీటీ) ఇన్‌స్పెక్టర్ భిక్షపతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన జబ్బర్ ఖాన్ మున్షీ ఖాన్ బేగంపేటలో ఉంటూ జేకే ఫైనాన్షియల్ సొల్యూషన్స్ పేరిట సోమాజిగూడ కేంద్రంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడికి అదే ప్రాంతంలో చికెన్ షాప్ నిర్వహిస్తున్న మహారాష్ట్రకు చెందిన అన్నదమ్ములు ఖురేషీ జావిద్ హబీబ్‌సాబ్, సద్దాం హబీబ్‌సాబ్ ఖురేషీలతో జబ్బర్ ఖాన్‌కు పరిచయం ఏర్పడింది. సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న వారు ముగ్గురు ప్రాపర్టీలకు బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని ప్రచారం చేసుకునేవారు. వారి వలలో పడిన వారి నుంచి ప్రాపర్టీకి సంబంధించిన డాక్యుమెంట్లు, చెక్కులను తీసుకునేవారు. రుణం పొందేందుకు సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని వారికి మాయమాటలు చెప్పి, ప్రాపర్టీలను తమ సభ్యుల పేరు మీద రిజిస్టర్ చేస్తే.. సిబిల్ స్కోర్ బాగుంటుందని దీంతో రుణం త్వరగా మంజూరు అవుతుందని నమ్మించేవారు. వీరి మాటలను నమ్మిన బాధితులు ఆస్తులను వారి పేరు మీద రిజిస్టర్ చేయగానే. తమ ముఠా సభ్యుల నో యువర్ కస్టమర్ (కేవైసీ) వివరాలతో బ్యాంక్‌లో తనఖా పెట్టి రుణం తీసుకునేవారు. రుణానికి సంబంధించిన మొత్తం కస్టమర్ల బ్యాంక్ ఖాతాలో జమ కాగానే.. ముందుగానే కస్టమర్ల నుంచి తీసుకున్న చెక్‌లను ఉపయోగించి మొత్తం సొమ్మును విత్‌డ్రా చేసుకునేవారు. బ్యాంక్‌కు నెలవారి వాయిదా (ఈఎంఐ) చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులకు కస్టమర్లను సంప్రదించి ప్రాపర్టీలను ఖాళీ చేయాలని, ఈఎంఐ చెల్లించకపోవడంతో ప్రాపర్టీలను వేలం వేస్తామని హెచ్చరించేవారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన స్పెషల్ జోన్ క్రైం పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్, రామకృష్ణనగర్ కాలనీకి చెందిన శైలేష్(52), గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం అతను మద్యం తాగేందుకు భార్య వాణికి డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. అనంతరం భార్య, కుమారుడు ఉద్యోగాలకు వెళ్లి పోయారు. రాత్రి వారు ఇంటికి వచ్చి చూడగా లోపలి నుండి గడియ పెట్టి ఉంది. దీంతో వాణి భర్త శైలేష్‌ను పిలిచినా స్పందన లేకపోవడంతో స్థానిక సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు చీర సహాయంతో ఉరివేసుకుని కనిపించాడు. అతడిని కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్టార్ హోటల్‌లో యువ వైద్యురాలిపై లైంగిక దాడి

ఆలస్యంగా ఫిర్యాదు ● వైద్యుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తన భార్యకు విడాకులు ఇచ్చానని, త్వరలోనే నిన్ను పెళ్లి చేసుకుంటానని వైద్యురాలిని నమ్మించి బంజారాహిల్స్ లోని ఒక స్టార్ హోటల్ లో లైంగిక దాడికి పాల్పడిన వైద్యుడిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మహబూబాబాద్‌లోని అమ్మ ఆసుపత్రిలో పిల్లల వైద్య నిపుణుడిగా పనిచేస్తున్న డాక్టర్ జర్పుల స్వామి (37)కి 2023 లో అక్కడే మెడికో గా పని చేస్తున్న యువ వైద్యురాలు (30)తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. తన భార్య తనను బలవంతంగా వివాహం చేసుకుందని, ఆమెకు నాలుగు అబార్షన్లు సైతం అయ్యాయని, అందుకే ఆమెకు విడాకులు ఇచ్చి ఒంటరిగా ఉంటున్నట్లు యువ వైద్యురాలిని నమ్మించారు. ఆమెతో స్నేహం, ప్రేమకు దారి తీసి విషయం పెళ్ళి వరకు వెళ్ళింది. 2024 సెప్టెంబర్లో వైద్యురాలు నగరానికి వచ్చి ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్నది. ఇదిలా ఉండగా డాక్టర్ స్వామి ఈ ఏడాది జనవరి 12న నేషనల్ పెడికాన్ సదస్సు నిమిత్తం నగరానికి రాగా ఆ సదస్సుకు యువ వైద్యురాలు సైతం హాజరైంది. ఇద్దరు కలిసి అదే రోజు బంజారాహిల్స్ లోని పార్క్ హయత్ హోటల్ లో గది తీసుకున్నారు. పెళ్లి పేరుతో నమ్మించిన డాక్టర్ స్వామి ఆమెపై బలవంతంగా లైంగిక దారికి పాల్పడ్డాడు. విషయం బయటికి తెలియవద్దని పెళ్లి చేసుకుంటానని నమ్మించి వెళ్లిపోయాడు. స్వామి వ్యవహార తీరును అనుమానించిన యువ వైద్యురాలు అతని గురించి విచారించగా భార్యకు విడాకులు ఇవ్వలేదని తెలుసుకున్నది. తనకు జరిగిన అన్యాయాన్ని స్వామి తల్లిదండ్రుల దృష్టికి యువ వైద్యురాలు తీసుకెళ్లింది. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆమె సోమవారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం పోలీసులు డాక్టర్ స్వామి, అతని కుటుంబ సభ్యులపై బి.ఎన్.ఎస్ 64 (1), 318(4), 318(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరిగేషన్ శాఖ డీఈఈ ఆత్మహత్య



వెంకటరామరాజు మృతదేహం

శంషాబాద్: పురుగుల మందు తాగి నీటి పారుదల శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..కొత్వాల్‌గూడ చౌడమ్మ దేవాలయ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అతను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. అతడి వద్ద లభ్యమైన పర్సులో లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా అతడు నాగోల్‌లో నివాసముంటున్న నేరెళ్ల వెంకటరామరాజుగా గుర్తించారు. నీటి పారుదల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్నట్లు ఉంది. అతడి వద్ద లభ్యమైన ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా తాము తిరుపతిలో ఉన్నట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే అతను అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో మరో వ్యక్తి..



రాజు మృతదేహం

కొత్వాల్‌గూడలోని ఎకో పార్కులోని వాకింగ్ ట్రాక్‌పై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని గాంధీనగర్ కాలనీకి చెందిన బోదాసు రాజు(29)గా గుర్తించారు. సోమవారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతడు తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. అతిగా మద్యం తాగినందునే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్‌భవన్‌లో హార్డ్‌డిస్క్ మాయం .. నిందితుడి రిమాండ్

పంజగుట్ట: అనుమతి లేకుండా రాజ్‌భవన్‌లోకి ప్రవేశించిన సస్పెండైన ఉద్యోగి లోపల ఉన్న కంప్యూటర్ నుంచి హార్డ్‌డిస్క్ దొంగిలించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెలితే .. రాజ్‌భవన్‌లో ఐటీ ఉద్యోగిగా పని చేసే శ్రీనివాస్ అక్కడే పనిచేసే మహిళా ఉద్యోగిని ఫోటోలు మార్ఫింగ్ చేశాడు. ఈ విషయం ఈ నెల 10న సదరు మహిళ దృష్టికి రావడంతో ఆమె పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఫొటోలు మార్ఫింగ్ చేసింది శ్రీనివాస్‌గా గుర్తించారు. అతడిని 12న అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఉన్నతాధికారులు అతడిని సస్పెండ్ చేశారు. కాగా వెంటనే బెయిల్‌పై బయటకు వచ్చిన శ్రీనివాస్ ఈ నెల 14న రాత్రి హెల్మెట్ ధరించి బైక్‌పై రాజ్‌భవన్ లోకి ప్రవేశించాడు. నేరుగా మొదటి అంతస్తులోని ఐటీ సెల్ కార్యాలయంలోకి వెళ్లిన అతను సదరు మహిళ మార్ఫింగ్ ఫొటోలు ఉన్న కంప్యూటర్ నుంచి హార్డ్‌డిస్క్‌లు తీసుకుని వెళ్లిపోయాడు. 15న ఉదయం డ్యూటీకి వచ్చిన రాజ్‌భవన్ ఐటీ మేనేజర్ రాకేష్ కంప్యూటర్లలో ఒకటి ఆన్ చేసి ఉన్నట్లు గుర్తించాడు. దానిని పరిశీలించగా అందులో వేరే సాఫ్ట్‌వేర్ ఉంది. అందులో ఉన్న కీలక సమాచారం కనిపించలేదు. దీంతో అతను సీసీ పుటేజీలను పరిశీలించగా శ్రీనివాస్ హార్డ్‌డిస్క్ చోరీ చేసినట్లుగా గుర్తించారు. ఈ విషయాన్ని రాజ్‌భవన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారి సూచన మేరకు పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌ను తిరిగి అరెస్టు చేసిన పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు

సిటీ కోర్టులు: రాజ్‌భవన్‌లో హార్డ్ డిస్క్‌లను ఎత్తుకెళ్లిన కేసులో అరెస్టైన రాజ్‌భవన్ ఉద్యోగి శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నిందితుడి తరుపు న్యాయవాదులు కుర్మ నరేందర్, పి.మోహిత్‌కృష్ణ బెయిల్ పిటిషన్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. ఈ కేసుకు నిందితుడిగా పేర్కొన్న శ్రీనివాస్‌కు ఎలాంటి సంబంధం లేదని కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అతడిపై ఫిర్యాదు చేశారని కోర్టుకు తెలిపారు. అతడిపై కుటుంబం మొత్తం ఆధారపడి ఉన్నదని అతడికి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరుపు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీలత వాదనలు వినిపిస్తూ పాత కేసుల నుంచి బయటపడాలనే ఉద్దేశ్యంతో నిందితుడు ఈ నేరానికి పాల్పడ్డాడని తెలిపారు. ఇరువురి వాదనలు విన్న నాంపల్లి 14వ అదనపు చీఫ్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ జడ్జి సామ్య నిందితుడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా రూ.10 వేలతో రెండు పూచీకత్తులు పెట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుల అరెస్ట్

రూ.15 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం..



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి..

దుండిగల్: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి 14 తులాల బంగారు నగలు, కిలో వెండి, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.. మంగళవారం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. సూరారం కాలనీ దయానంద్‌నగర్‌కు చెందిన డేరంగుల హరిబాబు, తన్నీరు సూర్య పాత నేరస్తులు. హరిబాబుపై దుండిగల్, జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇళ్ల దొంగతనాలు, ఆటో చోరీ కేసులు ఉన్నాయి. గత మార్చి నెలలో జీడిమెట్ల పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపగా ఇటీవల విడుదలయ్యాడు. సూర్యపై సూరారం పీఎస్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కేసు, హత్య, రేప్ కేసులు ఉన్నాయి. తమ వైఖరి మార్చుకోని వీరు మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత కొన్నాళ్లుగా దుండిగల్, సంగారెడ్డి, అల్లాపూర్, నర్సాపూర్, చందానగర్, మేడిపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పంజా విసిరారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ శంకర్‌రెడ్డి ఆదేశాలతో వీరిపై నిఘా పెట్టిన దుండిగల్, సూరారం పోలీసులు మంగళవారం ఉదయం వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించారు. వారి నుంచి 14 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి ఆభరణాలు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన దుండిగల్ సీఐ సతీష్, సూరారం సీఐ భరత్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు బి.సతీష్, నాయుడులను డీసీపీ అభినందించారు. నిందితులను మేడ్చల్ కోర్టులో ప్రవేశపెట్టి పోలీసులు న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఫాంహౌస్‌లో హుక్కా పార్టీ

పోలీసుల అదుపులో 10 మంది యువకులు, ఇద్దరు మైనర్లు



శంషాబాద్ రూరల్: ఫాంహౌస్‌లో హుక్కా పార్టీ జరుపుకుంటున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన కొందరు యువకులు గండిగూడ శివారులోని ఎంఆర్‌జీ ఫాంహౌస్‌లో హుక్కా పార్టీ చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ చేసుకుంటున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు సమాచారం. హుక్కా పరికరాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లిలోని నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి సమీపంలో మంగళవారం నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి చేయిపై పచ్చబొట్టు ఉందని, అతని వయసు 35 ఏళ్ల మధ్యలో ఉండవచ్చునని, ఇతర ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి విద్యార్థి దుర్మరణం

మియాపూర్: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి, శాతవాహన నగర్ కాలనీకి చెందిన ఆదిలక్ష్మీ, రాజు దంపతుల కుమారుడు గోపి ప్రవీణ్(21) సీఎంఆర్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడు హర్ష పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు సోమవారం రాత్రి అతను తన స్నేహితులు శ్యాముల్, వివేక్, హర్షలతో కలిసి బైక్‌పై బయటకు వెళ్లాడు. శ్యాముల్, గోపి ప్రవీణ్ బుల్లెట్‌పై వెళుతుండగా, హర్ష, వివేక్ మరో బైక్‌పై లింగంపల్లి వైపు వెళ్లి చందానగర్ మీదుగా మియాపూర్ వైపు వస్తుండగా మదీనాగూడ బావర్చి హోటల్ వద్ద బుల్లెట్ అదుపుతప్పి కింద పడ్డారు. వెనకే వస్తున్న హర్ష, వివేక్‌లు కూడా సడన్‌గా బ్రేక్ వేయడంతో వారు కూడా క్రిందపడిపోయారు. ఈ ఘటనలో గోపి ప్రవీణ్‌కు తలకు తీవ్రంగా గాయాలు కాగా శ్యాముల్, హర్ష, వివేక్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో స్నేహితులు వారిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే గోపి ప్రవీణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్యాముల్ అజాగ్రత్త కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని ఆరోపిస్తూ గోపి ప్రవీణ్ తల్లి ఆదిలక్ష్మీ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నివాళి

లిబర్టీ: ధైర్య సాహసానికి టంగుటూరు ప్రకాశం పంతులు ప్రతీక అని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. స్వాతంత్ర సమరంలో బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన దీశాలి అని గుర్తు చేశారు. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉవ్వెత్తుగా సాగుతున్న స్వాతంత్ర పోరులో పాల్గొని అగ్రభాగాన నిలిచారని మహనీయులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

సనత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఓ ఆటో డ్రైవర్‌ను సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్ ఇందిరాగాంధీపురంలోని ఎండీ షాహెబాజ్ షకూర్ (27) అనే ఆటోడ్రైవర్ ఇంట్లో గంజాయి నిల్వ ఉన్నట్లు సమాచారం మేరకు పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు చేశారు.మహారాష్ట్రలోని పర్భానీ ప్రాంతం నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ఇదే క్రమంలో 2రోజుల క్రితం అక్కడి నుంచి రూ.30వేలతో 2కిలోల గంజాయిని కొనుగోలు చేసి సోమవారం ఉదయం రైల్‌లో ఫతేనగర్‌లో దిగి ఇందిరాగాంధీ పురానికి తీసుకువచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సులభంగా సంపాదించవచ్చని 6నెలలుగా గంజాయి విక్రయిస్తున్నట్లు నిందితుడు పోలీసులకు తెలిపాడు.ఈ మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కేజీ, 700 గ్రాములు ఉన్న రెండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

వెంగళరావునగర్: భర్త ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేలోగా భార్య అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంగళరావునగర్‌కు చెందిన యు.ప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆరేళ్ల కిందట శ్రావణి అనే యువతితో వివాహం జరిగింది. గత 2 నెలల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ప్రసాద్ ఈ విషయాన్ని తన భార్య మేనమామ, అత్తలకు ఫోన్ చేసి చెప్పాడు. దాంతో వారు 15 రోజులు ఆమెను వారి ఇంటికి తీసుకెళ్లి ఇటీవల మరలా తెచ్చి నగరంలోని భర్త వద్ద వదిలేశారు. 10వ తేదీ ఆమె వారికి ఫోన్ చేసి తాను ఒక వ్యక్తిని ప్రేమించానని చెప్పింది. దాంతో ఆమె అత్తామామలు ఈనెల 13న నగరానికి వచ్చి మాట్లాడతామని చెప్పారు. ఈ క్రమంలో ఈనెల 12న ప్రసాద్ డ్యూటీకి వెళ్లి ఇంటికి వచ్చేసరికి శ్రావణి అతడికి లెటర్ రాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

బంజారాహిల్స్: మద్యం తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి అక్కడ ఉన్న సిబ్బందిని గ్లాస్ కావాలంటూ అడగ్గా ఉచితంగా ఇవ్వలేమని చెప్పడంతో దాడిచేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న గోర్కటి మొగిలి (53) సోమవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌లో ఉన్న ప్రియాంక వైన్స్‌కు మద్యం తాగడానికి వెళ్లాడు. అక్కడ ప్లాస్టిక్ గ్లాసులు, నీళ్ల విక్రయించే వ్యక్తిని తనకు ఒక ప్లాస్టిక్ గ్లాస్ కావాలంటూ అడిగాడు. డబ్బులు ఇవ్వనిదే గ్లాస్ ఇవ్వనని సదరు వ్యక్తి చెప్పడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన వాటర్ సప్లై చేసే యువకుడు అక్కడ ఉన్న కర్రతో మొగిలి తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కారులోనే నిద్రించారు... లేచేసరికి ఫోన్లు గాయబ్

వెంగళరావునగర్: సొంత పనిమీద నగరానికి వచ్చిన యువకుల ఫోన్లు గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని కోడూరు ప్రాంతానికి చెందిన ఎస్.ఇమ్మానియేలు, టి.గణేష్, ఎం.గురుప్రసాద్, పి.మోహన్ నగరానికి వచ్చి కృష్ణకాంత్‌పార్క్ వద్ద తమ ద్విచక్ర వాహనం నిలిపి రాత్రి అక్కడ కారులోనే పడుకున్నారు. ఉదయం నిద్ర లేచేసరికి ఇరువురి ఫోన్లు మాయం అయ్యాయి. బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో దాడికి ఖండన

ఉస్మానియా యూనివర్సిటీ: తిరుపతిలో ఈనెల 17న దళిత విద్యార్థిపై జరిగిన దాడిని ఓయూ విద్యార్థి నేతలు మంగళవారం తీవ్రంగా ఖండించారు. బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై కొందరు మనువాద శక్తులు దాడి చేసి గాయపరచి మూత్ర తాగించడం హేయమైన చర్యగా తెలంగాణ రీసెర్చ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.ప్రేమ్‌కుమార్, బహుజన విద్యార్థి జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్,ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు కొత్తపల్లి తిరుపతి, పేర్కొన్నారు.

మెరుగైన బోధన.. | ఉపాధ్యాయులకు శిక్షణ

- సర్కార్ టీచర్లకు ప్రారంభమైన శిక్షణా తరగతులు
- ఐదు రోజుల పాటు బోధనాంశాల్లో మెలకువలు


ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న విద్యాశాఖ అధికారులు

బంజారాహిల్స్: విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందించడంతో పాటు అభ్యాసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి 24 వరకు బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రారంభమైన మండలస్థాయి సెకండరీ గ్రేడ్ టీచర్స్ శిక్షణ కార్యక్రమానికి షేక్‌పేట, ఖైరతాబాద్-1, 2, అమీర్‌పేట మండలాల నుంచి 48 ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, సోమాజీగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట డివిజన్ల నుంచి ప్రాథమిక పాఠశాలలకు చెందిన 176 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో మెరుగైన బోధనతో పాటు సామర్థ్యాలను తెలుసుకోనున్నారు.

భాష, గణిత సామర్థ్యాలు పెంపొందించే దిశగా..

1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధన కోసం ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని 2022 ఆగస్టు 15 నుంచి అమలు పరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రణాళికాబద్ధంగా బోధనాభ్యాసన కార్యక్రమాలను అమలుపరచడానికి పాఠ్య ప్రణాళికలు ఆధారంగా బోధించడంలో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు కూడా అభ్యాసన పుస్తకాలను అందజేశారు. ప్రాథమిక విద్య పూర్తయ్యేసరికి విద్యార్థులందరూ మౌలిక భాష, గణిత సామర్థ్యాలు పొంది ఉండాలని దీని లక్ష్యం.

ప్రస్తుత పరిస్థితి..

పిల్లల ప్రగతిని సమీక్షించడానికి మూడు దశలుగా (బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్) పరీక్షలు నిర్వహించి ప్రగతిని నమోదు చేస్తున్నారు. ప్రతి నెలలో మూడో శనివారం రోజు తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమ ప్రగతిని పరిశీలించేందుకు గత మార్చి నెలలో ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించిన రెండో తరగతి శాంపిల్ సర్వే ఫలితాల్లో అక్షరాలు గుర్తించడం, తేడా చదువుటలో విద్యార్థులు వెనుకబడి ఉన్నట్లు తేలింది. ఆలోచింపజేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో ఓఆర్‌ఎఫ్‌లో కూడా వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు.

వీటిపై దృష్టి..

సోపానాల ప్రకారం బోధనాభ్యాసన ప్రక్రియలు నిర్వహించబడాలి. కీలకాంశాలకు అనుగుణంగా అభ్యాసం కల్పించాలి. 1, 2 తరగతుల్లో అక్షర గుర్తింపు, ధ్వని గుర్తింపు, కృత్యాల నిర్వహణపై అదనపు దృష్టి పెట్టాలి. పిల్లలు అక్షరాలు, పదాలు, వాక్యాలు, పేరా ధారాళంగా చదివేలా అభ్యాసం కల్పించాలి. గ్రంథాలయ పుస్తక పఠన ప్రాధాన్యాన్ని గుర్తించి సమర్థవంతంగా నిర్వహించాలి. పటం ద్వారా అక్షరాలు, ధ్వనులను పరిచయం చేసి వాటిని వర్ణమాల చార్ట్‌లో గుర్తింపజేయాలి.

ఈ శిక్షణతో ప్రయోజనాలివి..

1, 2 తరగతుల్లో ఎలా రాయాలో నేర్చుకుంటారు. 3, 4, 5 తరగతుల్లో ఏమి రాయాలి, ఎందుకు రాయాలి. ఎట్లా రాయాలి, ఏమి మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి, ఎందుకు మాట్లాడాలి అనేవి నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. తద్వారా నిత్య జీవితంలో భాషను సమగ్రంగా సమర్థవంతంగా ఉపయోగించగలిగేలా ఈ పాఠాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక-సాంస్కృతిక, సామాజిక-విమర్శనాత్మక ధోరణిని కూడా పెంపొందింపజేస్తారు.

శాస్త్రీయంగా కులగణన చేయాలి

లిబర్టీ: శాస్త్రీయంగా కులగణన చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. ఏకకాలంలో జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తే ఎవరి సంఖ్య ఎంత ఉందో స్పష్టత వస్తుందని ఆయన అన్నారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కులగణన చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో శాస్త్రీయంగా పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.ఏకకాలంలో నిర్వహిస్తే ఏ సామాజిక వర్గాల్లో ఎంత మంది ఉన్నారు అనే విషయం స్పష్టంగా తెలుస్తుందన్నారు.

'మహనీయులను అవమానిస్తున్న బీజేపీ'

లిబర్టీ: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ చిత్రపటాలను తొలగించటాన్ని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో అధికారం చేపట్టిన బీజేపీ ముఖ్యమంత్రి కార్యాలయంలోని అంబేడ్కర్, విప్లవవీరుడు భగత్‌సింగ్ చిత్రపటాన్ని తొలగించడం సరికాదన్నారు. మతోన్మాద బీజేపీ మనువాద పాలకుల కుట్రలను అడ్డుకోవాలని విన్నవించారు. ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను అధ్యయనం చేసి దేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయంలో అంబేడ్కర్, భగత్‌సింగ్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యాన శాఖను బలోపేతం చేయాలి


మంత్రిని కలిసిన సందీప్ కుమార్

హిమాయత్‌నగర్ : ఉద్యానశాఖను పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలని ఉద్యాన అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుడిమళ్ల సందీప్ కుమార్, కోశాధికారి జలంధర్ మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి విజ్ఞప్తి చేశారు. 1982లో వ్యవసాయ శాఖ నుంచి ఉద్యాన శాఖ వేరైనప్పుడు ఎన్ని ఉద్యాన అధికారుల(హెచ్‌ఓ) పోస్టులు ఉన్నాయో, ఇప్పటికీ అవే ఉన్నాయన్నారు. ఒక్కో ఉద్యాన అధికారి 5 నుంచి 10 మండలాలు తిరగాలని, కేవలం క్షేత్రస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా 100 మంది మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. సిబ్బంది ఉంటే కూరగాయలు, పండ్ల తోటలు, పామాయిల్ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచటానికి అవకాశాలు ఉంటాయని ఉద్యాన శాఖ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

అద్దెకు ఇల్లు ఇస్తే ఆధార్‌కార్డు తీసుకోవాలి


మాట్లాడుతున్న బషీర్ అహ్మద్

బంజారాహిల్స్: ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి అద్దెకు ఉండేవారి ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని బంజారాహిల్స్ అదనపు ఇన్‌స్పెక్టర్ బషీర్ అహ్మద్ సూచించారు.మంగళవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని ఐఏఎస్ క్వార్టర్స్ పక్కన ఉన్న ఈద్గా మైదానంలో ఏర్పాటు చేసిన బంజారాహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మైగ్రేట్, ఎన్ఆర్ఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనుమానంగా విదేశీయులు ఎవరైనా కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చోరీ చేసిన ఫోన్లను కొనవద్దని సూచించారు. నేరస్తులకు ఆశ్రయం ఇస్తే ఇంటి యజమానులు కూడా బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జావేద్ హష్మి, మహ్మద్ వసీం, జాకీర్, అంజద్ అలీ, సెక్టార్ ఎస్ఐ రవీందర్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని మహోగని బిల్డింగ్ అమృతావ్యాలీ అపార్ట్‌మెంట్స్‌లో ప్లాట్లకు చెందిన విద్యుత్ ప్యానెల్ బోర్డులు, వైర్లు, నేలను తాకుతూ ప్రమాదకరంగా మారాయి. ప్రమాదం పొంచి ఉన్నా సదరు యజమానులు నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నారు. సెంచరీ ఆస్పత్రి పక్కనే ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌లో గత కొంతకాలంగా విద్యుత్ ప్యానెల్ బోర్డుల కారణంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెద్ద ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పార్కింగ్ అడ్డాగా క్వారీ మైదానం



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానం వాహనాల పార్కింగ్ అడ్డాగా మారింది. విశాలంగా ఉన్న ఈ మైదానంలో పదుల సంఖ్యలో వాహనాలు నిలుపుతున్నారు. మార్నింగ్ వాక్‌కు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే నెలల తరబడి తమ వాహనాలకు ఈ మైదానంలో నిలిపి ఉంచుతున్నారు. మైదానం చుట్టు వాహనాలు నిలిపి ఉంచడంతో యువకులు ఆటలు ఆడుకునేందుకు వీలు లేకుండా పోయింది. రాత్రి వేళల్లో వాహనాల మాటున కొందరు యువకులు గంజాయి, మద్యం సేవిస్తున్నారని బస్తీవాసులు చెబుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదే విధంగా పోలీసులు ఈ మైదానంలో పెట్రోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దంత వైద్యుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం సరికాదు

పంజగుట్ట: సామాజిక మాధ్యమాల్లో కొంతమంది దంతవైద్యుల ప్రతిష్టకు నష్టం వాటిల్లేలా మాట్లాడుతున్నారని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.నరసింహ స్వామి అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐడీఏ కార్యదర్శి డాక్టర్ డి.చలపతిరావు, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు జి.ప్రమోద్ కుమార్, కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ రవికిరణ్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ఇటీవల ఓ డెర్మటాలజిస్ట్ ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డెంటల్ మాఫియా అని, డెంటల్ వైద్యులపై వ్యంగ్యంగా మాట్లాడుతూ అవహేళన చేసిందని దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా డెంటల్ వైద్యులు ఏదైనా తప్పు చేస్తే డెంటల్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చెయ్యాలని వారిపై తప్పకుండా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పెద్ద తప్పుచేస్తే డిగ్రీ కూడా రద్దు చేస్తామన్నారు. కానీ.. డెంటల్ మాఫియా అన్న పదం వాడడం సరికాదన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సుధీర్ రామిశెట్టి, డాక్టర్ ఎం.కిరణ్ కుమార్, డాక్టర్ ఎస్.కె.అబేద్ అలీ, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ శ్వేత బింగి, డాక్టర్ మనీత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహ స్వామి

వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై కేసు

బంజారాహిల్స్: భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న వివాహితను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో ఉన్న ఫొటోలతో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్న వివాహిత (22) రోడ్డునెంబర్-14లో ఉంటుంది. ఆమెకు 2020లో పెళ్లి కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం భర్త వదిలేయడంతో ఆమె పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఇటీవల ఆమెకు టోలిచౌకికి చెందిన ర్యాపిడో డ్రైవర్ అబ్దుల్ గఫార్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీయడమే కాకుండా పెళ్లి కూడా చేసుకుంటానని నమ్మబలికాడు. అయితే సదరు యువకుడు డ్రగ్స్, మద్యానికి బానిసయ్యాడని తెలుసుకున్న బాధితురాలు దూరంగా పెట్టసాగింది. తనను దూరం పెట్టడాన్ని సహించలేని నిందితుడు ఆమెతో ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్ మెయిల్ చేయసాగాడు. సోమవారం రాత్రి ఆమె పనిచేస్తున్న ఆస్పత్రి వద్దకు వచ్చి తీవ్రంగా కొట్టాడు. ఆమెతో ఉన్న ఫోటోలను ఆమె స్నేహితురాలికి కూడా పంపించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

సనత్‌నగర్: ద్విచక్ర వాహనం అపహరణకు గురైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఉండే నందనూరి నరేందర్ ఈనెల 3న రాత్రి 11.30 గంటలకు ఫతేనగర్ రామాయలం ఎదుట తన స్నేహితుడి ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లాడు. ఇంటి ముందే తన ద్విచక్ర వాహనం పార్కు చేశాడు. తిరిగి వచ్చి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థినిపై లైంగిక దాడి

బంజారాహిల్స్: ఇంటర్ విద్యార్థినిని బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయింది. బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముండే విద్యార్థిని (17) ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఈనెల 19న సోదరితో కలిసి బయటకు వచ్చింది. అక్కడి నుండి సోదరి వేరే పనిమీద వెళ్లిపోగా విద్యార్థిని ఒంటరిగా ఇంటికి బయలుదేరింది. మధ్యలో సమీప బంధువైన నవీన్ ఆమెను కలిసి తాను తోడుగా వస్తానని చెప్పాడు. ద్విచక్ర వాహనం మీద ఆమెను ఎక్కించుకొని దేవరకొండ బస్తీలోని తన ఇంటికి తీసుకువచ్చాడు. కాస్త పని ఉంది పూర్తిచేసుకుని వెళ్దామని ఆమెను ఇంట్లోకి తీసుకువెళ్లి బెడ్రూంలో బలవంతంగా లైంగిక దాడి చేశాడు. బయటికి చెప్తే చంపేస్తానని బెదిరించాడు. విద్యార్థిని తనకు జరిగిన ఘటనపై సోదరుడికి చెప్పింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట 15, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.40, బజ్జీమిర్చి.35, క్యాప్సికం.45, పచ్చికాకరకాయ.32, పందిరి బీర.45, క్యాబేజీ.13, క్యారెట్.26, దొండకాయ.23, గుండు బీన్సీస్.85, గింజచిక్కుడు.45, గోకరకాయ.35, కీర.23, దోసకాయ.18, బీట్‌రూట్.17, ఉల్లిగడ్డ.16, ఆలుగడ్డ.25, చామగడ్డ.35, మొరంగడ్డ.18, కందగడ్డ.50, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ.10, పొట్లకాయ.13, అరిటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.45, ముల్లంగి.4-5, ఉల్లిపొరక.45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

ఉన్నత విద్యను బలోపేతం చేయాలి



హిమాయత్‌నగర్ : రాష్ట్రంలో ఉన్నత విద్యను బలోపేతం చేయాలని తెలంగాణ స్టూడెంట్ జేఏసీ చైర్మన్ బొడ్డుపల్లి లింగం, వర్కింగ్ ప్రెసిడెంట్ పోగుల చిరంజీవి, కన్వీనర్ రవీందర్ నాయక్, అధ్యక్షులు మన అశోక్ యాదవ్ బీసీ వెల్ఫేర్ సెక్రటరీ ఈ.శ్రీధర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిపిన కుల గణన ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేసిన విధంగా బీసీ విద్యార్థులకు 42 శాతం రిజర్వేషన్లను ఈ విద్య సంవత్సరం నుంచి డిగ్రీ, పీజీ, లా, ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల సీట్ల భర్తీలో(ఎ,బి,సి,డి) ల వారిగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలన్నారు. బీసీ విద్యార్థులకు గత 15 ఏళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం రూ.35 వేలు మాత్రమే ఉందన్నారు. ప్రస్తుతం 10 వేల లోపు ర్యాంకు ఉన్న బీసీ విద్యార్థులకు మాత్రమే పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుతుందని, అలా కాకుండా కన్వీనర్ కోటాలో సీట్లు పొంది అర్హత కలిగిన ప్రతి బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వర్తింపజేయాలన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

వెంగళరావునగర్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని మధురానగర్ పోలీసులు అరెసు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌కాలనీ, పరిసర ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందని మధురానగర్ పీఎస్‌కు సమాచారం అందింది. దాంతో ఎస్ఐ సాయికుమార్ పలు ప్రాంతాల్లో నిఘా పెట్టారు. ఈ మేరకు మంగళవారం పెట్రోలింగ్ చేస్తుండగా మధురానగర్‌కాలనీలోని హవేలీ టీ పాయింట్ వద్ద యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతనిని పోలీసులు ఆపి విచారించగా క్రికెట్ బెట్టింగ్ పెడుతున్నట్టుగా అంగీకరించాడు. దాంతో అతనిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితరత్న అవార్డుల ప్రదానం


దళితరత్న అవార్డులు అందుకుంటున్న ఎర్రగడ్డకు చెందిన దళిత నేతలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డకు చెందిన పలువురు దళితరత్న అవార్డులను అందుకున్నారు. సికింద్రాబాద్‌లో తెలంగాణా రాష్ట్ర అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఉత్సవాల కమిటీ-2025 దళితరత్న అవార్డులను మంగళవారం అందజేశారు. ఎర్రగడ్డకు చెందిన తెలంగాణా దళితసేన నేతలు రాజేష్ సాహూ, జి. రఘు, గంట నర్సింగరావులకు ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటిక రాజు, మాజీ చైర్మన్ జన్ను కనకరాజు, తెలంగాణా దళితసేన అధ్యక్షుడు గంట మల్లేష్, ముంజ విజయ్‌కుమార్‌లు అందజేశారు. ఈ అవార్డులు మాలో మరింత బాధ్యతను పెంచాయని దళితరత్న అవార్డు గ్రహీతలు వెల్లడించారు.

అప్పులు బాధ తాళలేక యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్: అప్పులు చేసిన యువకుడు ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం.శ్రీనివాసులు రహమత్‌నగర్‌లో నివసిస్తూ సివిల్ కాంట్రాక్టర్‌గా పని చేస్తుంటాడు. అతడి చిన్న కుమారుడు ప్రేమ్‌చంద్ తన స్నేహితులైన లోకేష్, సాయిబాబా, శివ, నితిన్ వద్ద దాదాపు రూ.లక్ష వరకు అప్పులు చేశాడు. అయితే తిరిగి చెల్లించలేదు. అతని స్నేహితులు తరచూ ఇంటికి వచ్చి అడుగుతున్నారు. దాంతో ఈనెల 17వ తేదీనాడు ప్రేమ్‌చంద్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తొలుత తమ కుమారుడు తిరిగి వస్తాడని అనుకున్న తల్లిదండ్రులు మూడు రోజులైనా రాకపోవడంతో ఆందోళన చెందారు. అనేక ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి అద్దె ఇవ్వలేదని కుటుంబంపై దాడి

రహమత్‌నగర్: ఇంటి అద్దె ఇవ్వడం లేదని యాజమాని ఓ కుటుంబంపై దాడి చేసిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహ్మద్ అజీం తన కుటుంబ సభ్యులతో కలిసి బంజారనగర్‌లోని సలావుద్దీన్ నివాసంలో కొంత కాలంగా అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం అజీం తాను ఇంటిని ఖాళీ చేసే పనిలో భాగంగా ఆటోను తీసుకొచ్చి సామాన్లు సర్దుతున్నాడు. ఆ సమయంలో ఇంటి యాజమాని సలావుద్దీన్ అతడి కూమారుడు సలాం, మరికొంత మందితో కలిసి వచ్చి ఇంటి అద్దె ఇవ్వకుండా ఏలా ఖాళీ చేస్తావని వారిపై దాడి చేశారు. లెక్క చూసుకొని అద్దె చెల్లిస్తానని అజీం ఎంత చెప్పినా వారు వినకుండా దాడికి పాల్పడ్డారు. అజీం ఫిర్యాదు మేరకు ఆదివారం ఇంటి యాజమాని సలావుద్దీన్, మరికొందరిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పక్కా ప్లాన్‌తో ఫోన్ కొట్టేశాడు

బంజారాహిల్స్: ఓఎల్‌ఎక్స్‌లో ఫోన్ విక్రయానికి పెట్టిన ఓ యువకుడిని కొనుగోలు కోసం వచ్చిన మరో యువకుడు ఫోన్‌తో ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పటాన్‌చెరుకు చెందిన ఎండీ.అబ్దుల్లా రేహాన్ (19) తన ఫోన్ విక్రయిస్తానంటూ ఓఎల్‌ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. ఇందుకు షేక్ విక్రమ్ అనే వ్యక్తి తాను కొనుగోలు చేస్తానని చెప్పి జూబ్లీహిల్స్‌కు రప్పించాడు. ఎక్కడైనా టీ తాగుదామంటూ రేహాన్ బైక్‌పై జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-44లోని ఓ హోటల్‌కు తీసుకువెళ్లాడు. కాసేపటి తర్వాత విక్రమ్ పక్కా పథకంతో తన గర్ల్‌ఫ్రెండ్ బయట వేచి చూస్తుందని, ఆమెతో మాట్లాడి వస్తానంటూ బైక్ తీసుకుని వెళ్లిపోయాడు. అదే బైక్ డిక్కీలో రేహాన్‌కు చెందిన ఫోన్ కూడా ఉంది. 10 నిమిషాల తర్వాత విక్రమ్ ఫోన్ చేసి తాను ఫర్జీ హోటల్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యానని చెప్పడంతో వెంటనే రేహాన్ ర్యాపిడో బుక్ చేసుకుని ఘటనా స్థలానికి వెళ్లాడు. అక్కడ తన బైక్ ఒక పక్కన పార్క్ చేసి ఉంది. అయితే అందులో ఉండాల్సిన ఫోన్ కనిపించలేదు. విక్రమ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. రూ. లక్ష ఖరీదు చేసే ఫోన్‌తో ఉడాయించిన విక్రమ్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

ఫెర్టిలైజర్స్ విక్రయాలను పరిశీలించిన ఇండోనేషియా బృందం



శంషాబాద్‌లో ఫెర్టిలైజర్స్ విక్రయాలను పరిశీలిస్తున్న ఇండోనేషియా బృందం

శంషాబాద్: రైతులకు ఫెర్టిలైజర్ విక్రయాల తీరును ఇండోనేషియా అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. అంతకుముందు ఇండోనేషియా జాతీయ అభివృద్ధి, ప్రణాళిక శాఖ సహాయ మంత్రి బపక్ లియోనార్డోతోపాటు పదమూడు మంది అధికారుల బృందానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వ్యవసాయ శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని డీలర్ కోశోష్ చంద్ర పటేల్ ఫెర్టిలైజర్ దుకాణాన్ని ఇండోనేషియా బృందం సందర్శించింది. ఈ పోస్ యంత్రం ద్వారా ఫెర్టిలైజర్ విక్రయాల తీరును అడిగి తెలుసుకున్నారు. ఇండోనేషియాలో ఫెర్టిలైజర్ క్రయవిక్రయాల తీరును మెరుగుపర్చేదుకు పరిశీలించినట్లు తెలిపింది. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు నర్సింహారావు, మాధవి, సత్యబాబు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

షా కుటుంబాన్ని పరామర్శించిన ఇరాన్ కాన్సుల్ జనరల్



మతీన్ ఆలీషా తదితరులతో ఇరాన్ కాన్సూల్ జనరల్ మెహెది షారోఖీ

గోల్కొండ: గత వారం మృతి చెందిన ముస్లిం మత గురువు హైదర్ షా కుటుంబాన్ని హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్ డాక్టర్ మెహెది షారోఖీ పరామర్శించారు. మంగళవారం మధ్యాహ్నం గోల్కొండ రిసాలబజార్‌లోని హైదర్ షా నివాసానికి వెళ్లారు. ఆయన కుమారుడు సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీని, ఇతర కుటుంబసభ్యులను ఓదార్చారు. హైదర్ షా మృతి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సఫ్దర్ పాషా, అహసాన్ పాషా ఖాద్రీ, మహ్మద్ ఖదీర్, పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నవోదయ రీజియన్ ప్రిన్సిపాళ్ల సమావేశం

రాయదుర్గం: నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) హైదరాబాద్ రీజియన్ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయాల ప్రిన్సిపాళ్ల వార్షిక సమావేశాన్ని బుధవారం నుంచి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌వీఎస్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. సమావేశం బుధవారం నుంచి శుక్రవారం వరకు ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో జరగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్ ప్రాంతాలకు చెందిన 77 జవహర్ నవోదయ విద్యాలయాల ప్రిన్సిపాళ్లు పాల్గొంటారని పేర్కొన్నారు. నోయిడాలోని నవోదయ విద్యాలయ సమితి ప్రధాన కార్యాలయానికి చెందిన కమిషనర్ రాజేష్ లఖాని ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. సమావేశంలో జవహర్ నవోదయ విద్యాలయలోని విద్యాప్రగతిని, సహ పాఠ్య కార్యకలాపాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించనున్నట్లు చెప్పారు. ఎన్ఈపీ-2020 అమలు, ప్రధాన మంత్రి శ్రీ పాఠశాలలు కార్యక్రమంపై సమీక్ష, విశ్లేషణ, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించనున్నట్లు తెలిపారు.

చర్లపల్లి స్టేషన్‌ను సందర్శించిన ఆర్‌పీఎఫ్ ఐజీ



కుషాయిగూడ: దక్షిణ మధ్య రైల్వే ఆర్‌పీఎఫ్ ఐజీ అరోమాసింగ్ ఠాకూర్, ఉన్నతాధికారులు దేబస్మిత బెనర్జి, రాకేష్ మీనన్ తదితరులు మంగళవారం చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శించారు. స్టేషన్‌లో భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీటీవీల పని తీరును పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ప్రయాణికుల భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నివేదిక అందజేయండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

సిటీ కోర్టులు: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని పంజగుట్ట ద్వారకాపురి కాలనీ రోడ్‌లోని మోడల్ హౌస్ సమీపంలోని ఓ భవనం ముందు రెయిలింగ్ ప్రమాదకరంగా ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని సోమవారం పత్రికల్లో ''పద్దారంటే అంతే ''అని వచ్చిన కథనానికి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. దీనిని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. దీనిపై పూర్తి నివేదికను జూన్ 30లోగా అందజేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రహరీగా ఏర్పాటు చేసుకున్న రెయిలింగ్ పదునైన ఇనుప చువ్వలతో ఉన్నదని, దిగువస్థాయిలో ప్రహరీ ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నట్లు ఆ ప్రాంతవాసులు పేర్కొన్నారు.

పాతబస్తీలో పరేషాన్ లెన్నో..!

అది అద్భుతమైన కట్టడం.. దాని పరిసరాలు మాత్రం ఆందోళనకరం.. నిత్యం ఆ ప్రాంత రహదారులు రద్దీ.. వాటికి ఇరువైపులా ఇరుకు గల్లీలు.. కాలిబాటలపైనే సరుకుల అమ్మకాలు.. వేలాదిగా తరలివచ్చే సందర్శకులకు ఇక్కడ అరకొర సౌకర్యాలు.. ప్రమాదవశాత్తు ఏదైనా సంఘటనలు జరిగితే రెస్క్యూ చేయడం గగనమే.. మచ్చుకు కూడా కానరాని ఎమర్జెన్సీ సర్వీసులు.. ఒక్కోసారి ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా అధికమే.. ఇదీ ప్రపంచ పర్యాటక కేంద్రమైన చార్మినార్ కట్టడం పరిసరాల్లో నెలకొన్న పరిస్థితి. ఇదీ పాతబస్తీ దుస్థితి.

–చార్మినార్

పొంచి ఉన్న ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు

నిత్యం రద్దీతో కిటికిటలాడే చార్మినార్ పరిసరాలు	నలువైపులా దారులు బంద్	ప్రమాదాలు జరిగితే రెస్క్యూ చేయలేని పరిస్థితి

అందుబాటులో లేని ఎమర్జెన్సీ సర్వీసులు



చార్ కమాన్ వద్ద వినియోగదారులు



చార్మినార్ వద్ద రద్దీ..

చార్మినార్ కట్టడంతో పాటు..

చార్మినార్ కట్టడంతోపాటు మదీనా సర్కిల్, పటేల్ మార్కెట్, పత్తర్ గట్టి, లాడ్ బజార్, రికాబ్ గంజ్, మామా జుమ్లా పాఠక్, ఘాన్సీ బజార్, ఉర్దూ గల్లీ, కాళీ కమాన్, పంజేషా, చౌక్ మైదాన్ ఖాన్, మెహజీరోంకా క్యాంప్, మోతీగల్లీ తదితర ప్రాంతాలన్నీ ప్రధాన వ్యాపార కేంద్రాలు. దీనికి తోడు పర్యాటక ప్రాంతాల్లో కూడా వ్యాపార లావాదేవీలు కొనసాగుతున్నాయి. ఇక చార్మినార్ నలువైపులా ఏర్పాటు చేసిన గ్రానైట్ రోడ్డులో చిరు వ్యాపారుల సందడి అధికం. అడ్డదిడ్డంగా ఇక్కడ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఈ విషయాలన్నీ సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ ముందు జాగ్రత్త చర్యలకు ముందుకు రావడం లేదు. రెగ్యులర్ వ్యాపారం చేసే ఇక్కడి చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులను జారీ చేసి క్రమపద్ధతిలో కట్టడి చేస్తే బాగుంటుందని, అప్పుడు ఎలాంటి ప్రమాదాల సంభవించినా వెంటనే స్పందించి చర్యలు చేపట్టడానికి వీలు కలుగుతుందని పర్యాటకులు అంటున్నారు.

అత్యవసర సర్వీసులు అవసరం

లక్షలాదిమంది సంచరించే చార్మినార్ పరిసరాలను కవర్ చేయడానికి ఈ అత్యవసర సర్వీసులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అగ్ని ప్రమాదం లాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే రెస్క్యూ చేయవచ్చు. 2007లో చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద 108 అంబులెన్స్ అందుబాటులో ఉండేది. ఈ నేపథ్యంలోనే 2007 మే 18న, మక్కా మసీదులో బాంబు పేలుళ్లు జరిగినప్పుడు ఇక్కడే ఉన్న 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో చేరుకుని అత్యవసర వైద్య సేవలు అందించారు. దాదాపు మూడేళ్లపాటు చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద 24/7 అందుబాటులో ఉన్న ఈ అంబులెన్స్ సేవలు ఆ తర్వాత కనుమరుగయ్యాయి. చార్మినార్ పెడస్ట్రీనైజేషన్ ప్రాజెక్టు పనుల్లో భాగంగా చార్మినార్ కట్టడానికి నాలుగు వైపులా గ్రానైట్ రోడ్లు నిర్మించారు. లాడ్ బజార్‌తోపాటు చార్మినార్ సర్దార్ మహల్ భవనం వైపు రోడ్లను సిమెంట్ దిమ్మెలను అడ్డుగా పెట్టి దారిని మూసి వేయగా.. గుల్జార్ హౌస్, మక్కా మసీదు పరాషా హోటల్ వైపు బొల్లార్డ్స్ ను ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో ఈ బొల్లార్డ్స్ ను ఆటోమేటిగ్గా తొలగించడానికి వీలు కలిగేటట్లు ఏర్పాటు చేశారు. వాహనాలు కాకుండా కేవలం కాలినడకన మాత్రమే చార్మినార్, మక్కా మసీదు, లాడ్ బజార్ వరకు అవకాశాలు ఉన్నాయి.

భద్రతా ప్రమాణాలు అవసరం..



చార్మినార్ పరిసరాల్లో భద్రతా ప్రమాణాలు అవసరం. ఇక్కడ ఒక్కోసారి అర్ధరాత్రి వరకు కూడా జనాల రద్దీ ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని 108 అంబులెన్స్, అగ్నిమాపక వాహనం, సిబ్బంది అందుబాటులో ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే స్పందించడానికి వీలుంటుంది.

– రేణిగుంట సురేష్, గౌలిగూడ

చార్మినార్ వద్ద అంబులెన్స్ ఉండాలి..



నిత్యం రద్దీగా ఉండే చార్మినార్ వద్ద 108 అంబులెన్స్ 24/7 అందుబాటులో ఉండాలి. వేలాదిగా తరలివచ్చే సందర్శకులతోపాటు వినియోగదారుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అత్యవసర సేవలు ఇక్కడ ఎంతో అవసరం. గతంలో ఉన్నట్లే.. తిరిగి అందుబాటులోకి తేవాలి.

– అనంతోజు హంసరాజ్, వ్యాపారి, గుల్జార్ హౌస్

సురవరం ప్రతాపరెడ్డి జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుత్తా సుఖేందర్ రెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి

నాంపల్లి: తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి మహాసభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం శాసనమండలిలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. గోల్కొండ సాహితీ కళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29న రవీంద్రభారతిలో సురవరం జయంతి సభ జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. సభకు ముఖ్యఅతిథిగా సుఖేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎంనాయకుడు చెరుపల్లి సీతారాములు, ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షులు డాక్టర్ చంద్ర ప్రకాశ్‌రెడ్డి, బడేసాబ్, గంటా మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



గాయకుడు సైదారెడ్డి బృందం

గన్‌ఫౌండ్రీ: మంచి సంగీతం మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుందని పోలీస్ శాఖ ఉన్నతాధికారి పి.మధుకర్‌స్వామి అన్నారు. మంగళవారం ఎస్.ఆర్.మ్యూజికల్స్ ఆధ్వర్యంలో 12 గంటలపాటు సీజన్ 7 సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ గాయకులు డి.సైదారెడ్డి బృందం 12 గంటలపాటు 120 పాటలు పాడి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా మధుకర్ స్వామి మాట్లాడుతూ పలువురు గాయనీ గాయకులు నిర్విరామంగా పాటలు పాడటం అభినందనీయమన్నారు. అనంతరం గాయని గాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యులు డాక్టర్ వంశీ రామరాజు, పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో 263 దరఖాస్తులు

– దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 263 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 54, రెవెన్యూ శాఖ 45, మున్సిపల్ శాఖ 15, విద్యుత్ శాఖ 18, ఇందిరమ్మ ఇండ్ల కోసం 81 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 50 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.



రిజర్వాయర్లను తక్షణమే వినియోగంలోకి తీసుకురండి

సాక్షి, సిటీబ్యూరో: పదేళ్ల క్రితం నిర్మించిన రిజర్వాయర్లను తక్షణమే వినియోగంలోకి తీసుకొని రావాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం షేక్‌పేట జలమండలి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అక్కడ పదేళ్ల క్రితం నిర్మించిన రిజర్వాయర్లను ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

వెంటనే రిజర్వాయర్లను వినియోగంలోకి తీసువచ్చి, ఏయే ప్రాంతాల్లో నీటి సరఫరా చేయవచ్చో సర్వే చేసి వివరాలను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. రిజర్వాయర్లు అందుబాటులో వస్తే షేక్‌పేట పరసర ప్రాంతాల్లో నీటి సరఫరా మెరుగుపడే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎండీ అశోక్ రెడ్డి ఆ ప్రాంగణంలోని నీటిశుద్ధి కేంద్రాన్ని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహీయుద్దీన్‌తో కలిసి పరిశీలించారు.

విద్యుత్‌శాఖ మొబైల్ నంబర్ల మార్పు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఉపయోగించే అన్ని అధికారిక మొబైల్ నంబర్లను మార్చింది. ప్రస్తుతం వినియోగించే నెట్‌వర్క్‌లో సిగ్నల్ సమస్యతోపాటు కాల్ డ్రాప్ వంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్న కారణంగా వీటి స్థానంలో మరో సర్వీసు ప్రొవైడర్ నెట్‌వర్క్‌కు మారాల్సి వచ్చినట్లు పేర్కొంది. సంస్థ పరిధిలోని విద్యుత్ అధికారులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో వినియోగించే నంబర్లన్నీ మారనున్నాయి. ఈ మొబైల్ నంబర్లన్నీ 87124 సిరీస్ నుంచి ప్రారంభమవుతాయని ఆ సంస్థ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

మెట్రోజోన్‌లో..	
సర్కిల్	ఫోన్ నంబర్
సీఈ/ మెట్రోజోన్	8712468831
ఎస్ఈ/ బంజారాహిల్స్	8712468922
ఎస్ఈ/సికింద్రాబాద్	8712470320
ఏఈ/హైదరాబాద్ సౌత్	8712470575
ఎస్ఈ/హైదరాబాద్ సెంట్రల్	8712469840
మేడ్చల్ జోన్‌లో...	
సర్కిల్	ఫోన్ నంబర్
సీఈ/ మేడ్చల్	8712472515
ఎస్ఈ/ మేడ్చల్	8712472516
ఎస్ఈ/హబ్సిగూడ	8712471392
ఎస్ఈ/సంగారెడ్డి	8712473077
రంగారెడ్డి జోన్‌లో...	
సర్కిల్	ఫోన్ నంబర్
సీఈ/రంగారెడ్డి	8712468897
ఎస్ఈ/సైబర్‌సిటీ	8712469515
ఎస్ఈ/రాజేంద్రనగర్	8712470037
ఎస్ఈ/సరూర్‌నగర్	8712472298
ఎస్ఈ/వికారాబాద్	8712469715

4 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

– యువకుడి అరెస్ట్

గచ్చిబౌలి: బెంగళూరు నుంచి వచ్చిన వ్యక్తి నుంచి ఎండీఎంఏ తీసుకున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ నరేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వైజాగ్‌కు చెందిన ప్రణీత్(24) గచ్చిబౌలిలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో ఫెసిలిటీస్ మేనేజర్‌గా పనిచేసి మానేశాడు. గచ్చిబౌలి రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ప్రణీత్ వైజాగ్‌కు పంపించేందుకు బెంగళూర్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి నుంచి 4 గ్రాముల ఎండీఎంఏ తీసుకున్నాడు. దీనిపై సమాచారం అందడంతో ఇందిరానగర్ బస్టాప్‌లో ప్రణీత్‌ను అదుపులోకి తీసుకొని, డ్రగ్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హైడ్రాలో డ్రైవర్ ఉద్యోగాలు.. పోటెత్తిన నిరుద్యోగులు



డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు సమర్పించేందుకు నెక్లెస్ రోడ్డులోని హైడ్రా ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద బారులు తీరిన నిరుద్యోగులు

బన్సీలాల్‌పేట్: హైడ్రాలో డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు బారులు తీరారు. నెక్లెస్ రోడ్డు సంజీవయ్య పార్కు సమీపంలోని హైడ్రా ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ముందు మంగళవారం నిరుద్యోగులు పోటెత్తారు. హైడ్రాలో విపత్తుల నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పర్యవేక్షణ తదితర విభాగాల్లోని వాహనాలు నడిపేందుకు 200 మంది డ్రైవర్లు కావాలంటూ హైడ్రా నోటిఫికేషన్ జారీ చేసింది. 2022-23లో కానిస్టేబుల్ పరీక్షలు రాసినా ఉద్యోగ అర్హత పొందని అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఈ నెల 19, 20 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. దీంతో నగరంతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు పెద్ద ఎత్తున హైడ్రా కార్యాలయానికి చేరుకొని తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం కనిపించింది. రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ తుది ఫలితాల జాబితా ఆధారంగా అందులో పేర్లున్న వారి నుంచి మాత్రమే హైడ్రా అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. అయితే ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో దరఖాస్తుదారులు రోడ్డుపైన, గేటు ముందు ఎండల్లో నిరీక్షించాల్సి వచ్చింది. రెండు రోజులపాటు నిర్వహించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పెద్ద ఎత్తున యువత దరఖాస్తులను సమర్పించారు.

అగ్ని ప్రమాద ఘటనపై విచారణ చేపట్టాలి

ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి




బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పాతబస్తీ చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అగ్ని ప్రమాద మృతుల సంతాప సభ మంగళవారం శివరాంపల్లిలోని ఎస్ఎన్‌సీ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాజేందర్, విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ ఎలా జరిగింది..? పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఎంతసేపటికి ఘటనాస్థలానికి వచ్చారు.. ఎలాంటి సహాయక చర్యలు చేపట్టారు.. అనే అంశాలపై పూర్తిస్థాయిలో, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మరణించడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉత్సవాలు

– హర్షం వ్యక్తం చేసిన దళిత సంఘాలు



మాదిరి భాగ్యరెడ్డి వర్మ

సుల్తాన్‌బజార్: దేశంలోనే గొప్ప సంఘసంస్కర్త, దళిత ఉద్యమ వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని ప్రభుత్వం ఈ నెల 22న రవీంద్రభారతిలో అధికారికంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించనుండటంపై దళిత సంఘాలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు ఆదిహిందూ సోషల్ సర్వీస్ లీగ్ అధ్యక్షుడు పి.బాలనర్సింహ, మేనేజింగ్ ట్రస్టీ జ్ఞాన్ ప్రకాష్, అజయ్ గౌతమ్ హర్షం వ్యక్తం చేశారు. మే 22 1888న హైదరాబాద్‌లో జన్మించిన భాగ్యరెడ్డి వర్మ దళితుల అభివృద్ధి కోసం 1906లో జగన్ మిత్రమండలి, 1911లో మన్య సంఘం స్థాపించి, ఆ తర్వాత దానిని ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్‌గా మార్చారు. నిరక్షరాస్యత, జోగిని దురాచారం, జంతుబలి, మద్యపానం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించారు. ఆయన ఉద్యమం ఫలితంగానే నైజాం ప్రభుత్వం జోగిని దురాచారాన్ని నిషేధించింది. అప్పట్లోనే హైదరాబాద్‌లో వివిధ బస్తీల్లో దళిత బాలికల కోసం 26 పాఠశాలలను భాగ్యరెడ్డి వర్మ ప్రారంభించారు. 1925లో చాదర్‌ఘాట్‌లోని ఆదిహిందూ భవన్‌కు పునాది రాయి వేసి ప్రారంభించిన పాఠశాల నేటికీ భాగ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలగా కొనసాగుతోంది. భాగ్యరెడ్డి వర్మ 1939లో కన్నుమూశారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 2025-26 సంవత్సరంలో విద్యార్థులను చేర్చుకొనేందుకు ఆసక్తి గల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ కటకం రమేష్ తెలిపారు. ఈ నెల 28లోగా నాంపల్లి చంద్రవిహార్ కాంప్లెక్స్, 8వ అంతస్తులోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

గుల్జార్ హౌస్ ఘటన బాధాకరం



వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీతా దయాకర్ రెడ్డి

చార్మినార్: గుల్జార్ హౌస్ వద్ద జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోవడం చాలా బాధాకరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కమిషన్ సభ్యులతో కలిసి ఆమె సందర్శించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో అమాయక చిన్నారులను కోల్పోవడం హృదయ విదారకమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పిల్లల హక్కులు, వారి శ్రేయస్సును కాపాడటానికి కమిషన్ తమ వంతు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు కంచెర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బి.వచన్ కుమార్, డీసీపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

25న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష

ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 25న నిర్వహించే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గల సరోజిని నాయుడు వనితా మహావిద్యాలయలోని సమావేశ మందిరంలో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లు, అబ్జర్వర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని 95 పరీక్షా కేంద్రాలలో 43,676 మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్ష రాస్తున్నారని తెలిపారు. పేపర్ 1 ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని వివరించారు. పరీక్షకు 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తారని తెలిపారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోకి తీసుకువెళ్లడానికి అనుమతి లేదన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద జామర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండేలా ముందుగానే సూపర్‌వైజర్లు పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థులతోపాటు పెన్, పెన్సిల్, ఐడీ కార్డ్, అడ్మిట్ కార్డ్ ఫొటోగ్రఫీ మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, మెటల్ డిటెక్టర్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి, అడిషనల్ డీసీపీ(ట్రాఫిక్) తేజావత్ రాందాస్, ఆర్డీఓ సాయిరాం, మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 21, మే, 2025

అభాగ్యులకు అండగా..



సాలెహా బేగం

చింతల్: అమ్మ ప్రేమ కోసం సాక్షాత్తూ ఆ భగవంతుడే మనిషి రూపంలో భూలోకానికి వచ్చినట్లు పురాణాలలో చదువుకొన్నాం. అంతటి గొప్ప అమ్మ ప్రేమ అందక ఎంతో మంది మానసిక దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిన ఓ జంట వారికి సేవలు అందిస్తున్నారు. చింతల్ హెచ్ఎంటీ కాలనీలోని నిర్మాణ్ మానసిక వికలాంగుల కేంద్రంలో ఉంటున్న వారిని కొన్నేళ్లుగా గురువులా.. తల్లిలా.. చూసుకుంటున్నారు నిర్మల్ మానసిక వికలాంగుల కేంద్రం నిర్వాహకురాలు సాలెహ బేగం.

నిర్మాణ్ సంస్థ ఆవిర్భావం..

హెచ్ఎంటీ నిర్మల్ అనే మానసిక వికలాంగుల కేంద్రం అప్పట్లో హెచ్ఎంటీ పరిశ్రమ ఓ వెలుగు వెలుగుతున్న క్రమంలో కొంతమంది సిబ్బంది మానసిక దివ్యాంగుల కోసం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. 1994వ సంవత్సరంలో సొంత ఖర్చుతో హెచ్ఎంటీ కంపెనీలో ఓచోట గదిని అద్దెకు తీసుకొని ప్రారంభించారు. నిర్వహణ సాధ్యం కాకపోవడంతో చాలా చేతులు మారింది. 2009లో సాలెహ బేగం తన భర్తతో కలిసి ఆ సంస్థ బాధ్యతలను తీసుకున్నారు.

అనాథలకు అమ్మగా..

ఇక్కడ మానసిక దివ్యాంగులతో పాటు కొంతమంది అనాథ పిల్లలు కూడా ఉన్నారు. దాతల సహాయంతో వారిని చదివిస్తున్నారు. మానసిక దివ్యాంగులైన యువకులకు వివిధ వాటిలో శిక్షణ ఇప్పించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. వారికి వచ్చే పెన్షన్ డబ్బులతో పాటు కొంతమంది దాతల సాయంతో వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. మరికొంత మంది దాతలు ముందుకు రావాలని కోరుతున్నారు.





రీడ్.. ఫ్రెండ్

పఠనాసక్తి పెంచుతూ, స్నేహాలను పంచుతూ..

అభిరుచులు పంచుకోవడం, పుస్తకం చదవడం, చర్చలు, రచనలు, కథా కథనాలపై విశ్లేషణలు.. ఇంకా ఇలాంటివెన్నో ఈ క్లబ్స్‌ను సభ్యులకు ఆసక్తికరంగా మారుస్తున్నాయి. వేసవి సీజన్ కావడంతో వీటి కార్యకలాపాల్లో మరింత ఉత్సాహం కనిపిస్తోంది. వేసవి కాలంలో పుస్తక ప్రియుల కోసం పలు బుక్ క్లబ్‌లు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పాఠకులకు కొత్త పుస్తకాలను పరిచయం చేయడమే కాకుండా, సాహిత్య చర్చలు, కథనాలు, రచనలపై అభిరుచి పెంచేలా రూపొందిస్తున్నారు.

- సాహిత్యాన్ని మథిస్తూ, సాన్నిహిత్యాలను అందిస్తూ..
- నేర్పుతూ నేర్చుకుంటూ.. నేస్తాలను పెంచుకుంటూ..
- వినూత్న కార్యకలాపాలతో విస్తరిస్తున్న బుక్ క్లబ్స్

హస్తాల్లోని నేస్తం సాక్షిగా మన చుట్టూ స్నేహాలు అల్లుకుంటాయి. తిరగేసే పేజీలతో పాటు పెరిగే అనుబంధాలూ అక్కడే ఉంటాయి. నగరంలోని బుక్ క్లబ్స్ నిండైన ఫ్రెండ్‌షిప్స్‌కు చిరునామాగా వర్ధిల్లుతున్నాయి. ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేయగలిగిందేమో గానీ గ్లోబలైజేషన్.. పుస్తకమనే ప్యాషన్‌ను మాత్రం తగ్గించలేదని నిరూపిస్తున్నాయి. నగరంలో పుస్తక ప్రియత్వం నానాటికీ పెరుగుతూనే ఉంది. చదవడం తగ్గిపోతోందనే భయాలను పటాపంచలు చేస్తూ నగరంలో బుక్ క్లబ్స్ తమ కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

కొన్ని క్లబ్స్ వివరాలు..

- నగరంలోని హైదరాబాద్ బుక్ క్లబ్: 2010లో స్థాపించారు. ఈ క్లబ్‌కు దాదాపు 500 మంది సభ్యులు ఉన్నారు. ఇది రచయితలు, పాఠకులు కలిసి పుస్తకాలపై చర్చలు నిర్వహించే వేదికగా నిలుస్తోంది.
- లైబ్రరీ ఇంటలెక్చ్యువల్ అండ్ కల్చరల్ హబ్(ఎల్ఐసీహెచ్): 1,230 మంది సభ్యులతో, ఇది హైదరాబాద్‌లో అతిపెద్ద పుస్తక క్లబ్‌గా నిలుస్తోంది. ఇది సాహిత్యం, కళలు, సాంస్కృతిక అంశాలపై చర్చలకు ప్రసిద్ధి చెందింది.
- వేదిక: తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించే ఈ క్లబ్‌లో 328 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి శనివారం సాయంత్రం 5 గంటలకు సమావేశాలు జరుగుతాయి.
- హైదరాబాద్ రీడ్స్: ఈ క్లబ్ ఆధ్వర్యంలో కేబీఆర్ పార్క్‌లో శనివారం, ఆదివారం సాయంత్రాలు 4 నుంచి 7 గంటల వరకు నిశ్శబ్దంగా పుస్తకాలు చదివే కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉచితంగా అందరికీ అందుబాటులో ఉంది. చాలా ఆహ్లాదకరంగా సాగుతుందీ కార్యక్రమం.
- కాఫీ విత్ కథలు: ఈ కార్యక్రమం పుస్తక ప్రియుల కోసం కథలపై చర్చలు, రచనలపై అభిప్రాయాలు పంచుకునే వేదికగా ఉంటుంది. ఇది పాఠకులకు కొత్త కథలను పరిచయం చేయడంలో సహాయపడుతుంది.
- ది లిటిల్ జిమ్ బంజారాహిల్స్‌లోని ఈ క్లబ్‌లో కథా కథనాలు, కళా కార్యక్రమాలు, ఇతర సృజనాత్మక కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఇవి పిల్లల్లో సాహిత్యంపై ఆసక్తిని పెంచడంలో సహాయపడతాయి.
- బుక్స్ అండ్ మోర్ లైబ్రరీ– యాక్టివిటీ సెంటర్ ఇది వెస్ట్ మారేడ్‌పల్లిలో ఉంది. చిన్నారుల కోసం కథా కథనాలు, రచయితలతో సమావేశాలు, పుస్తక మార్పిడి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తోంది.



ది పాండా క్లబ్..

ఈ క్లబ్ వేసవి కాలంలో చిన్నారుల కోసం కథా కథనాలు, పుస్తక చదవడం, చిత్ర లేఖనం, కళా కార్యక్రమాలు, సంగీతం, నృత్యం, వంటకాలు, బ్రెయిన్ గేమ్స్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

అప్ప వరల్డ్ లైబ్రరీ అండ్ కిడ్స్ క్లబ్

ఈ లైబ్రరీ సమ్మర్ రీడింగ్ ఛాలెంజ్‌ల ద్వారా పిల్లల కోసం వివిధ శైలుల పుస్తకాలను చదవడం, కథా కథనాలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

- నగరంలోని కొన్ని గేటెడ్ కమ్యూనిటీల్లో పిల్లల కోసం పుస్తక మార్పిడి, బుక్మార్క్ తయారీ, పిల్లల చేత కథా కథనాలు వంటి కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తున్నారు. ఇవి పిల్లల్లో చదవడం పట్ల ఆసక్తిని పెంచడంలో సహాయపడతాయి.

నేస్తాన్ని.. వదలకూడదని..

“ఇప్పటి వేగవంతమైన జీవనశైలిలో చదవడం అనే అలవాటు నెమ్మదిగా మన జీవితాల నుంచి మాయమవుతోంది. పుస్తక పఠనం అనేదాన్ని పునరుద్ధరించడానికి మళ్లీ పుస్తకాలతో అనుబంధాన్ని అందించాలనుకున్నాం. ప్రతినెలా నిర్వహించే సమావేశాల్లో పుస్తకాలపై చర్చలు, సారాంశాలు పంచుకోవడం ద్వారా చదవడంలోని మాధుర్యాన్ని ఇస్తున్నాం.. అనుభవిస్తున్నాం. వివిధ వయస్సుల, అనుభవాలున్న సభ్యుల మధ్య జరిగే చర్చలు మనల్ని విస్తృతమైన దృక్పతం వైపు నడిపిస్తాయి. ఇది విలువైన పుస్తకాల పరిచయంతో పాటు నూతన భావజాలాల ఆవిష్కరణకు మార్గం కూడా..

– శాంతికృష్ణ, విభ.. బుక్ బ్లిస్ క్లబ్ వ్యవస్థాపకులు




అపరిచితులతో.. ఆనందంగా..

“ఒక బుక్ క్లబ్‌లో కొన్ని సెషన్లు పూర్తి చేశా. అంతకు ముందు ఎప్పుడూ కలవని వ్యక్తుల నుంచి వినడం, వారితో సంభాషించడం అనేది ఒక వినూత్న అనుభవం. ఆ సందర్భాన్ని గురించిన ఆలోచనలు, గ్రూప్ సెషన్లలోని ‘మంచి అనుభూతి’ తాలూకు ఫీలింగ్స్ మనల్ని ‘ఇతర విషయాలను’ మరచిపోయి, ఆస్వాదించేలా చేస్తాయి.”

– వెంకట్ రామ్ దత్తు

అస్లీ మ్యాంగో..

రుచి చూడాల్సిందే..



సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ పురస్కరించుకుని ప్రముఖ కేఫ్ చైన్ బ్రాండ్ యమ్మీ బీ మామిడితో తయారైన డిసర్ట్స్ రూపొందించి అస్లీ మామిడి 2.0 కలెక్షన్ పేరిట నగరంలో విడుదల చేసింది. ఈ సందర్భంగా యమ్మీ బీ వ్యవస్థాపకుడు మాజీ ఇండియన్ అండర్–19 క్రికెటర్ కూడా అయిన సందీప్ జంగాల మాట్లాడుతూ ఇవి చక్కెర రహిత, గ్లూటెన్ రహితంగా ఉంటాయని, శుద్ధి చేసిన పిండి వంటివి వినియోగించకుండా సహజ పదార్థాలతో తయారైనవని తెలిపారు. ఈ కలెక్షన్‌లో మ్యాంగో ఫ్లోరిడా పేస్ట్రీ, మ్యాంగో చీజ్‌కేక్ తదితర వెరైటీలు ఉన్నాయని వివరించారు. ఇవి నగరంలోని తమ అవుట్‌లెట్స్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

ఐఐఎంలో చదివి.. వైభవంగా సినిమా వైపు



బంజారాహిల్స్: ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లో చదువు అంటే ఆషామాషీ కాదు. ఎన్నో ఆశయాలతో ఐఐఎంలో అడుగుపెట్టాడు. మేనేజ్‌మెంట్ రంగంలో కార్పొరేట్ రంగాన్ని శాసించాలనుకున్నాడు. మరోవైపు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ప్యాషన్.. అటు ఐఐఎం చదువుకు తగ్గ లక్షల్లో జీతం వచ్చే కొలువు చూసుకోవడమా.. సినిమా రంగం వైపు వెళ్లడమా? అని ఆలోచించి రంగుల ప్రపంచం వైపు అడుగేశాడు. మేనేజ్‌మెంట్ నైపుణ్యాన్ని సినిమా రంగానికి జోడించి తెలుగు సినిమా దర్శకుడిగా మారాడు. అతనే సూర్యాపేటకు చెందిన యువ కెరటం సాత్విక్. నగరంలోని మణికొండలో ఉండే సాత్విక్ విశాఖపట్టణం ఐఐఎం నుంచి పట్టభద్రుడయ్యాడు. చిన్నప్పటి నుంచి సినిమాల మీద ఉన్న ప్యాషన్‌తో మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు అందించాలని కలలు కన్నాడు. ఈ క్రమంలో దర్శకుడిగా తన తొలి చిత్రం ‘వైభవం’ ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంతో రుత్విక్, ఇక్రా దిద్రిసితో పాటు పలువురు కొత్త నటీనటులు పరిచయమయ్యారు.



ఎన్నెన్నో వెరైటీలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్–1లోని లేబుల్స్ పాప్–అప్ స్పేస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను ప్రముఖ సామాజికవేత్త ఏనుగు శైలజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ‘విభిన్నమైన పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్ర ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రదర్శించడం అభినందనీయమని ఆమె అన్నారు. డీ సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా పటాన్ పటోలా, బంధాని, బనారసి, చందేరి, కశ్మీరీ నేత వస్త్రాలు, జరీ కోట, మహేశ్వరి, గద్వాల్, ఇక్కత్, తుస్సార్ కాంత, కంచి పట్టు, లక్నోవి సూట్లు, అజ్రక్ సూట్లు, డ్రెస్ మెటీరియల్స్, బెడ్‌షీట్లు, ఆభరణాలు వంటి 10 వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.



కమ్యూనిటీ ఆవకాయ

ఒకటి రెండు కుటుంబాలతో మొదలై కమ్యూనిటీ కల్చర్ వరకు..

సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన మహిళలు

మోతీనగర్ సమీపంలో కొత్తగా నిర్మితమైన బ్రిగేడ్ సిటాడెల్ హైరైజ్ అపార్ట్‌మెంట్ అది. 1300 ఫ్లాట్లు కలిగిన ఈ అపార్ట్‌మెంట్స్‌లో ఇప్పుడిప్పుడే కుటుంబాలు గృహప్రవేశాలు చేస్తున్నాయి. అలా దిగిన కుటుంబాలకు చెందిన 800 మంది మహిళలంతా ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. అందులో మనమందరం కలిసి ఆవకాయ పచ్చడి పట్టుకుంటే బాగుంటుందని స్వాతి జ్యోతులకు వచ్చిన ఆలోచనను వాట్సప్ గ్రూపులో పంచుకుంది. దీనికి మిగతా మహిళల నుంచి కూడా ఆమోదం వచ్చింది. ఒక వంద కుటుంబాలు కలసికట్టుగా ఆవకాయ పచ్చడి పట్టుకుందామని ముందుకువచ్చాయి. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆవకాయ పచ్చడి పట్టడాన్ని ఒక పండుగలా, ఒక జాతరలా జరుపుకుని మహానగరంలో సరికొత్త సంప్రదాయానికి తెరలేపారనే చెప్పవచ్చు.

ఒక్కరోజులో 150 కిలోల పచ్చడి..

దాదాపు 100 కుటుంబాల డబ్బులు వేసుకుని సామూహిక ఆవకాయ పచ్చడికి సిద్ధమయ్యారు. ఇందుకోసం అక్కడే ఒక హాల్‌ను బుక్ చేసుకున్నారు. పచ్చడి పెట్టుకునేందుకు ముందుకువచ్చిన కుటుంబాలతో పాటు చూడడానికి వచ్చిన వారితో ఈ ఈవెంట్ ఒక వేడుకగా మారింది. శంషాబాద్ శివారుల నుంచి 300 దాకా ఆర్గానిక్ మామిడి కాయలను ప్రత్యేకంగా కోసుకుని తీసుకువచ్చారు. గుంటూరు కారాన్ని తెప్పించారు. ఆవాలు, మెంతులు, వెల్లుల్లి, పసుపు ఇలా అన్ని పదార్థాలూ సరిపడా సమకూర్చుకున్నారు. ఒక్కరోజులో 150 కిలోల పచ్చడిని పట్టి ఔరా అనిపించారు.

ఆవకాయ.. ఇది తెలుగు వారికి మాత్రమే ప్రత్యేకం. విస్తర్లో ఎన్ని వంటకాలు ఉన్నా.. ఏదో ఒక మూల ఆవకాయ టేస్ట్ తగలకపోతే ఏదో వెలితి. ఆఖరికి పెరుగులో టచింగ్‌కైనా సరే. తెలుగు విందు భోజనాల్లో అంతటి స్థానాన్ని సంపాదించుకుంది ఆవకాయ. అంతెందుకు దేశం దాటి వెళ్తున్న తమ వారి లగేజీల్లో ఆవకాయ పచ్చడి ఉండి తీరాల్సిందే. ఇప్పటికే విదేశాల్లో స్థిరపడ్డ కుటుంబీకులకు పచ్చళ్లు పంపడానికి ఏకంగా కొరియర్ సర్వీసులు లెక్కకుమించి పుట్టుకొస్తున్నాయంటే తెలుగు ఆవకాయకు ఉన్న ప్రాధాన్యం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అలా వేసవి విహారంలో విలేజీకి వెళ్లినప్పుడు అమ్మమ్మలు, నాన్నమ్మలు చుట్టుపక్కల అమ్మలక్కలతో కలిసి ఆవకాయ పట్టడం ఇప్పటికీ చూస్తునే ఉంటాం. అలాంటి మధుర జ్ఞాపకాలు పాత తరం వారి ప్రతిఒక్కరి జీవితంలో ఉండే ఉంటాయి. ఆ జ్ఞాపకాలను తిరగేసుకుని మళ్లీ అలాగే అందరం కలిసి ఆవకాయ పడితే ఎలా ఉంటుందని ఆ అపార్ట్‌మెంట్ మహిళల మదిలో ఆలోచన తళుక్కుమనడమే కాదు..ఏకంగా పట్టాలెక్కించారు. ఆవకాయ పచ్చడి పట్టడానికి ఒక వేడుకగా మలచుకున్నారు.

– సనత్‌నగర్



తొలిసారి ప్రయత్నమే సక్సెస్

అందరం ఒకచోట చేరి ఒక పండుగలా ఆవకాయ ఈవెంట్‌ను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి వేడుక ద్వారా ఐక్యత పెరుగుతోంది. బతుకమ్మ, సంక్రాంతి, దసరా పండుగలప్పుడు కలవడం సాధారణమే అయినా ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలతో అందరూ తలో చేయి వేసి సమిష్టిగా పచ్చడిని పెట్టుకోవడం నిజంగా అద్భుతమనిపించింది. మరుపురాని అనుభూతి మిగిల్చింది.

– దీప్తి ధరణిప్రగడ



మధురానుభూతి..

కొత్తగా చేరిన కుటుంబాలంతా కలిసి తొలిసారిగా ఆవకాయ ఈవెంట్‌ను జరుపుకోవడం ఎంతో మధురానుభూతిని కలిగించింది. ఒక కుటుంబమో, లేక ఆ కుటుంబంలోని బంధువులో కలిసి ఆవకాయ పచ్చడి పెట్టుకోవడం మామూలే. కానీ అపార్ట్‌మెంట్‌లోని మహిళలంతా కలిసి ఒక వేడుకగా జరుపుకోవడం ద్వారా అందరి మధ్య ఒక ఆత్మీయ బంధాన్ని ఆవకాయ ఏర్పరిచింది.

– స్వాతి జ్యోతుల

క్లుప్తంగా...

కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర

- ఎమ్మెల్సీ కవిత ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాజకీయ కక్షతో మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకే కాళేశ్వరం కమిషన్ పేరుతో నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి నదిలో తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వాటాను కోల్పోయిన సందర్భంలో ప్రజలు పడిన బాధ అందరికీ తెలుసన్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద కాంగ్రెస్ వాళ్లకు మొదటి నుంచీ కడుపు మంటగా ఉందంటూ మంగళవారం కవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'తెలంగాణలో బీడు భూములన్నింటికీ నీళ్లు వచ్చేలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మీద కాంగ్రెస్ నాయకులు మొదటి నుంచీ కుట్రలు పన్నుతూ అనేక కేసులు వేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రాజెక్టుపై ప్రజలను గందరగోళానికి గురి చేశారు. ఈ కుట్రలో భాగంగానే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. రాజకీయ కక్షతో వేసిన ఇలాంటి కమిషన్లు కాలక్రమంలో తప్పకుండా న్యాయాన్నే గెలిపిస్తాయని విశ్వాసం ఉంది. త్వరలోనే నిజాలన్నీ బయటకు వస్తాయి. పాలు ఏవో.. నీళ్లు ఏవో ప్రజలకు స్పష్టత వస్తుంది'అని కవిత అన్నారు.

కేసీఆర్, హరీశ్, ఈటల వివరణ ఇవ్వాల్సిందే

- కాళేశ్వరం నోటీసులపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, సాగునీటి శాఖ మంత్రి హరీశ్‌రావులు ప్రజలకు వివరణ ఇవ్వాల్సిందేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరంపై నియమించిన విచారణ కమిషన్ వారికి నోటీసులు ఎలా ఇస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారని, తప్పు చేసిన ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదని అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక కోణంలోనే నిర్ణయాలు తీసుకుంటుందని, అందుకే విచారణ కోసం కమిషన్ వేసిందని అన్నారు. మూడేళ్లలో ఒక్క పిల్లర్ కూలితే ఏమవుతుందని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారని, మరి నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు కట్టి ఇన్నేళ్లయినా ఎందుకు కూలలేదో చెప్పాలని అన్నారు. కాళేశ్వరంకు ఆర్థిక అనుమతులు ఎలా ఇచ్చారో రాజేందర్ చెప్పాల్సిందేనన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, కేసీఆర్ తన నిజాయితీని నిరూపించుకుంటే పూలదండలు వేస్తామని అన్నారు. సరస్వతి పుష్కరాల్లో ప్రజాప్రతినిధులకు అవమానం జరిగిందనడంలో వాస్తవం లేదని దయాకర్ చెప్పారు.

నల్లమల ఖనిజ సంపదపై రేవంత్ కన్ను

- ప్రారంభోత్సవానికి చెంచులను రానివ్వలేదు : బీఆర్ఎస్ నేతలు


సాక్షి, హైదరాబాద్: నల్లమల అడవుల్లోని ఖనిజ సంపదపై సీఎం రేవంత్‌రెడ్డి కన్ను పడిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. సీఎంతోపాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిగివచ్చినా ఆ సంపదను తరలించుకుపోనిచ్చేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, పార్టీ నాయకులు భూక్యా జాన్సన్ నాయక్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో బాలరాజు మీడియాతో మాట్లాడారు. అచ్చంపేటలో ప్రభుత్వం నిర్వహించిన 'ఇందిర సౌరగిరి జల వికాస పథకం'ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ కాంగ్రెస్ సభగా మార్చారని మండిపడ్డారు. ఈ సభలో సమస్యలు ప్రస్తావించేందుకు ప్రయత్నించిన చెంచుల గొంతు నొక్కారని ఆరోపించారు. బౌరాపూర్ చెంచు ఆలయం, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రారంభోత్సవాన్ని పోలీసులు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల హామీల అమలును విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాలను మోసం చేశారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శించారు. నల్లమలలో లంకె బిందెల కోసం రేవంత్ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని రేగా కాంతారావు ఎద్దేవా చేశారు.

బింగ్‌హామ్టన్‌తో వీఐటీ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: పరివర్తన విద్య, ఖండాంతర అవకాశాలను అందించడం ద్వారా భవిష్యత్ నాయకులను శక్తిమంతం చేయడానికి సంబంధించి.. మారిషస్‌కు చెందిన వీఐటీ, అమెరికాలోని బింగ్‌హామ్టన్ విశ్వవిద్యాలయంతో ఇటీవల ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంపై వీఐటీ వ్యవస్థాపకుడు, చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్, న్యూయార్క్‌లోని బింగ్‌హామ్టన్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ హార్వే జి.స్టెంజర్ సంతకం చేశారు. నోబెల్ గ్రహీత డాక్టర్ ఎం.స్టాన్లీ విట్టింగ్‌హామ్ తదితరుల సమక్షంలో బింగ్‌హామ్టన్ క్యాంపస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వ్యూహాత్మక అవగాహన ఒప్పందం రెండు సంస్థల మధ్య దీర్ఘకాలిక సహకారానికి నాంది పలికిందని డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు.

ఆర్థిక లావాదేవీల విషయంలో భారతీయ కుటుంబాల్లో ఇటీవలి కాలంలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. అప్పు తీసుకోవడానికి ఎవరూ వెనుకంజ వేయడం లేదు. దీంతో జీడీపీలో అప్పులు శాతం 2011-12తో పోలిస్తే 2023-24 నాటికి దాదాపు రెట్టింపునకు చేరింది. అలాగే కుటుంబాలు తమ వద్ద నగదు నిల్వలు అట్టిపెట్టుకోవడం తగ్గించి పెట్టుబడులవైపు దృష్టి సారిస్తున్నారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు 2019-20తో పోలిస్తే 2023-24 నాటికి దాదాపు నాలుగు రెట్లు దూసుకెళ్లాయని కేంద్ర గణాంకాల శాఖ తాజా నివేదిక చెబుతోంది. కుటుంబ అప్పుల్లో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల వాటా 98.8 శాతానికి ఎగసింది. షేర్లలో పెట్టుబడులు దాదాపు మూడు రెట్లు పెరిగాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



అప్పు.. రెండింతలు!

కుటుంబాల్లో తగ్గిన నగదు నిల్వలు

పెరిగిన డిపాజిట్లు, పెట్టుబడులు

బ్యాంకులిచ్చిన అప్పులు నాలుగింతలు

ఆర్థిక లావాదేవీల్లో పెను మార్పులు

ఆస్తులు, రుణాలు ఇలా.. (రూ.లక్షల కోట్లలో)

	2019-20	2020-21	2021-22	2022-23	2023-24	2019-20తో పోలిస్తే 2023-24లో మార్పు (శాతం)
నగదు	2.83	3.82	2.70	2.38	1.18	-58
డిపాజిట్లు	8.89	12.46	8.34	11.09	13.91	57
స్థిరాస్తులు	22.52	21.35	29.68	36.15	38.44	71
బంగారం, ఆభరణాలు	0.43	0.40	0.61	0.64	0.65	51
బ్యాంకుల రుణాలు	4.83	6.05	7.69	11.91	18.56	284
నికర పొదుపులు	15.5	23.3	17.13	13.31	15.52	0.11

జీడీపీలో ఇలా (శాతాల్లో)..

	2011-12	2023-24
కుటుంబాల పొదుపు	23.6	18.1
అప్పులు	3.32	6.24

దేశంలో 2019 నుంచి ఈ అయిదేళ్ల కాలంలో బ్యాంకుల రుణాలు 284 శాతం పెరిగాయి. గృహాల్లో నగదు నిల్వలు 58 శాతానికి పైగా తగ్గాయి. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలలో (ఎన్‌బీఎఫ్‌సీ) డిపాజిట్లు 57 శాతం అధికం అయ్యాయి. దేశంలో మ్యూచువల్ ఫండ్లతో సహా షేర్ మార్కెట్లో పెట్టుబడులు 191 శాతం ఎగశాయి. ఐపీఓల ద్వారా మొత్తం నిధుల సమీకరణ 2024 ఏప్రిల్-డిసెంబర్ మధ్య రూ.11.1 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది 2023-24లో అందుకున్న మొత్తంతో పోలిస్తే 5 శాతం ఎక్కువ.

డిజిటల్ లావాదేవీల రయ్ రయ్

దేశంలో ప్రజల ఆర్థిక కార్యకలాపాల్లో మార్పులకు ప్రధాన కారణం డిజిటల్ లావాదేవీల పెరుగుదల. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకారం 2023-24లో రిటైల్ చెల్లింపుల్లో డిజిటల్ పేమెంట్స్ వాటా 80 శాతంగా నమోదైంది. మొత్తం డిజిటల్ లావాదేవీల సంఖ్య 13,100 కోట్లకుపైమాటే. కానీ ఈ లావాదేవీల విలువ రికార్డు స్థాయిలో రూ.200 లక్షల కోట్లను దాటింది. వినియోగంలో సౌలభ్యం, విస్తరిస్తున్న నెట్‌వర్క్‌తో కోట్లాది మందికి రియల్-టైమ్ చెల్లింపుల వేదికగా యూపీఐ మారింది.

బంగారంలా దాచుకుని..

సురక్షిత పొదుపు సాధనంగా బంగారం అవతరించింది. భారతీయ కుటుంబాలు పుత్తడి, బంగారు ఆభరణాలు, వెండి కొనుగోలుకు 2019-20లో రూ.43 వేల కోట్లు వెచ్చించాయి. 2023-24 నాటికి ఇది 51 శాతం దూసుకెళ్లి రూ.65 వేల కోట్లకు చేరింది. బ్యాంకుల్లో డిపాజిట్లు రూ.8.89 లక్షల కోట్ల నుంచి 57 శాతం అధికమై రూ.13.91 లక్షల కోట్లను తాకాయి. స్థిరాస్తులకు 71 శాతం అధికంగా రూ.38.44 లక్షల కోట్లు ఖర్చు చేశారు. అయితే బ్యాంకుల నుంచి అందుకున్న రుణాలు రూ.4.83 లక్షల కోట్ల నుంచి భారీగా పెరిగి రూ.18.56 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

హామీలు గాలికి..కుట్రలు తెరపైకి..

బరితెగించి తప్పుడు కేసులతో రాష్ట్రంలో రాక్షస పాలన

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు
- ప్రజలు చంద్రబాబును తీవ్రంగా ద్వేషిస్తున్నారు
- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- రేపు వచ్చేది మన ప్రభుత్వమే.. సినిమా చూపిద్దాం
- వైఎస్సార్‌సీపీ 'స్థానిక'ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికలప్పుడు ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలు అమలు చేయకపోగా ప్రతిపక్ష నేతలపై తప్పులు కేసులు పెట్టడంపైనే దృష్టి పెట్టిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారని, ప్రజాస్వామ్యం మచ్చుకైనా కనిపించడం లేదని.. ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు పెచ్చుమీరిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రెడ్‌బుక్ కుట్రలతో విధ్వంసం సృష్టిస్తున్నారని, బరితెగించి యథేచ్ఛగా కేసుల మీద కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని.. మనం రాక్షస యుగంలో ఉన్నామని, చంద్రబాబు పాలనలో రాజకీయాలు నైతికంగా పతనం అయ్యాయన్నారు. అయితే ఈ అక్రమ కేసులు, అరెస్టుల పర్వానికి భయపడాల్సిన అవసరం లేదని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు తేల్చి చెప్పారు. జైళ్లకు పంపినా సరే.. 'చంద్రబాబూ.. నిన్ను ఎదుర్కొంటాం'అని ధైర్యంగా, గట్టిగా నిలబడగలిగినప్పుడే రాష్ట్రంలో రాజకీయం చేయగలమని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మున్సిపాలిటీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మున్సిపాలిటీ, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం, శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, జరుగుతున్న పరిణామాలపై చర్చించి.. పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీకి కార్యకర్తే నంబర్ వన్ అని, వచ్చేది మన ప్రభుత్వమేనని.. జగన్ 2.0లో కార్యకర్తలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని పునరుద్ఘాటించారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత

మామూలుగా ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఏడాది తర్వాత కొంత వస్తుంది. కానీ, చంద్రబాబు ప్రభుత్వానికి ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకత చాలా తీవ్ర స్థాయిలో ఉంది. ప్రజలు ఆయన్ను తీవ్రంగా ద్వేషిస్తున్నారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చాడు. జగన్ ఇచ్చినవన్నీ ఇవ్వడమే కాకుండా, ఇంకా మూడు ఎక్కువ ఇస్తానన్నాడు. కానీ, ఏదీ నిలబెట్టుకోలేదు. ఇప్పటికే సంవత్సరం అయిపోయింది. అందుకే ఆయన ప్రభుత్వంపై అంత వ్యతిరేకత వచ్చింది. చంద్రబాబు అన్ని వ్యవస్థలను నాశనం చేశాడు. ఆయన ఎక్కడా మాట నిలబెట్టుకోలేదు. అలా ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు. అందుకే తనను ఎవరూ ప్రశ్నించకూడదని భయానక పాలన సాగిస్తున్నాడు. అందులో భాగంగా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతున్నారు. ఎవరు మాట్లాడినా, వారి గొంతు నొక్కుతున్నారు. నిలదీస్తున్న గొంతులను నలిపేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తే నంబర్ వన్

ఈరోజు నేను మీ అన్నగా, మీ బిడ్డగా ఒకటే చెబుతున్నా. జగన్ 2.0లో పరిస్థితి ఇలా ఉండదు. పూర్తి భిన్నంగా ఉంటుంది. గతంలో మన ప్రభుత్వ హయాంలో రెండేళ్లు కోవిడ్. దాంతో మనం యుద్ధం చేశాం. అందువల్ల అనుకున్న మేరకు కార్యకర్తలకు చేయలేకపోయాను. ఇప్పుడు చెబుతున్నాను. రేపు ఈ పరిస్థితి ఉండదు. వైఎస్సార్‌సీపీకి కార్యకర్తనే నంబర్ వన్. ప్రతి కార్యకర్తకు చెబుతున్నా. మీకు ఎవరు అన్యాయం చేసినా, మిమ్మల్ని ఎవరు ఇబ్బంది పెట్టినా, వారి పేరు రాసుకోండి. అది ఏ బుక్ అయినా సరే. వారి పేరు మాత్రం కచ్చితంగా రాసి పెట్టుకోండి. ఆ తర్వాత మనం వచ్చాక, ఈరోజు మీకు అన్యాయం చేసిన వారికి సినిమా చూపిస్తాం. ఆ మనిషి రిటైర్ అయినా, దేశం వదిలి పోయినా లాక్కొస్తాం. ఎవ్వరినీ వదిలిపెట్టం. సినిమా ఎలా చూపాలో వారికి చూపిస్తాం. మిమ్మల్ని ఎవరైనా కొట్టినా కొట్టించుకోండి. ఫరవాలేదు. నీ టైమ్ బాగుంది. కొట్టు అనండి. ఆ తర్వాత మన టైమ్ వస్తుంది. అప్పుడు మనం కొడతాం. ఇవాళ వారు నాటుతున్న విత్తనం రేపు రెండింతలు అవుతుంది.

బోధన తీరు మార్చుకోండి

మూస విధానానికి స్వస్తి చెప్పండి

- ప్రపంచవ్యాప్త బోధన పద్ధతులపై అధ్యయనం చేయండి
- సర్కారీ స్కూళ్లలో అవన్నీ అమలు చేయాలి.. వెబినార్‌లో విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో బోధన విధానం సమూలంగా మారాలని టీచర్లకు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను అవగతం చేసుకోవాలని టీచర్లకు సూచించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా, వారిలో ఆసక్తి పెంచేలా బోధన సాగాలని అన్నారు. అత్యాధునిక సాంకేతికతను జోడించి బోధించడానికి అలవాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 550 మండల కేంద్రాల్లో టీచర్లకు మెరుగైన బోధనపై చేపట్టిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం మొదలైంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులతో కలిసి యోగితా రాణా శిక్షణ పొందుతున్న టీచర్లతో వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, బోధనా అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు టీచర్లు లేవనెత్తిన వృత్తిపరమైన సమస్యలకు ఆమె సమాధానాలిచ్చారు.

నమ్మకం పెంచాలి

ప్రభుత్వ స్కూళ్లకు పేద విద్యార్థులే వస్తున్నారని, వారిలో బడిపట్ల విశ్వాసం పెంచాలని కోరారు. మూస విధానంతో బోధనకు కాలం చెల్లిందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం వివిధ దేశాలు, రాష్ట్రాల్లో బోధనకు అనుసరిస్తున్న సరికొత్త పద్ధతులపై అధ్యయనం చేసిందని, వాటిని రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే టీచర్లకు ప్రాథమిక శిక్షణ చేపడుతున్నామని తెలిపారు. వివిధ మార్గాల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని టీచర్లకు సూచించారు. అంకితభావం ఉంటే అన్నీ సాధ్యమేనని పేర్కొన్నారు. నాణ్యమైన బోధన, నైపుణ్యం ఉన్న టీచర్లు ప్రభుత్వ బడుల్లోనే ఉన్నారనే వాస్తవాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. ప్రతి టీచర్ తమ బడి సమీపంలోని విద్యార్థులను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ విద్య వైపు ప్రభుత్వ బడులు ముందుకెళ్తున్నాయనే విషయాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని సూచించారు. అంతిమంగా ప్రభుత్వ స్కూళ్లలో వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం కావాలని స్పష్టంచేశారు.

కేసీఆర్‌కు నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేసింది. ఈ నేపథ్యంలో సహజ న్యాయ సూత్రాల మేరకు ఈ ముగ్గురి వాదనలు సైతం వినాలని జస్టిస్ ఘోష్ నిర్ణయించినట్లు సమాచారం. కాళేశ్వరం నిర్మాణం సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌తోపాటు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌లను ప్రశ్నించి మరింత సమాచారం జోడిస్తే సమగ్ర నివేదిక ఇచ్చినట్లు అవుతుందని భావించిన కమిషన్ వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 సెక్షన్ 311ను అనుసరించి నోటీసులు జారీ చేసినట్లు చెబుతున్నారు. పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఇదివరకే పలువురు ఇంజనీర్లు, నిర్మాణదారులు, అప్పట్లో నీటిపారుదల శాఖ, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా పనిచేసిన ఐఏఎస్ అధికారులను విచారించిన సంగతి విదితమే.

2019లో బరాజ్‌ల నిర్మాణం పూర్తి:

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడు బరాజ్‌ల నిర్మాణ పనులు 2016లో ప్రారంభించగా 2019 మేలో పూర్తయ్యాయి. అయితే 2023 సెప్టెంబర్‌లో మేడిగడ్డ బరాజ్‌లోని ఒక బ్లాక్ పిల్లర్లు కుంగిపోయాయి. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇప్పటికే నివేదిక ఇచ్చింది. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో మొదటి దఫాలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రిగా, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. రెండో దఫాలో కేసీఆర్ సీఎంగా, నీటిపారుదల శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించగా.. హరీశ్‌రావు ఆర్థిక మంత్రిగా కొనసాగారు. ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణం తదితర అంశాల్లో వీరి నిర్ణయాలు కీలకంగా ఉన్నాయనే ఉద్దేశంతో, వారిని విచారించి వాదనలు రికార్డు చేయాలని కమిషన్ భావిస్తున్నట్టు సమాచారం. నోటీసుల ప్రకారం వారంతా వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాల్సి ఉండగా, ఒకవేళ వారు కోరితే వర్చువల్‌గా కూడా విచారణ కొనసాగించే అవకాశాలు ఉన్నట్టు కమిషన్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

గుట్టలతో గాలివాటానికి అవాంతరం

- విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లపై ప్రభావం
- 'కొత్తగూడెం ఎయిర్‌పోర్టు'కు మళ్లీ అడ్డంకి
- గుర్తించిన రెండో స్థలం కూడా యోగ్యం కాదని తేల్చిన ఏఏఐ



సాక్షి, హైదరాబాద్: వరంగల్ విమానాశ్రయంతోపాటే పనులు ప్రారంభిద్దామనుకున్న కొత్తగూడెం విమానాశ్రయ కసరత్తుకు అవాంతరం ఎదురైంది. విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని భావించి గుర్తించిన స్థలం పనికిరాదని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తేల్చిచెప్పింది. దీంతో కొత్తగూడెం విమానాశ్రయానికి మరో స్థలం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా దీని నిర్మాణ కసరత్తులో జాప్యం తప్పేలా కనిపించటం లేదు.

ముచ్చటగా మూడో స్థలం కోసం..

రాష్ట్రంలో ప్రతిపాదించిన ఆరు విమానాశ్రయాల్లో కొత్తగూడెం కూడా ఒకటి. ఇందులో వరంగల్ శివారులోని మామునూరు పాత ఎయిర్‌స్ట్రిప్ ఉన్న స్థలంలో భారీ విమానాశ్రయ నిర్మాణానికి ఇప్పటికే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఓకే చెప్పిన విషయం తెలిసిందే. దాని తర్వాత రెండో విమానాశ్రయంగా కొత్తగూడెంను ముందుకు తెచ్చారు. ప్రతిపాదించిన సమయంలో తొలుత పాల్వంచ సమీపంలోని గుడిపాడు-బంగారుజాల మధ్య స్థలాన్ని గుర్తించారు. అది అనుకూలంగా లేదని ఏఏఐ తేల్చటంతో గతేడాది చివరలో కొత్తగూడెం మండలంలోని రామవరం, సుజాతనగర్ మండలం పరిధిలో సుజాతనగర్ గ్రామం, చుంచుపల్లి మండల పరిధిలోని చుంచుపల్లి గ్రామాల సరిహద్దులో 950 ఎకరాల భూమిని గుర్తించారు. ఈ ప్రాంతానికి సంబంధించిన పదేళ్ల వాతావరణ నివేదికలు, విండ్‌రోజ్ డయాగ్రామ్ తదితర నివేదికలను స్థానిక అధికారులు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి నివేదించారు. వీటితోపాటు ఆ స్థలాన్ని ఇటీవల పరిశీలించిన ఏఏఐ అధికారులు.. ఆ భూమి కూడా యోగ్యంగా లేదని తేల్చి ఉసూరుమనిపించారు. ప్రతిపాదిత స్థలంలో 2800 మీటర్ల రన్‌వేను నిర్మించాల్సి ఉంది. ఇది తూర్పు-పశ్చిమ దిశలో ఉంటుంది. ఈ రన్‌వేను 10/28 పద్ధతిలో ల్యాండింగ్, టేకాఫ్ రెండింటికీ ఉపయోగపడేలా నిర్మించాలని నిర్ణయించారు. కానీ, రన్‌వేకు ఉద్దేశించిన ప్రాంతానికి కొంత చేరువగా ఎత్తయిన గుట్టలున్నాయి. అవి గాలి వాటాన్ని అడ్డుకోవటం ద్వారా విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌లపై ప్రభావాన్ని చూపుతాయని అథారిటీ తేల్చింది. తొలుత చిన్న విమానాలకు సరిపడే ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించాలని భావించినా, వరంగల్ తరహాలో వేయి ఎకరాల్లో ఎయిర్‌బస్ విమానం దిగగలిగే రన్‌వేతో పెద్ద విమానాశ్రయాన్నే నిర్మించాలని నిర్ణయించారు. కానీ, కొత్తగూడెం ప్రాంతం యావత్తు గుట్టలతో నిండి ఉన్నందున అంత పెద్ద విమానాశ్రయానికి అనువైన స్థలం లభించే విషయంలో ఇప్పుడు అనుమానాలు నెలకొన్నాయి.

కేసీఆర్ విచారణకు హాజరు కావాలి

- ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, పెద్దపల్లి: చట్టాన్ని గౌరవించి మాజీ సీఎం కేసీఆర్ విచారణకు హాజరై.. తన నిజాయితీని నిరూపించుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం శివపల్లిలోని ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో మంగళవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై ప్రశ్నించగా.. చట్టం ముందు అందరూ సమానులేనని మంత్రి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన సమయంలో తనపై అక్రమ కేసులు పెట్టారని, 8 ఏళ్లపాటు కోర్టు విచారణకు హాజరయ్యానని గుర్తు చేశారు. ఇటీవల ఆ అక్రమ కేసులను కోర్టు కొట్టివేసిందన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు ఉన్నారు.

పైసల్లేవని అందాల పోటీలు పెట్టిండు!

- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



మాట్లాడుతున్న హరీశ్‌రావు

నంగునూరు (సిద్దిపేట): కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను చూపిస్తూ వాటి ఎదుట అందాల భామలను ఫొటోలు తీయించడం తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చేసిందేమీ లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణకు కావాల్సింది అందాల పోటీలు కాదని, పూర్వ వైభవం రావాలని యువత ఎదురుచూస్తోందన్నారు. పైసల్లేవని అందాల పోటీలు పెట్టిండని రేవంత్‌పై ధ్వజమెత్తారు. మంగళవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నాగరాజుపల్లిలో జరుగుతున్న ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ కట్టించిన సెక్రటేరియట్, నాగార్జున సాగర్‌లో బౌద్ధ నిలయం, యాదాద్రి, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్, హైదరాబాద్‌లో కేబుల్ బ్రిడ్జి ముందు అందాల భామల ఫొటోలు తీయించారన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేయడంతోపాటు తెలంగాణ ఆడబిడ్డలతో వాళ్ల కాళ్లు కడిగించి ఇజ్జత్ తీశారన్నారు. కేసీఆర్ జాతి గౌరవాన్ని ఆకాశమంత ఎత్తున నిలబెడితే, అప్పు కోసం ఢిల్లీ వెళితే చెప్పులు ఎత్తుకెళ్లేటోని లెక్క చూస్తున్నారంటూ రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ బాహాబాహీ

ధర్మారంలో ఉద్రిక్తం...పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ



కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల తోపులాట

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం బాహాబాహీకి దిగాయి. వివరాల్లోకి వెళితే...వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై ఇరుపార్టీల నేతలు చర్చకు మంగళవారం తేదీని ఖరారు చేశారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద చర్చకు రావాలని బీఆర్ఎస్, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రస్థానం ప్రారంభమైన నందిమేడారంలో చర్చావేదిక ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పిలుపునిచ్చాయి. అయితే పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ ఇరుపార్టీల నాయకులతో మాట్లాడి ప్రెస్‌మీట్లతోనే చర్చ ముగించాలని సూచించగా, ఇరుపార్టీలు సోమవారం రాత్రి అంగీకరించాయి. అయితే బీఆర్ఎస్ నాయకులు మంగళవారం అనూహ్యంగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరారు. ముఖ్య నేతలను పోలీసులు కేడీసీసీబీ వద్ద అడ్డుకున్నారు. మిగతా నాయకులు, కార్యకర్తలు తప్పించుకొని చౌరస్తాకు చేరుకొని రోడ్డుపై బైఠాయించారు. అయితే బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేస్తున్నారనే సమాచారంతో మేడారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. కేడీసీసీబీ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఉండటాన్ని గమనించి అక్కడకు పరుగెత్తుకుంటూ వెళ్లారు. సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు రోడ్డుపై తోపులాటకు దిగాయి. దీంతో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడికి దిగే ప్రయత్నాలు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. చివరకు పోలీసులు ఇరువర్గాల నేతలతో చర్చించి శాంతింపజేశారు. ఆ తర్వాత ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కేంద్ర పథకాలపై రేవంత్ సర్కారు నిర్లక్ష్యం

- తెలంగాణ ప్రభుత్వంపై కఠిన చర్యలు తీసుకోండి
- కేంద్రమంత్రి నిర్మలకు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేంద్ర పథకాలకు కావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకుండా.. పేర్లు మార్చి, పథకాలను నీరుగారుస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వంపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నార్త్ బ్లాక్‌లో నిర్మలా సీతారామన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర పథకాలు అమలు చేయని ప్రభుత్వాల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. అంతకుముందు ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన విలేకరుతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లపై విచారణను నీరుగార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం 21-5-2025

నేడు యాంటీ-టెర్రరిజం డే

ఉన్మాదం తలకెక్కిన ఉగ్రవాదానికి...
ఆమె ధైర్యం... ఉక్కుపాదం.
ఆమె సాహసం... రక్తం రుచి మరిగిన
నరరూప రాక్షసుల పాలిట వజ్రాయుధం.
ఉగ్రవాదం పీచమణచడంలో వివిధ స్థాయిలలో,
విభాగాలలో ఎంతోమంది మహిళా సైనికులు
కీలకపాత్ర పోషిస్తున్నారు...



ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన ఉమన్ ఆఫీసర్ (సిగ్నల్స్ రెజిమెంట్)

ఉగ్రవాదంపై ఉక్కుపాదాలై...

‘ఆపరేషన్ సిందూర్’లో భారత సైన్యంలోని ఉమెన్ ఆఫీసర్‌లు మేల్ ఆఫీసర్‌లతో సరిసాటిగా కాల్పులు, మిస్సైల్ ప్రయోగాలలో తమ సత్తా చాటారు. శత్రువులకు దడ పుట్టించారు. ‘ఆపరేషన్ సిందూర్’లో పాల్గొన్న సిగ్నల్స్ రెజిమెంట్‌కి చెందిన ఒక మహిళా అధికారి (పేరు వెల్లడి చేయలేదు) తన అనుభవాలను పంచుకున్నారు. ఆమె, ఆమె టీమ్ గ్రౌండ్‌లోనే కాకుండా ఎయిర్‌లో కూడా కమ్యూనికేషన్స్‌ని హ్యాండిల్ చేశారు.

‘ఏ యుద్ధంలో అయినా కమ్యూనికేషన్ అనేది చాలా కీలకం. నేను ఈ ఆపరేషన్‌లో భాగం కావడం గర్వంగా ఉంది. మా టాస్క్‌లన్నీ అంకిత భావంతో పూర్తి చేశాం. గ్రౌండ్ మీద లేదా ఎయిర్‌లో కాన్‌ఫ్లిక్ట్‌ని వీడియో గ్రాఫ్ చేయడంలో కమ్యూనికేషన్‌కి సంబంధించిన అన్ని అంశాలనీ చూసుకున్నాం’ అన్నారు.

‘విధి నిర్వహణలో పురుష అధికారులకు, మహిళ ఆఫీసర్‌లకూ తేడా ఉంటుందా?’ అనే ప్రశ్నకు...

‘ఫ్రంట్‌లైన్‌లో స్త్రీలు, పురుషులకు ఒకేరకమైన విధి నిర్వహణ ఉంటుంది. అందరినీ ఒకేరకంగా చూస్తారు. మహిళలుగా మేము ప్రత్యేక సౌకర్యాలని కోరుకోలేదు. ఎందుకంటే మేము దేశం కోసం యుద్ధం చేస్తున్నాం’ అంటారు ఉమన్ ఆఫీసర్.

ఆమె భర్త ఆర్మీలో సిగ్నల్స్ ఆఫీసర్‌గా పనిచేసేవారు

‘ఆపరేషన్ రైనో’ సమయంలో ఆయన అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఉగ్ర దాడిలో మరణించారు.

ఉల్ఫా ఉగ్రవాదుల ఏరివేతకు అస్సాం-అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులలోని దట్టమైన అడవుల్లో ‘ఆపరేషన్ రైనో’ మెరుపుదాడిలా మొదలైంది. ఎన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య ఉగ్రవాదులతో పోరాడడం అంటే ఆషామాషీ విషయం కాదు. ఏ మూల నుంచి అయినా మృత్యువు పొంచి ఉండవచ్చు.

‘ఆపరేషన్ రైనో’కి సంబంధించి ఎన్నో జ్ఞాపకాలు ఆ ఉమన్ ఆఫీసర్ మది నిండా ఉన్నాయి. అయితే ఏ జ్ఞాపకమూ ఆమెను వెనక్కి లాగలేదు. ‘సాధారణ జీవితమే మేలు’ అనుకునేలా చేయలేదు.

భర్తకు సంబంధించిన ప్రతి జ్ఞాపకం... యుద్ధరంగంలో ముందడుగు వేయడానికి అవసరమై శక్తిని ఇచ్చాయి.

‘భారత సైన్యంలోకి రావడానికి స్ఫూర్తినిచ్చింది ఏమిటి?’ అనే ప్రశ్నకు జవాబుగా

‘నా భర్త ఇండియన్ ఆర్మీలో సిగ్నల్స్ కార్ప్స్‌లో పనిచేసేవారు. నా భర్త చేసిన త్యాగమే నన్ను ఆర్మీలో చేరేలా చేసింది’ అని చెప్పారు.

ఆర్మీలో చేరాలనే ఆకాంక్ష ఆమెతోనే ఆగిపోలేదు.

ఆమె కొడుకు కూడా ఆర్మీలో చేరాలనుకుంటున్నాడు.

కొన్ని కుటుంబాల్లో వ్యక్తులు మాత్రమే కనిపిస్తారు.

కొన్ని కుటుంబాల్లో వ్యక్తులు కనిపించరు. దేశం కనిపిస్తుంది... అలాంటి అరుదైన ఒక కుటుంబ ఈ ఉమెన్ ఆఫీసర్‌ది.



‘ఆల్-ఉమెన్ కమాండో’లోని సాహసికులు... చంచల్, సరితా పాండే

ఆల్-ఉమెన్ కమాండో టీమ్

కొత్త సెక్యూరిటీ బ్లూప్రింట్‌లో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో యాంటి టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్)లో తొలిసారిగా ఆల్-ఉమెన్ కమాండో టీమ్ ప్రారంభించారు. 36 మంది ఉమెన్ కమాండోలతో ఈ టీమ్ మొదలైంది. విధానసభ, రాజ్ భవన్, క్రికెట్ స్టేడియం, ముఖ్యమంత్రి నివాసంలాంటి ప్రాంతాల రక్షణకు వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అన్ని రకాల ఆయుధాలను హ్యాండిల్ చేయడంలో శిక్షణ ఇచ్చారు. ఇజ్రాయెల్ అన్‌ఆర్మ్‌డ్ కంబాట్ టెక్నిక్‌లో కూడా తర్ఫీదు ఇచ్చారు.

ఆల్-ఉమెన్ కమాండో టీమ్‌కు ఎంపికైన వారిలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని చిన్న పట్టణమైన బులంద్‌షహర్‌కు చెందిన చంచల్ తెవోటియా యాంటి-టెర్రరిస్ట్ స్క్వాడ్‌లో అత్యంత పిన్న వయస్కురాలు. తక్కువగా మాట్లాడే ఈ అమ్మాయి మాక్ డ్రిల్‌లో సత్తా చాటింది.



యాంటీ టెర్రర్ ఫోర్స్-గరుడ

గరుడ-యాంటీ టెర్రర్ ఫోర్స్

‘గరుడ’ అనేది కర్ణాటక రాష్ట్ర యాంటీ-టెర్రర్ ఫోర్స్. ఈ స్పెషల్ ఆపరేషనల్ టీమ్‌లో కర్ణాటకలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన పదహారు మంది యువతులు ఉన్నారు. వీరికి ఉగ్రవాదులను ఎదుర్కోవడంలో, ఆయుధాలు చేపట్టడంలో శిక్షణ ఇచ్చారు. పోలీసర్ ఆఫీసర్ మధుర వీణ ఆధ్వర్యంలో ఈ ఫోర్స్ పనిచేస్తుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ ప్రధానంగా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. పోలీసు ఉన్నతాధికారుల మాటల్లో చెప్పాలంటే... ఇది సాధారణమైన ట్రెనింగ్ కాదు. ట్రెనింగ్ పూర్తి చేసిన తరువాత ఒక ఉమెన్ కమాండో ఆయుధాలతో ఉన్న ముగ్గురు నలుగురితో పోరాడే శక్తిని కలిగి ఉంటారు.



* మే 21 ఇంటర్నేషనల్ టీ డే

రోజులో తేనీటి ప్రాముఖ్యత ఎంతటిదో మనకు తెలిసిందే. అంతటి ముఖ్యమైన టీ వ్యాపార ప్రపంచంలోనూ తమ సత్తా చాటుతున్నారు భారతీయ మహిళలు. ఇంటర్నేషనల్ టీ డే సందర్భంగా వారి ప్రయాణ విజయాలు...

భారతదేశ తేయాకు పరిశ్రమలో 50 శాతానికి పైగా పైగా మహిళలు ఉన్నట్టు నివేదికలు చూపుతున్నాయి. టీ ఎస్టేట్ నిర్వహణలోనూ, ఎగ్జిక్యూటివ్ పదవుల్లోనూ గణనీయమైన సంఖ్యలో మహిళలు ఉన్నారు. తేనీటి పరిశ్రమల్లోనూ మహిళల పాత్ర పెరుగుతున్నట్లు నవతరమూ తన విజయాల ద్వారా నిరూపిస్తోంది. ఇక తేయాకు తోటలలో కార్మికులుగా మహిళల శాతమే ఎక్కువ. సవాళ్లను అధిగమించడానికి, విజయవంతమైన వ్యాపార నిర్వహణలో సానుకూల మార్పును సృష్టించేలా తేనీటి రంగంలో ఈ మహిళలు తమ సామర్థ్యాన్ని చూపుతున్నారు.

కెఫిన్ లేని టీ



ఇండియాలో మొట్టమొదటి సర్టిఫైడ్ టీ సామెలియర్‌గా స్నిగ్ధ మంచంద తన పేరును సుస్థిరం చేసుకుంది. ముంబై వాసి అయిన స్నిగ్ధ ‘టీ ట్రంక్’ కంపెనీ ద్వారా 2000 వేల రకాల టీ స్పెషల్స్‌ను అందిస్తోంది.

‘టీ వ్యాపారం గురించి ప్రొఫెషనల్‌గా తెలుసుకోవాలనుకున్నప్పుడు ఇక్కడ ఏ విద్యాసంస్థా నాకు కనిపించలేదు. దీంతో భారతదేశంలో టీ స్కూల్‌ను ప్రారంభించాలనుకున్నాను. 2013లో కేవలం ఆరు టీ మిశ్రమాలతో టీ ట్రంక్‌ను ప్రారంభించాను. వాటి తయారీలో పరిపూర్ణత సాధించడానికి రెండేళ్ల సమయం పట్టింది. ప్రారంభ దశలో లిస్టింగ్, పంపిణీదారుల వైఖరి చాలా కష్టంగా ఉండేది. దీంతో దృష్టిని ఈ-కామర్స్ వైపు మళ్లించి, నేరుగా టీ ప్రియుల వద్దకు చేరుకున్నాను. సీజన్‌కు తగినట్టు టీలను మార్చుకోవాలని ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తాను. వేసవిలో శరీరానికి చల్లదనాన్నిచ్చే హై బిస్కస్ గ్రీన్ టీ బాగుంటుంది. మందార పూల రేకలతో టీ సాంత్వనను ఇస్తుంది. కాలానికి తగినట్టు టీ తయారీ స్పెషల్స్ మా వద్ద లభిస్తాయి. వీటిలో ఎలాంటి కెఫిన్ ఉండదు.

– స్నిగ్ధ మంచంద, టీ ట్రంక్

తయారీలో సమయం తెలియదు

తండ్రి నుంచి టీ కంపెనీని తీసుకొని, ఆనందిని పేరుతో విజయవంతంగా నడుపుతోంది డార్జిలింగ్ వాసి అనామికా సింగ్. ‘ఒక కప్పు టీ కోసం ఉదయకాంతితో పాటు పోటీ పడుతూ 30 ఏళ్లగా పనిచేస్తున్నాను. 2014లో ‘ఆనందిని’ బ్రాండ్‌ని సృష్టించాను. ఇది కచ్చితంగా పురుషాధిక్య పరిశ్రమ. ప్రతి రంగంలో మహిళ తల చుట్టూ ఒక గాజు సీలింగ్ ఉంటుంది. దానిని అధిగమిస్తేనే అనుకున్నది సాధిస్తాం. పారదర్శకంగా ఉండటం, మూలంపై దృష్టి పెట్టడం మా సక్సెస్ మంత్ర. టీ మిశ్రమాలకు జోడించే పదార్థాలలో పువ్వులు, సుగంధ ద్రవ్యాలు, మూలికలు ఉంటాయి. కానీ, కృత్రిమ రుచులు ఉండవు. నాకు ఇష్టమైనవి ఫిర్దౌస్, గోల్డెన్ నీడిల్, ఫైన్‌వుడ్ స్మోక్ టీ లు. కొత్త రుచుల టీ తయారీల కోసం గంటల తరబడి పనిచేస్తాను. సమయం గురించి కూడా ఆలోచించను.’



– అనామికా సింగ్, ఆనందిని హిమాలయ టీ

ఇమ్యూనిటీలు



‘చాయ్ డైరీస్’ పేరుతో తన లైఫ్ డైరీని కొత్తగా ఆవిష్కరించింది అమీ భన్సాలీ. న్యూయార్క్ బిజినెస్ స్కూల్‌లో బిజినెస్ కోర్సు చేస్తున్నప్పుడు చాయ్ కేఫ్‌ను ప్రారంభించాలనుకుంది అమీ. ‘మేనేజ్‌మెంట్, కస్టమ్స్, షిప్పింగ్, అమ్మకాల డేటా వంటివి... ఇందులో ప్రతిదీ నేర్చుకోవాల్సి వచ్చింది. 2011లో ఇండియాలో 2013లో అమెరికాలో ఎటువంటి బ్యాకప్ లేకుండా చాయ్ డైరీస్ ప్రారంభించాను. కుటుంబం నుంచి, బయటి నుంచి ఎలాంటి పెట్టుబడి సహకారమూ లేదు. అప్పు చేసి మరీ ఈ వ్యాపారంలోకి దిగాను. అనుకున్నది సాధించగలిగాను. ఇప్పుడు మా దగ్గర తులసి గ్రీన్, మోరింగా వంటి రోగనిరోధక శక్తిని పెంచే టీలు కూడా ఉన్నాయి. కోవిడ్ టైమ్‌లో పిల్లలకు పాలిచ్చే తల్లుల కోసం ‘మామా’ అనే టీ ని సృష్టించాను. ఆర్గానిక్ బాంబే మసాలా టీ లో పాలు, చక్కెర లేకున్నా రుచికరంగా ఉంటుంది. కాక్‌టెయిల్, ఐస్డ్ టీ వంటివి సలాడ్ డ్రెస్సింగ్‌గా కూడా ఉపయోగించవచ్చు.’

– అమీ భన్సాలీ, చాయ్ డైరీస్

కచ్చితమైన సమయపాలన


లండన్‌లో ఒక గ్లోబల్ అడ్వైజరీ సంస్థలో లక్షల్లో జీతం వచ్చే కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి 2016లో ఆసమ్ టీ పేరుతో బెంగళూరులో టీ వ్యాపార ప్రారంభించి రాణిస్తోంది మయూర రావు. ‘ఉదయం 5 గంటలకు ముందే నా రోజు ప్రారంభం అవుతుంది. ఒక కప్పు వేడి తేనీటితో మొదలయ్యే ప్రయాణంలో అన్నింటినీ అర్థం చేసుకుంటూ ముందుకు వెళ్లడమే. బృందాన్ని సమీక్షించడం, టీ తయారీపై దృష్టి పెట్టడం, ఈ-కామర్స్, డిస్ట్రిబ్యూషన్ ప్రతిదీ కీలకమే. మేం మా వృద్ధిని గడిచిన 12 వారాల రన్‌రేట్‌ను పరిశీలించి తెలుసుకుంటాం. ప్రస్తుతం 4 గిడ్డంగులను నిర్వహిస్తున్నాం. ఆర్డర్ ప్రకారం ప్రతి కస్టమర్‌కి సకాలంలో డెలివరీ చేస్తాం. కచ్చితమైన సమయపాలన మా విజయానికి పునాది.



– మయూర రావు, ఆసమ్ టీ

ఇంటిప్స్

- మూతలేని బాక్స్‌లో బేకింగ్ సోడా ఫ్రిజ్ షెల్ఫ్‌లో పెట్టండి. ఆహార పదార్థాల వల్ల ఫ్రిజ్‌లో దుర్వాసన రాకుండా ఉంటుంది.
- కప్పు బోరిక్ పౌడర్, ఒక కప్పు పంచదార, ఒక కప్పు పిండి, ఒక కప్పు పాలు కలిపి చపాతీ పిండిలా కలపాలి. దీన్ని చిన్న చిన్న బాల్స్‌లాగా చేసి కిచెన్ మూలల్లో పెట్టాలి. బొద్దింకలు, చీమలు, పురుగులు చేరవు.
- పెరుగు గట్టిగా ఉండాలంటే పాలను తోడు పెట్టేటప్పుడు కొద్దిగా కార్న్‌ఫ్లోర్ కలపాలి.
- టీలో చిటికెడు మిరియాల పొడి వేసుకుని తాగితే గొంతు నొప్పి, గరగర నుంచి ఉపశమనం లభిస్తుంది.



బ్యూటిప్

మసాజ్‌లు చేయిస్తున్నప్పటికీ వయసు,వాతావరణ ప్రభావం వల్ల అప్పుడప్పుడూచర్మం నిర్జీవంగా మారుతున్నట్టుగా అనిపిస్తుంది. ఇలాంటప్పుడు ఆలివ్ ఆయిల్‌లోకొన్ని చుక్కల నిమ్మరసం కలిపి ముఖానికి,చేతులకు, కాళ్లకు రాసుకోవాలి. మునివేళ్లతోవలయాకారంగా రుద్దతూ మసాజ్ చేయాలి.దీనివల్ల రక్తప్రసరణ పెరిగి, చర్మానికి తగినంత తేమ అందుతుంది. చర్మం జీవం లేనట్టుగా కనిపిస్తున్న రోజుల్లో పౌడర్లను ఉపయోగించకపోవడమే మంచిది.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) 20న ముగింపు రూ.లలో



హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	95,610
బంగారం (22 క్యారెట్లు)	88,060
వెండి	98,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	95,090
బంగారం (22 క్యారెట్లు)	87,166
వెండి	97,050
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	95,020
బంగారం (22 క్యారెట్లు)	87,100
వెండి	1,08,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	96,220
బంగారం (22 క్యారెట్లు)	89,710
వెండి	97,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	94,900
బంగారం (22 క్యారెట్లు)	87,350
వెండి	97,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	95,010
బంగారం (22 క్యారెట్లు)	87,100
వెండి	1,09,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

లీగల్

ఆ వివాహం ఇక్కడా చెల్లుతుంది

నేను పోలాండ్ లో నివసిస్తున్న భారతీయుడిని. ఇటలీలో ఉంటున్న మరొక భారతీయ మహిళను అక్కడే పెళ్లి చేసుకున్నాను. మా మతాలు వేరు. తనకోసం ఇక్కడ వీసా దరఖాస్తు చేస్తుండగా ఇటలీలో పొందిన మ్యారేజ్ సర్టిఫికెట్ భారతదేశంలో కూడా చెల్లుతుంది అని భారతదేశ ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు లేదా కోర్టు ఆర్డరు ఏవైనా ఉంటే తేవాలి అని సూచించారు. మేము ఇంకా భారతదేశ పౌరులమే కాబట్టి ఈ ధ్రువీకరణ తప్పనిసరి అని చెప్పారు. మా పెళ్లి భారత దేశంలో చెల్లుతుందా? లేక అక్కడికి వచ్చి ఇంకొకసారి పెళ్లి చేసుకోవాలా? సరైన సలహా ఇవ్వగలరు.

– భరద్వాజ్, పోలాండ్

విదేశాలలో ఉంటున్న భారతీయులు పెళ్లి చేసుకుంటే (లేదా పెళ్లి చేసుకోబోతున్న వారిలో కనీసం ఒకరు భారతీయులు అయి ఉంటే) ఆ వివాహం భారతదేశంలో కూడా ‘ది ఫారిన్ మ్యారేజ్ యాక్ట్, 1969 ప్రకారం చట్టబద్ధమే. అయితే మీరు అదే విధమైన పెళ్లి భారతదేశంలో చేసుకుని ఉంటే ఆ పెళ్లికి ‘స్పెషల్ మ్యారేజ్ యాక్ట్’ నిబంధనలు అన్నీ వర్తిస్తాయి. ఉదాహరణకు

(1) మీకు ఇదివరకే పెళ్లి అయ్యి మీ భార్య/భర్త జీవిస్తూ (విడాకులు లేకుండా) ఉండకూడదు.

(2) మీరు ఉంటున్న దేశంలో కూడా మీ పెళ్లి చట్టబద్ధమైనది అయి ఉండాలి

(3) మీరు పెళ్లి చేసుకున్న దేశంలోని అధికారులు మీ వివాహ ధ్రువీకరణ పత్రాన్ని అపాస్టిల్ చేయాలి.

ఇటలీ దేశం కూడా భారతదేశంతో పాటు హేగ్ కన్వెన్షన్ ఒప్పందం లో సంతకం చేసింది కాబట్టి, మీ వీసా దరఖాస్తుకు – భారత దేశంలో ఎవిడెన్స్ ఇవ్వడానికి కూడా అపాస్టిల్ చేసిన ఆ దేశ వివాహ ధ్రువీకరణ పత్రం చట్టబద్ధమైనదే!

అలాంటి వివాహాలను రిజిస్టర్ చేయడానికి మీరు పెళ్లి చేసుకున్న దేశంలో ఉన్న ఇండియన్ ఎంబసీ వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ప్రతి ఇండియన్ ఎంబసీ లో కూడా వివాహాలను రిజిస్టర్ చేయడానికి ఒక ఆఫీసర్ ఉంటారు. ఇటలీలో మీరు పొందిన సర్టిఫికెట్ తీసుకొని ఫారిన్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం అవసరమైన అప్లికేషన్ నింపి దరఖాస్తు చేసుకోండి. మీ దంపతులు – సాక్షులు కూడా వ్యక్తిగతంగా వెళ్ళాల్సి ఉంటుంది. ఇండియన్ ఎంబసీ వారు ఇచ్చిన ధ్రువీకరణ పత్రం మీకు సరిపోతుంది.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



పజిల్స్ చేద్దామా?

పరీక్షల్లో మీ మార్కులు బెస్ట్‌గా వచ్చే ఉంటాయి. అయితే పజిల్స్ చేయడంలో తెలుస్తుంది అసలైన చురుకుదనం. ఈ పజిల్స్‌ను స్పీడ్‌గాచేయగలరా? అసలు పజిల్స్ ఎందుకు చేయాలో తెలుసా?



పిల్లలూ.. పజిల్స్ మన మెదడుకు మేత పెడతాయి. వీటికి సమయం కేటాయించడం వల్ల మీ ఏకాగ్రత, ఓర్పు పెరగడంతోపాటు కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. పజిల్స్‌లో ఎన్ని రకాలున్నాయో, వాటివల్ల ఉపయోగాలేమిటో చూద్దామా?

పద వినోదం: దీనినే గళ్ల నుడికట్టు అని కూడా అంటారు. ఇది పదాలతో ఆడే సరదా ఆట. ఇది భాష మీద పట్టును పెంచుతుంది. దినపత్రికల్లో తెలుగు, ఇంగ్లిషుల్లో మీకు ఇవి కనిపిస్తూ ఉంటాయి. ఖాళీ గళ్లలో పదాలు నింపే ప్రక్రియ ఇది. అందుకోసం పక్కనే మీకు కొన్ని క్లూస్ ఇస్తారు. వీటి వల్ల కొత్త కొత్త పదాలు, వాటి అర్థాలు తెలుస్తాయి.



సుడోకు: ఇది జపాన్ దేశంలో పుట్టిన పజిల్. నిలువు తొమ్మిది, అడ్డం తొమ్మిది చొప్పున మొత్తం 81 గడులు ఉంటే సుడోకులో కొన్ని గడుల్లో అంకెలు వేసి ఉంటాయి. మిగిలిన వాటిని మనం పూర్తి చేయాలి. అయితే అడ్డంగా, నిలువుగా, తొమ్మిది గడులలో ఒకసారి వేసిన అంకె మరోసారి వేయకూడదు. సుడోకు పూర్తి చేయాలంటే చాలా ఏకాగ్రత అవసరం. పైగా సుడోకు పూర్తి చేయడం వల్ల అంకెల మీద ఇష్టం ఏర్పడుతుంది. లెక్కలంటే భయం ఉన్న పిల్లలు సుడోకు చేయడం వల్ల లెక్కల మీదున్న భయం పోతుంది.





జిగ్‌సా: ప్రపంచవ్యాప్తంగా చాలా పాపులర్ అయిన పజిల్ ఇది. 1760లో దీన్ని కనిపెట్టారు. ఒక అట్ట ముక్కపై ఓ ఆకారాన్ని గీసి, ఆపైన దాన్ని రకరకాలుగా ఆకృతులుగా కత్తిరిస్తారు. మనం ఆ కత్తిరించిన ముక్కల్ని కలిపి ఆ ఆకారాన్ని తిరిగి తీసుకురావాలి. ఇది ఒకరికంటే ఎక్కువమంది కూడా ఆడొచ్చు. ఆడుతున్నంతసేపూ ఏకాగ్రత చాలా అవసరం. మార్కెట్లో అనేక జిగ్‌సా పజిల్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని మీరు కొని ఆడుకోవచ్చు.

కొత్తగా ఆలోచించు (Lateral Thinking): ఇవి మనందరికీ తెలిసిన పజిల్స్. రకరకాల ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోవడమే ఇందులో కీలకం. ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోవడంలో భలే సరదాగా ఉంటుంది. పొడుపు కథలు, ప్రాచీన గాథలు, పదాలతో చేసే చిక్కుప్రశ్నలు వీటిలో కీలకం అవుతాయి. ఈ ప్రశ్నల కోసం మార్కెట్లో ప్రత్యేకమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ‘ఫలానా సందర్భంలో మీరైతే ఏం చేస్తారు? ఫలానా అంశం ఇలాగే ఎందుకు జరుగుతుంది?’ అంటూ ప్రశ్నలు వేసి పిల్లల చేత సమాధానాలు రాబట్టడం ఇందులో ముఖ్యమైన విషయం.



లెక్కల పజిల్స్: ఇది మనందరికీ తెలిసినవే. లెక్కలతో తయారైన పజిల్స్. వీటిని పూర్తి చేయడం వల్ల గణితశాస్త్రంలోని పలు అంశాలపై అవగాహన పెరుగుతుంది. కూడికలు, తీసివేతలు, గుణించడం, భాగించడం వంటి అంశాలతో కూడిన ప్రశ్నలు వేసి వాటికి సమాధానాలు పిల్లల చేత రాబడతారు. సరదాగా సాగుతూ పిల్లలకు లెక్కల మీద అవగాహన పెంచడం వీటిలో కీలకం.



సుమిత్ నగాల్ శుభారంభం

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. పారిస్‌లో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 170వ ర్యాంకర్ సుమిత్ 6-1, 6-1తో ప్రపంచ 141వ ర్యాంకర్ మిచెల్ క్రుగెర్ (అమెరికా)పై గెలుపొందాడు. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ఒక ఏస్ సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. సుమిత్ నెగ్గిన మొత్తం 59 పాయింట్లలో 22 విన్నర్స్ ఉన్నాయి. 14 అనవసర తప్పిదాలు చేసిన సుమిత్ నెట్ వద్దకు 10 సార్లు దూసుకొచ్చి ఎనిమిది సార్లు పాయింట్లు గెలిచాడు. రెండో రౌండ్‌లో ప్రపంచ 225వ ర్యాంకర్ జురిజ్ రొడియోనోవ్ (ఆస్ట్రియా)తో సుమిత్ తలపడతాడు. 27 ఏళ్ల సుమిత్ తన కెరీర్‌లో ఎనిమిదిసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడు సార్లు, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో ఒక్కోసారి, యూఎస్ ఓపెన్‌లో మూడుసార్లు అతను మెయిన్ 'డ్రా'లో పోటీపడ్డాడు. 2020 యూఎస్ ఓపెన్‌లో, 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరడం సుమిత్ గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనగా ఉంది.



అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్

ముల్లాన్‌పూర్‌లో రెండు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు ● కోల్‌కతా, హైదరాబాద్ ప్రేక్షకులకు నిరాశ

న్యూఢిల్లీ: ఐపీఎల్ 18వ సీజన్ తుదిపోరుకు అహ్మదాబాద్ వేదిక కానుంది. నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియంలో జూన్ 3న ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఒక ప్రకటనలో తెలిపింది. రెండో క్వాలిఫయర్ పోరు కూడా అహ్మదాబాద్‌లోనే (జూన్ 1న) జరుగుతుంది. నిజానికి ఈ రెండు మ్యాచ్‌లు గత విజేత కోల్‌కతా నైట్ రైడర్స్ కావడంతో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో జరగాలి. అయితే భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలతో లీగ్‌ను వారం వాయిదా వేశారు. సవరించిన షెడ్యూల్ సమయంలో కోల్‌కతా, హైదరాబాద్‌లో వర్షాలు ఉంటాయనే సమాచారంతో ఈ రెండు నగరాల్లో జరగాల్సిన 'ప్లే ఆఫ్స్' మ్యాచ్‌లను అహ్మదాబాద్, ముల్లాన్‌పూర్ (న్యూ చండీగఢ్) తరలించారు. 2022, 2023 ఐపీఎల్ ఫైనల్స్ అహ్మదాబాద్‌లోనే జరిగాయి. ఇక ముందనుకున్న షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో జరగాల్సిన తొలి క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్‌లను ముల్లాన్‌పూర్‌లో నిర్వహిస్తారు. ఈ నెల 29న తొలి క్వాలిఫయర్, 30న ఎలిమినేటర్ మ్యాచ్ ముల్లాన్‌పూర్‌లో జరుగుతాయి. దీంతో ఈ సీజన్‌లో కోహ్లి మ్యాచ్‌ను క్వాలిఫయర్ రూపంలో అయినా హైదరాబాద్‌లో చూడాలనుకున్న ప్రేక్షకులకు నిరాశే మిగిలింది. రొటేషన్‌లో భాగంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో సన్‌రైజర్స్ హైదరాబాద్ హోం మ్యాచ్‌కు ఈసారి అవకాశం లేకుండా పోయింది. అయితే ఈ సీజన్‌లో ఆర్సీబీ ఆరంభం నుంచి అదరగొట్టడంతో ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. దీంతో టాప్-2 జట్ల మధ్య తొలి క్వాలిఫయర్... 3-4వ స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఎలిమినేటర్... ఈ రెండింటిలో ఏదైనా ఒక మ్యాచ్‌లోనైనా కోహ్లి మెరుపులు చూడాలనుకున్న హైదరాబాద్ ప్రేక్షకులు ఇప్పుడు మరో సీజన్ దాకా నిరీక్షించక తప్పదు. ఈ నెల 23న బెంగళూరు, సన్‌రైజర్స్‌ల మధ్య బెంగళూరు వేదికగా జరగాల్సిన లీగ్ మ్యాచ్‌ను లక్నోకు మార్చారు. 23న బెంగళూరులో భారీ వర్ష సూచన ఉండటంతో మ్యాచ్‌ను లక్నోకు తరలించినట్లు బీసీసీఐ తెలిపింది. ఇప్పటికే చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన చివరి మ్యాచ్ వర్షంతో తుడిచిపెట్టుకుపోయింది. ఐపీఎల్ పునఃప్రారంభమైన 17న బెంగళూరు, కోల్‌కతా నైట్‌రైడర్స్‌ల మధ్య మ్యాచ్ వర్షార్పణమైంది.

ఐపీఎల్ 'ప్లే ఆఫ్స్' షెడ్యూల్

మే 29	క్వాలిఫయర్-1	ముల్లాన్‌పూర్
మే 30	ఎలిమినేటర్	ముల్లాన్‌పూర్
జూన్ 1	క్వాలిఫయర్-2	అహ్మదాబాద్
జూన్ 3	ఫైనల్	అహ్మదాబాద్

వైభవ్ వీరవిహారం

33 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 57 ● తమ చివరి మ్యాచ్‌లో నెగ్గిన రాజస్తాన్ రాయల్స్ ● చెన్నై ఖాతాలో పదో పరాజయం



వైభవ్

న్యూఢిల్లీ: ఐపీఎల్ 18వ సీజన్‌లో తమ ఆఖరి మ్యాచ్ ఆడేసిన రాజస్తాన్ రాయల్స్ విజయంతో ముగించింది. మంగళవారం జరిగిన పోరులో రాయల్స్ ఆరు వికెట్ల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై గెలుపొందింది. ధోని జట్టుకిది పదో పరాజయం కావడం గమనార్హం. మొదట చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. ఆయుశ్ మాత్రే (20 బంతుల్లో 43; 8 ఫోర్లు, 1 సిక్స్), బ్రెవిస్ (25 బంతుల్లో 42; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆకాశ్ మధ్వాల్, యుధ్‌వీర్ చెరో 3 వికెట్లు తీశారు. తర్వాత రాజస్తాన్ 17.1 ఓవర్లలో 4 వికెట్లకు 188 పరుగులు చేసి గెలిచింది. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 57; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మరోసారి మెరిపించాడు. కెప్టెన్ సంజూ సామ్సన్ (31 బంతుల్లో 41; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడాడు.

ఆరంభంలో కుదేలైనా...

చెన్నై ఆరంభంలోనే కాన్వే (10), ఉర్విల్ పటేల్ (0) వికెట్లను కోల్పోయింది. మరో ఓపెనర్ ఆయుశ్ మాత్రే బౌండరీలతో అలరించాడు. పవర్‌ప్లేలో జట్టు పుంజుకుంటున్న తరుణంలో... ఆయుశ్ దూకుడుకు తుషార్ చెక్ పెట్టాడు. స్వల్ప వ్యవధిలో అశ్విన్ (13), జడేజా (1) వికెట్లను కోల్పోయిన చెన్నై 78/5 స్కోరు వద్ద కష్టాల్లో పడింది. ఈ దశలో బ్రెవిస్, శివమ్ దూబే (32 బంతుల్లో 39; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. లక్ష్య ఛేదనలో మొదట యశస్వి జైస్వాల్ (19 బంతుల్లో 36; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే దంచేశాడు. అతను అవుటైనప్పుడు జట్టు స్కోరు 37/1. అందులో 36 జైస్వాల్‌వే! సామ్సన్ వచ్చాకే వైభవ్ బ్యాట్‌కు పనిచెప్పాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడి 27 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అయితే అశ్విన్ ఒకే ఓవర్లో సామ్సన్, వైభవ్‌లను అవుట్ చేశాడు. పరాగ్ (3)ను నూర్ అహ్మద్ బౌల్డ్ కొట్టించాడు. అయితే చెన్నై పట్టుబిగించకుండా జురేల్ (12 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేయడంతో ఇంకా 2.5 ఓవర్లు మిగిలుండగానే రాజస్తాన్ గెలిచింది.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: ఆయుశ్ (సి) మఫాక (బి) తుషార్ 43; కాన్వే (సి) పరాగ్ (బి) యుధ్‌వీర్ 10; ఉర్విల్ (సి) మఫాక (బి) యుధ్‌వీర్ 0; అశ్విన్ (సి) హెట్‌మైర్ (బి) హసరంగ 13; జడేజా (సి) జురేల్ (బి) యుధ్‌వీర్ 1; బ్రెవిస్ (బి) ఆకాశ్ 42; దూబే (సి) జైస్వాల్ (బి) ఆకాశ్ 39; ధోని (సి) తుషార్ (బి) ఆకాశ్ 16; అన్షుల్ (నాటౌట్) 5; నూర్ అహ్మద్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1-12, 2-12, 3-68, 4-70, 5-78, 6-137, 7-180, 8-185. **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-33-1, యుధ్‌వీర్ సింగ్ 4-0-47-3, క్వెన మఫాక 2-0-22-0, హసరంగ 4-0-27-1, పరాగ్ 2-0-26-0, ఆకాశ్ మధ్వాల్ 4-0-29-3. **రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** జైస్వాల్ (బి) అన్షుల్ 36; వైభవ్ (సి) జడేజా (బి) అశ్విన్ 57; సామ్సన్ (సి) బ్రెవిస్ (బి) అశ్విన్ 41; పరాగ్ (బి) నూర్ అహ్మద్ 3; జురేల్ (నాటౌట్) 31; హెట్‌మైర్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (17.1 ఓవర్లలో 4 వికెట్లకు) 188. వికెట్ల పతనం:** 1-37, 2-135, 3-138, 4-158. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-0-35-0, అన్షుల్ 3-0-21-1, అశ్విన్ 4-0-41-2, నూర్ అహ్మద్ 3-0-42-1, పతిరణ 2.1-0-22-0, రవీంద్ర జడేజా 2-0-27-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	12	6	5	1	13	0.260
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లక్నో	12	5	7	0	10	-0.506
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్తాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై × ఢిల్లీ
వేదిక: ముంబై

రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

లక్నో స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీపై ఒక మ్యాచ్ నిషేధం



లక్నో: లక్నో సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ సింగ్ రాఠీపై ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటు పడింది. సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ సందర్భంగా ఓపెనర్ అభిషేక్ శర్మ, దిగ్వేశ్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సీజన్‌లో లక్నో స్పిన్నర్ మళ్లీ పరిధి దాటడంతో ఒక మ్యాచ్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. అయితే సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. అతని మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత పెట్టడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. అసలేం జరిగిందంటే... లక్ష్యఛేదనకు దిగిన సన్‌రైజర్స్ ఓపెనర్లలో అభిషేక్... పవర్‌ప్లేలో భారీషాట్లతో విరుచుకుపడ్డాడు. జోరుమీదున్న అతన్ని తన రెండో ఓవర్ (ఇన్నింగ్స్ 8వ)లో దిగ్వేశ్ అవుట్ చేసి ఎప్పట్లాగే నోట్‌బుక్ సంబరాలు చేసుకున్నాడు. ఈ సమయంలో క్రీజు నుంచి నిష్క్రమిస్తున్న అభిషేక్ అతన్ని చూసి ఏదో అన్నాడు. వెంటనే రాఠీ అతనివైపు దూసుకొచ్చి వాగ్వావాదానికి దిగాడు. వెంటనే ఫీల్డ్ అంపైర్లు కల్పించుకోవడంతో ఈ జగడం అక్కడితోనే ఆగిపోయింది. అయితే ఈ సీజన్‌లో దిగ్వేశ్ రాఠి పరిధి దాటడం ఇది మూడోసారి! ఈ నేపథ్యంలోనే అతనిపై మ్యాచ్ నిషేధం పడింది. 'ఐపీఎల్ ప్రవర్తన నియమావళిని అతిక్రమించిన లక్నో స్పిన్నర్ దిగ్వేశ్ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించాం. ఈ ఒక్క సీజన్‌లోనే నియమావళిలోని 'లెవెల్ 1'ను మూడోసారి అతిక్రమించడంతో 2 డీమెరిట్ పాయింట్లు కూడా విధించాం. ఇదివరకే అతని ఖాతాలో 3 డీమెరిట్ పాయింట్లు ఉండటంతో మొత్తం 5 డీమెరిట్‌ల కారణంగా ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటు వేశాం' అని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఏప్రిల్ 1న పంజాబ్ కింగ్స్‌తో, 4న ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌ల్లోనూ దిగ్వేశ్ ఇలాగే అతి సంబరాలతో డీమెరిట్ పాయింట్లకు గురయ్యాడు.

సాక్షి సినిమా



● ఎన్టీఆర్, హృతిక్ రోషన్

గెట్ రెడీ ఫర్ వార్

'నా కళ్లు నిన్ను ఎప్పటి నుంచో వెంటాడుతూనే ఉన్నాయి కబీర్ (హృతిక్ రోషన్ పాత్రపేరు) అనే ఎన్టీఆర్ డైలాగ్‌తో 'వార్ 2' టీజర్ ప్రారంభమైంది. హృతిక్ రోషన్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ద్వారా ఎన్టీఆర్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఇదిలా ఉంటే... మంగళవారం(మే 20) ఎన్టీఆర్ పుట్టినరోజు. ఎన్టీఆర్ బర్త్ డేకి బహుమతి ఇస్తానని హృతిక్ రోషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా 'వార్ 2' హిందీ, తెలుగు, తమిళ టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. 'ఇండియాస్ బెస్ట్ సోల్జర్, రా లో బెస్ట్ ఏజెంట్.. నువ్వే.. కానీ ఇప్పుడు కాదు..', 'నీకు నా గురించి తెలీదు.. ఇప్పుడు తెలుసుకుంటావ్.. గెట్ రెడీ ఫర్ వార్' అంటూ ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. టీజర్‌లో హృతిక్ రోషన్ కనిపించినప్పటికీ ఆయన నుంచి ఒక్క డైలాగ్ కూడా లేకపోవడం విశేషం. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ ఫ్రాంచైజీలో 'వార్ 2' ఆరవ చిత్రంగా రాబోతోంది.



● 'రక్షక్'లో మంచు మనోజ్

నిజం దాగదు

పోలీసాఫీసర్‌గా మంచు మనోజ్ అతి త్వరలో చార్జ్ తీసుకోనున్నారు. మంచు మనోజ్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'రక్షక్' అనే టైటిల్ ఖరారైంది. ఈ సినిమాతో నవీన్ కొల్లి దర్శకుడిగా పరిచయం కానున్నారు. శ్రీనిధి క్రియేషన్స్ ఈ సినిమాను నిర్మించనుంది. మంగళవారం(మే 20) మంచు మనోజ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'రక్షక్' సినిమాని ప్రకటించారు మేకర్స్. 'ది హిడెన్ ట్రూత్ ఈజ్ నెవర్ హిడెన్ ఫరెవర్' (దాచిన నిజం శాశ్వతంగా దాగి ఉండదు) అనే ట్యాగ్ లైన్ 'రక్షక్' పోస్టర్‌పై ఉంది. ''గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేషన్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందనున్న చిత్రమిది. ప్రేక్షకులకు ఎడ్జ్ ఆఫ్ ది సీట్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించబోతోంది. త్వరలో ఈ సినిమాకు చెందిన ఇతర వివరాలను వెల్లడిస్తాం'' అని మేకర్స్ తెలిపారు.

కాన్స్‌లో భారతీయత

రెడ్ కార్పెట్‌పై షర్మిలా ఠాగూర్, సిమి గరేవాల్

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినీ నటీనటుల సందడి మొదలైంది. సత్యజిత్ రే దర్శకత్వంలో సౌమిత్రా ఛటర్జీ, శుభేందు ఛటర్జీ, సమిత్ బంజా, అపర్ణా సేన్, షర్మిలా ఠాగూర్, సిమి గరేవాల్ ప్రధాన పాత్రల్లో నటించిన బెంగాలీ చిత్రం 'అరణ్యేర్ దిన్ రాత్రి' (ఇంగ్లిష్‌లో 'డేస్ అండ్ నైట్స్ ఇన్ ది ఫారెస్ట్'). 1970లో విడుదలైన ఈ సినిమాను ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కాన్స్ క్లాసిక్స్' విభాగంలో ప్రదర్శించారు. ది ఫిల్మ్ ఫౌండేషన్స్ వరల్డ్ సినిమా ప్రాజెక్ట్, ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, గోల్డెన్ గ్లోబ్ ఫౌండేషన్ సంస్థల నేతృత్వంలో 'అరణ్యేర్ దిన్ రాత్రి' సినిమా 4కె వెర్షన్ రీ స్టోర్ చేయబడింది. ఈ వెర్షన్ చేసిన తర్వాత తొలిసారి కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాను ప్రదర్శించారు. ఈ షోకి షర్మిలా ఠాగూర్, సిమి గరేవాల్‌తో పాటుగా ఈ సినిమాని 4కె వెర్షన్‌ను రీ స్టోర్ చేయడంలో కీలక పాత్ర వహించినవారు కూడా హాజరై, రెడ్ కార్పెట్‌పై నడిచారు. అలాగే షర్మిలా ఠాగూర్ కుమార్తె, జ్యువెలరీ డిజైనర్ సబ అలీఖాన్ కూడా ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ''ఈ సినిమాకు సంబంధించి నేను, సిమి మాత్రమే ఇంకా జీవించి ఉన్నాం'' అన్నారు షర్మిలా ఠాగూర్.



● షర్మిలా ఠాగూర్, సిమి గరేవాల్



● డెంజెల్ వాషింగ్టన్



● జో శర్మ



● రుచి గుజ్జర్

డెంజల్ వాషింగ్టన్‌కి జీవిత సాఫల్య పురస్కారం

అమెరికన్ నటి, గాయని స్కార్లెట్ జోహన్సన్ 'ఎలియనోర్ ది గ్రేట్' సినిమాతో దర్శకురాలిగా మారారు. ఈ సినిమాని కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా ఐదు నిమిషాల స్టాండింగ్ ఓవేషన్ దక్కింది. అలాగే ప్రముఖ ఇండియన్ ఫిల్మ్ మేకర్ శేఖర్ కపూర్‌తో స్కార్లెట్ కొంతసేపు మాట్లాడారు. అలాగే స్పైక్ లీ దర్శకత్వం వహించిన 'హయ్యస్ట్ 2 లోయెస్ట్' మూవీని ప్రదర్శించారు. ఈ సినిమాలో లీడ్ రోల్ చేసిన అమెరికన్ నటుడు, దర్శక-నిర్మాత డెంజల్ వాషింగ్టన్‌కు 'పామ్ డీ ఓర్' జీవిత సాఫల్య పురస్కారం దక్కింది. ఈ పురస్కారం దక్కడం తనకు చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉందని ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు డెంజల్ వాషింగ్టన్. ఇంకా జూలియా డుకోర్నౌ దర్శకత్వం వహించిన ఫ్రెంచ్ మూవీ 'ఆల్ఫా' ప్రీమియర్ అయ్యింది. ఈ చిత్రానికి 12 నిమిషాల స్టాండింగ్ ఓవేషన్ దక్కింది.

కాన్స్‌లో తెలుగు చిత్రం

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తెలుగు సినిమా 'ఎమ్ 4 ఎమ్' (మోటివ్ ఫర్ మర్డర్) స్క్రీనింగ్ జరిగినట్లు యూనిట్ పేర్కొంది. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో జో శర్మ ప్రధాన పాత్ర పోషించారు. వడ్లపట్ల మోహన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. జో శర్మ, వడ్లపట్ల మోహన్ కాన్స్‌లో పాల్గొన్నారు. 'ఎమ్ 4 ఎమ్' త్వరలో విడుదల కానుంది.

స్పెషల్ నెక్లెస్

భారతీయ నటి, మోడల్ రుచి గుజ్జర్ తొలిసారిగా కాన్స్ రెడ్ కార్పెట్‌పై నడిచారు. ఆమె ధరించిన నెక్లెస్ ఈ ఫెస్టివల్‌లో హాట్ టాపిక్‌గా అయింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బొమ్మలు ఉన్న నెక్లెస్‌ను ఆమె ధరించడం చర్చనీయాంశం అయింది. మరోవైపు తన నెక్లెస్‌పై ఆమె మోదీ బొమ్మను డిజైన్ చేయించుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మాయాబజార్‌ని థియేటర్స్‌లోనే చూడండి

- ఎస్వీ కృష్ణారెడ్డి



● అచ్చిరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, జనార్దన్, రమేష్ ప్రసాద్, బలుసు రామారావు

''ఎన్టీఆర్‌గారి నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. 'మాయాబజార్' సినిమాని ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు. ఈ చిత్రాన్ని రీ రిలీజ్ రోజున చూసేందుకు రెండు టికెట్స్ బుక్ చేసుకున్నాను. ఈ చిత్రాన్ని అందరూ థియేటర్స్‌లోనే చూడండి'' అని డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, ఎస్వీ రంగారావు, సావిత్రి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మాయాబజార్'. కేవీ రెడ్డి దర్శకత్వంలో విజయా ప్రొడక్షన్స్‌పై నాగిరెడ్డి, చక్రపాణి నిర్మించిన ఈ సినిమా 1957 మార్చి 27న విడుదలైంది. ఈ నెల 28న ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా 'మాయాబజార్' చిత్రాన్ని బలుసు రామారావు రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'మాయాబజార్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన 'ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ' చైర్మన్ టి.డి.జనార్దన్ మాట్లాడుతూ– ''రీ రిలీజ్‌లోనూ 'మాయాబజార్' గొప్ప విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. నిర్మాత రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ–''మా నాన్న ఎల్వీ ప్రసాద్, రామారావుగారు తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో సేవలు అందించారు'' అని తెలిపారు. ''అలనాటి క్లాసిక్ సినిమాలు మళ్లీ విడుదల చేయడం మన బాధ్యత'' అన్నారు నిర్మాత అచ్చిరెడ్డి. ఈ వేడుకలో వీర శంకర్, భగీరథ, త్రిపురనేని చిట్టి, బలుసు రామారావు తదితరులు పాల్గొన్నారు.

అదే మా విజయం

– రాజ్



● తేజ, తన్మయి, రాజ్

''ఒక సినిమా విజయానికి చాలా కొలమానాలుంటాయి. '23' లాంటి ఓ సినిమా సవాల్ అని తెలుసు. అయినప్పటికీ మా చిత్రం స్ఫూర్తితో ఇలాంటి కథలు మరొకరు తీస్తారనే ఉద్దేశంతో ఓ ప్రయోగం చేశాం. మా సినిమాకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ వచ్చింది.. అదే మా విజయం'' అని డైరెక్టర్ రాజ్ ఆర్. తెలిపారు. తేజ, తన్మయి జంటగా 'మల్లేశం' మూవీ ఫేమ్ రాజ్ ఆర్. దర్శకత్వం వహించిన చిత్రం '23'. స్టూడియో 99పై రూపొందిన ఈ చిత్రానికి వెంకట్ సిద్ధారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేసిన ఈ సినిమా ఈ నెల 16న విడుదలైంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో రాజ్ ఆర్. మాట్లాడుతూ–''మా సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు. ''మా చిత్రాన్ని చూసిన వారు బాగుందని చెప్పడం సంతోషంగా ఉంది. ఇంకా చూడని వారు చూడాలి'' అని తన్మయి పేర్కొన్నారు. ''తొలి చిత్రానికే నాకు ఇంత మంచి కథ కుదరడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన రాజ్‌గారిని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను'' అని తేజ చెప్పారు.

ముంబైలో మిరాయ్



● తేజా సజ్జ

ముంబై గుహల్లో తేజా సజ్జ సాహసాలు చేస్తున్నారు. ఎందుకంటే యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'మిరాయ్' కోసం. తేజా సజ్జ, రితికా నాయక్ జంటగా, మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్న సినిమా 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టులో రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో సూపర్‌యోధగా తేజ కనిపిస్తారు. తాజాగా 'మిరాయ్' కొత్త షెడ్యూల్ షూటింగ్ చిత్రీకరణ ముంబైలోని చారిత్రక గుహల్లో ప్రారంభమైంది. తేజ, ఇతర ప్రధాన పాత్రధారులు ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారని మేకర్స్ తెలిపారు.''మిరాయ్' కోసం తేజా సజ్జ పూర్తిగా మేకోవర్ అయ్యారు. 2డీ, 3డీ ఫార్మాట్స్‌లో ఎనిమిది భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: గౌరహరి, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతీ ప్రసాద్.

సాక్షి బిజినెస్
బుధవారం
21-5-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	873	81,186
నిఫ్టీ ▽	261	24,684

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,149	▽	65
డోజోన్స్	42,688	▽	104
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,781	△	82
డాక్స్	24,036	△	101
షాంఘై	3,380	△	13
నికాయ్	37,529	△	261

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.00	115.29
€	యూరో	ఎస్‌బీఐ	94.94	97.62
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.36	59.89
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.11	56.13
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.73	68.42
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.94	23.45
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.43	24.21
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.99	12.81

నెమ్మదించిన మౌలికం

- ఏప్రిల్‌లో 8 నెలల కనిష్టానికి డౌన్; 0.5 శాతానికి పరిమితం
- తగ్గిన క్రూడాయిల్, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల ఉత్పత్తి



న్యూఢిల్లీ: కీలకమైన ఎనిమిది మౌలిక రంగాల వృద్ధి ఏప్రిల్‌లో ఎనిమిది నెలల కనిష్ట స్థాయి 0.5 శాతానికి నెమ్మదించింది. క్రూడాయిల్, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల ఉత్పత్తి క్షీణించడం ఇందుకు కారణం. గతేడాది ఏప్రిల్‌లో మౌలిక రంగ పరిశ్రమలు 6.9 శాతం వృద్ధి చెందాయి. ఈ ఏడాది మార్చిలో 4.6 శాతం వృద్ధి నమోదైంది. మంగళవారం విడుదల చేసిన డేటా ప్రకారం గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈసారి ఏప్రిల్‌లో బొగ్గు, సహజ వాయువు, విద్యుత్, ఉక్కు ఉత్పత్తి వరుసగా 3.5 శాతం, 0.4 శాతం, 3 శాతం, ఒక్క శాతానికి నెమ్మదించాయి. అయితే, సిమెంటు ఉత్పత్తి 0.2 శాతం నుంచి 6.7 శాతానికి పెరిగింది. మౌలిక రంగ పనితీరు గత నెల గణనీయంగా క్షీణించినట్లు ఇక్రా చీఫ్ ఎకానమిస్ట్ అదితి నాయర్ తెలిపారు.

హిందాల్కో లాభం జూమ్

క్యూ4లో రూ. 5,284 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 66 శాతం జంప్‌చేసి రూ. 5,284 కోట్లను తాకింది. దేశీ అమ్మకాలు పుంజుకోవడం, ముడివ్యయాలు తగ్గడం ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 3,174 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 55,994 కోట్ల నుంచి రూ. 64,890 కోట్లకు ఎగసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,155 కోట్ల నుంచి రూ. 16,002 కోట్లకు జంప్ చేసింది. మొత్తం ఆదాయం రూ. 2,15,962 కోట్ల నుంచి రూ. 2,38,496 కోట్లకు బలపడింది.


ఈఎంఐఎల్ మైన్స్‌కు ఓకే

గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ చరిత్రలోనే అత్యుత్తమ పనితీరు ప్రదర్శించినట్లు హిందాల్కో ఎండీ సతీష్ పాయ్ పేర్కొన్నారు. ఇందుకు నిలకడైన నిర్వహణ సామర్థ్యం, వ్యయ నియంత్రణకుతోడు అన్ని బిజినెస్‌లకు నెలకొన్న డిమాండ్ దోహదపడినట్లు తెలియజేశారు. ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ సొంత అనుబంధ సంస్థ ఈఎంఐఎల్ మైన్స్ మినరల్ రిసోర్సెస్ కొనుగోలుకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు హిందాల్కో పేర్కొంది. బంధా కోల్ బ్లాకు లీజ్ హక్కులు కలిగిన ఈఎంఐఎల్ మైన్స్‌లో 100 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు వెల్లడించింది.

హిందాల్కో షేరు బీఎస్‌ఈలో 0.7% బలపడి రూ. 663 వద్ద ముగిసింది.

బ్లూచిప్స్‌లో లాభాల స్వీకరణ

- కలవరపెట్టిన కరోనా కేసులు
- విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు
- సెన్సెక్స్ 873 పాయింట్ల పతనం
- నిఫ్టీ నష్టం 261 పాయింట్లు
- ఒక్కరోజే రూ.5.64 లక్షల కోట్లు ఆవిరి



ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు షేర్లలో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం ఒకశాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 873 పాయింట్లు పతనమై 81,186 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 261పాయింట్లు కోల్పోయి 24,684 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఆటో, ఫైనాన్స్, రక్షణ రంగ షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు చోటు చేసుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 906 పాయింట్లు క్షీణించి 81,154 వద్ద, నిఫ్టీ 275 పాయింట్లు కోల్పోయి 24,670 వద్ద కనిష్టాన్ని తాకాయి.

- భారీ పతనంతో మంగళవారం ఒక్కరోజే రూ.5.64 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం విలువ రూ.438 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 16 పైసలు క్షీణించి 85.58 వద్ద స్థిరపడింది.

పతనం ఎందుకంటే...

- ఆపరేషన్ సిందూర్ కాల్పులవిరమణ తర్వాత సూచీలు అనూహ్యంగా 4% లాభపడ్డాయి. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై స్పష్టత కొరవడింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల్లో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు.
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు కలవరపెట్టాయి. భారత్‌లో యాక్టివ్ కేసుల సంఖ్య 257కు చేరింది. వారం రోజుల్లో 164 కేసులు నమోదైనట్లు గణాంకాలు తెలపడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు.
- వరుస కొనుగోళ్ల తర్వాత విదేశీ ఇన్వెస్టర్లు నికర విక్రేతలుగా మారారు. అనూహ్యంగా మే 19న డీఐఐలూ అమ్మకాలకు పాల్పడ్డారు. మంగళవారం ఎఫ్‌ఐఐలు రూ.10,016 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఐపీవోకు 7 కంపెనీలు రెడీ
నియంత్రణ అనుమతుల్లో జాప్యంతో అనిశ్చితులు

మెడికల్ ఇంప్లాంట్.. ఫుల్ డిమాండ్..!

భారీగా విస్తరిస్తున్న మార్కెట్

- 2027–28 నాటికి 5 బిలియన్ డాలర్లు
- ఆర్థోపెడిక్, కార్డియాక్ ఇంప్లాంట్లపై కేర్‌ఎడ్జ్ నివేదిక



ముంబై: ఆర్థోపెడిక్, కార్డియాక్ ఇంప్లాంట్ల వ్యాపారం 2027–28 నాటికి 4.5–5 బిలియన్ డాలర్ల స్థాయికి (సుమారు రూ.42,500 కోట్లు) విస్తరిస్తుందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అంచనా వేసింది. దేశీయంగా బలమైన డిమాండ్‌కు తోడు, ఎగుమతులు క్రమంగా పెరుగుతుండడాన్ని ప్రస్తావించింది. ఆర్థోపెడిక్, కార్డియాక్ ఇంప్లాంట్ల వ్యాపారం (ఎగుమతులు సహా) 2024 మార్చి నాటికి 2.4–2.7 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు పేర్కొంది. భారత్‌లో తలసరి ఆదాయం పెరుగుతుండడం, ఆరోగ్య సంరక్షణపై అవగాహనలో మార్పు, వృద్ధ జనాభా పెరుగుతుండడం, ఆరోగ్య సదుపాయాల విస్తరణ, ఆరోగ్య బీమా కవరేజీ విస్తృతి ఇవన్నీ ఈ రంగం వృద్ధికి సానుకూలిస్తాయని కేర్‌ఎడ్జ్ నివేదిక వివరించింది. ఇటీవలి సంవత్సరాల్లో బహుళజాతి ఇంప్లాంట్ కంపెనీల కంటే దేశీ తయారీదారులే ఎక్కువ వృద్ధి చెందుతున్నట్టు పేర్కొంటూ.. పోటీతో కూడిన ధరలకు తోడు సామర్థ్యాలను సమకూర్చుకోవడాన్ని గుర్తు చేసింది. ఇంప్లాంట్లకు సంబంధించి బలమైన టెక్నాలజీ సామర్థ్యాలు అవసరమని.. ఈ విభాగాన్ని ప్రధానంగా విదేశీ ఎంఎన్‌సీలే శాసిస్తున్నట్టు తెలిపింది. అయితే దిగుమతులను భారత్ క్రమంగా తగ్గించుకుంటున్నట్టు.. దేశీ ఇంప్లాంట్ తయారీదారులు ఏటా 28 శాతం చొప్పున 2023–24 వరకు వరుసగా నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో వృద్ధిని సాధించినట్టు వెల్లడించింది. ఇదే కాలంలో అమ్మకాలు ఏటా 12 శాతం పెరిగినట్టు పేర్కొంది. ప్రభుత్వ ప్రాయోజిత బీమా పథకాల్లో పాల్గొనడంతోపాటు పోటీ ధరల ఫలితంగా విదేశీ ఎంఎన్‌సీల కంటే భారతీయ కంపెనీలే అమ్మకాల్లో అధిక వృద్ధిని నమోదు చేస్తున్నట్టు వివరించింది.

ఎగుమతుల్లోనూ సత్తా..

గడిచిన కొన్నేళ్ల నుంచి భారత ఇంప్లాంట్ తయారీ కంపెనీలు విదేశీ ఎంఎన్‌సీలను స్థానిక మార్కెట్‌లో సవాలు చేయడమే కాకుండా ఎగుమతుల మార్కెట్లోనూ గట్టి పోటీనిస్తున్నట్టు కేర్‌ఎడ్జ్ నివేదిక వెల్లడించింది. ఇంప్లాంట్ మార్కెట్లో ఉన్న అవకాశాల నేపథ్యంలో జైడస్ లైఫ్ సైన్సెస్, అల్కెమ్ ల్యాబొరేటరీస్ తదితర బడా ఫార్మా కంపెనీలు ఇంప్లాంట్ల తయారీ, పంపిణీపై పెట్టుబడి ప్రణాళికలను ప్రకటించినట్టు తెలిపింది. అయితే ప్రస్తుతం అంతర్జాతీయంగా కొనసాగుతున్న వాణిజ్యం, టారిఫ్‌ల అనిశ్చితులు, ధరలపై పరిమితుల విధింపు, నియంత్రణలను పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. గుండెలో స్టెంట్లు, మోకాళ్ల చిప్పలు ఇవన్నీ కూడా ఇంప్లాంట్ల కిందకే వస్తాయి.

దాతృత్వంలో ఆదర్శం ముకేశ్, ప్రేమ్‌జీ, కామత్

టైమ్ టాప్-100 దాతృత్వ ప్రభావశీలుర జాబితా



న్యూయార్క్: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీ, విప్రో చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ, జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్.. టైమ్ మ్యాగజైన్ టాప్-100 దాతృత్వ ప్రభావశీల వ్యక్తుల జాబితాలో చోటు సంపాదించుకున్నారు. వ్యవస్థాపకుడు, దాతృత్వవాదులు సామాజిక అవసరాలకు నిధులు ఎలా కేటాయించినదీ ఇది తెలియజేస్తుందని టైమ్ మ్యాగజైన్ పేర్కొంది. దేశంలో అత్యధికంగా ముకేశ్, నీతా అంబానీ 2024లో రూ.407 కోట్లను విరాళంగా ఇచ్చారు. ప్రేమ్‌జీ 2013లో విప్రో కంపెనీలోని 29 బిలియన్ డాలర్ల షేర్లను విరాళంగా ప్రకటించడాన్ని గుర్తు చేసింది. సంప్రదాయ విరాళానికి అదనంగా విద్య, ఆరోగ్యం తదితర రంగాల్లో సేవలు అందించే 940 సంస్థలకు ప్రేమ్‌జీ 2023–2024 సంవత్సరాల్లో 109 మిలియన్ డాలర్లను విరాళంగా అందించారు. 2023లో జెరోదా నిఖిల్ కామత్, నితిన్ కామత్ తమ సంపదలో 25 శాతాన్ని సమాజం కోసం ప్రకటించడాన్ని టైమ్ మ్యాగజైన్ గుర్తుచేసింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-ఇండియన్ ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

సీఐఎస్‌ఎఫ్‌లో 403 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్)లో స్పోర్ట్స్ కోటా కింద అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి హెడ్ కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 403.
» **క్రీడలు:** వుషు, తైక్వాండో, కరాటే, పెన్‌కాక్ సిలాట్, ఆర్చరీ, కయాకింగ్, కెనోయింగ్, రోయింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, స్విమ్మింగ్/అక్వాటిక్స్, ఖోఖో, వాలీబాల్, సెపక్‌టక్రా, బాస్కెట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, సైక్లింగ్, అథ్లెటిక్స్, బాక్సింగ్, హాకీ, షూటింగ్, జూడో, కబడ్డీ, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బాడీ బిల్డింగ్.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు రాష్ట్ర/జాతీయ/అంతర్జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించిన అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.08.2025 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100.
» **ఎంపిక విధానం:** ట్రయల్ టెస్ట్, ప్రొఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.06.2025
» **వెబ్‌సైట్:** https://www.cisf.gov.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 80 జీఈటీ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ(జీఈటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 80.
» **విభాగాలు:** ఈసీఈ/ఎలక్ట్రానిక్స్–టెలీ కమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సీఎస్‌ఈ/ఐటీ, మెకానికల్, ఈఈఈ/ఎలక్ట్రికల్, సివిల్, కెమికల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 30.04.2025 నాటికి 27ఏళ్లు ఉండాలి.



» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.06.2025
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

హెచ్‌సీఎల్‌లో 209 ట్రేడ్ అప్రెంటిస్‌లు

ఝున్ ఝును(రాజస్థాన్)లోని హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్(హెచ్‌సీఎల్)కు చెందిన ఖేత్రీ కాపర్ కాంప్లెక్స్‌లో ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 209.
» **ట్రేడులు:** మేట్(మైన్స్), బ్లాస్టర్(మైన్స్), ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్, డీజిల్ మెకానిక్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్(గ్యాస్–ఎలక్ట్రిక్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్(సివిల్), డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్), కంప్యూటర్ ఆపరేటర్–ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, సర్వేయర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్‌కండిషనర్, పంప్ ఆపరేటర్ కమ్ మెకానిక్.
» **అర్హత:** పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.05.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఐటీఐ, పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.06.2025
» **వెబ్‌సైట్:** www.hindustancopper.com

ఐహెచ్‌బీ లిమిటెడ్‌లో 25 పోస్టులు

ఇండియన్ ఆయిల్, హిందూస్తాన్ పెట్రోలియం అండ్ భారత్ పెట్రోలియం జాయింట్ వెంచర్ అయిన ఐహెచ్‌బీ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 25.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్(హెచ్‌ఎస్‌ఈ, మెకానికల్, ఫైనాన్స్)–03, సీనియర్ ఇంజనీర్(మెకానికల్, టెలికమ్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)–04, ఇంజనీర్(మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఐటీ)–14, ఆఫీసర్(ఫైనాన్స్)–03, ఆఫీసర్(హెచ్‌ఆర్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీ, సీఏ/సీఎంఏ, బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.05.2025 నాటికి డిప్యూటీ మేనేజర్‌కు 40 ఏళ్లు, సీనియర్ ఇంజనీర్‌కు 35 ఏళ్లు, ఆఫీసర్/ఇంజనీర్‌కు 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** సంవత్సరానికి డిప్యూటీ మేనేజర్‌కు రూ.11 లక్షలు, సీనియర్ ఇంజనీర్‌కు రూ.9 లక్షలు, ఇంజనీర్/ఆఫీసర్‌కు రూ.7 లక్షలు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.06.2025
» **వెబ్‌సైట్:** https://www.ihbl.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 45 టెక్నీషియన్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. వివిధ విభాగాల్లో టెక్నీషియన్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 45.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, టర్నర్, షీట్ మెటల్, వెల్డర్, కార్పెంటర్, పెయింటర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30.04.2025 నాటికి 27 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.20,480.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.06.2025
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

పదితోనే బ్యాంక్ కొలువు

» 500 ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» పదో తరగతి అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు
» రాత పరీక్ష, స్థానిక భాషా పరీక్ష ద్వారా ఎంపిక
» ఎంపికైతే నెలకు రూ.19,500 మూల వేతనం



ప్రభుత్వ రంగ బ్యాంక్.. బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా ఉన్న బ్రాంచ్‌ల్లో పనిచేసేందుకు ఆఫీస్ అసిస్టెంట్ (ప్యూన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తంగా 500 పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. పదో తరగతి ఉత్తీర్ణతతోనే ప్రభుత్వ ఉద్యోగం కోరుకునే వారికి ఇది చక్కటి అవకాశం. ఈ నేపథ్యంలో..బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర వివరాలు..

బ్యాంక్ ఆఫ్ బరోడా మొత్తం 500 ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 22 ఖాళీలు, తెలంగాణలో 13 ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులకు ఎంపికైన వారు నియమితులైన బ్యాంక్ బ్రాంచ్‌లో సబార్డినేట్ కేడర్ సిబ్బంది చేయాల్సిన అన్ని విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. సంబంధిత రాష్ట్రంలోని బ్యాంక్ బ్రాంచ్‌ల్లో ఎక్కడైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలి.

అర్హతలు

- పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు స్థానిక భాషలో చదవడం, రాయడం వచ్చి ఉండాలి.
- వయసు: 01.05.2025 నాటికి కనీసం 18 ఏళ్లు, గరిష్ఠంగా 26ఏళ్ల వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపి, నియామకం ఖరారు చేసుకున్న వారికి ప్రారంభంలోనే నెలకు రూ.19,500 మూల వేతనం అందుతుంది. దీంతోపాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ, స్పెషల్ అలవెన్స్, రవాణా భత్యం, ప్రత్యేక చెల్లింపు, వైద్య బీమా వంటి ప్రోత్సాహకాలు, ఇతర సౌకర్యాలు పొందే అవకాశముంది.

ఎంపిక ప్రక్రియ

ఆన్‌లైన్ రాత పరీక్షతోపాటు స్థానిక భాష నైపుణ్య పరీక్ష ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. స్థానిక భాష పరీక్షను తుది ఎంపిక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోరు. ఇది అర్హత పరీక్ష మాత్రమే. ఎంపికైన వారికి ఆరు నెలలపాటు ప్రొబేషన్ ఉంటుంది. ఇది కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే.. బ్యాంక్‌లో శాశ్వత కొలువు ఖరారవుతుంది.

ఆన్‌లైన్ పరీక్ష

ఆన్‌లైన్ రాత పరీక్ష 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇందులో నాలెడ్జ్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, ఎలిమెంటరీ అర్థమెటిక్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, సైకోమెట్రిక్ టెస్ట్(రీజనింగ్) 25 ప్రశ్నలు–25 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 80 నిమిషాలు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి పావు వంతు (0.25) మార్కులను తగ్గిస్తారు.

రాత పరీక్ష మాధ్యమం

- పరీక్షను ఇంగ్లిష్/హిందీ/సదరు రాష్ట్ర లేదా యూటీ అధికారిక భాషలో నిర్వహిస్తారు.
- ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులు ఇంగ్లిష్ /హిందీ /తెలుగు భాషలో పరీక్ష రాసే అవకాశముంది. అదే విధంగా తెలుగు లేదా ఉర్దూపై స్థానిక భాష పరీక్షకు హాజరవ్వొచ్చు.
- తెలంగాణ అభ్యర్థులకు ఇంగ్లిష్ /హిందీ /తెలుగు /ఉర్దూ భాషలో పరీక్ష రాసే అవకాశముంది. అదేవిధంగా తెలుగు లేదా ఉర్దూపై స్థానిక భాష పరీక్షకు హాజరవ్వొచ్చు.

రాత పరీక్షలో స్కోర్ ఇలా

- ఇంగ్లిష్‌లో ఉత్తమ స్కోర్ సాధించేందుకు అభ్యర్థులు పదో తరగతి స్థాయిలోని గ్రామర్, వొకాబ్యులరీపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సెంటెన్స్ కంప్లీషన్, ఎర్రర్ డిటెక్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. స్పెల్లింగ్స్‌పైనా దృష్టిపెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్‌లో ఎక్కువ స్కోర్ చేసే అవకాశముంది. ఇందుకోసం గతేడాది కాలంగా జరిగిన కరెంట్ అఫైర్స్‌పై అవగాహనతో పాటు స్టాక్ జీకేపై పట్టు సాధించాలి.
- అరిథమెటిక్‌లో మంచి స్కోర్ చేసేందుకు నంబర్ సిస్టమ్, ప్రాఫిట్ అండ్ లాస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, పర్సంటేజెస్, యావరేజెస్, సింపుల్ ఇంటరెస్ట్, కాంపౌండ్ ఇంటరెస్ట్, అలిగేషన్స్ అండ్ మిక్చర్స్ తదితర పదో తరగతి స్థాయి గణితంపై పట్టు సాధించాలి. ఇందుకోసం బేసిక్ కాన్సెప్ట్‌లు, ఫార్ములాల అధ్యయనంతోపాటు నిరంతరం ప్రాక్టీస్ చేయాలి. గత ప్రశ్న పత్రాలు,మోడల్ పేపర్స్ ప్రాక్టీస్ ద్వారా వేగం, కచ్చితత్వం అలవడుతాయి.
- ఎక్కువ మంది అభ్యర్థులు కష్టమైనదిగా భావించే రీజనింగ్ కోసం అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ప్రారంభించాలి. ఇందులో కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, సిరీస్, పజిల్స్, సిలోజిజమ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, డేటా సఫిషియెన్సీపై అవగాహన పెంచుకోవాలి. సాధ్యమైనన్ని ఎక్కువ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 23.05.2025
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.bankofbaroda.in/career.htm



ఈ వీధి పేరు 'సిందూర్ స్ట్రీట్'

- బోర్డు ఏర్పాటు చేసుకున్న కామారెడ్డి వాసులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అనంతరం భారత ప్రభుత్వం పాకిస్తాన్‌పై జరిపిన 'ఆపరేషన్ సిందూర్'సక్సెస్ కావడంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలోని ఓ వీధికి 'సిందూర్ స్ట్రీట్'(సిందూర్ వీధి) అని నామకరణం చేశారు. మంగళవారం ఆ వీధికి చెందిన ఇళ్ల యజమానులు సిందూర్ స్ట్రీట్ బోర్డు ఏర్పాటు చేసి ప్రారంభించుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావడంతో ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తూ, మన దేశ త్రివిధ దళాలకు మద్దతుగా వివిధ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని శాశ్వతంగా గుర్తుంచుకోవాలన్న ఉద్దేశంతో ఆ వీధి వాసులు తమ వీధికి సిందూర్ స్ట్రీట్ అని నామకరణం చేసి సైనికులకు మద్దతు తెలిపారు. దేశం కోసం సైనికులు చేసిన పోరాట పటిమను భవిష్యత్తు తరాలు గుర్తుంచుకునే విధంగా తమ వీధికి సిందూర్ స్ట్రీట్ అని పేరు పెట్టినట్టు వారు పేర్కొన్నారు.

తెలుగుపై ఉన్నత విద్యామండలి నిర్ణయం అభ్యంతరకరం

ఉస్మానియా యూనివర్సిటీ: డిగ్రీలో ద్వితీయ భాష తెలుగును 20 క్రెడిట్ల నుంచి 12 క్రెడిట్లకు తగ్గించాలనే ఉన్నత విద్యమండలి నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోందని పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు. ఓయూ తెలుగుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ట్స్ కాలేజీలో తెలుగు అధ్యాపకుల వార్షిక సమావేశం జరిగింది. సమావేశానికి ప్రొఫెసర్ కమలాకర్ శర్మ అధ్యక్షత వహించగా.. పలువురు సీనియర్ ప్రొఫెసర్లు అనేక అంశాలపై చర్చించి 8 తీర్మానాలను ఆమోదించారు. తెలంగాణలో తెలుగు భాషకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, 20 క్రెడిట్లను కొనసాగించాలని, 12 క్రెడిట్లకు కుదిస్తే.. ఎంఏ, పీహెచ్‌డీ చదవలేరని, తెలుగును కోర్ సబ్జెక్టుగా దోస్త్‌లో చేర్చాలని, బీఎస్సీలో సైతం కోర్ సబ్జెక్టుగా తెలుగును ప్రవేశపెట్టాలని, కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఈపీలో భాగంగా మాతృభాషలోనే వృత్తి విద్యా కోర్సులను ప్రారంభించాలని, తెలుగు భాషను ఉద్యోగం దృష్టితో చూడకూడదని తదితర తీర్మానాలను చేశారు. సమావేశంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీంతో పాటు వివిధ కళాశాలల తెలుగు శాఖ అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆకాశంలో అందాలు ఒంపినట్లు..

ఒక పాలపుంత కనిపించడమే గగనం.. అదీ ఇలా ఒంపు తిరిగినట్లు ఉండేవి రెండు ఒకేసారి కనిపిస్తే.. అబ్బురమే కదా.. ఈ చిత్రాన్ని స్విట్జర్లాండ్‌కు చెందిన జెర్మాట్ అనే ఫొటోగ్రాఫర్ ఆల్ప్స్ పర్వత శ్రేణి వద్ద తీశారు. మిల్కీవే ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్-2025 పోటీకి వేలాది ఎంట్రీలు రాగా.. 25 చిత్రాలను విజేతలుగా ఎంపిక చేశారు. అందులో ఇది కూడా ఒకటి.

బీటెక్‌లో ప్రమోషన్‌కు 20 క్రెడిట్స్..!

త్వరలో అన్ని వర్సిటీలకు ఒకే విధానం

- సెకెండియర్‌లో ఫస్టియర్ బ్యాక్‌లాగ్స్ లేకుండా చూసుకోవాలి
- అధికారుల నివేదికకు కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం.. ఈ ఏడాది నుంచే అమల్లోకి వచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఏకీకృత ప్రమోషన్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. కనీసం 20 క్రెడిట్స్ ఉంటే ప్రమోట్ చేయనున్నారు. సాంకేతిక విద్య అధికారులతో కూడిన కమిటీ ఈ మేరకు తాజాగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీన్ని కేబినెట్ ఉప కమిటీ ఆమోదించినట్టు, 2025–26 విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుందని విశ్వసనీయంగా తెలిసింది. కొన్ని రోజుల క్రితం అన్ని విశ్వవిద్యాలయాల వీసీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఏకీకృత విధానం అమలుపై ఇందులో ఏకాభిప్రాయం కుదిరింది. ఇంజనీరింగ్‌లో ఒక ఏడాది తర్వాత మరో ఏడాదికి వెళ్లేందుకు (ప్రమోట్ అయ్యేందుకు) ఒక్కో యూనివర్సిటీలో ఒక్కో విధానం ఉంది. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వర్సిటీల అధికారులు చెబుతున్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కొంతమంది సభ్యులు సైతం ఈ అంశం సభ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం.. ఏకీకృత విధానం అమలుపై అధికారుల నుంచి నివేదిక కోరింది. ప్రస్తుతం హైదరాబాద్ జేఎన్‌టీయూహెచ్‌లో అనుసరిస్తున్న విధానాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని వర్సిటీల ఉపకులపతులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉస్మానియా, మహాత్మాగాంధీ, జేఎన్‌టీయూహెచ్, కాకతీయ యూనివర్సిటీల పరిధుల్లో ఇంజనీరింగ్ విద్య కొనసాగుతోంది.

ఒక్కో చోట ఒక్కో విధానం

ఉస్మానియా, మహాత్మాగాంధీ వర్సిటీల్లో బీటెక్ మొదటి ఏడాది నుంచి రెండో ఏడాదికి వెళ్లాలంటే విద్యార్థి ఫస్టియర్‌లో 50 శాతం క్రెడిట్స్ సాధించాలి. కానీ జేఎన్‌టీయూహెచ్, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో 25 శాతం క్రెడిట్స్ పొందితే సరిపోతుంది. ఆ తదుపరి సంవత్సరాల్లో ప్రమోట్ కావాలన్నా ఒక్కో వర్సిటీలో ఒక్కో క్రెడిట్ విధానం ఉంది. ఒక్కో సెమిస్టర్‌కు 20 చొప్పున ఏడాదికి 40 క్రెడిట్స్, నాలుగేళ్ళకు కలిపి మొత్తం 160 క్రెడిట్స్ ఉంటాయి. ఒక్కో వర్సిటీకి ఒక్కో విభిన్నమైన సిలబస్ ఉండటం వల్ల కూడా క్రెడిట్ విధానంలో తేడా ఉంటోంది. సిలబస్, పీరియడ్స్‌ను బట్టి 3 లేదా 4 చొప్పున క్రెడిట్స్ ఉంటాయి. జేఎన్‌టీయూహెచ్‌లో ఫస్టియర్ ఇంజనీరింగ్‌లో ఐదు థియరీ సబ్జెక్టులు, 3 ల్యాబ్‌లు ఉంటాయి. ఒక సబ్జెక్టు పాసయితే దానికి సంబంధించిన క్రెడిట్స్ విద్యార్థి ఖాతాలో పడతాయి. అయితే ఎక్కడ తేలికగా ప్రమోట్ అవుతారో ఆ యూనివర్సిటీలను విద్యార్థులు ఎంచుకుంటున్నారు. జేఎన్‌టీయూహెచ్ కన్నా ఉస్మానియా యూనివర్సిటీలో ప్రమోట్ కావడం కష్టమని విద్యార్థులు భావిస్తున్నారు.

20 క్రెడిట్స్ ఉంటే ప్రమోట్

ప్రస్తుతం కనీసం 20 క్రెడిట్స్ ఉంటే తర్వాత సంవత్సరానికి ప్రమోట్ చేసే విధానంతెచ్చే యోచనలో ఉన్నారు. అంటే ఏటా ఆ ఏడాదికి సంబంధించిన సగం క్రెడిట్స్ విద్యార్థి సాధించాల్సి ఉంటుంది. దీంతోపాటే క్రెడిట్స్ విధానాన్ని మార్చాలని భావిస్తున్నారు. తొలి ఏడాది ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థికి రెండో సంవత్సరంలో సబ్జెక్టుపై కాస్త అవగాహన ఉంటుంది. కాబట్టి రెండో సంవత్సరంలో ఫస్టియర్ బ్యాక్‌లాగ్స్ లేకుండా చూసుకోవాలి. మూడో సంవత్సరం నుంచి 40% క్రెడిట్స్ సాధించాలి. ఇక ఆఖరి ఏడాదిలో పూర్తి క్రెడిట్స్ పొంది ఉండాలనే విధానం ఖరారు చేసినట్టు సమాచారం. నాలుగు వర్సిటీల అధికారులు ఇప్పటికే ఈ విధానంపై కసరత్తు పూర్తి చేశారు. త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. విద్యాశాఖ అంగీకారం పొందాక దీన్ని అమల్లోకి తెస్తారని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

'మొబైల్' రికవరీలో తెలంగాణ టాప్

- రెండేళ్లలో 78,114 ఫోన్ల రికవరీ

అధిక ఫోన్లు రికవరీలు చేసిన ప్రాంతాలు:

హైదరాబాద్ కమిషనరేట్:	11,879
సైబరాబాద్ కమిషనరేట్:	10,385
రాచకొండ కమిషనరేట్:	8,681

సాక్షి, హైదరాబాద్: మొబైల్ ఫోన్ల రికవరీలో తెలంగాణ జాతీయస్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి కనిపెట్టేందుకు కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ అభివృద్ధి చేసిన సీఈఐఆర్ పోర్టల్ సాయంతో తెలంగాణ పోలీసులు 2023, ఏప్రిల్ 19 నుంచి ఈ నెల 19 వరకు మొత్తం 78,114 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐడీ డీజీ శిఖాగోయల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా అత్యధిక రికవరీలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణలో సీఈఐఆర్ పోర్టల్ అమలుకు సీఐడీ తెలంగాణ నోడల్ ఏజెన్సీగా పని చేస్తోంది. రాష్ట్రంలోని 780 పోలీస్ స్టేషన్లలో ఈ సాంకేతిక వ్యవస్థ యాక్టివ్‌గా ఉంది. దేశవ్యాప్తంగా ఈ పోర్టల్‌ను 2022, సెప్టెంబర్ 5న పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించగా, తెలంగాణలో 2023, ఏప్రిల్ 19న ప్రారంభమైంది. ఆలస్యంగా అమలులోకి వచ్చినా, ఫలితాల సాధనలో మన రాష్ట్రం ముందుంది. మొబైల్ ఫోన్ల చోరీ, పోగొట్టుకోవడంపై కేసుల నమోదుతోపాటు రోజువారీ ట్రాకింగ్ రిపోర్టులను పరిశీలిస్తూ, ఫోన్లను తిరిగి యజమానులకు అప్పగిస్తున్నారు. పోగొట్టుకున్న, చోరీ అయిన ఫోన్లకు సంబంధించి ఫిర్యాదులు ఇవ్వడంలో తెలంగాణ పోలీస్ సిటిజన్ పోర్టల్, సీఈఐఆర్ కీలకంగా నిలుస్తున్నాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ మొదటి స్థానంలో నిలవడంలో కీలకంగా పనిచేసిన సీఐడీ సైబర్ క్రైం ఎస్పీ గంగారామ్ బృందాన్ని శిఖా గోయల్ అభినందించారు.

ఇంగ్లిష్ రాకనే గుమస్తాలయ్యాం



ఇంగ్లిష్ చదివినవారు ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యారు

- తెలుగు అమ్మభాష అయితే.. నడిపించే నాన్న భాష ఇంగ్లిష్
- ప్రాథమిక స్థాయి నుంచే తెలుగుతో పాటు ఇంగ్లిష్‌నూ బోధించాలి
- సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి ఆకాంక్ష

సాక్షి, హైదరాబాద్: 'విద్య ద్వారా సామాజిక న్యాయం కావాలంటే ప్రాథమిక స్థాయి నుంచే తెలుగుతోపాటు ఇంగ్లిష్‌ను కూడా బోధించాలి' అని ప్రముఖ సినీ నటుడు, దర్శక–నిర్మాత ఆర్. నారాయణమూర్తి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'తెలుగు వన్'యూట్యూబ్ చానల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన మాట్లాడారు. 'ప్రపంచంలో తెలుగువాడు ముందుండాలి అన్న ఆలోచనతో తెలుగు వన్‌ను స్థాపించిన రవిశంకర్‌కు అభినందనలు. ఈ చానల్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు భాష గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని చాటి చెబుతున్నారు. నేను తెలుగువాణ్ణి అంటూ తెలుగు ఖ్యాతిని ప్రపంచం నలుమూలలా చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్. మనం తెలుగువాళ్లమే. మన మాతృభాష తెలుగు గురించి అందరూ చాలా గొప్పగా చెప్పారు. ఈరోజు ప్రపంచం గ్లోబలైజేషన్ అయిపోయింది. ఉద్యోగాలు కావాలంటే అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లిష్ కావాలి.. ఇంగ్లిష్ రావాలి. అమ్మ భాష మాతృ భాష తెలుగు అయితే, నడిపించే నాన్న భాష ఇంగ్లిష్. మేము పేదవాళ్లం. అందరికీ న్యూటన్ లాగానో, సర్వేపల్లి రాధాకృష్ణన్ లాగానో ఐక్యూ చాలా గొప్పగా ఉండదు. అందరూ చదువుకోవాలి. మా ఊర్లో బీఏ చదివిన మొదటి వ్యక్తిని నేను. ఆ రోజుల్లో నాలాంటి పేద వాళ్లందరికీ ఇంగ్లిష్ రాక ఫెయిల్ అయ్యాం. ప్రాథమికస్థాయి నుంచి మాకు ఎప్పుడూ ఇంగ్లిష్ లేదు. మేం బీఏ, ఎంఏ, ఎంకామ్.. ఇలా అన్నీ పాస్ అయ్యాం. ఉద్యోగాల కోసం పరీక్ష రాసేందుకు వెళితే అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లిష్‌లో ప్రశ్న పత్రాలు ఉండటం వల్ల మాకు అర్థం కాక ఫెయిల్ అయ్యాం. దీంతో గుమస్తాలు అయ్యాం.. ప్యూన్‌లు అయ్యాం.. అటెండర్లు అయ్యాం. ఈ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడే జవాన్‌లు అయ్యాం. ఈ దేశంలో శాంతి భద్రతలు కాపాడే పోలీసులం అయ్యాం. కానీ ఇంగ్లిష్ మీడియం వచ్చిన వారు ఏమయ్యారు? కలెక్టర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యారు.. చాలా సంతోషంగా ఉంది. కానీ, విద్య ద్వారా ఏ సామాజిక న్యాయం వస్తుందని అంబేద్కర్‌గారు చెప్పారో.. తెలుగు, ఇంగ్లిష్ అనే భేదం వల్ల ఇంగ్లిష్ వచ్చినవాళ్లు చాలా గొప్పవాళ్లు అయిపోయారు. తెలుగు వచ్చినవారు అథఃపాతాళానికి వెళ్లారు. అది కాకుండా ఉండాలంటే.. విద్య ద్వారా సామాజిక న్యాయం కావాలంటే ప్రాథమిక స్థాయి నుంచే తెలుగుతో పాటు ఇంగ్లిష్‌ని కూడా బోధించాలని నేను కోరుకుంటున్నాను'అని నారాయణమూర్తి తెలిపారు.

ఐఎఫ్‌ఓఎస్‌లో సత్తా చాటిన తెలంగాణ యువకుడు

40వ ర్యాంకు సాధించిన అవినాష్‌రెడ్డి



తల్లిదండ్రులతో అవినాష్‌రెడ్డి


సాక్షి, పెద్దపల్లి

యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్‌ఓఎస్)–2024 పరీక్ష తుది ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. రాత పరీక్షను గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించగా, ఏప్రిల్ 21 నుంచి మే 2 వరకు రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటి ఫలితాలను యూపీఎస్సీ మంగళవారం ప్రకటించగా, దేశవ్యాప్తంగా మొత్తం 143 మంది విజేతలుగా నిలిచారు. ఈ జాబితాలో తెలంగాణ యువకుడు చోటుసాధించాడు. గోదావరిఖనికి చెందిన చెరుకు అవినాష్ రెడ్డి ఆలిండియా 40వ ర్యాంకు సొంతం చేసుకుని సత్తా చాటాడు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో మూడు సార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లిన అతడు.. లక్ష్యాన్ని వీడకుండా ప్రయత్నించి ఇప్పుడు విజయం సాధించాడు. అవినాష్‌రెడ్డి తండ్రి చెరుకు నర్సింహారెడ్డి సింగరేణి ఓసీపీ–3లో ఫిట్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి రాజమణి గృహిణి. ఆయన సోదరుడు అమెరికాలో ఎంఎస్ చేస్తున్నాడు. సివిల్స్ సాధించడంలో అమ్మ, నాన్న, అన్న ప్రోత్సాహం ఎంతో ఉందని అవినాష్ తెలిపాడు. బీటెక్ పూర్తికాగానే హైదరాబాద్‌లో రూమ్ తీసుకుని సొంతంగానే ప్రిపరేషన్ మొదలుపెట్టినట్లు అవినాష్ తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీతోపాటు కరెంట్ అఫైర్స్ కోసం వార్తాపత్రికలు చదివినట్లు చెప్పారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1 ఫలితాల్లో 61వ ర్యాంకు సాధించానన్నారు. సరైన ప్రణాళికతో ముందుకు సాగితే అనుకున్న గోల్ సాధించవచ్చని చెప్పాడు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


మండపానికి సహజ సిద్ధంగా ఏర్పాటుచేసిన శిల్పాలు


అందమైన డిజైన్లతో ఉన్న స్తంభాలు


శిల్పాలు, శిలాశాసనాల సమూహం

అద్భుత శిల్పాల మ్యూజియం

గత వైభవాన్ని చాటుతున్న అలంపూర్ పురావస్తు ప్రదర్శనశాల ★ పర్యాటకులను మైమరిపించే శిల్ప సౌందర్యం ★ అంతర్జాతీయ ప్రదర్శనలతో ఖ్యాతి

అలంపూర్: అద్భుత శిల్పాల రమణీయం పురాతన శిల్ప సౌందర్యంలోనే కన్పిస్తుంది. పురాతన ఇతిహాసాలు, గాథలు, ప్రకృతి వింతలు, విశేషాలు, రాజరికపు గుర్తులు, సిరి సంపదలు, మనుషుల వేషధారణ, సంప్రదాయం వంటి అనేక అంశాలను శిల్పులు తమ శిల్ప కళ ద్వారా భావితరాలకు తెలియజేసే ప్రయత్నం చేశారు. పురాతన చరిత్ర కలిగిన ప్రాంతాల్లో ఇలాంటి శిల్ప సంపదలు దర్శనమిస్తాయి. పురాతన ఇతిహాసాలకు, శిల్ప సౌందర్య కళకు అలంపూర్ పుట్టినిల్లుగా విరాజిల్లుతోంది. ఇక్కడ వెలసిన పురాతన ఆలయాల్లో శిల్పుల కళానైపుణ్యం పర్యాటకుల మనసులను రంజింపజేస్తాయి. అక్కడక్కడ కనిపించే శిల్పాలే పర్యాటకుల మనసులను ఆహ్లాదపరిస్తే.. అబ్బురపరిచే శిల్ప సమూహం ఒకే చోట కనిపిస్తే శిల్పాకళా ప్రేమికుల ఉల్లాసానికి అవధులుండవు. అలాంటి అద్భుత శిల్పాల సమూహం అలంపూర్ క్షేత్రం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ ప్రాంతంలో లభించిన పురాతన, అరుదైన శిల్పాలను పురావస్తు శాఖ ఒక చోట భద్రపరిచింది. అదే పురాతన శిల్పాల ప్రదర్శన క్షేత్రం. పురావస్తు మ్యూజియంగా ఏర్పాటుచేసి పర్యాటకుల సందర్శనకు అందుబాటులో ఉంచారు.

1952లో ప్రారంభం..

అలంపూర్‌లోని పురావస్తు ప్రదర్శనశాలను 1952లో ప్రారంభించారు. ఆలయాల పరిసర ప్రాంతాలతో పాటు సమీప గ్రామాల్లో లభించిన శిలా శాసనాలు, విగ్రహాలు అన్నింటినీ సేకరించి సిద్ధుల మఠంగా పిలవబడే మండపంలో మ్యూజియాన్ని ఏర్పాటుచేశారు. అప్పటి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ ఈ మ్యూజియాన్ని ప్రారంభించారు. ఇందులో 26 శిలా శాసనాలు, 188 శిలా విగ్రహాలు ఉన్నాయి. క్షేత్రానికి వచ్చే పర్యాటకులు మ్యూజియాన్ని సందర్శించే అవకాశం కల్పించారు.

మ్యూజియంలో విశేషం ఇది..

ఉత్తరవాహిణి తుంగభద్ర నదీ తీరాన వెలసిన అలంపూర్ క్షేత్రం ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతోంది. దేశంలో ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీజోగుళాంబ అమ్మవారి ఐదవ శక్తి పీఠం ఇక్కడ ఉంది. కోటి లింగాల క్షేత్రంగా అలంపూర్ ప్రసిద్ధిగాంచి.. దక్షిణకాశీగా పిలవబడుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తి పీఠంగల క్షేత్రంగా ఖ్యాతి దక్కించుకుంది. ఇక్కడ ఉన్న ఆలయాల్లో ప్రాచీన శిల్పకళకు అద్దంపట్టే శిల్పాలు పర్యాటకులను ఉల్లాసపరుస్తాయి. ఈ క్షేత్రంలో మరో అద్భుతమైన ప్రదేశం పురావస్తు ప్రదర్శనశాల. 6వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దం వరకు రాజుల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, వారిచే ఆరాధించబడిన దేవతా మూర్తుల విగ్రహాలు ఇక్కడ కొలువుదీరాయి. 6వ శతాబ్దంలోని బాదామి చాళుక్యుల కళాసంస్కృతికి ఇక్కడ వెలసిన శిల్పాలు నిదర్శనంగా ఉన్నాయి. 1500 ఏళ్ల క్రితం అలంకారానికి ఉపయోగించిన ఆభరణాలు, అప్పటి మహిళల వేషధారణ ఇక్కడి విగ్రహాలలో చూడవచ్చు. ఈ ప్రదర్శనశాలలో వీరాంగవీరులు (భర్త, భార్య ఇద్దరూ శత్రువులతో పోరాడి వీరమరణం పొందిన వారు), వీరుగల్లు, వీరశిలా విగ్రహాలు, వారి బల ప్రదర్శనలు నేటికీ స్పష్టంగా కనిపిస్తాయి. సతీ సహగమనానికి సంబంధించిన విగ్రహాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్శణగా నిలుస్తున్నాయి.


అలంపూర్‌లోని పురావస్తు మ్యూజియం

అంతర్జాతీయ ఖ్యాతి..

అలంపూర్‌లో లభ్యమై పురావస్తు మ్యూజియంలో భద్రపరిచిన శిల్పాలు దేశ విదేశాల్లో ఖ్యాతిని తెచ్చిపెడుతున్నాయి. ఇక్కడ ఏర్పాటుచేసిన శిల్పాలు కేవలం సందర్శనలకే గాక ప్రపంచ పురావస్తు శిల్పాల ప్రదర్శనలకు వెళ్లి అరుదైన గౌరవాలను దక్కించుకున్నాయి. 1977లో ఇక్కడి నటరాజ మూర్తి విగ్రహాన్ని లండన్‌లో ప్రదర్శించడం జరిగింది. అలాగే 1984లో సూర్య విగ్రహాన్ని జర్మనీలో, 2008లో సూర్య, నాగ, మహిషాసురమర్ధిని విగ్రహాలను బెల్జియంలో ప్రదర్శించగా ఖ్యాతి గడించాయి.

మంత్రముగ్ధులను చేసే విగ్రహాలు..

శిల్పాచార్యులు స్థానికంగా లభించే నల్లరాతి శిలతో అందంగా నటరాజ విగ్రహాన్ని చెక్కారు. ఈ విగ్రహంలో కనిపించే శరీర సౌష్టవాలు నాట్యభంగిమలు నాట్యకళాకారులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. అదే విధంగా 7–8 శతాబ్దాలకు చెందిన సూర్య విగ్రహం కూడా మెత్తటి ఎర్రఇసుక, రాతిని ఉపయోగించి తయారు చేశారు. 'సప్తాస్వ రథసమారూఢం'అన్నట్టుగా ఏడు గుర్రాలతో ఒకే చక్రం కలిగిన రథం, ఉషా, ఛాయా సమేతంగా సూర్య విగ్రహాన్ని అందంగా మలిచి ఉన్న ఈ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటుంది. ఇక 6–7 శతాబ్దాలకు చెందిన నాగబంధ విగ్రహాన్ని పరిశీలిస్తే.. పద్మ బంధంలో ఏడు తలలు కలిగి మానవ ఆకృతిని పోలి ఉన్న నాగబంధ విగ్రహం కళాకారులను మనసు దోచుకుంటుంది. 7–8 శతాబ్దాలకు చెందిన మహిషాసురమర్ధిని విగ్రహం కూడా అలనాటి దేవీభాగవతాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపిస్తుంది. అసుర సంహారం కోసం మహిషాసురిడిని సంహరించి మహిషి తలపై తాండవం చేస్తున్నట్టు ఆదిపరాశక్తి అభయ ముద్రలో దర్శనమిస్తుంది. అలాగే అలనాటి వైభవాన్ని చాటి చెప్పే స్తంభాలను నేటి తరాలవారిని అదరహో అనిపిస్తాయి. ఈ స్తంభంపై మలచబడిన శిల్పా ఆకృతులను పరిశీలిస్తే పట్టుచీరలపై ఉన్న బార్డర్ల డిజైన్‌లు తలపిస్తున్నాయి.



నంది వాహనంపై శివపార్వతులు

నంది వాహనంపై శివపార్వతులు..


పరమశివుడి రూపం ఎక్కడ చూసినా లింగరూపంలోనే దర్శనమిస్తుంది. సతీ సమేతుడై ఉన్న పార్వతీ పరమేశ్వరుడు నంది వాహనంపై ఆశీనులై దర్శనమివ్వడం అనేది చాలా అరుదు. కానీ అలంపూర్‌లో మాత్రం దేవతా స్వరూపంలో, అది కూడా శివుడు పార్వతీ సమేతుడై నంది వాహనంపై కూర్చుని ఉండటం ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. అలాంటి విగ్రహం చూడాలంటే అలంపూర్ మ్యూజియానికి రావాల్సిందే.

శిలాశాసనం ద్వారా తెలిసేదేమిటంటే..

ఆలయాల మనుగడ కోసం ఆనాటి రాజులు ఎన్నో భూములను మాణ్యాలుగా సమర్పించారు. సూర్య, చంద్రులు ఉన్నంత వరకు ఈ మాణ్యాలు ఆలయాలకు చెందాల్సిందేనని.. అలాంటి మాణ్యాలను ఎవరైనా హస్తగతం చేసుకుంటే గోవధ చేసినంత పాపం వస్తుందని తెలియజేస్తూ ఆ శాసనంపై సూర్య, చంద్రులు, లింగం, ఆవు, ఖడ్గం వంటి బొమ్మలతో శిలాశాసనం చేశారు. అది హలగన్నడ లిపిలో కనిపిస్తుంది.


మ్యూజియంలో వివిధ రూపాల శిల్పాలు



క్రీ.శ. 7-8 శతాబ్ది సూర్య విగ్రహం


క్రీ.శ. 8వ శతాబ్దికి చెందిన మహిషాసురమర్దిని విగ్రహం


శిలాశాసనంపై ఉన్న చిత్రాలు


మ్యూజియంలో భద్రపరిచిన శిలాశాసనం


క్రీ.శ. 6-7 శతాబ్ది నాటి నాగబంధం


క్రీ.శ 11-12 శతాబ్ది నాటి నటరాజ విగ్రహం

ఆపరేషన్ సిందూర్‌తో రాజకీయాలా?

• మాజీ ఎంపీ వీహెచ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చవకబారు రాజకీయాలు చేస్తున్నారని, ఆపరేషన్ సిందూర్‌ను కూడా ఆయన రాజకీయం కోసం వాడుకునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులపై కూడా వ్యాఖ్యలు చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. వీహెచ్ మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి దేశభక్తి గురించి నేర్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన చరిత్ర రాహుల్‌గాంధీ కుటుంబానిదని వీహెచ్ పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని పోటీదారులకు చూపించరా?

• మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన పోటీదారులకు ట్యాంక్‌బండ్ సమీపంలోని భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా చూపించాలని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు ఇప్పటికే రాష్ట్రంలోని పర్యాటక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలైన నాగార్జునసాగర్, చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్, వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి, యాదగిరిగుట్టను దర్శించుకు న్న విషయాన్ని ప్రస్తావించారు. కేసీఆర్ పాలనలో నిర్మితమైన కమాండ్ కంట్రోల్ సెంటర్, సెక్రటేరియట్ భవనాన్ని కూడా ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు సందర్శించారని, అయితే సెక్రటేరియట్ పక్కనే ఉన్న 125 అడుగులు భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని వారికి చూపించకుండా సీఎం రేవంత్ ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడంపై పూర్తి వివరాలతో త్వరలో పార్టీ స్పందిస్తుందని వినోద్ కుమార్ అన్నారు.

జర్నలిస్టు మునీర్ కుటుంబానికి అండ

• ఐజేయూ, టీయూడబ్ల్యూజే భరోసా

సాక్షి, హైదరాబాద్: హఠాత్తుగా అనారోగ్యానికి గురైన సీనియర్ పాత్రికేయుడు మునీర్ కుటుంబానికి అండగా ఉంటామని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్ అలీ, కె.రాంనారాయణలు మంగళవారం ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు. మునీర్ వైద్య చికిత్స ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు వారు తెలిపారు. మునీర్ కుటుంబం ఆందోళన చెందవద్దని, అన్నివిధాలా వారికి తమ సంఘం చేయూతనిస్తుందని భరోసా ఇచ్చారు.

ప్రొఫెసర్ నర్లికర్ మృతిపై సీఎం సంతాపం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జయంత్ నర్లికర్ మరణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆస్ట్రోఫిజిక్స్‌లో అత్యుత్తమ పరిశోధనలతో ఎన్నో సేవలందించారని కొనియాడారు. ప్రత్యేకంగా కాస్మోలజీలో పరిశోధనలు, ఆధునిక విజ్ఞానంపై చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా నర్లికర్ విశిష్ట గుర్తింపు పొందారని చెప్పారు. భవిష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధనలకు ఆయన మార్గదర్శి అని సీఎం కొనియాడారు. నర్లికర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



'మల్లు' ఇంట పచ్చళ్లు

మామిడి పచ్చడి తయారు చేసిన డిప్యూటీ సీఎం సతీమణి

మధిర: మధిరలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క మంగళవారం మామిడి పచ్చడి తయారు చేశారు. ఏటా బంధువులతో పాటు కార్యాలయ ఉద్యోగులు, గన్‌మన్ల కోసం ఆమె పచ్చడి తయారు చేసి అందించడం దశాబ్దకాలంగా ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం స్థానిక మహిళలతో కలిసి పచ్చడి సిద్ధం చేశారు.

ఆదాయ వనరులను అన్వేషించండి

ఎక్సైజ్ అధికారులకు కమిషనర్ హరికిరణ్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ శాఖలో అన్ని స్థాయిల్లో నేరాలను అరికట్టాలని, అదే విధంగా ఆదాయ వనరులను పెంపొందించడంపై దృష్టి సారించి పనిచేయాలని ఆ శాఖ కమిషనర్ సి. హరికిరణ్ దిశానిర్దేశం చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులతో మంగళవారం సాయంత్రం అబ్కారీ భవన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసింతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4 నెలల కాలంలో క్రైమ్ రేటు, రెవెన్యూ రాబడుల గురించి చర్చించారు. భవిష్యత్ కార్యాచరణపై ఎక్సైజ్ అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాబోయే వర్షాకాలంలో 25 లక్షల తాటి, ఈత వనాలను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ దిశగా అధికారులు ముందుకెళ్లాలని సూచించారు. త్వరలోనే మొక్కల పెంపకంపై మంత్రి స్థాయిలో కూడా సమీక్ష జరుగుతుందన్నారు. గంజాయితో పాటు డ్రగ్స్, మిథనాల్ వినియోగంపై నిఘా పెట్టాలని, కామారెడ్డి లాంటి ఘటనలు మరోమారు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్‌డీపీఎల్ లిక్కర్‌పై గట్టి నిఘా పెట్టాలని సూచించారు. కానిస్టేబుల్ నుంచి అన్ని స్థాయిల్లో పదోన్నతులు, బదిలీలు త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఖురేషి, జాయింట్ కమిషనర్లు కె.ఎ.బి. శాస్త్రి, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ నోటీసులు చెల్లవు

• మహాశక్తి ఆలయ వినతిని పరిశీలించాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన మహాశక్తి ఆలయ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ 2016లో జారీ చేసిన నోటీసులను హైకోర్టు కొట్టివేసింది. దేవాదాయ చట్టం నుంచి మినహాయింపు ఇవ్వాలన్న ధర్మకర్త బండి సంజయ్ విజ్ఞప్తిని పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దేవాదాయ చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని 2016, జూలై 12న అసిస్టెంట్ కమిషనర్ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ మహాశక్తి తరఫున బండి సంజయ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ విచారణ చేపట్టారు. 2010లో ఆలయాన్ని నిర్మించి, నిర్వహణ బాధ్యతలను హంపి విద్యారణ్య పీఠం విద్యారణ్య భారతి స్వామిజీకి అప్పగించినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఆలయంలో హుండీ పెట్టలేదని, పూజలకు ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదని చెప్పారు. చట్టంలోని సెక్షన్ 154 కింద మినహాయింపు ఇవ్వాలని సర్కార్‌ను కోరామన్నారు. దేవాదాయ చట్టం సెక్షన్ 1(3)(బీ) ప్రకారం.. హుండీ ఉన్నా లేకున్నా, పూజలకు రుసుము వసూలు చేయకున్నా ఆలయం ప్రైవేట్‌ది కాదని జీపీ మంగీలాల్ నాయక్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నోటీసులు జారీ చేసి తొమ్మిదేళ్లయినా సెక్షన్ 6 కింద ఆలయాల జాబితాను అధికారులు పేర్కొనలేదన్నారు. ఈ నోటీసులు చెల్లవని చెబుతూ.. మినహాయింపుపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

బీఎల్ సంతోష్‌తో.. బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి భేటీ

రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి.. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. అనంతరం రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్‌తోనూ అంజిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ జరిగిందని అంజిరెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు.. బీజేపీ పటిష్టానికి పనిచేయాలని పార్టీ పెద్దలు సూచించినట్లు తెలిపారు.

నాగం పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

'పాలమూరు'ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని జనార్దన్‌రెడ్డి ఆరోపణ

సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన వ్యవహారంలో మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ నాగం దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. అయితే ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టులో మూడు పిటిషన్లు కొట్టివేశారని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల తరఫున వాదనలు అసంపూర్తిగా జరిగాయి. వాదనలను తదుపరి విచారణలో వినిపించాలంటూ ధర్మాసనం విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

ఎల్కతుర్తి తరహాలోనే డల్లాస్‌లో సభ

పెప్పర్ ఎరేనాలో ఏర్పాట్లు పరిశీలించిన బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ తరహాలోనే.. అమెరికాలోని డల్లాస్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం గ్లోబల్ కో–ఆర్డినేటర్ మహేశ్ బిగాల ప్రకటించారు. జూన్ 1న జరగనున్న ఈ సభకు.. అమెరికా నలుమూలల నుంచి తెలుగు, తెలంగాణ సంఘాలతో పాటు ప్రవాస భారతీయులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. జూన్ 1న సభ జరగనున్న డల్లాస్‌లోని డీఆర్ పెప్పర్ ఎరేనాను.. పార్టీ నేతలతో కలిసి మహేశ్ బిగాల మంగళవారం సందర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఎరేనాను సందర్శించిన వారిలో బీఆర్‌ఎస్ యూఎస్ సలహా సంఘం చైర్మన్ తన్నీరు మహేశ్, శ్రీనివాస్ సురభి, హరీష్ రెడ్డి, శ్రీనివాస్ సురకంటి తదితరులు ఉన్నారు.


అలల పోటు తక్కువగా ఉన్నప్పుడు నది ప్రవాహానికి అడ్డువైపులా పేరుకుపోయిన ఇసుక


నీటి ప్రవాహంలో మార్పు రావడంతో ఒకవైపునకు తిరిగి ప్రవహిస్తున్న నది


నీటితో నిండుగా ఉన్న నది


ఉధృతంగా ప్రవహిస్తున్న నది

• సాగర సంగమం.. ప్రతీ సారి కొత్తగా..

మీరు ఎప్పుడైనా భీమిలి బీచ్‌కు వచ్చారా? విశాఖ జిల్లాలోని మిగతా బీచ్‌ల కంటే ఈ బీచ్ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడ ఉన్న లైట్‌హౌస్ దగ్గర నుంచి తీరం ఒంపులు తిరుగుతూ కనిపిస్తుంది. చూడటానికి భలే ముచ్చటగా ఉంటుంది. అంతే కాదు.. గోస్తనీ నది సముద్రంలో కలిసే 'సాగర సంగమం' ఇంకా అద్భుతంగా ఉంటుంది. తూర్పు కనుమల్లోని అనంతగిరి కొండల్లో జన్మించిన గోస్తనీ నది విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ప్రవహించి, చివరకు భీమిలి వద్ద సముద్రంలో కలుస్తుంది. అయితే సముద్రంలో కలిసే ముందు ఇక్కడి విశాలమైన ప్రాంతంలో నీళ్లు నిలిచిపోయి.. అదొక ప్రత్యేక నదిలాగా కనిపిస్తుంది. నీళ్లు తగ్గినప్పుడు ఇసుక తిన్నెలు కూడా ఏర్పడతాయి. ఈ ప్రదేశం ఎప్పుడూ ఒకేలా ఉండదు. నీళ్ల ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ఒకలా, తక్కువగా ఉన్నప్పుడు మరోలా ఉంటుంది. దీని వల్ల ఈ రోజు మీరు చూసిన దృశ్యం కొన్ని రోజుల తర్వాత పూర్తిగా మారిపోతుంది. మళ్లీ చూసినప్పుడు నది మరోచోట సముద్రంలో కలుస్తున్నట్లు కనిపిస్తుంది. ఇసుక తిన్నెలు కూడా వేరే ఆకారంలో ఉంటాయి. ఇలాంటి మార్పులు ఈ సాగర సంగమం దగ్గర మాత్రమే కనిపిస్తాయి. అందుకే ఇక్కడికి వచ్చే సందర్శకులకు ప్రతీసారి ఒక కొత్త అనుభూతి కలుగుతుంది. 'అరే.. పోయినసారి వచ్చినప్పుడు ఇలా లేదు కదా!' అని ఆశ్చర్యపోవడం ఖాయం. - భీమునిపట్నం

అలల చెంత.. 'రంగుల' కలగానే.!



దాదాపు ఐదేళ్ల కిందట భారీ తుఫాన్‌తో అలల ధాటికి కొట్టుకువచ్చి విశాఖలోని తెన్నేటి పార్క్ ఒడ్డుకు చేరిన ఎంవీ మా షిప్.. ప్రస్తుతం పర్యాటక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ షిప్‌ను చూసేందుకు ప్రతి రోజూ పర్యాటకులు వస్తున్నారు. అయితే కేవలం చూడటమే కాదు.. ఈ భారీ షిప్ ఎప్పుడు రెస్టారెంట్‌గా రూపుదిద్దుకుంటుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి ఈ షిప్‌ను పర్యాటక డెస్టినేషన్‌గా మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో టూరిజం శాఖ సిద్ధమైంది. అన్ని అనుమతులు తీసుకొని పర్యాటక కేంద్రంగా మార్చాలని అనుకుంది. కానీ ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయి. ఇటీవల కాలంలో ఈ షిప్‌కు మళ్లీ రంగులు వేయడం మొదలుపెట్టినా.. ఒకవైపు మాత్రమే వేసి మధ్యలో వదిలేశారు. ఈ షిప్ రెస్టారెంట్‌గా మారి సరికొత్త అనుభూతినిస్తుందని పర్యాటకులు ఎదురుచూస్తుండగా.. వారి ఆశ మాత్రం కలగానే మిగిలిపోతోంది. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

పర్యాటక ప్రచారానికి రూ.78 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి పేరుతో కార్యక్రమాలు నిర్వహణకు ప్రభుత్వం రూ.78 కోట్లను విడుదల చేసింది. ఏపీ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లో పర్యాటక ఆకర్షణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. మెగా ఈవెంట్స్, జిల్లాలో టూరిజం పండుగలు, ఇతర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా టూరిజం క్యాలెండర్‌కు అనుగుణంగా నిధులు వెచ్చించాలని పర్యాటక శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

టీటీడీ సీవీఎస్‌వోగా మురళీకృష్ణ

సాక్షి, అమరావతి: టీటీడీ ముఖ్య నిఘా–భద్రతాధికారి(సీవీఎస్‌వో)గా కేవీ మురళీకృష్ణను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం విశాఖపట్నంలోని 16వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న మురళీకృష్ణను టీటీడీ సీవీఎస్‌వోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెడ్‌క్యాప్ జీఎంగా శ్రీనివాస్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ–నెడ్‌క్యాప్) జనరల్ మేనేజర్(జీఎం)గా కె.శ్రీనివాస్‌ని ప్రభుత్వం నియమించింది. నెడ్‌క్యాప్ జీఎంగానే ఆయన ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. కాగా అదే స్థానంలో ఏడాది పాటు కాంట్రాక్టు విధానంలో పనిచేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) కమిషన్ చైర్మన్‌గా కేఎస్ జవహర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ఎంఎం నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ మహిళా శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పీతల సుజాతను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీచేశారు. కాగా, జవహర్, సుజాత పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది.

తల్లిదండ్రులు కోరుకునేది ఇంగ్లిష్ మీడియమే..

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియం బోధన కోరుకుంటున్నారు. వారి విజ్ఞప్తి మేరకే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను అందుబాటులోకి తెచ్చారు' అని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు మీడియం ఉండాలని ఉపాధ్యాయ సంఘాలు కోరడం హాస్యాస్పదంగా ఉంది. తల్లిదండ్రులే తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇంగ్లిష్ మీడియం కావాలని పట్టుబడుతుంటే ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలుగు మీడియం కావాలని కోరుకోవడం అవివేకం' అని సురేష్ పేర్కొన్నారు.

నెల పాటు యోగాంధ్ర–2025

మంత్రి సత్యకుమార్ యాదవ్

సాక్షి, అమరావతి: యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పించడానికి బుధవారం నుంచి నెల రోజుల పాటు యోగాంధ్ర–2025 కార్యక్రమం నిర్వహిస్తామని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖలో జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వెల్లడించారు. ప్రధాని హాజరయ్యే కార్యక్రమంలో ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వేదికగా రెండున్నర లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొనేలా ప్రణాళిక రచించామన్నారు. అలాగే రెండు కోట్ల మంది ప్రజల్ని భాగస్వామ్యం చేయాలనే లక్ష్యం పెట్టుకున్నామన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో యోగాంధ్ర కౌంట్ డౌన్ మొదలవుతుందన్నారు.

బొప్పాయి.. లాభమేనోయి..



- ఎకరాకు 30 టన్నుల దిగుబడి
- టన్ను కాయలకు రూ.5 వేల రాబడి
- సాగుకు రైతుల మొగ్గు

దేవరపల్లి: పొగాకు, జీడిమామిడి పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో ప్రత్యామ్నాయంగా పండ్ల తోటల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా బొప్పాయి సాగుతో లాభాలు సాధిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని 326 హెక్టార్లలో రైతులు బొప్పాయి సాగు చేస్తున్నారు. ముఖ్యంగా కడియం, అనపర్తి, దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు మండలాల్లో దీని సాగు అధికంగా ఉంది. తెగుళ్లను తట్టుకునే రకాల మొక్కలను మహారాష్ట్ర నుంచి తీసుకుని వచ్చి, తోటలు వేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. బొప్పాయిలో అనేక రకాల వంగడాలున్నప్పటికీ ఎక్కువ మంది పింక్, కో–786, తైవాన్ రెడ్ లీడ్, స్వీట్ బరీ రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మొక్క వేసిన 9 నెలల్లో కాపు వస్తోంది. రెండు నుంచి నాలుగేళ్ల పాటు ఎకరాకు 30 నుంచి 40 టన్నుల చొప్పున దిగుబడి వస్తోంది. దిగుబడి బాగుంటే నాలుగేళ్ల వరకూ తోటలు ఉంటాయి. కొంత మంది రెండేళ్లకే తోటలను తొలగిస్తున్నారు. మొదటి రెండేళ్లు దిగుబడి, పండు నాణ్యత, సైజు బాగుంటాయి. ఒక్కో పండు 2 నుంచి 4 కిలోల బరువు ఉంటుంది. ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తోందని, పెట్టుబడి రూ.60 వేల నుంచి రూ.70 వేలు అవుతోందని చెబుతున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు

- బొప్పాయి పండుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి.
- ఇది జీర్ణ వ్యవస్థను మెరుగు పరుస్తుంది.
- చర్మం, కంటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
- బరువు తగ్గడానికి, గుండె సంబంధిత సమస్యల నివారణకు తోడ్పడుతుంది.
- బొప్పాయిలో సమృద్ధిగా లభించే విటమిన్‌–సి దంతాల చిగుళ్ల ఆరోగ్యానికి, రక్తవృద్ధికి, రోగ నిరోధక శక్తి పెంపుదలకు తోడ్పడుతుంది.
- విటమిన్‌–బి నోటిపూత, తెల్లమచ్చలు, పెదాల పగుళ్లు రాకుండా కాపాడుతుంది.
- కెరోటిన్, ఎ, బి, సి, ఇ విటమిన్లు, ఖనిజాలు, ఫ్లేవొనాయిడ్‌లు, ఫోలేట్‌లు, పాంథోనిక్ ఆమ్లాల వంటి పోషకాలు బొప్పాయి పండులో పుష్కలంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.
- ఇన్ని విధాల ఆరోగ్యం కలిగించేది కావడంతో బొప్పాయి పండును ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు.

కోల్‌కతా, ఒడిశాకు ఎగుమతి

వేసవి అనంతరం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు బొప్పాయి తోటలు వేస్తారు. నల్ల నేలలు, ఇసుక, రాతి నేలలు దీని సాగుకు అనుకూలంగా ఉంటాయి. రాతి నేలలు, కొండ ప్రాంతాల్లో ఈ పంట పండదు. ఏటా మార్చి నుంచి జూన్ వరకూ దిగుబడి వస్తుంది. ఈ ప్రాంతంలో పండించిన బొప్పాయి కాయలు, పండ్లను ఒడిశా, భువనేశ్వర్, కోల్‌కతా వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఒడిశాలోని పలు ప్రాంతాల్లో బొప్పాయి కాయలు కూరగా వండుకొని తింటూంటారు. దీంతో, ఆ ప్రాంతాలకు పచ్చి కాయలు కూడా ఎగుమతి చేస్తున్నారు. వేసవిలో పండ్లకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. స్థానికంగా ఉన్న పండ్ల వ్యాపారులు తోటల్లోకి వచ్చి పండు కాయలు కొనుగోలు చేస్తారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో కిలో రూ.10 పలికింది. ప్రస్తుతం రూ.5 పలుకుతోంది.

పల్లంట్ల నుంచి కోల్‌కతాకు ఎగుమతి అవుతున్న బొప్పాయి కాయలు



దిగుబడి బాగుంది



నేను నాలుగెకరాల్లో బొప్పాయి పంట వేశాను. రెండు కోతలు జరిగాయి. ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను కాయలకు రూ.10 వేలు లభించాయి. ప్రస్తుతం టన్ను కాయలు రూ.5 వేలు పలుకుతున్నాయి. రావులపాలెం, అమలాపురం ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కాయలు కొనుగోలు చేసి, కోల్‌కతా, భువనేశ్వర్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ధర బాగుంటే మంచి ఆదాయం వస్తుంది. జులైలో తోట వేయగా, ఫిబ్రవరిలో కాపునకు వచ్చింది. మహారాష్ట్ర నుంచి మొక్క రూ.23 చొప్పున కొనుగోలు చేసి తెచ్చాను. ఎకరాకు 700 మొక్కలు పడతాయి. కాయ సైజు, నాణ్యత బాగున్నాయి.

– కూచిపూడి రాజు, రైతు, పల్లంట్ల, దేవరపల్లి మండలం

కొవ్వూరు డివిజన్‌లో అధికం



బొప్పాయి సాగు కొవ్వూరు డివిజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. రాజమహేంద్రవరం డివిజన్‌లోని కడియం, అనపర్తి ప్రాంతాల్లో అక్కడక్కడ తోటలు వేశారు. వాతావరణం అనుకూలించి, తెగుళ్లు లేకుండా ఉంటే రైతులకు ఇది లాభదాయకమైన పంట. రైతులు ఇప్పుడిప్పుడే బొప్పాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

– బి.సుజాత కుమారి, జిల్లా ఉద్యాన అధికారి, రాజమహేంద్రవరం

అగ్రి కోర్సులతో పచ్చని కెరీర్

టెన్త్ తర్వాత ఇంటర్.. అది పూర్తికాగానే ఇంజనీరింగ్ లేదా మెడిసిన్... మనలో చాలా మంది ఆలోచన ఇదే. అయితే ప్రస్తుత మార్కెట్ అవసరాల దృష్ట్యా సర్టిఫికెట్ కోర్సులకూ భారీగా డిమాండ్ నెలకొంది. పది, ఇంటర్ తర్వాత పలు సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేస్తే తక్కువ సమయంలోనే ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. ఇలాంటి కోర్సుల్లో అగ్రికల్చర్ కోర్సులు అగ్రస్థానంలో నిలుస్తున్నాయి.

తక్కువ ఫీజులకే కోర్సులు


రెడ్డిపల్లిలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల

బుక్కరాయసముద్రం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రూ.లక్షల్లో ఖర్చు పెట్టి ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారి కంటే అతి తక్కువ ఖర్చుతో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసిన వారు తొందరగా ఉద్యోగాలు దక్కించుకుని జీవితంలో స్థిరపడుతున్నారు. అలాంటి సర్టిఫికెట్ కోర్సుల్లో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులు ముందు వరుసలో నిలుస్తున్నాయి. వ్యవసాయాధరిత అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో తక్కువ ఖర్చుతో మంచి డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2 ఏళ్ల కోర్సు పూర్తి చేస్తే ఎంత లేదన్నా.. మరో 2 ఏళ్లలో ఉద్యోగం గ్యారంటీ అనే నమ్మకం ఇప్పటికే ప్రజల్లో పాతుకుపోవడంతో రోజురోజుకూ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. అనంతపురం జిల్లా రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, కళ్యాణదుర్గం కేవీకేలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. అలాగే శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు అనంతపురం, కదిరి, తాడిపత్రిలో ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

కావలసిన విద్యార్హతలు..

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు పెద్దగా విద్యార్హతలతో పని లేదు. ప్రధానంగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉంటే చాలు. ఆసక్తి ఉన్న వారు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. ఈ నెలాఖరులోపు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దరఖాస్తు చేయడానికి, మరింత సమాచారానికి https:// angrau.ac.in/ వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సి ఉంటుంది.



అగ్రికల్చర్ కోర్సులు ఇవే

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల నుంచి మూడేళ్ల కాల వ్యవధి ఉన్న పలు కోర్సులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా..

కోర్సు	కాల వ్యవధి
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్	3 ఏళ్లు
డిప్లొమా ఇన్ హోంసైన్స్	3 ఏళ్లు

సీట్ల కేటాయింపు, ఫీజులు ఇలా..

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు నిబంధనలు వర్తిస్తాయి. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బాలికలకు 33 శాతం సీట్లు, అంగవైకల్యం కలిగిన వారికి 3 శాతం సీట్లు కేటాయించారు. పదో తరగతిలో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశ అర్హత దక్కిన వారు ఏడాదికి రూ.8,800 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. హాస్టల్ వసతి కావాలనుకునేవారు రూ.11వేలు డిపాజిట్ చేయాలి. కోర్సు పూర్తి అయిన తర్వాత డిపాజిట్ సొమ్మును వెనక్కు చెల్లిస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో అయితే రూ.29 వేలు ఫీజు, హాస్టల్‌కు రూ.5,500 చెల్లించాలి. కళాశాలలో చేరే విద్యార్థులు నిర్ణీత దరఖాస్తు ఫారంను పూరించి జనరల్ విద్యార్థులు అయితే రూ.500, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులైతే రూ.250 డీడీ తీసి అందజేయాలి.


ఉజ్వల భవిష్యత్తు



అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులకు చాలా డిమాండ్ ఉంది. ఈ కోర్సులు అభ్యసిస్తే సత్వరమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి గానుత్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందజేయాలి. ఉజ్వల భవిష్యత్తు ఉన్న అగ్రి కోర్సులు పూర్తి చేసిన వారు ఆధునాతన వ్యవసాయం, డెయిరీ ఫాం, పాడి, ఎరువుల కంపెనీలు, వ్యాపారం వంటి రంగాలను ఎంచుకుని జీవితంలో స్థిరపడవచ్చు.

– డాక్టర్ వసుంధర, ప్రిన్సిపాల్, రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

బదిలీతో సరి.. చర్యలేవి మరి



- ఆర్టీపీపీ ఫ్లైయాష్‌ను కొల్లగొట్టిన ఇంటి దొంగలు
- బూడిద బూచోళ్లు దొరికినా.. శిక్ష ఏదీ?
- కేవలం స్థానచలనంతో మమ
- శాఖాపరమైన చర్యలకు జెన్‌కో అధికారులు వెనకడుగు

సాక్షి ప్రతినిధి, కడప: ఉద్యోగులు ఆయా సంస్థల శ్రేయస్సు కోసం పాటుపడాలి. నిబద్ధతతో పని చేసే వారు.. ఎవరైనా అలానే వ్యవహరిస్తారు. ఉద్యోగం ముసుగులో అక్రమాలకు తెరలేపుతూ, తిన్నంటి వాసాలు లెక్కపెట్టే వారిని ఉపేక్షించడం సహించరాని నేరం. అయితే ఆర్టీపీపీలో ఇందుకు భిన్నంగా జరిగింది. కొందరు అధికారులు అవినీతి తిమింగళాలుగా మారి.. ఆ సంస్థలోని ఫ్లైయాష్ (బూడద)ను దోచేశారు. వారిని గుర్తించిన జెన్‌కో ఉన్నతాధికారులు.. బదిలీలతో సరిపెట్టి చేతులు దులుపుకొన్నారు. బూడిద బూచోళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సాహసం చేయడం లేదు. విచారణతో సరిపెట్టి నివేదిక తొక్కి పెట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులకు పెత్తందారుల అండ ఉండటంతో.. ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

» బినామీ కంపెనీలు పెట్టి..

ఆర్టీపీపీలో ఫ్లైయాష్ విక్రయాల్లో అక్రమాలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు అధికారులు.. బినామీ కంపెనీలు పెట్టి, వాటి ద్వారా ఫ్లైయాష్ కొల్లగొట్టారనే ఆరోపణలు వచ్చాయి. శ్రీగణేష్, మణికంఠ, ఆర్వీజీ, శ్రీకృష్ణ లాజిస్టిక్స్ పేరుతో.. ఆర్టీపీపీ అధికారులు వేమెంటుతో నిమిత్తం లేకుండా ఫ్లైయాష్ తరలించే వారు. దీనిపై ఆరోపణలు రావడంతో.. గతేడాది అక్టోబర్ 28న విజిలెన్స్ విచారణ మొదలై నవంబర్‌లో ముగిసింది. విచారణ అనంతరం ఇద్దరు అధికారులను ఒడిస్సా, ఒకరిని శ్రీశైలానికి బదిలీ చేశారు. అంతటితో జెన్‌కో అధికారులు చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

విచారణ పూర్తయినా..

ఆర్టీపీపీలో ఫ్లైయాష్ కేటాయింపులు, బినామీ కంపెనీలతో కొల్లగొట్టిన వైనం.. విజిలెన్స్ విచారణలో నిగ్గు తేలింది. ఒక ఫ్లైయాష్ ట్యాంకర్‌పై రూ.20 వేల అక్రమ ఆదాయం పొందినట్లు తెలుస్తోంది. ఇలా రోజూ లక్షలాది రూపాయలు అక్రమార్కుల జేబుల్లోకి చేరింది. అనంతరం ఏప్రిల్ 10, 11వ తేదీల్లో శాఖాపరమైన విచారణను అధికారులు నిర్వహించారు. 40 రోజులు పూర్తి కావస్తున్నా.. ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నివేదిక సీల్డ్ కవర్లు సజావుగా మేనేజింగ్ డైరెక్టర్‌కు చేరాయా? అధికారులను కాపాడేందుకు.. పెత్తందారులు ఇచ్చిన కవర్లు ఏమైనా అడ్డుకున్నాయా? అనే అనుమానాలు ఆర్టీపీపీ ఉద్యోగుల్లో లేకపోలేదు. చిన్నాచితక ట్రాన్స్‌ఫోర్టర్లను కడుపు కొట్టి.. బినామీల పేరుతో ట్రాన్స్‌ఫోర్టు నిర్వహించిన అధికారులపై చర్యలు బదిలీతోనే సరిపెట్టారా? శాఖాపరమైన చర్యలు తీసుకోరా? ఇలాగైతే ఆర్టీపీపీలో అక్రమార్కులను ఎలా నిలవరించగలరని విశ్లేషకులు నిలదీస్తున్నారు. అసలు విషయం జెన్‌కో ఎండీ వరకూ వెళ్లిందా, లేదా అని ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేయడం వెనుక.. ఇప్పటికీ శాఖాపరమైన చర్యలు లేకపోవడమేనని పలువురు వివరిస్తున్నారు.

సాక్షి ప్లస్
బుధవారం ॥ 21-5-2025

సాగుబడి

కృత్తిక కార్తె: ఏప్రిల్ 24 వరకు
రోహిణి కార్తె: 25 నుంచి



బీ హ్యాపీ

'బీ' (BEE) అంటే తేనెటీగ!

తేనెటీగలను మనం హేపీగా ఉంచితే అవి మనల్ని సుసంపన్నంగా, హేపీగా ఉంచుతాయి.

తేనెటీగ గుర్తురాగానే అతి మధురమైన తేనె గుర్తొస్తుంది.

తేనె ఒక్కటే కాదు.. మనం తినే ప్రతి మూడు ముద్దల్లో కనీసం ఒక ముద్ద తేనెటీగల పుణ్యమే!

తేనెటీగలు శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకలు. 556 తేనెటీగలు పనిచేసి అర కిలో తేనెను తయారు చేస్తాయి.

తేనెకోసమని పూలపై వాలి పుప్పొడి సేకరించే క్రమంలో మనకు ఆహారాన్ని అందించే పంటల పరపరాగ సంపర్కానికి దోహదపడుతున్నాయి.

తేనెటీగలు అంతరిస్తే నాలుగేళ్లలోనే మానవ జాతి అంతరిస్తుంది అన్నాడో మహనీయుడు.

అయితే, ఆ పంటల కోసం మనం చల్లే పురుగుమందులే వాటి మనుగడకు పెనుముప్పుగా మారిపోయాయి.

తేనెటీగలతో పాటు సీతాకోకచిలుకలు, చిమ్మటలు, కందిరీగలు, పెంకు పురుగులు, పక్షులు, గబ్బిలాలు కూడా మొక్కల్లో పరాగ సంపర్కానికి, తద్వారా ప్రకృతి పచ్చదనానికి దోహదపడుతున్నాయి.

ఇరవై వేల రకాల తేనెటీగల జాతులు ప్రకృతిలో ఉన్నాయి. మన అశ్రద్ధ వల్ల వీటి సంతతి 40% అంతరించిపోతోంది.

తేనెటీగలు మనకు చేసే మేలును తలచుకొని, వాటి సంరక్షణ కార్యాచరణకు ఉపక్రమింపజేయాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే 20న అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవాన్ని జరుపుతూ ఉంటుంది. ఈ సంవత్సరం 'మనందరికీ పోషకాలందించే తేనెటీగల పరిరక్షణకు ప్రకృతి నుంచి స్ఫూర్తి పొందండి' అని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది!

తేనెటీగల దినోత్సవం మే 20నే ఎందుకు?

ప్రతి ఏటా అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవం మే 20వ తేదీన జరుపుకుంటున్నాం. ఆ రోజే ఎందుకు అంటే..? తేనెటీగల గురించి పరితపించి, ప్రపంచానికే వాటి విలువను చాటి చెప్పిన అంటోన్ జాన్సా పుట్టిన రోజు కాబట్టి. ఈయన స్లొవేనియాలో 1734 మే 20న పుట్టారు. ఆధునిక తేనెటీగల సేద్యానికి పితామహుడిగా గుర్తింపు పొందారాయన. ఆయన చదువుకున్నది చిత్రకళ విద్య. కానీ, ఆయన మనసంతా తేనెటీగలపైనే. అందువల్ల వాటిపై అధ్యయనం చేసి తేనెటీగలను పెంచటంలో పద్ధతులను ఆయన అభివృద్ధి చేశారు. జర్మన్ భాషలో తేనెటీగల పెంపకంపై పుస్తకం ప్రచురించారు కూడా. ఆయన కృషి తేనెటీగల పెంపకం పద్ధతులను ఎంతో మెరుగుపరచింది. స్లొవేనియా ప్రభుత్వ చొరవ వల్ల 2018 నుంచి ఆయన స్మృతిలో మే 20న తియ్యటి తేనెటీగల సంరక్షణ చర్యల గురించి ఆలోచించటం, చర్చించుకోవటం ద్వారా అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.



తేనెటీగల సంరక్షణకు మనం ఏం చెయ్యగలం?

తేనెటీగల ఉసురు తీస్తున్న పురుగుమందులు, కలుపుమందులు, పచ్చదనం కొరత, వ్యాధికారక క్రిముల విజృంభణ వంటి సమస్యలకు ఇప్పుడు అదనంగా 'వాతావరణ మార్పులు' తోడయ్యాయి. అంచేత, కరువు, కుంభవృష్టి వంటి వాతావరణ మార్పు ప్రభావాల నుంచి మనల్ని మనం కాపాడుకుంటూ తేనెటీగలను సైతం కనిపెట్టుకొని ఉండాలి.

అటవీ ప్రాంతాలను నాశనం చేయకుండా ఉండటం..

గ్రామీణ ప్రాంతాల్లో పొలాల గట్ల మీద రకరకాల స్థానిక రకాల పూల మొక్కల్ని పెంచటం..

అంతేకాదు, నగరాలు, పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో, మిద్దె తోటల్లో, పెరటి తోటల్లో, ముఖ్యంగా రోడ్ల పక్కన ఖాళీ జాగాల్లో కూడా చెట్లతోపాటు అనేక రకాల స్థానిక జాతుల పూల మొక్కల్ని తేనెటీగల సంరక్షణ కోసం పనిగట్టుకొని విస్తృతంగా పెంచటం..

రసాయనిక పురుగు మందులు, కలుపు మందులు చల్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవటం.. సాధ్యమైనంత వరకు రసాయనికేతర పురుగుమందులు/ జీవన పురుగుమందులు/ కషాయాలు వాడుకోవటం..

పంట పొలాల దగ్గర్లో తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించటం వంటి పనులను మనం చేస్తుంటే జీవవైవిధ్యం పరిఢవిల్లుతుంది. పనిలో పనిగా తేనెటీగలు వంటి చిరుజీవులు మనుగడ సాగించగలుగుతాయి, మనకు ఆహార భద్రతను ఇస్తాయి! అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవం సందర్భంగా ఈ చిరుజీవుల సేవలను గుర్తెరుగుదాం!

తేనెటీగలు మరియు పోలినేషన్ గురించి వాస్తవాలు







తేనెటీగల్లో అపిస్ మెల్లిఫెర వంటి 11 ముఖ్యమైన జాతులున్నాయి. తేనెటీగలన్నీ కుట్టవు. కుట్టని జాతులు వందలాదిగా ఉన్నాయి. కొన్ని సమాజాల్లో తేనెటీగలకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వైద్య సంబంధమైన ప్రాధాన్యం ఉంది. ఫలానా ప్రాంతంలో తేనెటీగలను బట్టి అక్కడి ప్రకృతి సుసంపన్నతను అంచనా వేస్తున్నారు.

వ్యవసాయం ద్వారా చేకూరుతున్న ఆర్థిక విలువలో సుమారు పది శాతం తేనెటీగలు తదితర పొలినేటర్ల వల్ల జరుగుతున్నదేనని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) తాజాగా అంచనా వేసింది.

తేనెటీగల పంట 10%



2 లక్షల జాతుల జంతువులు, కీటకాలు, పురుగులు పరపరాగ సంపర్కాని(పొలినేషన్)కి దోహదపడుతున్నాయి. అందులో చాలా వరకు అటవీ జాతులే. వీటిలో 20 వేల రకాలు తేనెటీగలు ఉన్నాయి.



పొలినేషన్ ఫలితంగా ఎన్నో వైవిధ్యభరితమైన, పోషకవంతమైన పండ్లు, కూరగాయలు, గింజ పంట జాతులు మంచి దిగుబడులు ఇవ్వగలుగుతున్నాయి.

తేనెటీగలు, పక్షులు, గబ్బిలాలు వంటి పొలినేటర్లు 87 ప్రధాన ఆహార పంటల దిగుబడులకు దోహదపడుతున్నాయి.

మనం తినే ఆహారంలో మూడింట రెండొంతుల వరకు పొలినేటర్ల ద్వారానే సమకూరుతోంది.



ప్రకృతి వ్యవసాయం లేదా సుస్థిర వ్యవసాయం దిశగా పరివర్తన జరగాలంటే అది తొలుత తేనెటీగలు, ఇతర పొలినేటర్ల పరిరక్షణ చర్యలతోనే ప్రారంభం కావాలి.

ప్రపంచవ్యాప్తంగా పూలు పూచే వృక్ష జాతుల్లో సుమారు 90% వరకు (సుమారు 3,08,000 జాతులు) ఎంతో కొంతైనా ఈ పొలినేటర్లపై ఆధారపడే పునరుత్పత్తి ప్రక్రియను పూర్తిచేసుకుంటున్నాయి.

మామిడి, పుచ్చ, ఉల్లి...

ప్రకృతిలో తేనెటీగల వంటి చిరుప్రాణులు లేకపోతే మన మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. మొక్కల్లో పూలు కాయలుగా మారడానికి పరాగ సంపర్కమే కారణం. ఈ ప్రక్రియకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపకరిస్తూ పంటల ఉత్పాదనలో ఈ చిరుప్రాణులు తోడ్పడటం వల్లనే మనం మూడు పూటలా తినగలుగుతున్నాం. మనం తింటున్న ప్రతి మూడో ముద్ద ముఖ్యంగా తేనెటీగల పుణ్యమే. తేనెటీగలు లేకపోతే ఎన్నో రకాల పంటలు పండవు. ప్రపంచవ్యాప్తంగా 75% ఆహార పంటలు పొలినేటర్ల సహాయంతో జరిగే పరాగ సంపర్కంపై ఆధారపడి ఉన్నాయి. ముఖ్యంగా తేనెటీగలపై బాదం, ఉల్లి, గుమ్మడి, ఆపిల్, మామిడి, పుచ్చ, ఆవాలు, పొద్దుతిరుగుడు పంటల దిగుబడి ఆధారపడి ఉంది.





నేషనల్ హనీబీ మిషన్

తేనెటీగల పరిరక్షణ, శాస్త్రీయ పద్ధతుల్లో పెంపకాన్ని ప్రోత్సహించడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. భారత ప్రభుత్వం 2019-20లో నేషనల్ బీకీపింగ్ అండ్ హనీ మిషన్‌ను ప్రారంభించింది. ఖాదీ బోర్డు ఈ మిషన్ కింద అనేక ప్రోత్సాహక పథకాలను ప్రారంభించింది. ఈ ఏడాది ఆరు రాష్ట్రాల్లో 2,050 తేనెటీగల పెట్టెలను, తేనెటీగల సమూహాలను పంపిణీ చేసింది.

అదేవిధంగా స్లొవేనియా, ఇథియోపియా తేనెటీగల సంరక్షణకు వినూత్న పథకాలు చేపట్టాయి. విస్తారంగా భూముల సంరక్షణ చేపట్టడం, తేనెటీగల మనుగడకు దోహదం చేసే వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టడం, విద్యాసంబంధమైన ప్రచారోద్యమాన్ని చేపట్టటం, పట్టణ ప్రాంతాల్లో 'బీ పాత్స్' పేరిట సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయటం వంటి పనులు చేస్తున్నారు.





చిక్కుడు పంటలో బోలెడంత వైవిధ్యం ఉంది. మనకు తెలిసిన అన్ని చిక్కుడు కాయలు ఆకుపచ్చగానే ఉంటాయి. కాయ పొడవుగా, పలకగానో, గుండ్రంగానో ఉంటాయి. అయితే, కాయకు నాలుగు రెక్కలు ఉండే చిక్కుడు (వింగ్డ్ బీన్) వంగడం ఉంది. ఇది ఆకుపచ్చని రకం. ఇందులోనే ఊదా రంగులో ఉండే వింగ్డ్ బీన్స్ రకం ఒకటి ఉంది. అదే పర్పుల్ వింగ్డ్ బీన్.

పర్పుల్ వింగ్డ్ బీన్!

దక్షిణ ఆసియాలోని రైతులు, వినియోగదారులకు ఈ వింగ్డ్ బీన్ తెలుసు. దీనితో వివిధ రకాల ఉపయోగాలు ఉన్నాయని, వ్యాధి నిరోధకతకు దోహదం చేస్తుందని వారికి గమనిక ఉంది. మొక్క 3-4 మీటర్లు (9.8-13.1 అడుగులు) ఎత్తు పాకే తీగ జాతి కూరగాయ పంట ఇది. దీని గింజలతో పాటు ఆకులు, పువ్వులు, వేర్లు.. అన్నీ తినదగినవే. కాయలను పచ్చిగా లేదా ఉడికించి తినవచ్చు. గింజలను ఉడికించి తినొచ్చు. వేర్లు కూడా తినొచ్చు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, కాల్షియం, ఇనుముతో పాటు ఇతర పోషకాలు ఉంటాయి. నాటిన మూడు నెలల్లోనే కాయలు కోతకు వస్తాయి. పర్పుల్ బీన్ పువ్వులను సలాడ్‌గా తినొచ్చు. లేత ఆకులను కోసి పాలకూర మాదిరిగానే ఆకుకూరగా తయారు చేసుకోవచ్చు. వేర్లను పచ్చివి లేదా దుంపల్లా కాల్చుకొని తినొచ్చు. గింజలను సోయా బీన్స్ మాదిరిగా అనేక విధాలుగా ఉపయోగించుకోవచ్చు. గింజల్లో 20% ప్రొటీన్ ఉంటుంది. ఆకులు, పూలలో 10-15% ప్రొటీన్ ఉంటుంది. వింగ్డ్ బీన్స్ పంటకు చీడపీడల బెడద లేదని, ఒక్కసారి నాటితే మళ్లీ మళ్లీ దానంతట అదే పెరుగుతూ ఉంటుందని కర్ణాటకకు చెందిన సహజ సీడ్స్ సంస్థ ప్రతినిధి కృష్ణప్రసాద్ చెబుతున్నారు.



ఐపీవోకు 7 కంపెనీలు రెడీ

సెబీ తాజాగా గ్రీన్‌సిగ్నల్
- రూ. 3,000 కోట్ల సమీకరణ
- జాబితాలో క్రెడిలా ఫైనాన్షియల్, జెన్సన్స్, యూరో ప్రతీక్
- శ్రీ లోటస్ డెవలపర్స్, కాలిబర్ మైనింగ్, జారో ఇన్‌స్టిట్యూట్



న్యూఢిల్లీ: దేశీ స్టాక్ మార్కెట్లు ఇటీవల తిరిగి జోరందుకోవడంతో మరోసారి ప్రైమరీ మార్కెట్లకు జోష్ వస్తోంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం (2025–26)లో తొలిగా ఏథర్ ఎనర్జీ ఐపీవో ద్వారా రూ. 3,000 కోట్లు సమీకరించగా.. సుమారు 10 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌వైపు సాగుతున్నాయి. బొరానా వీవ్స్, బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూలు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ బాటలో మరో 7 కంపెనీలు సన్నాహాలు ప్రారంభించనున్నాయి. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ 7 కంపెనీలు ఉమ్మడిగా రూ. 3,000 కోట్లవరకూ సమీకరించే ప్రణాళికలు అమలు చేయనున్నాయి. ఇవన్నీ 2024 అక్టోబర్– 2025 జనవరి మధ్య కాలంలో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. వివరాలు చూద్దాం..

హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలా

గతంలో హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలాగా కార్యకలాపాలు నిర్వహించిన క్రెడిలా ఫైనాన్షియల్ సర్వీసెస్ కాన్ఫిడెన్షియల్(గోప్యత) పద్ధతిలో ప్రాస్పెక్టస్‌ను డిసెంబర్‌లో దాఖలు చేసింది. అంటే ప్రాస్పెక్టస్ వివరాలు గోప్యంగా ఉంచేందుకు వీలుంటుంది. కంపెనీ ప్రధానంగా విద్యాసంబంధ రుణాలను అందిస్తోంది.

ఆశిష్ కొచాలియా..

బాలీవుడ్ స్టార్స్‌తోపాటు.. సుప్రసిద్ధ ఇన్వెస్టర్ ఆశిష్ కొచాలియాకు పెట్టుబడులున్న శ్రీ లోటస్ డెవలపర్స్ అండ్ రియల్టీ ఐపీవో ద్వారా రూ. 792 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందుకు వీలుగా కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. ఐపీవో నిధుల ద్వారా అనుబంధ సంస్థలు రిచ్‌ఫీల్ రియల్టీ, ధ్యాన్ ప్రాజెక్స్, త్రిక్షా రియల్టీలో పెట్టుబడులు సమకూర్చనుంది. మరికొన్ని నిధులను నిర్మాణంలో ఉన్న అమల్ఫీ, ఆర్కేడియన్, వరుణ్ ప్రాజెక్టులపై వెచ్చించనుంది.

యూరో ప్రతీక్

వాల్ ప్యానల్ డెకొరేటివ్ పరిశ్రమలో కార్యకలాపాలు విస్తరించిన యూరో ప్రతీక్ ఐపీవో ద్వారా రూ. 730 కోట్లు అందుకునే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు కంపెనీ ప్రమోటర్లు తమ వాటాలో కొంత మేర విక్రయానికి ఉంచనున్నారు.

మైనింగ్, లాజిస్టిక్స్

నాగ్‌పూర్ కంపెనీ కాలిబర్ మైనింగ్ అండ్ లాజిస్టిక్స్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 600 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. దీనిలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. నిధులను రుణ చెల్లింపులు, పెట్టుబడి వ్యయాలు, మెషీనరీ కొనుగోలు తదితరాలకు వినియోగించనుంది.

జారో ఇన్‌స్టిట్యూట్

ఐపీవోలో భాగంగా జారో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ రూ. 170 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్ మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 570 కోట్లు అందుకోవాలని చూస్తోంది. నిధులను బ్రాండ్ పటిష్టత, ప్రకటనలు, రుణ చెల్లింపులు తదితరాలకు వెచ్చించనుంది.

జెన్సన్స్ ఇండస్ట్రీస్


ఐపీవోలో భాగంగా జెన్సన్స్ ఇండస్ట్రీస్ రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా కంపెనీ ప్రమోటర్ మరో 94.61 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. నిధులను రుణ చెల్లింపులు, పెట్టుబడి వ్యయాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలు.. తదితరాలకు వెచ్చించనుంది.

జెమ్ అరోమాటిక్స్

స్పెషాలిటీ ఇన్‌గ్రెడియంట్స్ తయారీ ముంబై కంపెనీ జెమ్ అరోమాటిక్స్ ఐపీవోలో భాగంగా రూ. 175 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 89.24 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

'క్యాండిరే'కు ప్రచారకర్తగా షారుఖ్‌ఖాన్

ముంబై: కల్యాణ్ జువెలర్స్ అనుబంధ సంస్థ 'క్యాండిరే'కు ప్రచారకర్తగా నటుడు షారుఖ్‌ఖాన్ వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ''షారుఖ్‌ఖాన్ నటన, నైపుణ్యాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన ప్రచారం ద్వారా బ్రాండ్‌కు మరింత గుర్తింపు లభిస్తుంది'' అని కంపెనీ డైరెక్టర్ రమేశ్ కల్యాణరామన్ పేర్కొన్నారు. క్యాండిరేతో భాగస్వామ్యం పట్ల షారుఖ్ సంతోషం వ్యక్తం చేశారు. సంస్థతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు.



తయారీలో భారత్ ముందడుగు

- అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు ఎంతో ఆకర్షణీయం
- ఎస్‌అండ్‌పీ అధ్యయనం



న్యూఢిల్లీ: తయారీ రంగంలో భారత్ ఎంతో పురోగతి సాధించిందని, అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు ఎంతో ఆకర్షణీయంగా మార్చిందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ అధ్యయనం పేర్కొంది. అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రస్తుతం జరుగుతున్న మార్పులు దీర్ఘకాలంలో భారత్‌కు ప్రయోజనం కలిగిస్తాయని అభిప్రాయపడింది. ఈ మేరకు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రీసెర్చ్ అధ్యయన నివేదికను విడుదల చేసింది. అభివృద్ధి చెందుతున్న పరిణామాలు, వాణిజ్య సవాళ్లకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థలు మారుతున్నందున.. ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకుని తన తయారీ వృద్ధిని వేగవంతం చేసుకోగలదని, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో మరింత బలంగా అనుసంధానం కాగలదని ఈ నివేదిక అంచనా వేసింది. స్థానికంగానే విడిభాగాల సమీకరణ, తుది మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా ఉండడం, ప్రాంతీయ అనుసంధానత పెంచుకోవడం ద్వారా భారత్ తయారీ రంగం మరిన్ని అదనపు పెట్టుబడులను ఆకర్షించొచ్చని సూచించింది. భారత్ అత్యాధునిక టెక్నాలజీ సామర్థ్యాలను, తయారీ పోటీతత్వాన్ని పెంచుకోవడం ద్వారా తయారీలో అదనపు ఉపాధి అవకాశాలను కల్పించొచ్చని పేర్కొంది. సరఫరా వ్యవస్థ వైవిధ్యంలో భాగంగా మధ్యకాలం నుంచి దీర్ఘకాలంలో భారత్‌కు ప్రయోజనం లభిస్తుందని వివరించింది. 2024–25లో భారత జీడీపీ వృద్ధి నిదానించినప్పటికీ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉన్నట్టు గుర్తు చేసింది. భారత వృద్ధిలో ఎగుమతులపై ఆధారపడడం మోస్తరుగానే ఉన్నట్టు తెలిపింది. ఈ సానుకూలత వల్లే అంతర్జాతీయ వాణిజ్యం, టారిఫ్ విధానాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న మార్పుల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోదని పేర్కొంది. భారత స్థూల జీడీపీలో తయారీ విలువ 17.2 శాతంగా ఉన్నట్టు తెలిపింది. ఇటీవలి తయారీ పీఎంఐ గణాంకాలు పటిష్టంగా ఉండడాన్ని ప్రస్తావించింది.

నియంత్రణ అనుమతుల్లో జాప్యంతో అనిశ్చితులు



- పర్యవేక్షణే కాదు సత్వర అనుమతులూ అవసరం
- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: నియంత్రణపరమైన అనుమతుల్లో జాప్యం అనిశ్చితికి దారితీయడంతోపాటు, వాణిజ్యపరమైన ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కఠినమైన పర్యవేక్షణ కొనసాగిస్తూనే వేగవంతమైన, పోటీకి హాని చేయని సులభ అనుమతులు అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 16వ వ్యవస్థాపక దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతారామన్ పాల్గొని మాట్లాడారు. సమర్థతను పెంచే పోటీని ప్రోత్సహిస్తూ సరళీకరణ స్ఫూర్తిని కాపాడడంలో, ఆవిష్కరణలు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడడంలో సీసీఐ కీలక సంస్థగా అవతరించినట్టు మంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, నియంత్రణలు సైతం అవరోధాలుగా మారి పోటీని ప్రభావితం చేయరాదన్నారు. నేటి వేగవంతమైన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నియంత్రపరమైన అనుమతుల్లో జాప్యం అనిశ్చితులకు దారితీస్తాయని, సకాలంలో వాణిజ్య కార్యకలాపాలకు అవరోధం కల్పిస్తాయని మంత్రి అభిప్రాయపడ్డారు. అంతిమంగా లావాదేవీల ప్రయోజనానికి నష్టం కలిగిస్తాయన్నారు. ''ఈ విషయం ప్రపంచవ్యాప్తంగా ప్రభావాన్ని చూపిస్తుంది. ఎందుకంటే వివిధ దేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు నిర్వహిస్తున్నప్పుడు.. నియంత్రణ సంస్థల చురుకుదనం, సన్నద్ధతను ఇన్వెస్టర్లు గమనిస్తారు''అని మంత్రి పేర్కొన్నారు. న్యాయ పోరాటం, పరిష్కారానికి పట్టే సమయం లేక నియంత్రణ సంస్థలు తక్కువ పారదర్శకంగా ఉండే పరిస్థితుల్లో చర్చలు సంక్లిష్టంగా మారే అవకాశముంటుందన్నారు. అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం భారత్ చర్చలు నిర్వహిస్తున్న తరుణంలో మంత్రి చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. స్వేచ్ఛాయుత, పారదర్శక మార్కెట్ కేవలం ఆర్థిక అవసరాల కోసమే కాకుండా, ప్రజాస్వామికంగానూ అవసరమేనన్నారు. ఎగుమతులు, ఇంధన, పర్యావరణ సవాళ్ల మధ్య దేశీ వృద్ధి చోదకాలపై ఎక్కువగా ఆధారపడుతున్నప్పుడు నియంత్రణలు, స్వేచ్ఛ మధ్య సరైన సమతూకం అవసమని అభిప్రాయపడ్డారు.

టోరెంట్ ఫార్మా లాభం 11 శాతం అప్



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో టో ఫార్మా నికర లాభం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) 11 శాతం పెరిగి రూ. 498 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 449 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 2,745 కోట్ల నుంచి రూ. 2,959 కోట్లకు ఎగిసింది. వ్యయాలు రూ. 2,145 కోట్ల నుంచి రూ. 2,252 కోట్లకు పెరిగాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ. 10,728 కోట్ల నుంచి రూ. 11,516 కోట్లకు, లాభం రూ. 1,656 కోట్ల నుంచి రూ. 1,911 కోట్లకు పెరిగింది. రూ. 5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై కంపెనీ రూ. 6 తుది డివిడెండు ప్రకటించింది. గత త్రైమాసికంలో రూ. 26 మేర మధ్యంతర డివిడెండ్ చెల్లించింది. వారసత్వ ప్రణాళికల్లో భాగంగా గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా పెద్ద కుమారుడు అమన్ మెహతా మేనేజింగ్ డైరెక్టరుగా నియమితులైనట్లు కంపెనీ తెలిపింది. ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది.

గ్లాండ్ ఫార్మా లాభం రూ. 186 కోట్లు

GLAND PHARMA LIMITED

న్యూఢిల్లీ: ఫార్మా గత ఆర్థిక సంవత్సరం మార్చితో అంతమైన నాలుగో త్రైమాసికంలో రూ.186 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.192 కోట్లుతో పోల్చితే స్వల్పంగా తగ్గింది. కన్సాలిడేటెడ్ ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.1,537 కోట్ల నుంచి రూ.1,425 కోట్లకు వృద్ధి చెందింది. అమెరికా మార్కెట్ ఆదాయం 10 శాతం తగ్గి రూ.792 కోట్లకు పరిమితమైంది. యూరప్ ఆదాయం 4 శాతం పెరిగి రూ.280 కోట్లుగా ఉంది. దేశీ వ్యాపారం ఆదాయం ఫ్లాట్‌గా రూ.52 కోట్లుగా ఉంది. ఇతర మార్కెట్ల ఆదాయం 4 శాతం పెరిగి రూ.60 కోట్లుగా నమోదైంది. ఒక్కో షేరుకు రూ.18 చొప్పున డివిడెండ్‌కు కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంస్థ కన్సాలిడేటెడ్ లాభం రూ.698 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.772 కోట్లతో పోల్చితే 10 శాతం తగ్గింది. ఆదాయం రూ.5,665 కోట్ల నుంచి రూ.5,616 కోట్లకు పరిమితమైంది.

ఈ ఏడాది 6.5% మించి వృద్ధి

ఆర్‌బీఐ మరో విడత రేట్ల కోత ● పీహెచ్‌డీసీసీఐ సెక్రటరీ జనరల్ మెహతా



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ త్వరలోనే మరో విడత రేట్ల కోతను చేపడుతుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమ అంచనా 6.5 శాతం మించి వృద్ధి రేటు నమోదవుతుందని పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) సెక్రటరీ జనరల్, సీఈవో రంజిత్ మెహతా అభిప్రాయపడ్డారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం (ఎంఎస్‌ఎంఈ) అందుబాటు ధరలపై రుణాలు, టెక్నాలజీ, మార్కెట్ అవకాశాల పరంగా సవాళ్లను ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఈ అంశాలను ఆర్‌బీఐ తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. కనుక సమీప కాలంలోనే మరో విడత రేట్ల కోత ఉంటుందని అంచనా వేశారు. జూన్ 4–6 మధ్య ఆర్‌బీఐ ఎంపీసీ తదుపరి సమీక్ష జరగనుండడం గమనార్హం. ఎస్‌ఎంఈ మార్కెట్ సెంటిమెంట్ ఇండెక్స్ విడుదల కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సూచీ మార్చితో ముగిసిన త్రైమాసికంలో సానుకూలంగా ఉండడం గమనార్హం. 2024 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఉన్న 50 స్థాయిలోనే మార్చిలోనూ కొనసాగింది. ఎస్‌ఎంఈ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ మాత్రం 57.7 పాయింట్లతో బలంగా నమోదైంది.

ఏజీఎస్ హెల్త్‌కేర్ రేసులో బ్లాక్‌స్టోన్ ముందంజ



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ ఐటీ సేవల సంస్థ ఏజీఎస్ హెల్త్ కొనుగోలు రేసులో ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ ముందంజలో ఉన్నట్లు సమాచారం. గత వారం బిడ్లు దాఖలు అనంతరం మిగతా పోటీ సంస్థలతో పోలిస్తే కంపెనీని దక్కించుకునే విషయంలో బ్లాక్‌స్టోన్ మెరుగైన స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వేల్యుయేషన్ సుమారు 1.1 –1.3 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని పేర్కొన్నాయి. టీపీజీ–జనరల్ అట్లాంటిక్ కన్సార్షియం, ఫ్రేజియర్ పార్ట్‌నర్స్, విట్రువియన్ పార్ట్‌నర్స్ కూడా ఏజీఎస్ హెల్త్ కోసం పోటీపడుతున్నాయి. 2019లో ఏజీఎస్ హెల్త్‌ను ఈక్యూటీ ప్రైవేట్ క్యాపిటల్ ఏషియా (గతంలో బేరింగ్ ప్రైవేట్ ఈక్విటీ ఏషియా) 320 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. కంపెనీలో సుమారు 13,000 మంది రెవెన్యూ సైక్లింగ్ మేనేజ్‌మెంట్ (ఆర్‌సీఎం) నిపుణులు, 150 పైచిలుకు క్లయింట్లు ఉన్నారు. అమెరికాలోని టాప్ 20 ప్రముఖ హాస్పిటల్స్‌లో దాదాపు సగం ఆస్పత్రులకు సర్వీసులు అందిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-5-2025	
విశాఖ	545–00
చిత్తూరు	623–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,875
ఎన్ఎస్ఈ	1,16,851
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,87,349
ఎఫ్ఐఐ	- 10,016
డీఐఐ	+ 6,736


ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.02	$ 62.14
బ్రెంట్	65.38	$ 65.54

మార్చి త్రైమాసిక ఫలితాలు

ఫైజర్ రూ. 165 డివిడెండ్

క్యూ4లో రూ. 331 కోట్లు



న్యూఢిల్లీ: ఫార్మా రంగ దిగ్గజం ఫైజర్ లిమిటెడ్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 85 శాతం దూసుకెళ్లి రూ. 331 కోట్లను తాకింది. ఆస్తుల విక్రయం, బదిలీ కారణంగా ఆర్జించిన వన్‌టైమ్ లాభం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 179 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 8 శాతం పుంజుకుని రూ. 592 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 547 కోట్ల టర్నోవర్ నమోదైంది. మొత్తం వ్యయాలు రూ. 378 కోట్ల నుంచి రూ. 384 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. థానేలోని భూమితోపాటు, భవనాలు ఇతర నిర్మాణాలను జోటిస్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్‌కు విక్రయించడం ద్వారా రూ. 173 కోట్ల అనూహ్య లాభం ఆర్జించినట్లు కంపెనీ వెల్లడించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 165 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. దీనిలో 75వ వసంతంలోకి ప్రవేశించిన కారణంగా రూ. 100 ప్రత్యేక డివిడెండ్, ఆస్తుల అమ్మకంతో ప్రకటించిన మరో రూ. 35 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉన్నాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఫైజర్ నికర లాభం రూ. 551 కోట్ల నుంచి రూ. 768 కోట్లకు జంప్ చేసింది. మొత్తం ఆదాయం రూ. 2,193 కోట్ల నుంచి రూ. 2,281 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో ఫైజర్ షేరు బీఎస్ఈలో 11% దూసుకెళ్లి రూ. 4,945 వద్ద ముగిసింది.

మ్యాక్స్ హెల్త్‌కేర్ లాభం జూమ్

క్యూ4లో రూ. 376 కోట్లు



న్యూఢిల్లీ: ఆరోగ్య పరిరక్షణ సంస్థ మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 21 శాతం జంప్‌చేసి రూ. 376 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 311 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 29 శాతం ఎగసి రూ. 2,429 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 1,888 కోట్ల టర్నోవర్ నమోదైంది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. వైశాలిలోగల మ్యాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆనుకుని ఉన్న భూమి కొనుగోలు పూర్తయినట్లు సంస్థ చైర్మన్, ఎండీ అభయ్ సోయ్ పేర్కొన్నారు. తద్వారా అత్యంత రద్దీగా ఉండే ఈ ఆసుపత్రి విస్తరణను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే విస్తరణ చేపట్టిన సాకెట్, నానావతి, మొహాలీ ఆసుపత్రులు మూడు నెలల్లో ఉమ్మడిగా 1,500 పడకల సామర్థ్యాన్ని అందుకోనున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో మ్యాక్స్ హెల్త్ షేరు బీఎస్ఈలో 2% నష్టంతో రూ. 1,165 వద్ద ముగిసింది.

వర్ల్‌పూల్ లాభం హైజంప్

- షేరుకి రూ. 5 డివిడెండ్



న్యూఢిల్లీ: కన్జూమర్ డ్యురబుల్స్ దిగ్గజం వర్ల్‌పూల్ ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 50 శాతం జంప్‌చేసి రూ. 119 కోట్లను అధిగమించింది. అమ్మకాలు పుంజుకోవడంతోపాటు, అనుకోని లాభం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 79 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,734 కోట్ల నుంచి రూ. 2,005 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 1,660 కోట్ల నుంచి రూ. 1,890 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 224 కోట్ల నుంచి రూ. 363 కోట్లకు జంప్ చేసింది. మొత్తం ఆదాయం రూ. 6,830 కోట్ల నుంచి రూ. 7,919 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో వర్ల్‌పూల్ షేరు బీఎస్ఈలో 0.2 శాతం బలపడి రూ. 1,296 వద్ద ముగిసింది.

మొబిక్విక్‌కు పెరిగిన నష్టాలు

మార్చి క్వార్టర్‌లో రూ.56 కోట్లు




న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ (మొబిక్విక్) నష్టాలు మార్చితో ముగిసిన త్రైమాసికంలో మరింత పెరిగాయి. రూ.56 కోట్ల నష్టాన్ని కంపెనీ ప్రకటించింది. రుణ వ్యాపారం ద్వారా మార్జిన్లు తక్కువగా ఉండడం ఇందుకు దారితీసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ నష్టం కేలం రూ.60 లక్షలుగానే ఉంది. గత ఎనిమిది త్రైమాసికాల్లో ఆరింటిలో తాము లాభాలను నమోదు చేశామని.. గత రెండు త్రైమాసికాలుగా ఎబిట్డా ప్రతికూలంగా ఉండడానికి రుణ వ్యాపారం నుంచి వచ్చే మార్జిన్ తక్కువగా ఉండడం వల్లేనని కంపెనీ ఫైనాన్స్ హెడ్ కోమల్ శరణ్ తెలిపారు. తక్కువ రుణ వితరణ వల్లే మార్జిన్ ఆదాయం తగ్గినట్టు చెప్పారు. భవిష్యత్ వృద్ధికి అధిక పెట్టుబడులు కొనసాగిస్తామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్ తర్వాతి నుంచి వృద్ధి కోలుకుంటుందన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 2 శాతం నష్టపోయి రూ. 274 వద్ద ముగిసింది.

లాభాల్లో పెట్రోనెట్ రికార్డు

మార్చి క్వార్టర్‌లో ఆల్‌టైమ్ గరిష్టం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఇంధన సంస్థ పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ కంపెనీ చరిత్రలోనే త్రైమాసికం వారీ గరిష్ఠ లాభాన్ని నమోదు చేసింది. మార్చి త్రైమాసికానికి రూ.1,070 కోట్లను ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో లాభం రూ.738 కోట్లతో పోల్చితే 23 శాతం పెరిగింది. ఇందులో పే చార్జీల కింద వచ్చిన రూ.361 కోట్లు కూడా కలసి ఉంది. ఆదాయం మాత్రం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.13,793 కోట్ల నుంచి 11 శాతం క్షీణించి రూ.12,315 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు 14 శాతం తగ్గి రూ.11,069 కోట్లకు పరిమితం కావడం లాభాల్లో గణనీయమైన వృద్ధికి సాయపడింది. వాటాదారుల వద్ద నున్న ప్రతీ షేరుకు రూ.3 చొప్పున డివిడెండ్‌ను ప్రకటించింది. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 9 శాతం పెరిగి రూ.3,973 కోట్లకు చేరుకుంది.

బీఎస్ఈలో కంపెనీ షేరు ఎలాంటి మార్పు లేకుండా రూ.321 వద్ద ముగిసింది.

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా నిలకడైన పనితీరు

లాభంలో 14 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ మార్చి త్రైమాసికంలో స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూస్తే 14 శాతం పెరిగి రూ.215 కోట్లకు చేరుకుంది. ఆదాయం రూ.2,149 కోట్లకు పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.189 కోట్లు, ఆదాయం రూ.2,061 కోట్లుగా ఉండడం గమనార్హం. వ్యయాలు రూ.2,060 కోట్ల నుంచి రూ.1,895 కోట్లకు తగ్గడం సానుకూలించింది. ఇక 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ లాభం రూ.6,481 కోట్లకు చేరింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.605 కోట్లుగానే ఉంది. టోల్ ఆదాయం గత ఆర్థిక సంవత్సరంలో 23 శాతం పెరిగి రూ.6,360 కోట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా టోల్ ఆదాయంలో వృద్ధి రేటు 12.5 శాతంగా ఉంటే, అంతకు మించి తమ ఆదాయం పెరిగినట్టు కంపెనీ సీఎండీ వీరేంద్ర మస్కర్ తెలిపారు.

బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక శాతం నష్టంతో రూ.50.69 వద్ద స్థిరపడింది.

‘ప్లే ఆఫ్స్’ బెర్త్ లక్ష్యంగా!



రాహుల్

- ఐపీఎల్‌లో నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబై ఇండియన్స్ కీలక పోరు
- ముంబై గెలిస్తే అధికారికంగా ‘ప్లే ఆఫ్స్’కు అర్హత
- ఢిల్లీ ఓడితే ‘ప్లే ఆఫ్స్’ ఆశలకు తెర
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. పాయింట్ల పట్టికలో తొలి మూడు స్థానాల్లో ఉన్న గుజరాత్ టైటాన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు ఇప్పటికే ‘ప్లే ఆఫ్స్’కు చేరగా... ఇక మిగిలిన ఒక్క స్థానం కోసం ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ అమీతుమీకి సిద్ధమయ్యాయి. వాంఖడే స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో ముంబై జట్టు గెలిస్తే ‘ప్లే ఆఫ్స్ బెర్త్’ను ఖరారు చేసుకోనుంది. దీంతో ఈ మ్యాచ్‌ను అభిమానులు క్వార్టర్ ఫైనల్‌గా అభివర్ణిస్తున్నారు. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 12 మ్యాచ్‌లాడిన ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ 7 విజయాలు, 5 పరాజయాలతో 14 పాయింట్లు ఖాతాలో వేసుకొని నాలుగో స్థానంలో ఉండగా... ఢిల్లీ క్యాపిటల్స్ 12 మ్యాచ్‌ల్లో 6 విజయాలు, 5 పరాజయాలు, ఒక మ్యాచ్ రద్దుతో 13 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఇరు జట్ల మధ్య గత నెలలో జరిగిన పోరులో ముంబైనే విజయం వరించింది. అటు బౌలింగ్ ఇటు బ్యాటింగ్‌లో సమతూకంగా ఉన్న ముంబై ఇండియన్స్ జట్టు సొంతగడ్డపై జరగనున్న పోరులో ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ సాధించలేకపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఎలాంటి పోరాటం కనబరుస్తుందో చూడాలి!

అన్ని రంగాల్లో పటిష్టంగా...

సీజన్ ఆరంభంలో పెద్దగా ఆకట్టుకోలేకపోయినా... ఆ తర్వాత రాకెట్‌లా దూసుకొచ్చిన ముంబై ఇండియన్స్ అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. గత ఏడు మ్యాచ్‌ల్లో ఆరింట నెగ్గిన హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై జట్టు ఆల్‌రౌండర్లతో దట్టంగా ఉంది. సీజన్‌లో 63.75 సగటుతో 510 పరుగులు చేసిన సూర్యకుమార్ జట్టు తరఫున టాప్ స్కోరర్ కాగా... రికెల్టన్ 336, రోహిత్ శర్మ 300, తిలక్ వర్మ 246 పరుగులు చేశారు. గత మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓడిన ముంబై... తిరిగి పుంజుకుని సమష్టిగా సత్తాచాటాలని చూస్తోంది. రోహిత్ శర్మతో కలిసి రికెల్టన్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. వీరిద్దరూ కలిసికట్టుగా కదంతొక్కితే ఢిల్లీ బౌలర్లకు చిక్కులు ఖాయమే. ఇక సూర్యకుమార్, తిలక్ వర్మ, విల్ జాక్స్, హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్, కార్బిన్ బాష్‌తో మిడిలార్డర్ బలంగా ఉంది. లీగ్ దశ ముగియగానే రికెల్టన్, జాక్స్, బాష్ జట్టును వీడనున్నారు. బౌలింగ్‌లోనూ ముంబైకి మంచి ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. బుమ్రా, బౌల్ట్, దీపక్ చహర్, హార్దిక్ పాండ్యా పేస్ భారం మోయనుండగా... కరణ్ శర్మ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు. ఈ మ్యాచ్‌లో ఓడినా... ముంబై



జట్టుకు ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఉన్నప్పటికీ అవి ఇతర జట్ల జయాపజయాలపై ఆధారపడి ఉంటాయి.

స్టార్క్ లోటుతో!

అక్షర్ పటేల్ సారథ్యంలో ఈ సీజన్ ఆరంభంలో ఆశలు రేపిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆ తర్వాత లయ కోల్పోయింది. ఆరంభంలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదింట నెగ్గిన క్యాపిటల్స్... ఆ తర్వాత ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒక్క దాంట్లో మాత్రమే విజయం సాధించింది. 11 మ్యాచ్‌లు ఆడిన కేఎల్ రాహుల్ 61.63 సగటుతో 493 పరుగులు చేసి జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. అభిషేక్ పొరెల్ 295, ట్రిస్టన్ స్టబ్స్ 280, అక్షర్ పటేల్ 263 పరుగులు చేశారు. ఆరంభంలో మెరిపించిన అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్ ప్రభావం చూపలేకపోతుండగా... బౌలింగ్‌లో ఆ జట్టు స్టార్క్‌పై అతిగా ఆధారపడుతోంది. చావో రేవో మ్యాచ్‌లో అతడు లేకపోవడం జట్టుకు పెద్ద లోటుగా మారనుంది. గత మ్యాచ్‌లో చూసుకుంటే వికెట్లు చేతిలో ఉన్నా... ఆశించిన వేగంతో ఆడలేకపోయిన ఢిల్లీ జట్టు కేఎల్ రాహుల్ సెంచరీ సాయంతో 199 పరుగులు చేసింది. అయితే బౌలింగ్‌లో ఢిల్లీ ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడంతో గుజరాత్ జట్టు ఒక్క వికెట్ కూడా కోల్పోకుండానే లక్ష్యాన్ని ఛేదించింది. స్పిన్ త్రయం అక్షర్, కుల్దీప్, విప్రాజ్ ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారనే దానిపైనే ఢిల్లీ ‘ప్లే ఆఫ్స్’ భవితవ్యం ఆధారపడి ఉంది.

తుది జట్లు (అంచనా)


ముంబై ఇండియన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రోహిత్, రికెల్టన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, విల్ జాక్స్, నమన్ ధీర్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, కరణ్ శర్మ, ట్రెంట్ బౌల్ట్, బుమ్రా, అశ్వని కుమార్.

ఢిల్లీ క్యాపిటల్స్: అక్షర్ పటేల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, డు ప్లెసిస్, అభిషేక్ పొరెల్, స్టబ్స్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, నటరాజన్, కుల్దీప్ యాదవ్, ముస్తఫిజుర్, చమీరా.

వ్యభిచారం కేసులో ఒలింపిక్ చాంపియన్ అరెస్టు

- పోలీసుల స్టింగ్ ఆపరేషన్
- రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన అమెరికా స్టార్ రెజ్లర్ కైల్ స్నైడర్

కొలంబస్: అమెరికా స్టార్ రెజ్లర్ కైల్ స్నైడర్ వ్యభిచారం కేసులో అరెస్టయ్యాడు. 20 ఏళ్ల వయసులో రియో ఒలింపిక్స్ (2016)లో ఫ్రీస్టయిల్ 97 కేజీల విభాగంలో స్వర్ణ పతకం గెలిచిన స్నైడర్ టోక్యో ఒలింపిక్స్ (2020)లో రజత పతకం సాధించాడు. పిన్నవయసులో అమెరికా రెజ్లింగ్ చాంపియన్‌గా ఘనతకెక్కిన స్నైడర్‌ను వ్యభిచారం కేసులో ఈ నెల 9న అమెరికా పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో స్నైడర్ హోటల్ గదిలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. 29 ఏళ్ల స్నైడర్‌ను తాజాగా కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అతనికి 250 అమెరికన్ డాలర్లు (రూ. 21,386) జరిమానా విధించడంతో పాటు లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కోసం ఒక రోజంతా పని చేయాలని ఆదేశించారు. తీర్పు అనంతరం తన తప్పుపట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేసిన రెజ్లర్ ఇకపై సరైన నిర్ణయాలతో జీవితాన్ని కొనసాగిస్తానని, తన తప్పువల్ల కుటుంబం పడిన వేదన తనకు అర్థమైందని వాపోయాడు. అతని భార్య మ్యాడీ ఫుట్‌బాల్ ప్లేయర్! రెండు వరుస ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన స్నైడర్ గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతక పోరులో ఓడి నాలుగో స్థానంలో నిలిచాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్నైడర్ మూడు స్వర్ణ పతకాలు (2015, 2017, 2022), రెండు రజత పతకాలు (2018, 2021), రెండు కాంస్య పతకాలు (2019, 2023) సాధించాడు. అమెరికాలోని నేషనల్ కాలేజ్ అథ్లెటిక్ అసోసియేషన్ (ఎన్‌సీఏఏ) క్రీడల్లో మూడుసార్లు చాంపియన్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా తన 12 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో స్నైడర్ 30 స్వర్ణ పతకాలు, 5 రజత పతకాలు, 7 కాంస్య పతకాలు గెలిచాడు. 199 బౌట్‌లలో నెగ్గి, 21 బౌట్‌లలో మాత్రమే ఓడిపోయాడు. ఇటీవలే అతను రియల్ అమెరికన్ ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ లీగ్‌లో పాల్గొనేందుకు కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు.



అడ్రియన్‌కు రజతం



బెర్లిన్: జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ రజత పతకంతో బోణీ చేసింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో అడ్రియన్ కర్మాకర్ భారత్‌కు రజత పతకాన్ని అందించాడు. అడ్రియన్ 626.7 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. జెస్పర్ జాన్సన్ (627 పాయింట్లు; స్వీడన్) స్వర్ణ పతకం సొంతం చేసుకోగా... లేక్ గ్రిఫిన్ (624.6 పాయింట్లు; అమెరికా) కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు.

ముంబై జట్టులోకి బెయిర్‌స్టో

గ్లీసన్, అసలంకలను కూడా తీసుకున్న మాజీ చాంపియన్

న్యూఢిల్లీ: ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ కొత్తగా ముగ్గురు విదేశీ ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. ఈ నెల 26 తర్వాత జాతీయ జట్టుకు అందుబాటులో ఉండేందుకు ముగ్గురు విదేశీ ఆటగాళ్లు ముంబై జట్టును వీడుతుండటంతో... ఫ్రాంచైజీ వారి స్థానాలను మరో ముగ్గురు విదేశీ ఆటగాళ్లతో భర్తీ చేసుకుంది. ఇంగ్లండ్ ప్లేయర్లు జానీ బెయిర్‌స్టో, రిచర్డ్ గ్లీసన్‌తో పాటు శ్రీలంక ఆటగాడు చరిత అసలంకలను జట్టులోకి తీసుకుంది. ప్లే ఆఫ్స్ బెర్తు దక్కించుకునేందుకు తహతహలాడుతున్న ముంబై జట్టు... పాయింట్ల పట్టికలో తుది నాలుగు స్థానాల్లో నిలిస్తేనే ఈ ముగ్గురు ఆటగాళ్ల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 26న పంజాబ్ కింగ్స్‌తో ముంబై ఇండియన్స్ తమ చివరి లీగ్ మ్యాచ్ ఆడనుండగా... ఆ తర్వాతే ఈ ముగ్గురు జట్టుతో కలవనున్నారు. దక్షిణాఫ్రికాకు చెందిన రికెల్టన్, కార్బిన్ బాష్... ఇంగ్లండ్ ప్లేయర్ విల్ జాక్స్ ఈనెల 26 తర్వాత ముంబై జట్టును వీడనున్నారు. ‘జాక్ స్థానాన్ని ఇంగ్లండ్ వికెట్ కీపర్ బెయిర్‌స్టో భర్తీ చేస్తాడు. అతడిని రూ. 5 కోట్ల 25 లక్షలకు ముంబై ఇండియన్స్ జట్టు కొనుగోలు చేసుకుంది. రికెల్టన్ స్థానంలో జట్టులోకి తీసుకున్న ఇంగ్లండ్ పేసర్ రిచర్డ్ గ్లీసన్‌కు 1 కోటి రూపాయాలు... శ్రీలంక బ్యాటర్ అసలంకను రూ. 75 లక్షలు అందజేస్తారు’ అని ఐపీఎల్ పాలక మండలి తెలిపింది.



అసలంక, బెయిర్‌స్టో, రిచర్డ్ గ్లీసన్

బంగ్లాదేశ్‌కు యూఏఈ షాక్



షార్జా: టి20 ఫార్మాట్‌లో బంగ్లాదేశ్‌పై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తొలి విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం అర్ధరాత్రి జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య యూఏఈ జట్టు 2 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించి సంచలనం సృష్టించింది. హోరాహోరీగా సాగిన పోరులో ఒత్తిడిని అధిగమించిన యూఏఈ జట్టు మొదటిసారి బంగ్లాదేశ్‌పై అంతర్జాతీయ టి20 మ్యాచ్ గెలిచింది. ఫలితంగా సిరీస్ 1–1తో సమమైంది. మొదట బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తన్జీద్ హసన్ (33 బంతుల్లో 59; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకం సాధించగా... తౌహిద్ హృదయ్ (24 బంతుల్లో 45; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ లిటన్ దాస్ (32 బంతుల్లో 40; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. యూఏఈ బౌలర్లలో జవాదుల్లా 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో యూఏఈ 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. కెప్టెన్ మొహమ్మద్ వసీమ్ (42 బంతుల్లో 82; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) దుమ్మురేపగా... జోహైబ్ (38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 10 ఓవర్లలోనే 107 పరుగులు జోడించి జట్టుకు మెరుగైన ఆరంభం అందించడంతో లక్ష్యఛేదన సులువైంది. చివర్లో హైదర్ అలీ (6 బంతుల్లో 15 నాటౌట్; 1 సిక్స్) వేగంగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో షరీఫుల్ ఇస్లామ్, నహీద్ రాణా, రిషాద్ హుసేన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. వసీమ్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో టి20 బుధవారం జరగనుంది.



మనిక బత్రా

సింగిల్స్‌లో ముగిసిన భారత్ పోరు

దోహా: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో భారత రెండో ర్యాంకర్ మనిక బత్రా, దియా చిటాలె... పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ మానవ్ ఠక్కర్ రెండో రౌండ్‌లో నిష్క్రమించారు. మంగళవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 46వ ర్యాంకర్ మనిక 8–11, 7–11, 5–11, 8–11తో ప్రపంచ 130వ ర్యాంకర్ పార్క్ గయోన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. 35 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మనిక తన సర్వీస్‌లో 16 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 12 పాయింట్లు సాధించింది. మరో మ్యాచ్‌లో దియా చిటాలె 3–11, 7–11, 6–11, 11–6, 5–11తో చెంగ్ ఐ చింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 48వ ర్యాంకర్ మానవ్ 11–13, 3–11, 11–9, 6–11, 11–9, 3–11తో ప్రపంచ 4వ ర్యాంకర్ టొమోకాజు హరిమోటో (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

శివపాల్‌పై 8 ఏళ్ల నిషేధం!

దోపింగ్ పరీక్షలో విఫలమైన జావెలిన్ త్రోయర్



న్యూఢిల్లీ: భారత జావెలిన్ త్రోయర్ శివపాల్ సింగ్... డోపింగ్ పరీక్షలో మరోసారి విఫలమయ్యాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్న 29 ఏళ్ల శివపాల్ సింగ్... ఈ ఏడాది ఆరంభంలో నిర్వహించిన పరీక్షల్లో నిషిద్ధ ఉత్ప్రేరకాలు వాడినట్లు తేలింది. అతడి కెరీర్‌లో ఇలా జరగడం ఇది రెండోసారి కాగా... విచారణ అనంతరం అతడిపై గరిష్టంగా 8 ఏళ్ల నిషేధం పడే అవకాశం ఉంది. ‘శివపాల్ డోపింగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలాడు. నిషేధిత ఉత్ప్రేరకాలు వినియోగించాడు. ఇది అతడి కెరీర్‌లో రెండోసారి’ అని ఓ అధికారి తెలిపారు. పూర్తిస్థాయి విచారణలో అతడు తప్పుచేసినట్లు తేలితే కెరీర్ ముగిసినట్లే అని అభిప్రాయపడ్డాడు. 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో శివపాల్ తన అత్యుత్తమ ప్రదర్శన (86.23 మీటర్ల)తో రజత పతకం సాధించాడు. 2021లో నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) అతడిపై నాలుగేళ్ల నిషేధం విధించగా... ఆ తర్వాత దాన్ని ఏడాదికి తగ్గించింది. 2023 ఏప్రిల్‌లో తిరిగి మైదానంలోకి అడుగుపెట్టిన శివపాల్ సింగ్... 2023 జాతీయ క్రీడల్లో స్వర్ణం, ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచాడు. ప్రస్తుతం అతడు పాటియాలాలోని జాతీయ శిక్షణ కేంద్రంలో సాధన చేస్తున్నాడు.



శ్రీకాంత్ ముందంజ

- క్వాలిఫయింగ్‌లో రెండు విజయాలు
- మెయిన్ ‘డ్రా’కు అర్హత
- తరుణ్, శంకర్‌లకు నిరాశ

కౌలాలంపూర్: ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత అగ్రశ్రేణి షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చేందుకు కష్టపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మొదలైన మలేసియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్‌–500 టోర్నీలో శ్రీకాంత్ మెయిన్ ‘డ్రా’కు అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ దశలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన శ్రీకాంత్ మెయిన్ ‘డ్రా’లోకి అడుగు పెట్టాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 65వ స్థానంలో ఉన్న శ్రీకాంత్ తొలి రౌండ్‌లో 21–8, 21–13తో కువో కువాన్ లిన్ (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు. అనంతరం రెండో రౌండ్‌లో 9–21, 21–12, 21–6తో హువాంగ్ యి కాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గి క్వాలిఫయర్ హోదాలో మెయిన్ ‘డ్రా’లోకి ప్రవేశించాడు. మెయిన్ ‘డ్రా’ తొలి రౌండ్‌లో ఆరో సీడ్ చైనా ప్లేయర్ లు గ్వాంగ్ జుతో శ్రీకాంత్ తలపడతాడు. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన 32 ఏళ్ల శ్రీకాంత్ ఈ ఏడాది ఎనిమిది టోర్నీల్లో ఆడినా ఏ టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయాడు. మరోవైపు గతవారం థాయ్‌లాండ్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ వరకు దూసుకెళ్లిన హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నెపల్లికి ఈ టోర్నీలో నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే తరుణ్ వెనుదిరిగాడు. తరుణ్ 13–21, 21–23తో పనిత్‌చఫోన్ తీరారత్‌సకుల్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ శంకర్ ముత్తుస్వామి 20–22, 20–22తో జు జువాన్ చెన్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖరబ్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. అన్‌మోల్ 14–21, 18–21తో హుంగ్ యి టింగ్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో మోహిత్–లక్షిత జగ్లాన్ ద్వయం 15–21, 16–21తో మింగ్ యాప్ టూ–లీ యు షాన్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడిపోయింది. అన్ని విభాగాల్లో మెయిన్ ‘డ్రా’ మ్యాచ్‌లు నేడు మొదలవుతాయి.

సాక్షి ప్లస్
బుధవారం ı 21-5-2025



జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి సరిహద్దుల్లో మన సైనిక జవాన్ల అప్రమత్తతకు నిదర్శనం ఈ చిత్రాలు. మీడియా సిబ్బంది మంగళవారం పాక్‌తో సరిహద్దులకు అత్యంత సమీపంలో క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి క్లిక్ మనిపించిన దృశ్యాలివి.

ఉరుముతున్న ఉష్ణోగ్రతలు

దేశంలో అధికం నుంచి అత్యధిక హీట్ రిస్క్ కేటగిరీలో 57 శాతం జిల్లాలు

- మొత్తం జనాభాలో 76 శాతం మందికి ఉష్ణోగ్రతల ముప్పు
- 'కౌన్సిల్ ఆన్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్' అధ్యయనంలో వెల్లడి

శిలాజ ఇంధనాల వాడకం నానాటికీ పెరిగిపోతుండడం, తద్వారా వాతావరణ మార్పులు సంభవిస్తుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. భారత్ సైతం ఇందుకు మినహాయింపు కాదు. దేశంలో 57 శాతం జిల్లాలు అధికం నుంచి అత్యధిక హీట్ రిస్క్ కేటగిరీలో ఉన్నట్లు ఢిల్లీకి చెందిన వాతావరణ సంస్థ కౌన్సిల్ ఆన్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్(సీఈఈడబ్ల్యూ) వెల్లడించింది. దేశంలోని మొత్తం జనాభాలో ఏకంగా 76 శాతం మంది ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతల ముప్పును ఎదుర్కొంటున్నట్లు తేల్చిచెప్పింది. ఈ మేరకు మంగళవారం ఒక నివేదిక విడుదల చేసింది. ఢిల్లీ, మహారాష్ట్ర, గోవా, కేరళ, గుజరాత్, రాజస్తాన్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సహా పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో హీట్ రిస్క్ అత్యధికంగా ఉన్నట్లు తెలియజేసింది. గత పదేళ్లలో అత్యధిక వేడి కలిగిన పగటి దినాల కంటే అత్యధిక వేడి కలిగిన రాత్రి దినాల సంఖ్య వేగంగా పెరిగినట్లు వివరించింది.

- అధ్యయనంలో భాగంగా సీఈఈడబ్ల్యూ సంస్థ 734 జిల్లాలకు సంబంధించిన హీట్ రిస్క్ ఇండెక్స్(హెచ్ఆర్ఐ)ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం 1982 నుంచి 2022 వరకు.. 40 ఏళ్ల వాతావరణ గణాంకాలు, ఉపగ్రహ చిత్రాలు ఉపయోగించుకుంది. ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితులు, జల వనరులు, భూవినియోగం, పచ్చదనం తదితర అంశాలను అధ్యయనం చేసింది.
- జనాభా, భవనాలు, ఆరోగ్య, సామాజిక–ఆర్థిక అంశాలు, పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు, వాతావరణంలో తేమ వంటి అంశాలను సైతం పరిగణనలోకి తీసుకుంది.
- 734 జిల్లాలకు గాను 417 జిల్లాలు హై నుంచి వెరీ హై రిస్క్ కేటగిరీల్లో ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. ఇందులో 151 జిల్లా హై రిస్క్, 266 జిల్లాలు వెరీ హై రిస్క్ విభాగంలో ఉన్నాయి. 201 జిల్లాలు సాధారణ, 166 జిల్లాలు తక్కువ లేదా అతి తక్కువ హీట్ రిస్క్ విభాగాల్లో నిలిచాయి.
- ఉష్ణోగ్రతలు సాధారణం లేదా తక్కువగా ఉన్నట్లయితే దాని అర్థం వేడి వల్ల ముప్పు లేనట్లు కాదని, సీఈఈడబ్ల్యూ స్పష్టంచేసింది. ఇతర జిల్లాల కంటే కొంత తక్కువగా ఉన్నట్లు మాత్రమే భావించాలని పేర్కొంది.
- దేశంలో అధిక ఉష్ణోగ్రత కలిగిన రోజులు పెరుగుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన రోజులు అంతకంటే ఎక్కువగా పెరుగుతుండడం గమనార్హం. అంటే మనుషులకు ముప్పు సైతం అదే స్థాయిలో పెరుగుతున్నట్లే లెక్క.
- ఉష్ణోగ్రతలు అత్యధికంగా మనుషులు తట్టుకోలేరు. అది ప్రమాదకరమే. శారీరకంగా, మానసికంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పల్లెలతో పోలిస్తే పట్టణాలు, నగరాల్లో అధిక ఉష్ణోగ్రత కలిగిన రాత్రి దినాలు అధికంగా నమోదవుతున్నాయి. అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్టే ఇందుకు కారణం.
- 10 లక్షలకుపైగా జనాభా ఉన్న జిల్లాలతో పాటు ముంబయి, బెంగళూరు, భోపాల్, జైపూర్, ఢిల్లీ, చెన్నై వంటి నగరాల్లో అధిక ఉష్ణోగ్రత కలిగిన రాత్రి దినాల సంఖ్య భారీగా పెరిగింది.
- చల్లగా ఉండే హిమాలయా ప్రాంతాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన పగటి, రాత్రి రోజుల సంఖ్య పెరుగుతోంది. సున్నితంగా ఉండే పర్వత ప్రాంత భౌగోళిక స్థితిగతులను ఈ పరిణామం తీవ్రంగా ప్రభావితం చేయనుంది.
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లో అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన పగటి, రాత్రి రోజుల సంఖ్య 15 చొప్పున పెరిగింది. ఈ ప్రతి ఏటా వేసవిలో ఈ పెరుగుదల కనిపిస్తోంది.
- ఉత్తర భారతదేశంలో వేసవి తేమ గత పదేళ్లలో 30–40 శాతం నుంచి 40–50 శాతం పెరిగింది.
- అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా 2030 నాటికి 3.5 కోట్ల ఉద్యోగాలను కోల్పోతామని, జీడీపీలో 4.5 శాత తగ్గుదల నమోదవుతుందని సీఈఈడబ్ల్యూ అధ్యయనం అంచనా వేసింది.
- ఇండియాలో 2024లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా 45,000కుపైగా గుండెపోటు కేసులు నమోదయ్యాయి. 159 మరణాలు సంభవించాయి. ఇవన్నీ అధికారికంగా నమోదైన గణాంకాలే. నమోదు కానివి ఇంకెన్నో ఉంటాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

రష్యాపై ఈయూ మరిన్ని ఆంక్షలు

బ్రస్సెల్స్: ఉక్రెయిన్‌పై దురాక్రమణ సాగిస్తున్న రష్యాపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) మంగళవారం మరిన్ని ఆంక్షలను ప్రకటించింది. ఇప్పటికే అమల్లో ఉన్న ఆంక్షలను తప్పించుకుంటూ దొంగచాటుగా ఇతర దేశాలకు చమురు తరలించే రష్యాకు చెందిన 189 నౌకలపై ఈ ఆంక్షలు అమలవుతాయి. ఈయూ పరిధిలోని 27 దేశాల్లో ఈ నౌకలకు సంబంధించిన రష్యా కంపెనీలు, అధికారుల ఆస్తులను స్తంభింపజేయడంతోపాటు ప్రయాణ నిషేధం అమలవుతుంది. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో సమావేశమైన ఈయూ విదేశాంగ మంత్రులు ఈ మేరకు తీర్మానించారు.

ఫ్రెషర్లు జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్షకు అనర్హులు

న్యూఢిల్లీ: జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్షల అభ్యర్థులకు తీవ్ర నిరాశ కలిగించే పరిణామమిది. జ్యుడీషియల్ సర్వీసెస్ ఎంపిక పరీక్షకు ఫ్రెష్ లా గ్రాడ్యుయేట్లు అనర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రవేశ స్థాయి(ఎంట్రీ లెవెల్) సివిల్ జడ్జి పోస్టులకు సైతం అభ్యర్థులు కనీసం మూడేళ్ల లీగల్ ప్రాక్టీస్ చేయాలన్న నిబంధన వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ మసీహ్‌ల ధర్మాసనం పేర్కొంది. కాబోయే న్యాయమూర్తులకు కోర్టు రూంలో కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమని పునరుద్ఘాటించింది. 'తాజా లా పట్టభద్రులను ఉద్యోగాల్లో నియమించడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ పలుమార్లు హైకోర్టులు తెలిపాయి. జ్యుడీషియల్ సమర్థతకు, పోటీతత్వానికి కోర్టులో ప్రాక్టికల్ అనుభవం చాలా అవసరం'అని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు.

పరస్పరం సహకరించుకొంటేనే ఆరోగ్యకరమైన ప్రపంచం

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: ఆరోగ్యకరమైన ప్రపంచం భవిష్యత్తు సమగ్ర దార్శనికత, పరస్పర సహకారంపై ఆధారపడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గ్లోబల్ సౌత్ దేశాలు ఎదుర్కొంటున్న ఆరోగ్యపరమైన సవాళ్లకు ఇండియా వద్ద చక్కటి పరిష్కార మార్గాలు ఉన్నాయని తెలిపారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరుగుతున్న 78వ వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో మోదీ ఈ మేరకు మంగళవారం వీడియో సందేశం ఇచ్చారు. భారత్‌లో ఆరోగ్య రంగంలో చేపట్టిన సంస్కరణల గురించి వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రస్తావించారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకమని చెప్పారు. దీని ద్వారా 58 కోట్ల మందికి లబ్ధి కలుగుతోందని అన్నారు. 70 ఏళ్లు దాటిన వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా వేలాది హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇక్కడ క్యాన్సర్, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి వ్యాధులను తొలి దశలోనే గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలాది పబ్లిక్ ఫార్మసీలు అందుబాటులోకి తీసుకొచ్చామని, ఔషధాలు అతి తక్కువ ధరకే లభిస్తున్నాయని గుర్తుచేశారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం టెక్నాలజీని వాడుకుంటున్నట్లు ప్రధాని మోదీ తెలియజేశారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తే ఆరోగ్యకరమైన ప్రపంచం సాకారం అవుతుందని పిలుపునిచ్చారు. ఆరోగ్య రంగంలో తమ అనుభవాలు, పరిజ్ఞానాన్ని ప్రపంచం దేశాలతో ప్రపంచ దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. వచ్చే నెలలో జరిగే యోగా దినోత్సవంలో ప్రపంచవ్యాప్తంగా అందరూ భాగస్వాములు కావాలని కోరారు. యోగాకు పుట్టినిల్లు అయిన భారత్‌ను సందర్శించాలని సూచించారు.

పర్యాటక రంగంపై మోదీ సమీక్ష

పర్యాటక రంగంపై ప్రధాని మోదీ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ రంగంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పర్యాటక రగంలో మన దేశాన్ని అగ్రగామిగా మార్చడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడుదాం

ఉగ్రవాదంపై పోరులో కలిసికట్టుగా ముందుకు సాగాలని ప్రధాని మోదీ, జర్మనీ ఛాన్సెలర్ ఫ్రెడెరిక్ మెర్జ్ నిర్ణయించుకున్నారు. ఇద్దరు నేతలు మంగళవారం ఫోన్‌లో సంభాషించుకున్నారు. 'ఛాన్సెలర్‌గా బాధ్యతలు చేపట్టిన మెర్జ్‌కు శుభాకాంక్షలు తెలిపాను. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని, ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించాం'అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

గాజాలో పాపం పసివాళ్లు!

- 14 వేల మందికి ప్రాణగండం: ఐరాస
- తక్షణం మానవతా సాయానికి పిలుపు

లండన్: యుద్ధంలో మరుభూమిగా మారిన గాజాకు తక్షణం పూర్తి స్థాయిలో మానవతా సాయం అందడం అత్యవసరమని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. లేదంటే రాబోయే 48 గంటల్లో ఏకంగా 14 వేల మంది పిల్లలు ఆకలి చావుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించింది. చిన్నారులకు ఆహారంతో పాటు మానవతా సహాయాన్ని తీసుకెళ్తున్న ఐదు ట్రక్కులను మాత్రమే ఇజ్రాయెల్ గాజాలోకి అనుమతించిందని ఐరాస గాజా ఎయిడ్ చీఫ్ టామ్ ప్లెచర్ వాపోయారు. అది కేవలం సముద్రంలో నీటి బిందువు వంటిదని ఆక్షేపించారు. అవసరమైనంత సాయం గాజాకు చేరడం లేదని మంగళవారం బీబీసీ రేడియోతో ఆయన పేర్కొన్నారు. ''పిల్లలకు ఆహారాన్ని అందించడానికి అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నాం. సకాలంలో ఆహారం అందించలేకపోతే 48 గంటల్లో 14 వేల మంది చిన్నారులు చనిపోతారు''అన్నారు.

నిర్బంధాన్ని సడలించాం: ఇజ్రాయెల్

నిర్బంధాన్ని సడలించి గాజాలోకి ఆహారం, ఔషధాలను అనుమతించినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. పిల్లల ఆహారం, పోషకాహారంతో నిండిన 100 ట్రక్కులను అనుమతించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్టు ఐరాస తాజాగా తెలిపింది. ఐరాస స్థానిక సహాయ బృందాలు దీన్ని స్వాగతించాయి. అయితే ఇప్పటికైతే అవసరమైనంత సాయం అందడం లేదని తెలిపాయి. కాల్పుల విరమణ సమయంలో గాజాకు రోజుకు 600 ట్రక్కులు రాగా గత 24 గంటల్లో కేవలం ఐదు ట్రక్కులను మాత్రమే అనుమతించారని వెల్లడించాయి.

ఇజ్రాయెల్‌పై ఆంక్షలు!

గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యను, మానవతా సాయాన్ని అడ్డుకుంటున్న తీరును యూరప్ దేశాలు ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించాయి. పూర్తిస్థాయిలో సాయాన్ని అనుమతించకపోతే ఆంక్షలు, కఠిన చర్యలు తప్పవని బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ సంయుక్త ప్రకటనలో హెచ్చరించారు.


ఇజ్రాయెల్ భీకర దాడుల్లో 60 మంది మృతి

డెయిర్ అల్–బలాహ్: ఇజ్రాయెల్ బలగాలు గాజా ప్రాంతంపై సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సాగించిన భీకర దాడుల్లో కనీసం 60 మంది మృత్యువాత పడ్డారు. ఉత్తరప్రాంతంలోని ఓ నివాస భవనం, శరణార్థులు తలదాచుకుంటున్న స్కూలుపై జరిగిన దాడుల్లో 22 మంది చనిపోయారు. వీరిలో సగానికిపైగా మహిళలు, చిన్నారులే ఉన్నారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది.

బెయిలుకు జైల్లో ఏడాది గడపాలని రూలేం లేదు: సుప్రీం


న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో బెయిలివ్వాలంటే ఏడాదిపాటు జైలులో గడపాలన్న నిబంధనేదీ లేదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. రూ.2 వేల కోట్ల లిక్కర్ కుంభకోణంలో గతేడాది ఆగస్టులో అరెస్టయిన వ్యాపారవేత్త అన్వర్ ధెబార్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లో ధర్మాసనం విచారణ చేపట్టింది. ధెబార్ అరెస్టయి ఏడాది కూడా కాలేదని, ఆయనకు బెయిలివ్వరాదని ఈడీ న్యాయవాది వాదించారు. వివిధ కేసుల్లో బెయిల్ మంజూరుకు అత్యున్నత న్యాయస్థానం 'ఏడాది కస్టడీ బెంచ్‌మార్క్'ను అనుసరిస్తోందని, ఈ కేసులోనూ దీనినే కొలమానంగా తీసుకోవాలని అన్నారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన ధెబర్‌ను విడుదల చేస్తే దర్యాప్తు ఆటంకం కలగొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో, ధర్మాసనం పైవిధంగా వ్యాఖ్యానించింది. 'మొత్తం ఈ కేసులోని 450 మంది సాక్షులకు గాను ఇప్పటి వరకు 40 మంది విచారణ మాత్రమే పూర్తయింది. విచారణ సమీప భవిష్యత్తులో ముగిసే సూచనలు కనిపించడం లేదు. దర్యాప్తు పురోగతిలో ఉంది. గరిష్ఠ శిక్షాకాలం ఏడేళ్లు కాగా ఇప్పటికి 9 నెలలపాటు పిటిషనర్ జైల్లో ఉన్నారు'అని ధర్మాసనం పేర్కొంది. అయితే, ప్రత్యేక కోర్టు పేర్కొనే కఠిన షరతులు, నిబంధనలకు లోబడి ధెబర్‌ను వారం రోజుల్లో బెయిల్‌పై విడుదల చేయాలని దిగువ కోర్టుకు ఉత్తర్వులిచ్చింది పాస్‌పోర్టును అధికారులకు అప్పగించాలని అన్వర్ ధెబార్‌ను ఆదేశించింది.

ప్రఖ్యాత శాస్త్రవేత్త జయంత్ విష్ణు నార్లికర్ కన్నుమూత



పుణే: ప్రపంచ ప్రఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ కన్నుమూశారు. 86 ఏళ్ల నార్లికర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. మహారాష్ట్రలోని పుణేలో మంగళవారం ఉదయం నిద్రలోనే తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యుల చెప్పారు. జయంత్ విష్ణు నార్లికర్ 1938 జూలై 19న జన్మించారు. ప్రాథమిక, కళాశాల విద్య అనంతరం బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్నారు. ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో చేరారు. యూకేలో ఉన్నప్పుడే తన డాక్టోరల్ సలహాదారు ఫ్రెడ్ హోలేతో కలిసి ప్రఖ్యాత హోలే–నార్లికర్ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. దీన్ని ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా పరిగణిస్తుంటారు. నార్లికర్ ఇండియాకు తిరిగి వచ్చి 1972 నుంచి 1989 దాకా టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ పనిచేశారు. అనంతరం యూజీసీ ఆహ్వానం మేరకు ఇంటర్–యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్(ఐయూసీఏఏ)ను స్థాపించారు. దానికి ఫౌండర్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఖగోళ భౌతిక శాస్త్రంపై విస్తృతమైన పరిశోధనలు చేశారు. ఈ రంగంపై ఎన్నో పుస్తకాలు రాశారు. సైన్స్ పట్ల సామాన్య ప్రజల్లో ఆసక్తి పెంచడానికి ఎంతగానో కృషి చేశారు. భారత ప్రభుత్వం నార్లికర్‌ను 1965లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. అప్పుడు ఆయన వయసు కేవలం 26 ఏళ్లు. 2004లో ఆయన పద్మవిభూషణ్ పురస్కారం లభించింది. డాక్టర్ నార్లికర్ మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తదితరులు సంతాపం ప్రకటించారు. ఖగోళ భౌతికశాస్త్రానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. దార్శనికుడైన గొప్ప శాస్త్రవేత్తను మన దేశం కోల్పోయిందని ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ వి.సోమనాథ్ విచారం వ్యక్తంచేశారు.

అణు శాస్త్రవేత్త ఎం.ఆర్.శ్రీనివాసన్ ఇక లేరు



ఉదకమండలం: ప్రముఖ అణు శాస్త్రవేత్త, అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ ఎం.ఆర్.శ్రీనివాసన్ మంగళవారం కన్నుమూశారు. భారత్ అణు శక్తి సంపన్న దేశంగా మారడం వెనుక ఆయన కీలక పాత్ర పోషించారు. శ్రీనివాసన్ వయసు 95 ఏళ్లు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసన్ తమిళనాడులో జన్మించారు. 1955లో డిపార్టుమెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ(డీఏఈ)లో చేరారు. అంచెలంచెలుగా పైకి ఎదిగారు. డాక్టర్ హోమీ బాబాతో కలిసి పరిశోధనల్లో పాల్గొన్నారు. దేశంలో తొలి అణు పరిశోధన రియాక్టర్ 'అప్సర'ను నిర్మించారు. 1959లో దేశంలో తొలి అటామిక్ పవర్ స్టేషన్‌కు ప్రిన్సిపల్ ప్రాజెక్టు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. 1967లో మద్రాసు అటామిక్ పవర్ స్టేషన్ చీఫ్ ప్రాజెక్టు ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించారు. న్యూక్లియర్ పవర్ బోర్డు చైర్మన్‌గా సేవలందించారు. 1987లో అటామిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్‌గా పదోన్నతి పొందారు. అదే సంవత్సరం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఫౌండర్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన నేతృత్వంలో దేశంలో 18 న్యూక్లియర్ పవర్ యూనిట్లకు అంకురార్పణ జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ పురస్కారం ప్రదానం చేసింది. ఎం.ఆర్.శ్రీనివాసన్ మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు.

మదర్సాల సిలబస్‌లో 'ఆపరేషన్ సిందూర్'

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని మదర్సాల పాఠ్యాంశాల్లో 'ఆపరేషన్ సిందూర్' కూడా ఉంటుందని రాష్ట్ర మదర్సా విద్యా బోర్డు మంగళవారం ప్రకటించింది. 'ఆపరేషన్ సిందూర్ ఏమిటి? దాని అవసరం ఎందుకు వచ్చింది? వంటి వివరాలు మదర్సాల్లో చదువుతున్న పిల్లలకు క్షుణ్నంగా అర్థమయ్యేలా వివరిస్తాం 'అని బోర్డు చైర్మన్ ముఫ్తీ షమూన్ కాస్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమైన రాష్ట్ర సిలబస్‌తోపాటు ఎన్సీఈఆర్‌టీ సిలబస్‌తో సమానంగా మదర్సాల్లో పాఠ్యాంశాలుండేలా తమ కృషిని కొనసాగిస్తామని చెప్పారు. పాకిస్తాన్‌ను ఒక దుష్ట దేశంగా పేర్కొంటూ ఆయన.. పహల్గాంలో నిరాయుధులైన మన సోదరులను చంపినందుకు ఆ దేశానికి గుణపాఠం చెప్పాల్సిందేనన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి ఒడిగట్టడం ఖురాన్‌ను తక్కువ చేయడమేనని ఆయన పేర్కొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' బృందంలో అభిషేక్ బెనర్జీ

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌పై మన దేశ వైఖరిని వివరించేందుకు విదేశాలకు వెళ్లే అఖిలపక్ష బృందంలో టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఉంటారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో ఫోన్‌లో మాట్లాడాక ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతకుముందు, టీఎంసీ తరఫున ఎంపీ యూసుఫ్ పఠాన్ పేరును కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. తనను సంప్రదించకుండానే కేంద్రం నిర్ణయం తీసుకుందంటూ ఆయన బృందం నుంచి తప్పుకోవడం తెల్సిందే. ఈ పరిణామంతో మంత్రి రిజిజు మంగళవారం సీఎం మమతతో మాట్లాడి ఆమెను శాంత పరిచారని టీఎంసీ వర్గాలు తెలిపాయి. అఖిలపక్ష బృందంలో ఎవరిని పంపాలనేది కేంద్రం నిర్ణయించరాదంటూ మమతా బెనర్జీతోపాటు అభిషేక్ బెనర్జీ అంతకుముందు వ్యాఖ్యానించడం గమనార్హం.

జ్యుడీషియల్ కస్టడీకి అశోకా వర్సిటీ ప్రొఫెసర్

సోనిపట్(హరియాణా): ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులతో అరెస్టయిన అశోకా వర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్‌ను కోర్టు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతించింది. పోలీసుల రెండు రోజుల కస్టడీ గడువు ముగియడంతో అలీ ఖాన్‌ను మంగళవారం మధ్యాహ్నం పోలీసులు కోర్టులో హాజరుపరిచారని ఆయన లాయర్ కపిల్ బల్యాన్ తెలిపారు. వాదనల సమయంలో మరింత విచారించాల్సిన అవసరమున్నందున ప్రొఫెసర్ కస్టడీని మరో ఏడు రోజులపాటు పొడిగించాలన్న పోలీసుల వినతి మేరకు జడ్జి మే 27వ తేదీ వరకు మాత్రమే అనుమతించారన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చేసిన వ్యాఖ్యలు దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా ఉన్నాయంటూ రెండు ఎఫ్ఐఆర్‌లు దాఖలవడంతో రాయ్ పోలీస్‌స్టేషన్ పోలీసులు ప్రొఫెసర్ అలీఖాన్‌ను ఆదివారం అరెస్ట్ చేయడం తెల్సిందే.

పంజాబ్‌లో బబ్బర్ ఖల్సా మాడ్యూల్ గుట్టురట్టు

జలంధర్: పాకిస్తానీ గూఢచర్య విభాగం ఐఎస్ఐ దన్నుతో నడుస్తున్న ఖలిస్తానీ మాడ్యూల్ గుట్టును పంజాబ్ పోలీసులు ఛేదించారు. విదేశీ హ్యాండ్లర్స్ నిర్వహించే బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్(బీకేఐ)కు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేశామని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ మంగళవారం వెల్లడించారు. పాకిస్తాన్‌లో ఉన్న ఖలిస్తానీ ఉగ్రవాది హర్విందర్ సింగ్ రిండా ఆదేశాల మేరకు పోర్చుగల్‌లో ఉన్న మణీందర్ బిల్లా, మన్ను అగ్వాన్ అనే ఇద్దరు ఈ మాడ్యూల్‌ను నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు. అరెస్టయిన బీకేఐ నిర్వాహకులు..జతిన్ కుమార్ అలియాస్ రోహన్, బరీందర్ సింగ్ అలియాస్ సజన్ అలియాస్ రాహుల్ మసీహ్, అబ్రహాం అలియాస్ రోహిత్ అలియాస్ సోహిత్, సునిల్ కుమార్ అని డీజీపీ వివరించారు. బటాలాలోని ఓ మద్యం దుకాణంపై గ్రెనేడ్‌తో దాడి చేసేందుకు వీరు ప్రయత్నించారన్నారు. వీరికి పోర్చుగల్‌లోని మణీందర్ బిల్లా, మన్ను అగ్వాన్ నుంచి నేరుగా ఆదేశాలందాయని చెప్పారు. ఇటీవల అమెరికా పోలీసులు గ్యాంగ్‌స్టర్ హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపీ పస్సియాను అరెస్ట్ చేయడంతో బీకేఐ ఆపరేషనల్ కమాండ్ బాధ్యతలను వీరిద్దరు చేపట్టారని వివరించారు. పోలీసులు అరెస్ట్ చేసేందుకు వెళ్లినప్పుడు జతిన్ కుమార్ కాల్పులు జరిపి పారిపోయేందుకు యత్నించాడని డీజీపీ చెప్పారు. పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో గాయపడిన జతిన్ బటాలాలోని ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పారు.

పాక్ సైతం ఆ ఉగ్రవాదుల్ని అప్పగించాలి

ఇజ్రాయెల్‌లో భారత రాయబారి జేపీ సింగ్

జెరూసలేం: ముంబై దాడుల సూత్రధారుల్లో ఒకడైన తహవ్వుర్ రాణాను అమెరికా ప్రభుత్వం అప్పగించిన విధంగానే పాకిస్తాన్ కూడా ఆ దేశంలో ఉన్న మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు హఫీజ్ సయీద్, సాజిద్ మిర్, జకియుర్ రెహ్మాన్ లఖ్వీ వంటి వారిని భారత ప్రభుత్వానికి అప్పగించాలని ఇజ్రాయెల్‌లో భారత రాయబారి జేపీ సింగ్ పేర్కొన్నారు. ఉగ్రవాదం ప్రపంచానికే బెడదగా మారింది, దీనిని ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ కూటమి ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ఆయన పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జేపీ సింగ్ పలు విషయాలను ప్రస్తావించారు. పాకిస్తాన్‌పై భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రస్తుతం విరామమే తప్ప, ముగింపు కాదని వివరించారు. 'పాక్ నేలపై నడిచే ఉగ్ర గ్రూపులకు వ్యతిరేకంగా మాత్రమే ఈ ఆపరేషన్‌ను భారత్ చేపట్టింది. పాకిస్తాన్ మాత్రం భారత మిలటరీ స్థావరాలపై దాడులతో బదులిచ్చింది. ప్రతిగా భారత్ పలు పాకిస్తానీ సైనిక స్థావరాలపై భీకర దాడులకు దిగింది'అని వివరించారు. జైషే మొహ్మద్, లష్కరే తొయిబా గ్రూపులే ఈ సంక్షోభానికి మూల కారణమని ఆరోపించారు.

పార్లమెంటు కన్నా విదేశాలే ఎక్కువా?

ఆపరేషన్ సిందూర్ దౌత్యంపై సీపీఐ

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌పై దేశ ప్రజలకు తెలపకముందే విదేశీ ప్రభుత్వాలకు వివరించేందుకు వెళ్లాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అంగీకార యోగ్యం కాదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చి ఆపరేషన్ సిందూర్‌పై వివరణ ఇవ్వాలన్నారు. పహల్గాం ఉగ్ర దాడి అనంతర పరిణామాలపై చర్చించేందుకు పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చాలంటూ కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తుండటం తెల్సిందే. అశోకా వర్సిటీ ప్రొఫెసర్ అరెస్ట్‌పై రాజా స్పందిస్తూ..'పహల్గాం దారుణం అనంతరం దేశ ప్రజలంతా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏకమయ్యారు. బీజేపీ మాత్రం విభేదాలను మరింత పెంచేందుకు, రాజకీయ లబ్ధి పొందేందుకు, అసమ్మతిని అణచేందుకు ప్రయత్నిస్తోంది. ప్రొఫెసర్ అలీ ఖాన్‌ను వ్యాఖ్యలను బట్టి కాకుండా గుర్తింపును బట్టి లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది'అని రాజా పేర్కొన్నారు. పాక్‌తో కాల్పుల విరమణ ఒప్పందం షరతులను ప్రజలకు వివరించి, అయోమయం తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. ప్రపంచ దేశాల వద్దకు వెళ్లేందుకు ముందుగా దేశ ప్రజలను, వ్యవస్థలను గౌరవించాలంటూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని రాజా ఎండగట్టారు.

అఖిల పక్ష బృందానికి ఉద్ధవ్ మద్దతు

ముంబై: ఉగ్రవాదులకు పాక్ తోడ్పాటు, ఆపరేషన్ సిందూర్‌పై అఖిల పక్ష ఎంపీల బృందాలను విదేశాలకు పంపించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని బహిష్కరించాలంటూ పిలుపునిచ్చిన శివసేన (యూబీటీ) కొద్ది రోజుల్లోనే వెనక్కి తగ్గింది. అఖిల పక్ష బృందంలో చేరేందుకు అంగీకరించింది. 'కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం మా పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతినిధి బృందాలకు ఎంపిక చేసిన ఎంపీల పేర్లను ప్రొటోకాల్ ప్రకారం ముందుగా సంబంధిత రాజకీయ పార్టీలకు సమాచారం ఇవ్వడం ద్వారా గందరగోళం, నిర్వహణ లోపం తలెత్తకుండా చూడాలని ఉద్ధవ్ కోరారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఉగ్రవాదంపై మన దేశం ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలకు మద్దతివ్వాలని నిర్ణయించారు'అని ఆ పార్టీ ప్రకటించింది. రాజ్యసభ ఎంపీ ప్రియాంకా చతుర్వేదిని పార్టీ తరఫున పంపాలని నిర్ణయించినట్లు పేర్కొంది. అదే సమయంలో, పహల్గాంలో ఉగ్రఘాతుకానికి దారి తీసిన నిఘా వైఫల్యంపై కేంద్రం వివరణ ఇవ్వాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. వివిధ దేశాలకు అఖిల పక్ష బృందాలను పంపాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బాయ్‌కాట్ చేయాలని ఆదివారం శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఇండియా కూటమి పక్షాలకు పిలుపునివ్వడం తెల్సిందే.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థించిన కమిషన్?

రాష్ట్రాల ఏర్పాటు

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ ఫజల్ అలీ కమిషన్

భాషాప్రయుక్త ప్రాతిపదికన ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. దీంతో దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ప్రస్తావనకు వచ్చింది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ కమిషన్‌ను నియమించింది. కె.ఎం.ఫణిక్కర్, హెచ్.ఎం.కుంజ్రు సభ్యులుగా ఉన్న ఈ కమిషన్‌కు ఫజల్ అలీ నేతృత్వం వహించారు. 1955 సెప్టెంబర్‌లో ఈ కమిషన్ నివేదిక సమర్పించింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటును ఫజల్ అలీ కమిషన్ సమర్థించింది. కానీ ఒక భాష-ఒక రాష్ట్రం అనే డిమాండ్‌ను తిరస్కరించింది.

ఫజల్ అలీ కమిషన్ ప్రతిపాదనలు..

- రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణలో దేశ ఐక్యతను, రక్షణను బలోపేతం చేసేలా చర్యలు ఉండాలి.
- భాష, సాంస్కృతికపరమైన సజాతీయత ఉండాలి.
- ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.
- జాతీయాభివృద్ధితోపాటు రాష్ట్రాల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

దీనికి అనుగుణంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ చట్టం, ఏడో రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పార్ట్-ఎ, పార్ట్-బి, పార్ట్-సి అనే వ్యత్యాసాలను రద్దు చేసి రాష్ట్రాలను పునర్‌వ్యవస్థీకరించింది. ఫలితంగా 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలతో నూతన వ్యవస్థ అమల్లోకి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ - పెద్ద మనుషుల ఒప్పందం

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

1948లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర సంస్థను స్థాపించారు. తెలుగు మాట్లాడే వారందరినీ కలిపి ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనేది విశాలాంధ్ర ప్రధాన నినాదం. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విషయంలో నిర్ణయాన్ని హైదరాబాద్ రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి వదిలిపెట్టారు. హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీలో విశాలాంధ్ర ఏర్పాటు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, 103 మంది సభ్యులు అనుకూలంగా ఓటేశారు. 1956 ఫిబ్రవరి 20న తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన 8 మంది నాయకుల మధ్య ఢిల్లీలో ఒక ఒప్పందం కుదిరింది. దీన్నే 'పెద్ద మనుషుల ఒప్పందం' అంటారు. ఈ ఒప్పందంపై బూర్గుల రామకృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, జె.వి.నరసింగరావు, మర్రి చెన్నారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ, నీలం సంజీవరెడ్డి, సర్దార్ గౌతు లచ్చన్న సంతకాలు చేశారు.

1956 తర్వాత ఏర్పాటైన రాష్ట్రాలు

గుజరాత్ (1 మే, 1960): బొంబాయి రాష్ట్రాన్ని విడగొట్టి గుజరాత్‌ను 15వ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. బొంబాయి రాష్ట్రం పేరును మహారాష్ట్రగా మార్చారు.

నాగాలాండ్ (1 డిసెంబర్, 1963): అస్సాం రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించి నాగా కొండ ప్రాంతాలు, ట్యూన్‌సాంగ్ ప్రాంతాలతో నాగాలాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇది 16వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

హర్యానా(1 నవంబర్, 1966): పంజాబ్‌ను పునర్‌వ్యవస్థీకరించి హిందీ మాట్లాడే ప్రాంతాన్ని హర్యానా రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. షా కమిషన్ సూచన మేరకు చండీగఢ్‌ను పంజాబ్, హర్యానా రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చేశారు. దీంతోపాటు చండీగఢ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా గుర్తించారు.

హిమాచల్ ప్రదేశ్ (25 జనవరి, 1971): పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలతో కలిపి కేంద్రపాలిత ప్రాంతమైన హిమాచల్‌కు రాష్ట్ర హోదా కల్పించారు. ఇది 18వ రాష్ట్రం.

మణిపూర్ (21 జనవరి, 1972): ఈశాన్య రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ చట్టం ద్వారా మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రపాలిత ప్రాంతమైన మణిపూర్‌ను 19వ రాష్ట్రంగా మార్చారు.

త్రిపుర (21 జనవరి, 1972): కేంద్రపాలిత ప్రాంతమైన త్రిపురను 20వ రాష్ట్రంగా మార్చారు.

మేఘాలయ (21 జనవరి, 1972): అస్సాంలో ఉపరాష్ట్రంగా ఉన్న మేఘాలయను పూర్తి రాష్ట్రంగా మార్చారు. 1969లో మేఘాలయకు ఉపరాష్ట్ర హోదా కల్పించారు.

సిక్కిం (16 మే, 1975): 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింకు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక చరిత్ర ఉంది. 1947 వరకు సిక్కిం ఛోగ్యాల్ రాజవంశ పాలనలో ఉండేది. 1974లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింకు అసోసియేట్ రాష్ట్ర పతిపత్తి కల్పించారు. 10వ షెడ్యూల్‌లో నూతన ప్రకరణ 2ఎను చేర్చారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను సంపూర్ణ రాష్ట్రంగా గుర్తించారు. ఈ విధంగా సిక్కిం 22వ రాష్ట్రంగా ఏర్పాటైంది. 1974లో చేసిన 35వ రాజ్యాంగ సవరణను రద్దుచేశారు. ప్రకరణ 2ఎను, 10వ షెడ్యూల్‌లోని ప్రత్యేకతను తొలగించారు. ప్రకరణ 371ఎఫ్ ద్వారా సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక రక్షణ కల్పించారు.

మిజోరాం (20 ఫిబ్రవరి, 1987): కేంద్రపాలిత ప్రాంతమైన మిజోరాంకు 53వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్ర హోదా కల్పించారు. ఇది 23వ రాష్ట్రంగా ఏర్పాటైంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

అరుణాచల్ ప్రదేశ్ (20 ఫిబ్రవరి, 1987): 55వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన అరుణాచల్ ప్రదేశ్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదాను కల్పించారు. అరుణాచల్ ప్రదేశ్‌ను నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజెన్సీ (ఎన్ఈఎఫ్ఏ) అని పిలిచేవారు.

గోవా (30 మే, 1987): 56వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన గోవాకు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. 1961లో పోర్చుగీసువారు గోవాను భారతదేశానికి అప్పగించారు. గోవా, డయ్యూ, డామన్‌లను కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేశారు. ఇందు కోసం 1962లో 12వ రాజ్యాంగ సవరణ చేశారు.

ఛత్తీస్‌గఢ్(1 నవంబర్, 2000): మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించి ఛత్తీస్‌గఢ్‌ను 26వ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు.

ఉత్తరాఖండ్ (9 నవంబర్, 2000): ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించారు. ఉత్తరాఖండ్ 27వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

జార్ఖండ్ (15 నవంబర్, 2000): బిహార్ రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించి 28వ రాష్ట్రంగా జార్ఖండ్‌ను ఏర్పాటు చేశారు.

తెలంగాణ (2 జూన్, 2014): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించి 10 జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

వివరణ: 1954లో ఫ్రెంచివారు పాండిచ్చేరిని భారత్‌కు అప్పగించారు. 1962లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా పాండిచ్చేరిలో 4 జిల్లాల(పాండిచ్చేరి, కరైకల్, మహే, యానాం)ను కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేశారు.

కేంద్రపాలిత ప్రాంతాలు- ఏర్పాట్లు

దాద్రానగర్ హవేలి: 1954 వరకు ఈ ప్రాంతం పోర్చుగీసు వారి ఆధీనంలో ఉండేది. 1961లో పదో రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు.

డామన్ - డయ్యూ: భారత ప్రభుత్వం 1961లో సైనిక చర్య ద్వారా ఈ ప్రాంతాలను పోర్చుగీసు వారి నుంచి స్వాధీనం చేసుకుంది. 12వ రాజ్యాంగ సవరణ ద్వారా 1962లో కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు. 1987లో గోవా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా కొనసాగించారు.

పాండిచ్చేరి: ఇది పుదుచ్చేరి, కరైకల్, మహే, యానాం అనే నాలుగు ప్రాంతాల కలయిక. 1964లో ఫ్రెంచివారు ఈ ప్రాంతాలను భారత్‌కు అప్పగించారు. 1962లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ప్రాంతాలకు కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.

చండీగఢ్: 1966లో పంజాబ్ పునర్‌వ్యవస్థీకరణ ద్వారా హర్యానా, పంజాబ్‌లకు ఉమ్మడి రాజధాని అయిన చండీగఢ్‌కు కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు - పాత పేర్లు - నూతన పేర్లు

సం.	పాత పేరు	కొత్తపేరు
1950	యునైటెడ్ ప్రావిన్స్	ఉత్తరప్రదేశ్
1956	ట్రావెన్‌కోర్	కొచ్చిన్ కేరళ
1959	మధ్యభారత్	మధ్యప్రదేశ్
1960	బొంబాయి	మహారాష్ట్ర
1968	మద్రాసు	తమిళనాడు
1973	మైసూరు	కర్ణాటక
1973	లక్కదీవి, మినికాయ్ అమిన్‌దీవి	లక్షదీవులు
2006	ఉత్తరాంచల్	ఉత్తరాఖండ్
2006	పాండిచ్చేరి	పుదుచ్చేరి
2007	అస్సాం	అసోం
2011	ఒరిస్సా	ఒడిశా
2011	పశ్చిమ బెంగాల్	పశ్చిమ బంగ

రాష్ట్రాలు - ప్రత్యేక హోదా

ప్రత్యేక హోదా - చరిత్ర: అయిదో ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించే పద్ధతిని 1969లో ప్రవేశపెట్టారు. మొదట్లో అస్సాం, నాగాలాండ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాలకు మాత్రమే ప్రత్యేక హోదా ఉండేది. తర్వాత అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కూడా వర్తింపజేశారు.

ప్రాతిపదిక: ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించేందుకు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అవి...

- పర్వత ప్రాంతాలు, రవాణాకు కష్టతరమైనవి
- తక్కువ జనసాంద్రత, అధిక గిరిజనులు ఉన్న ప్రాంతాలు
- సరైన మౌలిక సదుపాయాలు లేని ప్రాంతాలు
- ఆర్థికంగా పటిష్టంగా లేని రాష్ట్రాలు
- విదేశాలతో సరిహద్దులు ఉండి, వ్యూహాత్మకంగా ప్రాధాన్యమున్న రాష్ట్రాలు.

ప్రత్యేక హోదాను నిర్ణయించేది: ప్రధానమంత్రి అధ్యక్షుడిగా ఉన్న జాతీయాభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘం(ప్రస్తుతం నీతి ఆయోగ్) సలహా మేరకు ప్రత్యేక హోదాపై నిర్ణయం తీసుకుంటారు. ప్రత్యేక హోదాకు నిధుల కేటాయింపులతో సంబంధం ఉండటం వల్ల కేంద్ర ఆర్థిక సంఘాన్ని కూడా సంప్రదించాలి.

ప్రయోజనాలు

- కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహాయాన్ని గ్రాంట్ల రూపంలో అందిస్తుంది.
- కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్లో 30 శాతం నిధులను తొలుత ఈ రాష్ట్రాలకు కేటాయిస్తారు. మిగతా వాటాను ఇతర రాష్ట్రాలకు ఇస్తారు.
- కేంద్ర ప్రభుత్వ పథకాల్లో 90 శాతం నిధులను గ్రాంట్ల రూపంలో, 10 శాతం నిధులను రుణంగా ఇస్తారు.
- పన్నుల్లో మినహాయింపు ఉంటుంది.
- రుణాలు చెల్లింపును వాయిదా వేయడం, పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తారు.

గాడ్గిల్ - ముఖర్జీ ఫార్ములా

ప్రత్యేక హోదా లేని రాష్ట్రాలకు గాడ్గిల్ - ముఖర్జీ ఫార్ములా ప్రకారం నిధులను కేటాయిస్తారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డి.ఆర్. గాడ్గిల్ 1969లో ఈ ప్రతిపాదన చేశారు. 1990లో ప్రణాళికా సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీ మరికొన్ని మార్పులు సూచించారు. అందుకే దీన్ని గాడ్గిల్-ముఖర్జీ ఫార్ములా అంటారు. దీనికి అనుగుణంగా జాతీయాభివృద్ధి మండలి నూతన పద్ధతిని నిర్ణయించింది. దీని ప్రకారం రాష్ట్రాలకు ఈ కింది అంశాల ఆధారంగా నిధులను కేటాయిస్తారు.

ప్రాతిపదిక	శాతం
జనాభా	60 శాతం
తలసరి ఆదాయం	25 శాతం
ఆర్థిక నిర్వహణ	7.5 శాతం
ప్రత్యేక సమస్యలు	7.5 శాతం
మొత్తం	100 శాతం

దేశవ్యాప్తంగా ప్రత్యేక రాష్ట్రాల కోసం జరుగుతున్న ఉద్యమాలు

- అసోం - బోడోలాండ్, కర్బి, అంగ్లాంగ్
- కర్ణాటక - కొడగు (కూర్గ్)
- మహారాష్ట్ర - విదర్భ
- గుజరాత్ - సౌరాష్ట్ర
- ఉత్తరప్రదేశ్ - హరితప్రదేశ్, పశ్చిమ ప్రదేశ్, అవధ్ ప్రదేశ్, పూర్వాంచల్
- మధ్యప్రదేశ్ - వింధ్యప్రదేశ్, అవధ్
- బిహార్, జార్ఖండ్- మిథిలాంచల్, కోసల్
- కేరళ, కర్ణాటక సరిహద్దులో - తుళునాడు
- పశ్చిమ బెంగాల్- గూర్ఖాలాండ్
- ఒడిశా - కోసల్
- జమ్మూ కశ్మీర్ - లడక్
- మేఘాలయ - గారోలాండ్
- మణిపూర్ - కుకీలాండ్

భాగ్యనగరం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నిలయం

రాష్ట్రంలో ఏర్పాటైన ఏకైక అంతర్జాతీయ పరిశోధనా సంస్థ ఇక్రిశాట్. దీన్ని 1972లో మెదక్ జిల్లా పటాన్‌చెరు వద్ద ఏర్పాటు చేశారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో అర్ధశుష్క వాతావరణ పరిస్థితులను తట్టుకొని పెరిగే వంగడాలకు రూపకల్పన చేస్తోంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణనిస్తోంది. మెట్ట ప్రాంత వ్యవసాయ సాగుపై పరిశోధనలు చేస్తోంది. ఇంటర్నేషనల్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమీ ఎరిడ్ ట్రోపిక్స్‌కు సంక్షిప్త రూపమే ఇక్రిశాట్.

రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రభుత్వ రంగ సంస్థలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)

బీఈఎల్ మొదటి యూనిట్‌ను బెంగళూరులో 1954లో స్థాపించారు. ఇది రక్షణ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. దీని 9వ యూనిట్‌ను 1986లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ రక్షణ శాఖకు అవసరమైన ఎలక్ట్రానిక్ అవసరాలను తీరుస్తోంది. దీనికి నవరత్న హోదా కల్పించారు.

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)

దేశంలో మొత్తం ఆరు బీహెచ్ఈఎల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. మెదక్ జిల్లాలోని రామచంద్రాపురంలో 1963లో బీహెచ్ఈఎల్‌ను స్థాపించారు. దేశంలోని అతి పెద్ద ఇంజనీరింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో ఇదొకటి. ఇక్కడ టర్బైన్లు, జనరేటర్లు, సర్క్యూట్ బ్రేకర్లు తయారవుతాయి. ఇది థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. దీనికి మహారత్న హోదా ఉంది.

ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ (ఐడీపీఎల్)

ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అతిపెద్ద ఫార్మా రంగ సంస్థ. దీన్ని 1961లో ఢిల్లీలో ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆరు ఐడీపీఎల్ యూనిట్లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ యూనిట్‌ను 1967లో బాలానగర్‌లో స్థాపించారు. అత్యవసర, జీవనాధార మందుల తయారీలో స్వయం సమృద్ధి సాధనకు అవసరమైన పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది.

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)

1967 ఏప్రిల్ 11న హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేశారు. ఇది అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఎలక్ట్రానిక్ పరికరాల పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల స్వయం సమృద్ధి సాధనలో కీలకపాత్ర పోషిస్తోంది.

దేశంలో తొలి డిజిటల్ కంప్యూటర్‌ను ఈసీఐఎల్ రూపొందించింది. దేశంలో తొలి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, మొదటి న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నియంత్రణ పరికర వ్యవస్థలను, టెలివిజన్లను ఈ సంస్థ రూపొందించింది.

ప్రాగా టూల్స్

దీన్ని 1959లో హైదరాబాద్‌లో స్థాపించారు. యంత్రాల విడి పరికరాలు, కట్టర్లు, టూల్స్, గ్రైండర్లు, త్రెడ్ రోలింగ్ మిషన్లు మొదలైన వాటిని ఇది రూపొందిస్తోంది.

హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)

హెచ్‌సీఎల్‌ను రంగారెడ్డి జిల్లాలో, పశ్చిమ బెంగాల్‌లోని రూప్ నారాయణ్‌పూర్‌లో స్థాపించారు. ఇది భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో పని చేస్తోంది. హెచ్‌సీఎల్‌లో టెలికాం కేబుల్స్‌ను తయారు చేస్తున్నారు.

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)

భారత్‌లో హెచ్ఏఎల్‌కు ఆరు యూనిట్లు ఉన్నాయి. 1965లో రంగారెడ్డి జిల్లాలో హెచ్ఏఎల్ యూనిట్‌ను ప్రారంభించారు. దీనికి నవరత్న హోదా కల్పించారు. ఇందులో విమానయాన యంత్ర భాగాలను ఉత్పత్తి చేస్తున్నారు.

రేడియో అల్టీమీటర్ తయారీలో హెచ్ఏఎల్ హైదరాబాద్ డివిజన్‌ది కీలకపాత్ర. ఇది కమ్యూనికేషన్, నావిగేషన్లలో రక్షణ శాఖకు సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీ)

దీని దక్షిణ ప్రాంత మండల ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఇది గ్రామీణ ప్రాంత విద్యుదీకరణకు ఆర్థిక సహాయం అందిస్తోంది. దీనికి నవరత్న హోదా ఉంది.

హిందుస్తాన్ మెషిన్ టూల్స్ లిమిటెడ్ (హెచ్ఎంటీ)

దేశంలో ఆరు హెచ్ఎంటీ పరిశ్రమలున్నాయి. వాటిలో ఒకటి రంగారెడ్డి జిల్లాలో ఉంది. ఈ పరిశ్రమలో గడియారాలు, బల్బులు, లేత్, బోర్, మిల్లింగ్ యంత్రాలు తయారవుతాయి.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)

ఇది భారత ప్రభుత్వ పరిపాలన నియంత్రణ, రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. దీన్ని 1970లో ప్రారంభించారు. ఈ పరిశ్రమలో క్షిపణులను రూపొందిస్తారు. హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్, మెదక్ జిల్లాలోని భానూర్‌లో దీని తయారీ కేంద్రాలున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో రెండు యూనిట్లను స్థాపించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్

దీన్ని 1973లో రంగారెడ్డి జిల్లాలో ప్రారంభించారు. పారిశ్రామికీకరణ వేగవంతమయ్యేందుకు తోడ్పడే లోహాలు, మిశ్రమ లోహాలు ముఖ్యంగా టైటానియం లాంటి లోహాల తయారీలో కీలక పాత్ర పోషిస్తోంది.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ (డీఆర్‌డీఎల్)

దీన్ని 1962లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. భారత రక్షణ వ్యవస్థను పటిష్టపర్చడంలో ఈ కంపెనీది కీలకపాత్ర. క్షిపణి వ్యవస్థ రూపకల్పన, క్షిపణుల తయారీ ప్రయోగాల్లో ఇది కృషి చేస్తోంది. ఈ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన ఆకాశ్, నాగ్, పృథ్వీ, అగ్ని తదితర క్షిపణులు భారత సైన్యాన్ని పటిష్టం చేశాయి.

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ)

అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో మౌలాలీలో 1971లో దీన్ని ఏర్పాటు చేశారు. న్యూక్లియర్ ఫ్యూయల్ బండిల్స్, రియాక్టర్ కోర్ పదార్థాలను ఇది తయారు చేస్తోంది. యురేనియం ఇంధనం, జిర్కోనియం మిశ్రమ లోహ క్లాడింగ్‌ను రూపొందించింది.

భార జల కేంద్రం (హెవీ వాటర్ ప్లాంట్)

ఈ కేంద్రాన్ని ఖమ్మం జిల్లాలోని మణుగూరులో ఏర్పాటు చేశారు. దీనిలో డ్యూటీరియం ఆక్సైడ్ (D_2O) తయారు చేస్తున్నారు. అణు రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని స్థిరీకరించేందుకు భారజలాన్ని వాడతారు.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)

ఇది రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. ప్రపంచస్థాయి ఆయుధాల తయారీలో, స్వదేశీ పరిజ్ఞానం ద్వారా సైన్యానికి కావాల్సిన ఆయుధ సంపత్తిలో స్వయం సమృద్ధి సాధనకు సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ)

కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 1958లో ఎన్ఎండీసీని ఏర్పాటు చేశారు. ముడి ఇనుము, రాగి, డోలమైట్, టంగ్‌స్టన్ తదితర ఖనిజాలను వెలికి తీయడానికి, ముడి ఖనిజాలను వేరు చేయడానికి అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఈ సంస్థ అందిస్తోంది. ఖనిజ వనరులపై పరిశోధనా కార్యక్రమాలను చేపడుతోంది.

నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ

సికింద్రాబాద్‌లోని హకీంపేటలో ఏర్పాటు చేశారు. భారీ పరిశ్రమలకు సెక్యూరిటీ నిర్వహణ, విపత్తు నిర్వహణలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)

దీన్ని 1970లో సికింద్రాబాద్‌లోని సైనిక్‌పురిలో ఏర్పాటు చేశారు. భద్రతా దళాలు, సైన్యంలో మేనేజ్‌మెంట్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలను పెంచడం కోసం ఇది కృషి చేస్తోంది.

ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌కు మేనేజ్‌మెంట్ రంగంలో శిక్షణనిచ్చే ఆసియాలోని ఏకైక సంస్థ ఇది.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

మెదక్ జిల్లాలోని ఎద్దుమైలారంలో 1987లో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ యుద్ధ ట్యాంకు(బీఎంపీ)లను తయారు చేస్తున్నారు.

తెలంగాణ మొదటి పారిశ్రామిక విధానం

- పారిశ్రామిక వర్గాలను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి పారిశ్రామిక విధానం టీఎస్-ఐపాస్‌ను 2015లో రూపొందించింది. అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు 2015 జూన్ 12న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో టీఎస్-ఐపాస్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల రాయబారులు, పారిశ్రామిక దిగ్గజాలు హాజరయ్యారు. నూతన పారిశ్రామిక విధానంలో నూరు శాతం అవినీతి రహితంగా పరిశ్రమలకు అనుమతులు ఇస్తామని ప్రకటించారు. దరఖాస్తు చేసిన 10, 12 రోజుల్లోనే అనుమతులు జారీ చేస్తారు.
- ఈ కార్యక్రమంలోనే సోలార్ విద్యుత్ విధానాన్ని ప్రకటించారు.
- ఈ విధానంలో తెలంగాణ ప్రభుత్వం 14 కీలక రంగాలపై దృష్టి సారించింది.
- 'కనీస తనిఖీ గరిష్ఠ సౌలభ్యత' నినాదం దీని ప్రధానాంశం.
- రాష్ట్రంలో ఆరు పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.
- మొదటి దశలో భాగంగా హైదరాబాద్ - వరంగల్, హైదరాబాద్ - నాగ్‌పూర్, హైదరాబాద్ - బెంగళూరు పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేస్తారు.
- రెండో దశలో భాగంగా హైదరాబాద్ - మంచిర్యాల, హైదరాబాద్ - నల్లగొండ, హైదరాబాద్ - ఖమ్మం పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేస్తారు.
- దళితులు, గిరిజనులకు నేరుగా రుణసాయం, వారి తరఫున మార్జిన్ మనీ చెల్లింపు.
- రాష్ట్రంలోని ఉమ్మడి 9 జిల్లాల్లో మహిళల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కులు.
- రాష్ట్రంలోని పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరాలో నాణ్యత పెంపు, సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకం, ఉత్పత్తికి ప్రోత్సాహం.
- నీటి పారుదల ప్రాజెక్టుల్లో పది శాతం పరిశ్రమలకు కేటాయింపు. టీఎస్ఐఐసీ ద్వారా నీటి సౌకర్యం.
- రూ. 200 కోట్లకుపైగా పెట్టుబడి, వెయ్యి మందికిపైగా ఉపాధి కల్పించే మెగా ప్రాజెక్టులకు సీఎస్ నేతృత్వంలోని 'తెలంగాణ స్టేట్‌వైడ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫెసిలిటేషన్ బోర్డ్' అనుమతులు మంజూరు చేస్తుంది.
- టీఎస్-ఐపాస్ విధానాన్ని సింగిల్ విండో క్లియరెన్స్ పద్ధతి అంటారు.
- తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ సంక్షిప్త రూపమే టీఎస్-ఐపాస్.

టీ-హబ్: గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఇది ఏర్పాటైంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. భారజల కర్మాగారం ఎక్కడ ఉంది?
   1) పటాన్‌చెరు 2) మణుగూరు
   3) రామగుండం 4) హైదరాబాద్
2. అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్) ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
   3) మెదక్ 4) నల్లగొండ
3. తెలంగాణలో ఒక పరిశ్రమను మెగా పరిశ్రమగా గుర్తించాలంటే కనీసం ఎంత పెట్టుబడి పెట్టాలి?
   1) రూ. 250 కోట్లు 2) రూ. 200 కోట్లు
   3) రూ. 300 కోట్లు
   4) రూ. 150 కోట్లు
4. ఇచ్చిన వాటిలో మహారత్న హోదా పొందిన సంస్థ?
   1) బీఈఎల్ 2) ఈసీఐఎల్
   3) ఐడీపీఎల్ 4) బీహెచ్ఈఎల్
5. ముల్కనూర్ మహిళా సహకార డైరీ ఏ ఉమ్మడి జిల్లాలో ఉంది?
   1) వరంగల్ 2) ఆదిలాబాద్
   3) కరీంనగర్ 4) నల్లగొండ
6. ఇచ్చిన వాటిలో రక్షణ శాఖకు సంబంధించిన వస్తువులను ఉత్పత్తి చేసే సంస్థ?
   1) బీడీఎల్ 2) ఈసీఐఎల్
   3) హెచ్ఏఎల్ 4) హెచ్‌సీఎల్
7. న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) ఎక్కడ ఉంది?
   1) మణుగూరు 2) పాల్వంచ
   3) రామచంద్రాపురం 4) మౌలాలీ
8. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) ఎక్కడ ఉంది?
   1) రామగుండం 2) రామచంద్రాపురం
   3) గచ్చిబౌలి 4) కొత్తగూడెం
9. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన సంవత్సరం?
   1) 1970 2) 1963
   3) 1958 4) 1967
10. టెలివిజన్లను ఉత్పత్తి చేసే సంస్థ ఏది?
   1) ఎన్ఎఫ్‌సీ 2) బీడీఎల్
   3) ఈసీఐఎల్ 4) హెచ్‌సీఎల్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 4; 5) 3; 6) 1; 7) 4; 8) 2; 9) 3; 10) 3.

రివర్స్ రెపో రేటు అంటే..?

బ్యాంకింగ్ రంగం

ఖాతాదారుల నుంచి డబ్బు స్వీకరించి భద్రపరచడం, వారికి అవసరానికి డబ్బు ఇవ్వడం, స్వీకరించిన ధరావతులకు కాలానుగుణంగా వడ్డీలు చెల్లించడం, అప్పులు ఇవ్వడం (వారి స్తోమతను బట్టి), తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లించడం లేదా వసూలు చేయడం తదితర ద్రవ్య సంబంధ కార్యకలాపాలను నిర్వహించే వ్యవస్థను బ్యాంకింగ్ రంగంగా నిర్వచిస్తాం. బ్యాంకింగ్ వ్యవహారాలు నిర్వర్తించే సంస్థనే బ్యాంకుగా గుర్తిస్తాం. చెక్కులు, డ్రాఫ్టులు, ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు లేదా ఒక స్థలం నుంచి మరో స్థలానికి ద్రవ్య బదలాయింపులు నిర్వహించడం ద్వారా ఇంకా మరెన్నో ద్రవ్య లావాదేవీలకు బ్యాంకులు ఆలవాలంగా ఉంటాయి. ద్రవ్య సేవల పరిశ్రమగా బ్యాంకును పేర్కొనవచ్చు. బ్యాంకులు లేనికాలంలో సామాన్యుడి నగదు లావాదేవీలు, రుణ అవసరాలను స్థానిక వడ్డీ వ్యాపారులు తీరుస్తుండేవారు.

భారతదేశంలో మొదటి బ్యాంకును 1786లో 'ది జనరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో నెలకొల్పారు. ఈస్ట్ ఇండియా కంపెనీ 1809లో 'ది బ్యాంక్ ఆఫ్ బెంగాల్'ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఎన్నో ప్రెసిడెన్సీ బ్యాంకులు ఆవిర్భవించాయి. వీటన్నింటినీ బ్రిటిషర్లే నిర్వహించేవారు. స్వాతంత్ర్యానంతరం 1949లో భారత ప్రభుత్వం బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1965లో ఈ చట్టాన్ని సవరించింది. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు మొదటగా జాతీయ స్ఫూర్తితో 1953లో మొదలయ్యాయి. బ్రిటిష్ వారసత్వంగా వచ్చిన ఇంపీరియల్ బ్యాంక్‌ను.. 'భారతీయ స్టేట్ బ్యాంక్'గా మార్చి జాతీయం చేశారు. ఇందిరా గాంధీ హయాంలో 14 ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులను 1969 జూలై 19న జాతీయం చేశారు.

1980వ దశకం తర్వాత దశల వారీగా ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాల్సిన ఆవశ్యకత ఉందనే, ప్రభుత్వం తన పరిధిని తగ్గించుకోవడం అవసరం అనే ప్రతిపాదనలు వచ్చాయి. నరసింహన్ కమిటీ సిఫారసుల మేరకు 1993లో సవరించిన బ్యాంకుల క్రమబద్ధీకరణ చట్టం అమలైంది. ఈ చట్టం ద్వారా మరిన్ని ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులకు, పెట్టుబడులకు ద్వారాలు తెరిచినట్లైంది. ఈ దశను బ్యాంకింగ్ రంగంలో మూడో స్థాయి సంస్కరణగా చెప్పవచ్చు. ఇది విస్తృత స్థాయి స్థూల ఆర్థిక సరళీకరణ సంస్కరణల్లో భాగంగా గమనించవచ్చు. అంటే.. అన్ని రంగాలకు వర్తిస్తూ 1991–92ల్లో జరిగిన సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలో భాగంగానే బ్యాంకింగ్ సంస్కరణలనూ అర్థం చేసుకోవాలి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

ఈ దశలోనే బ్యాంకింగ్ రంగం సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకుంది. బ్యాంకింగ్ రంగాన్ని కంప్యూటర్లతో అనుసంధానిస్తూ ఆన్‌లైన్ నగదు బదిలీలను, ప్లాస్టిక్ మనీ (క్రెడిట్ లేదా డెబిట్ కార్డులు)ని ప్రవేశపెట్టారు.

ప్రస్తుతం భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నిర్మాణాన్ని కింది విధంగా పేర్కొనవచ్చు.

1. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
2. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు

ఇందులో పబ్లిక్ రంగ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు ఉంటాయి. పబ్లిక్ రంగ బ్యాంకుల్లో ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకులు, ఇతర జాతీయ బ్యాంకులు ఉంటాయి.

3. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ఆర్‌బీలు)
4. విదేశీ బ్యాంకులు
5. షెడ్యూల్డ్ సహకార బ్యాంకులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంకింగ్ వ్యవస్థకు అధిపతి కేంద్ర బ్యాంకు, భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ) మన కేంద్ర బ్యాంకు. 1934 రిజర్వ్ బ్యాంక్ చట్టం ద్వారా 1935 ఏప్రిల్ 1న భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. మొట్టమొదట ఇది వాటాదారుల బ్యాంకుగా రూ. 5 కోట్ల మూలధనంతో ఏర్పాటైంది. 1949 జనవరి 1న ఆర్‌బీఐని జాతీయం చేశారు. ఆర్‌బీఐకి గవర్నర్, నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉంటారు. వీరితో పాటు ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఒక ప్రభుత్వ ప్రతినిధి, ప్రభుత్వంతో ప్రతిపాదితమైన వివిధ రంగాలను ప్రతిబింబించే పది మంది ప్రతినిధులు, స్థానిక బోర్డులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన డైరెక్టర్లు కలిసి సమగ్ర నిర్వహణ బాధ్యత పర్యవేక్షిస్తారు. ఈ స్థానిక బోర్డులు ముంబై, కోల్‌కతా, న్యూఢిల్లీ, చెన్నై ప్రధాన కేంద్రాలుగా పనిచేస్తాయి. ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా.



ఆర్‌బీఐ లక్ష్యాలు– విధులు: కరెన్సీని క్రమబద్ధం చేయడం, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య స్థిరత్వాన్ని, సుస్థిరతను సాధించడం, పటిష్టమైన ద్రవ్య విధానాన్ని అమలు పరుస్తూ పరపతి నియంత్రణ చేయడం, దేశంలోని వాణిజ్య బ్యాంకులకు మార్గదర్శిగా వ్యవహరించడం, దేశవ్యాప్తంగా ఒకే రీతిలో పరపతి విధానాన్ని అమలు చేయడం ఆర్‌బీఐ ప్రధాన లక్ష్యాలు. దీంతోపాటు కరెన్సీ నోట్ల జారీ గుత్తాధిపత్యం కూడా ఆర్‌బీఐదే. ఇది 5, 10, 20, 50, 100, 500 రూపాయల కరెన్సీ నోట్లను జారీచేస్తుంది. ఒక రూపాయి నోట్లను మాత్రం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది. అలాగే రిజర్వ్ బ్యాంక్ కేంద్ర ప్రభుత్వానికి బ్యాంకరుగా, ప్రతినిధిగా, సలహాదారుగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వానికి బ్యాంకింగ్ సౌకర్యాలను కల్పిస్తుంది. ద్రవ్య విధానాన్ని రూపొందించడం, ప్రభుత్వానికి సలహా ఇవ్వడమే కాకుండా అమలుపరిచే బాధ్యతను ఆర్‌బీఐ నిర్వహిస్తుంది. దీంతోపాటు బ్యాంకులకు బ్యాంకుగా వ్యవహరిస్తుంది అంటే.. వాణిజ్య బ్యాంకుల కార్యకలాపాలను నియంత్రిస్తుంది, పర్యవేక్షిస్తుంది. వాణిజ్య బ్యాంకుల అంతిమ రుణదాతగా వ్యవహరిస్తుంది. విదేశీ మారకంగా ఉపయోగించే బంగారం నిల్వలను, విదేశీ మారక ద్రవ్య నిల్వలను కూడా ఆర్‌బీఐ పరిరక్షిస్తుంది. వీటితోపాటు బ్యాంకింగ్ వ్యవస్థను అభివృద్ధి పరచడం, వ్యవసాయ పరపతిని ప్రోత్సహించడం, పారిశ్రామికాభివృద్ధికి పరపతిని అందించడం లాంటి అభివృద్ధిపరమైన విధులను కూడా భారతీయ రిజర్వ్‌బ్యాంక్ నిర్వహిస్తుంది.

షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు

వాణిజ్య బ్యాంకులు.. షెడ్యూల్‌లో ఉన్నవి, షెడ్యూల్డ్ కానివి అని రెండు రకాలు. రిజర్వు బ్యాంకు 1934వ చట్టంలోని రెండో షెడ్యూల్‌లో పేర్కొన్న బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు. ప్రైవేట్, పబ్లిక్ సెక్టా రు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు.. అన్నీ షెడ్యూల్డ్ బ్యాంకులుగానే పరిగణిస్తారు. కానీ సహకార బ్యాంకులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. సహకార బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు కావు. షెడ్యూల్‌లో లేని బ్యాంకులన్నీ షెడ్యూల్డేతర వాణిజ్య బ్యాంకులు.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (రీజినల్ రూరల్ బ్యాంక్స్) 1970లో స్థాపించారు. ఇవి వాణిజ్య బ్యాంకులు నిర్వహించే విధులన్నింటినీ నిర్వహిస్తాయి. వీటి కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నీ భారతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ నియంత్రణలో ఉంటాయి. ప్రస్తుతం విలీన ప్రక్రియలో భాగంగా 25 గ్రామీణ బ్యాంకులను పదింటికి కుదించారు. మొత్తం దేశంలో ప్రస్తుతం 56 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

విదేశీ బ్యాంకులు

భారతదేశంలో విదేశీ బ్యాంకులు కొత్తగా వచ్చినవి కావు. బ్రిటిషర్ల పాలనకాలంలోనే విదేశీ బ్యాంకుల పరంపర ప్రారంభమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విదేశీ బ్యాంకుల కార్యకలాపాలు తగ్గించారు. 1950లలో విదేశీ బ్యాంకులను జాతీయం చేయడం ద్వారా వాటి కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. విదేశీ మారక క్రమబద్ధీకరణ చట్టం పరిధిలో పని చేస్తున్న విదేశీ బ్యాంకులకు స్వతహాగా తమ కార్యకలాపాలు నిర్వహించే స్వేచ్ఛను మన ప్రభుత్వం కల్పించలేదు. తర్వాత కాలంలో ప్రభుత్వం సరళీకరణ ప్రక్రియను చేపట్టి విదేశీ మారక క్రమబద్ధీకరణ చట్టాన్ని విదేశీ మారక నిర్వహణ చట్టంగా మార్చింది (ఫెరా చట్టం ఫెమాగా మారింది). ఆ చట్టంలో విదేశీ బ్యాంకులకు వెసులుబాటు కల్పించారు. ప్రపంచీకరణ తర్వాత విదేశీ బ్యాంకులకు భారత కార్యకలాపాల్లో ప్రాచుర్యం కల్పించారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం ప్రస్తుతం దేశంలో 34 విదేశీ బ్యాంకులు దాదాపు 320 శాఖలతో ప్రధాన పట్టణాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఏబీఎన్-ఆమ్రో బ్యాంక్, ఏఎన్‌జడ్ గ్రిండ్లేస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఎమిరేట్స్, బ్యాంక్ ఆఫ్ అబుదాబీ ప్రధానమైన విదేశీ బ్యాంకులు.

షెడ్యూల్డేతర బ్యాంకులు

1934లోని బ్యాంకింగ్ చట్టంలో రెండో షెడ్యూల్‌లో ప్రస్తావించని బ్యాంకులను షెడ్యూలేతర బ్యాంకులు అంటారు. వీటి ప్రాముఖ్యం అంతగా లేదు. అయితే షెడ్యూల్‌లో లేని బ్యాంకులు ప్రైవేట్ బ్యాంకులై కొన్ని లాభాపేక్ష కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. జాతీయ స్థాయిలో వీటికి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఇవి స్థానిక వ్యాపార కార్యకలాపాలకే పరిమితమైనట్లుగా భావించవచ్చు.

సహకార బ్యాంకులు

ప్రభుత్వ ప్రోత్సాహంతో, కొంతభాగం మూలధన పెట్టుబడి చేకూర్చడంతో ఈ సహకార బ్యాంకులను స్థాపించారు. ఇవి లాభాపేక్ష లేకుండా సహకార సూత్రంపై ఆధారపడి పనిచేస్తాయి. సహకార బ్యాంకుల నిర్మాణం నాలుగు స్థాయిల్లో ఉంటుంది. కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో జిల్లా సహకార బ్యాంకులు విధులు నిర్వహిస్తాయి. జిల్లా సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లోని గ్రామ ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తాయి.

బ్యాంకింగ్ రంగంలో ఉపయోగించే పదాలు..

ద్రవ్య విధానం, బ్యాంకింగ్ రంగంలో తరచూ ఉపయోగించే కొన్ని సాంకేతిక పారిభాషిక పదాల గురించి తెలుసుకుందాం..

- **బ్యాంకు రేటు**
  రిజర్వ్ బ్యాంకు ఇతర బ్యాంకులకు రుణ సదుపాయం కోసం ఏర్పరిచే కనీస వడ్డీ రేటు. ప్రస్తుతం బ్యాంకు రేటు 6.25%గా ఉంది.
- **నగదు నిల్వల నిష్పత్తి (క్యాష్ రిజర్వ్ రేషియో)**
  బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద ఉంచాల్సిన నిర్దిష్ట నిధుల మొత్తం. ఆర్‌బీఐ సీఆర్ఆర్‌ను పెంచితే బ్యాంకుల వద్ద ఉండే ద్రవ్యం తగ్గిపోతుంది. షెడ్యూల్డ్ బ్యాంకులు కొంత నిర్దిష్ట ద్రవ్యాన్ని తప్పనిసరిగా ఆర్‌బీఐ వద్ద ఉంచాలి. దీన్నే సీఆర్ఆర్ అంటారు. ప్రస్తుత సీఆర్ఆర్ 4%గా ఉంది. సీఆర్ఆర్, వడ్డీ రేట్లు మార్కెట్‌లో చలామణిలో ఉన్న ద్రవ్య ప్రవాహ వేగానికి అడ్డుకట్ట వేయడానికి లేదా గతిశీలత పెంచడానికి ఉపయోగపడతాయి.
- **స్టాట్యూటరీ లిక్విడిటీ రేషియో (ఎస్ఎల్ఆర్)**
  వాణిజ్య బ్యాంకులు తమ రోజువారీ వ్యాపారంలో కాలానుగత రుణాలు, బంగారం, ధరావతులు లేదా సెక్యూరిటీస్.. అన్నీ ద్రవ్యత్వ సంపత్తిగా అంటే లిక్విడ్ అసెట్స్‌గా కలిగి ఉంటాయి. బిజినెస్ డే ముగిసే సరికి ప్రతి బ్యాంక్.. దాని రోజువారీ నికర డిమాండ్, రుణాలు ద్రవ్యత్వ సంపత్తికి కనీస అనుపాతంలో ఉండేలా చూసుకోవాలి. ఈ కనీస అనుపాత రాశినే చట్టపర ద్రవ్యత్వ రాశి నిష్పత్తి (ఎస్ఎల్ఆర్)గా నిర్వచిస్తారు. ప్రస్తుతం ఆర్‌బీఐ సూచించిన రాశి 18%. ఇది మారుతూ ఉండవచ్చు.
- **రెపో రేటు**
  వాణిజ్య బ్యాంకులకు ధరావతుల (సెక్యూరిటీస్) ఆధారంగా రిజర్వ్ బ్యాంక్ స్వల్పకాలిక అప్పుగా ఇచ్చే మొత్తంపై వసూలు చేసే వడ్డీ రేటును రెపో రేటు అంటారు. ప్రస్తుతం ఇది 6%గా ఉంది. ఇది ఆర్‌బీఐ సూచనల ప్రకారం మారుతూ ఉంటుంది.
- **రివర్స్ రెపో రేటు**
  వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకొనే అప్పుపై ఆర్‌బీఐ చెల్లించే వడ్డీ రేటును రివర్స్ రెపో రేటు అంటారు. వ్యవస్థలో అధిక ద్రవ్యం ఉన్నప్పుడు ఆర్‌బీఐ రివర్స్ రెపో రేటును పెంచి బ్యాంకులు తమ అనుత్పాదక ద్రవ్యాన్ని ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేసేలా చేస్తుంది. ప్రస్తుతం ఇది 3.35%గా ఉంది. ఇది కూడా మారుతూ ఉంటుంది.

Number of messages used per person?

MODEL QUESTIONS

Directions (Q. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The number of people (1)/ who fail each year (2)/ is now in (3)/ single figure. (4)/ no error (5)
2. The experiments (1)/ were carried out (2)/ under simulation (3)/ examination conditions. (4)/ no error (5)
3. The game will be (1)/ broadcasted (2)/ simultaneously (3)/ on TV and radio. (4)/ no error (5)
4. He seemed sincere (1)/ enough when (2)/ he said he (3)/ wants to help. (4)/ no error (5)
5. My teaching style (1)/ is similar (2)/ to that of most (3)/ other teacher. (4)/ no error (5)
6. A report showing (1)/ the company's current situation shows (2)/ how people are influenced by (3)/ TV advertisements. (4)/ no error (5)
7. Market research has shown (1)/ us people want quality, (2)/ not just (3)/ low prices. (4)/ no error (5)
8. Candidates which are (1)/ shortlisted for interview (2)/ will be contacted by the end (3)/ of the week. (4)/ no error (5)
9. If I was asked (1)/ to work (2)/ on Sundays, (3)/ I should resign. (4)/ no error (5)
10. Though many companies know the fact (1)/ that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ no error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. In order that training should be ______ it must be planned ___.
    1) affected...thoroughly
    2) affective...periodically
    3) executed...properly
    4) effective...systematically
    5) complete...beforehand
12. Terrorist groups ____ responsibility for the shootings and bomb _____.
    1) charged...blasts
    2) levied...plants
    3) claimed...attacks
    4) withdraw...pits
    5) involved...calls
13. She is very ______ to other people's feelings.
    1) sensible 2) sensibility
    3) sensation 4) sensitive
    5) sensitize
14. Paying children too much ______ when they misbehave can be self ______.
    1) pampering...appealing
    2) negligence...destruction
    3) attention...defeating
    4) care...appease
    5) love...developing
15. Market researches often segment the population on the _____ of age and ______ class.
    1) grade...economy
    2) rate...affluent
    3) unit...security
    4) track...wealthy
    5) basis...social

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) If you knew the improved card deal is better than other cards you have, you may want to consider keeping it and cancelling the other card instead. Otherwise, cancel the card that you had decided to give up.

B) The first step in cancelling a card is to contact the card issuer. Some issuers let you cancel an account by phone. You may be transferred to a customer care officer who will try to convince you to keep the card.

C) Be sure to ask your issuer to record that the account was "closed at customer's request."



BANK EXAMS

GENERAL ENGLISH

D) Make a note of the day and time you called and the person you talked to for your records. A written confirmation that an account has been closed should be sent to you from the card issuer.

E) Go ahead and listen. They may be willing to lower your interest rate, waive an annual fee or upgrade your card. Some issues have been known to offer plane tickets or travel vouchers to customers who want to cancel a card.

F) Keep this notice carefully for your records. If anything goes wrong with the account at a later date, you've got proof that you closed it.

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions: (Q. 21 - 25): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. We are <u>concrete</u> seeking new ways of expanding our membership.
    1) evidence 2) fastly
    3) purposely 4) currently
    5) no correction required
22. Rumours that he <u>have flown</u> from the country were promptly scotched by his wife.
    1) had to flow 2) had been flew
    3) had fled
    4) had been flowing
    5) no correction required
23. Coal is a natural resource, which constitutes approximately 85% of the total fossil fuel <u>reservation</u> in the world.
    1) reserves 2) reserved
    3) reserve 4) reserving
    5) no correction required
24. Even <u>among the native</u> users of English, plain and direct language is regarded as a virtue in communication.
    1) between a native
    2) between an native
    3) among a native
    4) among nativity
    5) no correction required
25. Professional person at the work place frequently <u>dealing in material</u> which he must understand and also remember for future use.
    1) dealt with material
    2) deal in material
    3) deals with materials
    4) deal among materials
    5) no correction required

Directions (Q. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The first commercial SMS message was sent over the Vodafone GSM network in the United Kingdom on 3 December 1992, from Neil Papworth of Sema Group to Richard Jarvis of Vodafone. The text of the message was "Merry Christmas." The first SMS typed on a GSM phone is claimed to have been sent by Riku Pihkonen, an engineer student at Nokia in 1993.

Initial growth was slow, with customers in 1995 sending on an average only 0.4 messages per GSM customer per month. By the end of 2000, the average number of messages per user reached 35.

Short message services are developing very rapidly throughout the world. In 2000, just 17 billion SMS messages were sent; in 2001 the number was up to 250 billion and 500 billion SMS messages in 2004. At an average cost of USD 0.10 per message, this generates revenues in excess of $50 billion for mobile telephone operators and represents close to 100 text messages for every person in the world.

SMS is particularly popular in Europe, Asia - excluding Japan, Australia and New Zealand. Popularity has grown to a sufficient extent that the term texting has entered the common **lexicon.** In China, SMS is very popular, and has brought service providers significant profit; it is also a very influential and powerful tool in the Philippines, where the average user sends 10-12 text messages a day. The Philippines alone sends on the average 400 million text messages a day, more than the annual average SMS volume of countries in Europe, and even China. SMS is hugely popular in India, where youngsters often exchange lots of text messages, and companies provide alerts, infotainment, news, cricket scores, railway/airline booking, mobile billing and banking services on SMS. In India, metropolitan media outlets often take real-time polls and audience opinion through SMS, via reserved 4-digit numbers that redirect the information to the respective aforementioned outlets based on designated prefix codes.

26. The Asian country where SMS is not very popular is
    1) Philippines 2) Japan
    3) Australia 4) China
    5) Europe
27. The number of messages that an average user sends in the Philippines is
    1) more than the annual average SMS volume of countries in Europe, and even China
    2) more than the annual average SMS volume of countries in India, and even China
    3) more than the annual average SMS volume of countries in Europe, Australia and even China
    4) more than or equal to the annual average SMS volume of countries in Europe, and even China
    5) less than the annual average SMS volume of countries in Europe, and even China
28. Services provided by SMS to Indian users include
    1) emergency services
    2) fire services 3) mobile billing
    4) 108 services 5) counseling

Key

1) 4	2) 3	3) 2	4) 4	5) 4
6) 5	7) 2	8) 1	9) 1	10) 3
11) 4	12) 3	13) 4	14) 3	15) 5
16) 5	17) 5	18) 2	19) 1	20) 1
21) 4	22) 3	23) 1	24) 5	25) 3
26) 2	27) 1	28) 3		